

ఏలూరు జడ్పీ సమావేశ మందిరంలో బుధవారం సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా జ్యోతి వెలిగించి అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఈవో రేణుక ఎమ్మెల్సీ రాము సూర్యారావు తదితరులు - 3లో

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు జిల్లా వాసులు మృతి చెందారు.

బుట్టాయగూడెం మండలంలో ట్రాక్టరు ట్రక్కు బోల్తా పడి ఓ మహిళ మృతి చెందగా ఏడుగురు గాయపడ్డారు. - 11లో

పెంటపాడు మండలంలో డిసెంబరు 31 రాత్రి అదృశ్యమైన ఇద్దరు యువకులు బుధవారం కాలువలో శవాలై తేలారు. - 16లో

ఈనాడు

పశ్చిమ గోదావరి

గురువారం 4 జనవరి 2018 16 పేజీలు

కోడిపందేలపై హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో జిల్లాలో వాటి నిర్వహణ సందిగ్ధంగా మారింది. ఇప్పటికే ఈ విషయమై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొన్న నేపథ్యంలో తాజా పరిణామాలు ఇటు ప్రజాప్రతినిధులను, అటు అధికారులను కూడా సంకటంలో పడేశాయి. మరో పది రోజుల్లో కోడిపందేలు అసలు జరుగుతాయా? కోర్టు ఆదేశాలను అధికారులు ఏవిధంగా అమలు చేస్తారు? వంటి అంశాలు చర్చనీయాంశమయ్యాయి.



కోడి పందేలు.. కొత్త ఎత్తులు...!

- హైకోర్టు ఆదేశాలతో కలవరం
- పందేలు అడ్డుకునేందుకు అధికార యంత్రాంగం
- పోలీసులు, రెవెన్యూ సిబ్బందికి సవాలు
- నిర్వహణకు పందెంరాయుళ్ల వ్యూహాలు

ఈనాడు, ఏలూరు, న్యూస్‌టుడే, పాలకొల్లు

జిల్లాలో భీమవరం, వెంప, అయిభీమవరం, పాలకొల్లు, దెందులూరు వంటి మండలాల్లో కోడిపందేలు భారీగా నిర్వహిస్తారనే ప్రచారం ఉంది. దీనికి తగ్గట్లుగానే గడిచిన కొన్నేళ్లుగా పైన పేర్కొన్న ప్రాంతాల్లో భారీ ఎత్తున పందేలు నిర్వహించిన దాఖలాలు ఉన్నాయి. రెండేళ్లుగా వీటి విషయంలో పలువురు కోర్టుకు వెళ్లగా వ్యాజ్యాలు కూడా నడిచాయి. కోడిపందేలను నిర్వహించకూడదనే స్పష్టమైన ఆదేశాలు ఉన్న తరుణంలో గడిచిన సంవత్సరం సుప్రీం కోర్టు కత్తులు కట్టకుండా జీవులను హింసించకుండా ముందుకు వెళ్లవచ్చున్న వాదనను తెరమీదకు తీసుకొచ్చారు. దీంతో పందెం రాయుళ్లు గడిచిన సంవత్సరం ఆ నెపంతో యథేచ్ఛగా పందేలు నిర్వహించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను కొంతమంది పక్కదోవ పట్టించారన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో తాజాగా హైకోర్టు దీనిపై ఘాటుగా స్పందించింది. డీజీపీ, ప్రధాన కార్యదర్శులను దీనికి బాధ్యులను చేసింది.

నాయకుల్లో అయోమయం

వాస్తవానికి కోడిపందేలు జరిగే పది రోజుల ముందు నుంచీ వాటి విషయంలో స్పష్టత రాకుండా ఉండటం, చివరి నిముషంలో ఏదోవిధంగా జరగడం పరిపాటిగా మారింది. అయితే ఈసారి హైకోర్టు ఘాటుగా స్పందించిన నేపథ్యంలో వీటిని ఇటు రెవెన్యూ, పోలీసు విభాగాలు ఏవిధంగా అడ్డుకుంటాయనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే పోలీసులు కోడిపందేలు నిర్వహిస్తున్న వారిపై కేసులు (మిగతా 7లో)

కమీషన్ సొమ్ముకు సిగపట్లు

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇదో మాయ

ఈనాడు డిజిటల్, భీమవరం
తణుకు పట్టణం, న్యూస్‌టుడే

జిల్లాలో 2015-16లో ఖరీఫ్‌లో 174 వెలుగు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 26,005 మంది రైతుల నుంచి 7,33,176 టన్నుల ధాన్యం సేకరించారు. దీనివిలువ రూ. 1,044 కోట్లు దీనికిగాను కమీషను రూ. 26 కోట్లు మంజూరయ్యాయి. రబీసీజనులో కూడా అన్నే కేంద్రాలు ఏర్పాటు చేసి 17,803 మంది రైతుల నుంచి 5,10,641 టన్నుల ధాన్యం సేకరించారు. దీనికిగాను కమీషను రూ. 18.43 కోట్లు ప్రభుత్వం నుంచి మంజూరైంది. ఈ కమీషను పంచుకోవడానికి పలువురు తగాదాలు పడుతున్నారు. ఈ వివాదం వెలుగులోకి వచ్చింది. కానీ ఇలా వెలుగులోకి రానివి ఎన్నో ఉన్నాయి.



రేలంగిలో ధాన్యం కొనుగోలు కేంద్రం

మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పిస్తూ.. మరో పక్క రైతులకు మద్దతు ధర ఇచ్చేందుకు వీలుగా ఉంటుందనే భావనతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. నిర్వాహకులకు 2.5 శాతం కమీషను ఇస్తోంది. ఇలా వచ్చిన సొమ్మును నిర్వాహకులు తీసుకుంటారు. కొంతసొమ్ముతో గ్రామంలో కావాల్సిన (మిగతా 7లో)

● జిల్లాలోని ఇరగవరం మండలంలోని రేలంగి గ్రామంలో కొనుగోలు కేంద్రంలో 2015-16 సంవత్సరానికి సంబంధించి రెండు సీజనుల్లో కలిపి రెండున్నర లక్షల టన్నుల ధాన్యం సేకరించినట్లు రికార్డుల్లో చూపించారు. ఈ కేంద్రానికి రూ. 18 లక్షల వరకు కమీషను వచ్చింది. ఇందులో నిర్వాహకుల వేతనాలు, ఖర్చుల కింద రూ. 10.5 లక్షలు వచ్చింది. ఈ కేంద్ర నిర్వహణలో ఏడుగురు పాల్పంచుకున్నారు. ఈ ఏడుగురిలో కొంతమంది రూ. 1.37 లక్షలు, మరికొంతమంది రూ. 1.25 లక్షలు, ఇంకొంతమంది రూ. 1.10 లక్షలు చొప్పున పంచుకున్నారు. ఈ నిర్వాహకుల్లో అంగన్వాడీ కేంద్రం కార్యకర్త కూడా ఉండడం గమనార్హం. ఈమె భర్త ఓ మండలస్థాయి ప్రతినిధి కావడంతో ఆమె పేరు నిర్వాహకుల్లో నమోదు చేయించారు. అదే విధంగా మరో ఉద్యోగం చేస్తున్న మహిళ పేరు కూడా నమోదు చేయించారు. అదే గ్రామంలోని పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకంలో పని చేస్తున్న మహిళ కూడా నిర్వాహకుల్లో ఉన్నారు. ఇక్కడే వివాదం ప్రారంభమైంది. నిజంగా పనిచేసి ఇతరత్రా ఖర్చులు పెట్టిన మహిళలు కాస్త ఎక్కువ కమీషను తీసుకున్నారు. మాకు తక్కువ ఎందుకు ఇచ్చారని మిగిలిన వారు నిలదీశారు. ఈ వివాదం స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి రావడంతో సర్దుబాటు చేశారు.



‘అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్రమాలు జరుగుతున్నాయి. పాఠశాలల్లో చదువుతున్న వారిని తీసుకొచ్చి అంగన్‌వాడీ చిన్నారులుగా ఫొటోలు తీస్తున్నారు. కేంద్రాలకు వచ్చిన సరకులను గర్భిణులు తీసుకోకపోయినా తీసుకున్నట్లు చూపించి పౌష్టికాహారాన్ని పక్కదారి పట్టిస్తున్నారు.’

దేవరపల్లి మండలం గౌరీపట్నంలో మంగళవారం నిర్వహించిన జన్మభూమి- మాఊరు సభలో గ్రామస్థుల ఆరోపణ ఇది.

అంగన్‌వాడీ.. అందినంత దోపిడీ..!

చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆహారం పక్కదారి

కోడిగుడ్లు, బియ్యం, పప్పు, నూనె అమ్మేసుకుంటున్నారు

“నల్లజర్ల మండలం కవులూరులో అంగన్‌వాడీ కార్యకర్తపై అవినీతి ఆరోపణలు రుజువు కావడంతో శాఖాపరమైన చర్యలకు ఐసీడీఎస్ సీడీపీఓ సిఫార్సు చేశారు. హాజరు పట్టీల్లో విద్యార్థుల సంఖ్య తప్పుగా నమోదు, పౌష్టికాహారం పక్కదారి పడుతుందన్న గ్రామస్థుల సమాచారంతో సూపర్‌వైజర్ విచారణ జరిపి ఆరోపణలు వాస్తవాలని తేల్చారు.”

నల్లజర్ల, దేవరపల్లి, న్యూస్‌టుడే

పేద కుటుంబాలకు చెందిన చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించి వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలన్న ఉన్నతాశయంతో ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చిస్తోంది. ప్రభుత్వ ఆలోచన మంచిదే అయినా క్షేత్ర స్థాయిలో అంగన్‌వాడీ సిబ్బంది తీరుతో లక్ష్యం నీరుగారుతోంది. లబ్ధిదారులకు సరిగ్గా పౌష్టికాహారం అందడం లేదు. కొందరు అంగన్‌వాడీ సిబ్బంది నిబంధనలకు తిలోదకాలిస్తూ తప్పుడు లెక్కలతో కూడిన దస్త్రాలు సృష్టించి పేదలకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని కాజేస్తున్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టి అక్రమాలను నిరోధించాల్సిన పర్యవేక్షణాధికారులు అక్రమార్కుల నుంచి వాటాలు దండుకుంటున్నారనే ఆరోపణ వినిపిస్తోంది.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్రమాలను నిరోధించడానికి ప్రభుత్వం నూతన విధానాన్ని ప్రవేశ పెట్టింది. ఆ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఫొటోలు తీసి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు పంపించాలని, చిత్రాల్లో ఉన్న వారికి మాత్రమే హాజరువేయాలని ఆదేశాలు జారీ చేసింది. కొత్త విధానంలో అక్రమాలకు అవకాశం లేదని ఉన్నతాధికారులు చెబుతున్నారు. కానీ, శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్న.. చందంగా అక్రమాలకు పాల్పడే కొందరు సిబ్బంది కొత్తదారులు వెతుకుతున్నారు అనడానికి గౌరీపట్నం వాసులు చేసిన ఫిర్యాదే నిదర్శనం. అక్రమాల ఆరోపణల నేపథ్యంలో గోపాలపురం ఐసీడీఎస్ సెక్టార్ సీడీపీవోగా పనిచేసిన విజయలక్ష్మిని (మిగతా 7లో)



దేవరపల్లి: మీసేవ కేంద్రం సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రం

హోం వర్క్ చేయలేదని.. ముసుగు దొంగ నాటకం

పాతూరు (తాడేపల్లిగూడెం అర్బన్), న్యూస్‌టుడే: ఆపద సమయాల్లో సత్వర సాయం కోసం ఉపయోగించాల్సిన 100 నంబర్‌ను ఆకతాయిలు తమ వింత చేష్టలతో విసిగిస్తూ పోలీసులను ఇబ్బందుల పాలు చేస్తున్నారు. బుధవారం తాడేపల్లిగూడెంలోని పాతూరుకు చెందిన ఓ విద్యార్థి ఇలా చేయటంతో పోలీసులు అయోమయానికి గురి కావాల్సి వచ్చింది. సీఐ మూర్తి కథనం మేరకు పాతూరు పశువుల ఆసుపత్రి సమీపంలో ఉంటున్న బాలుడు (14) స్థానిక పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. తల్లి దుబాయ్‌లో ఉంటోంది. తండ్రి రాజమహేంద్రవరంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నాడు. బాలుడు తాత ఇంట్లో ఉండి చదువుకొంటున్నాడు. మూడు రోజులుగా హోంవర్క్ చేయకపోతుండటంతో ఉపాధ్యాయులు కోప్పడతారనే ఉద్దేశ్యంతో ఇంట్లోకి ఐదుగురు ముసుగు దొంగలు ప్రవేశించారని, తనను చంపడానికి ప్రతియత్నించి విలువైన వస్తువుల అపహరించారని స్థానికులతో నమ్మబలికాడు. వెంటనే వారు అత్యవసర పోలీస్ సహాయం కోసం 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకొన్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించే పనిలో పడ్డారు. దోపిడీ జరిగినట్లు ఎటువంటి ఆధారాలు లభించక పోవటంతో పోలీసులు బాలుడిని విచారించటంతో అసలు విషయం తెలిసింది. కొసమెరుపు ఏమిటంటే తనపై దొంగలు దాడి చేశారని తప్పించుకొనేందుకు దిండు అడ్డం పెట్టుకున్నానంటూ తనకు తానే కత్తితో దిండుపై పోట్లు పొడిచి కథ అల్లడం గమనార్హం. కుర్రోడి చేష్టలకు పోలీసులు బిత్తర పోయి మందలించి ఇంటికి సాగనంపారు.

దాళ్వాను గట్టెక్కించేలా సాగుదాం

☛ నేటి నుంచి అమలుకానున్న వంతులు ☛ ఇంకా పూర్తికాని 40 శాతం నాట్లు

పాలకొల్లు, న్యూస్‌టుడే : ఒక క్యూసెక్కు నీరు 70 ఎకరాలకు సరిపోతుంది. ప్రస్తుతం కాలువలకు అందించే నీటి సరఫరాను బట్టి వంద ఎకరాలకు సరిపెడుతున్నారు. పశ్చిమడెల్టాలోని పదకొండు ప్రధాన కాలువలకు విజ్జేశ్వరం వద్ద ఏడు వేల క్యూసెక్కుల నీరు విడుదల కావాల్సి ఉండగా గత పదిహేను రోజులుగా తగ్గించి వదులుతున్నారు. గత మూడురోజులుగా 4600 క్యూసెక్కులు మాత్రమే వస్తుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా గోదావరి జలాల లభ్యత పడిపోవడంతో 80 శాతం సీలేరు జలాలపైనే ఆధారపడి సరఫరా చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో లభ్యతలో ఉన్న నీటినే అవసరాల మేరకు సర్దుబాటు చేయాలంటే ఇక వంతుల వారీ విధానమే మేలని ఆ


నీటి సరఫరా ప్రవాహం తగ్గిన జిన్నూరు కాలువ

దిశగా నిర్ణయం తీసుకున్నారు. ఆదిలోనే నీటి ఎద్దడి ఎదురుకావడంతో చివరి వరకు ఇబ్బందులు తలెత్తకుండా గురువారం నుంచి అన్ని ప్రధాన కాలువలకు అయిదు రోజుల చొప్పున రెండు విడతలుగా నీటి సరఫరా చేసేందుకు జల వనరుల శాఖ యంత్రాంగం ప్రణాళికను రూపొందించింది. కాలువలపై ఆయకట్టుకు రెండు విడతల సరఫరాతో మళ్లీ 70 నుంచి 90 క్యూసెక్కుల నీరు అందనుంది. ఈ పరిస్థితుల్లో అమలు కాబోతున్న వంతులవారీ విధానంలో నీటి పొదుపుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని గత ఏడాది నిరూపించారు. వంతుల విషయానికొస్తే మొదటి విడతలో 2,26,499 ఎకరాలకు, రెండో వంతులో 2,23,975 ఎకరాలకు నీరందనుంది. మొదటి విడత వంతు ఈనెల 4వతేదీన ప్రారంభమై అయిదు రోజులు కొనసాగుతుంది. ఆ తరువాత మరో అయిదు రోజులు రెండో విడత అమలవుతుంది. ఇలా రెండు విడతలుగా వచ్చే మార్చి 31వతేదీ వరకు ప్రణాళికను సిద్ధం చేశారు. ఇప్పటికే ఏ కాలువలకు వంతు ఏ విధంగా జరుగుతుందో రైతులకు సాగునీటి సంఘాల ప్రతినిధులు, జల వనరుల అధికారులు చెబుతున్నారు. వంతుల సమయంలో శివారు ఆయుకట్టు భూములకు నీరందేలా నీటి మట్టాలు సక్రమంగా అమలు జరిగేలా ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. ఈసారి దాళ్వాలో గడ్డు పరిస్థితి ఉందని భావిస్తున్న యంత్రాంగం ముందస్తుగా 120 చోట్ల మురుగు డ్రెయిన్లపై అడ్డు కట్టల నిర్మాణాలను చేపడుతుంది. విద్యుత్తు మోటార్లు వినియోగంతోను నీటిని అందించనుంది. దొంగరావిపాలెంలో ఎత్తిపోతల పథకం అమలుకు సిద్ధమవుతుంది.

60 శాతం నాట్లు.. పూర్తి.

జిల్లా వ్యాప్తంగా 4.60 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని అంచనా వేసిన అధికారులు ఇప్పటివరకు 60 శాతం వరినాట్లు పూర్తయినట్లుగా చెబుతున్నారు. ప్రస్తుత తరుణంలో దమ్ములు, నాట్లు ముమ్మరంగా జరుగుతున్నందున నీటి అవసరాలు పెరగనున్నాయి. సంక్రాంతి పండుగ నాటికి నూరు శాతం నాట్లు పూర్తవుతాయని రైతులు ఆ విధంగా పనుల్లో నిమగ్నమయ్యారంటున్నారు. అప్పటికి నాట్లు పూర్తికాకపోతే మాత్రం ఇక అపరాల సాగు చేసుకుంటేనే మంచిదని వివరిస్తున్నారు. వచ్చే మార్చి నెలాఖరు నాటికి పంట చేతికందితే ఏప్రియల్ నెలలో కాలువలు కట్టివేసి పనులు మొదలుపెట్టే అవకాశం ఉంటుందని, పంట సమయంలోను నీటి ఎద్దడిని ఎదుర్కోవచ్చునని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ పనుల్లో వెనుకబడిన ప్రాంతాల్లో రైతులు సన్నద్ధమయ్యేలా జలవనరుల శాఖ, వ్యవసాయ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా మొత్తం మీద పరిశీలిస్తే పాలకొల్లు,


నీటి ఎద్దడి ప్రాంతాల్లో పర్యటిస్తున్న జలవనరుల శాఖ ఎస్ఈ రఘునాథ్, కమిటీ అధ్యక్షుడు రామరాజు తదితరులు

నరసాపురం ప్రాంతాల్లోనే ఎక్కువగా నాట్లు పూర్తికాని పరిస్థితులు కనిపిస్తున్నాయి. భీమవరం, ఉండి, అత్తిలి తదితర ప్రాంతాల్లోను అక్కడక్కడ కనిపిస్తుంది.

శివారు భూములకు నీరు..

కాలువల శివారు ఆయుకట్టు భూములకు నీరందించడంతో పాటు దాళ్వా పంటను గట్టెక్కించేందుకే వంతులు విధానంను అమలు చేస్తున్నట్లు జలవనరుల శాఖ ఎస్ఈ ఆర్.రఘునాథ్, గోదావరి పశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ అధ్యక్షుడు పొత్తూరి రామాంజనేయ రాజు (రామరాజు)లు తెలిపారు. నరసాపురం, బ్యాంకుకెనాల్ కాలువల పరిధిలో ఎదురైన సాగునీటి ఇబ్బందుల ప్రాంతాల్లో బుధవారం వారు పర్యటించారు. అక్కడ రైతుల నుంచి నీటి సరఫరా పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వంతులవారీ విధానం అమలుతో అవసరమైన నీరు అందుతుందని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా పాలకొల్లులో పాత్రికేయులతో మాట్లాడుతూ గోదావరి జలాల లభ్యత బాగా తగ్గినందున ప్రస్తుత పరిస్థితుల్లో వంతులను అమలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు నీరందించే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు పొదుపు పాటించి సహకరించాలని రఘునాథ్, రామరాజులు కోరారు. వీరితో పాటు ఈఈ జి.శ్రీనివాసరావు, డీఈఈ సిహెచ్.వెంకట నారాయణ, పాలకొల్లు జలవనరుల సరఫరా కమిటీ అధ్యక్షుడు ఉంగరాల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

5న పాలకొల్లు రానున్న మంత్రి లోకేష్

పాలకొల్లు, న్యూస్‌టుడే : రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ నీటిసరఫరా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ శుక్రవారం పాలకొల్లు రానున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన వివరాలు స్థానిక శాసనసభ్యుడు నిమ్మల రామానాయుడు కార్యాలయం నుంచి విడుదలైంది. మధ్యాహ్నం 1 గంటకు పోడూరు మండలంలోని జిన్నూరు గ్రామం చేరుకుంటారు. అక్కడ శాసనసభ్యుడు రామానాయుడు స్వాగతం పలుకుతారు. ఇదే గ్రామంలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనంను మంత్రి ప్రారంభిస్తారు. అక్కడ నుంచి నేరుగా పాలకొల్లు పట్టణం వచ్చి జాతీయ నాయకుల విగ్రహాల ప్రాంతంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారు. ఆ తరువాత యలమంచిలి మండలం అడవిపాలెంలో రూ. 15 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనంను, రూ. 1.62 కోట్లతో నిర్మించిన శిరగాలపల్లి - యలమంచిలి లంక సిమెంటు రహదారి, రూ. 1.20 కోట్లతో నిర్మించిన కట్టుపాలెం - యలమంచిలి లంక సిమెంటు రహదారి నిర్మాణాలను ప్రారంభిస్తారు. 2.15 గంటలకు పాలకొల్లు మండలం పాలకొల్లు రూరల్ గ్రామంలో జరిగే జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో పాల్గొని ప్రజలను ఉద్దేశిస్తారు. అనంతరం బయలుదేరి వెళ్ళిపోతారు. మంత్రి లోకేష్ రాక సందర్భంగా శాసనసభ్యుడు రామానాయుడు ఆయా ప్రాంతాల్లో భారీ ఏర్పాట్లను చేస్తున్నారు.

రేపు నరసాపురం రాక

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: పంచాయతీరాజ్‌శాఖ మంత్రి నారా లోకేష్ శుక్రవారం నరసాపురం రానున్నట్లు ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో మలశుద్ధి ప్లాంటు, మొగల్తూరు మండలంలో సీపీడబ్ల్యూ స్కీం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి ప్రారంభించనున్నట్లు తెలిపారు.

8న ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 8న జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ భాస్కర్ చెప్పారు. సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం సమీక్షించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి 8న ఉదయం పోలవరంలో పర్యటిస్తారని తెలిపారు. అనంతరం తాళ్లపూడి మండలం వేగేశ్వరపురంలో జరిగే జన్మభూమి కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అక్కడ నిర్వహించే గ్రామసభలో వివిధ ప్రాధాన్యతరంగాల్లో అభివృద్ధి తెలిపేలా స్టాళ్లను ఏర్పాటుచేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఈనెల


సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ భాస్కర్

11 వరకు గ్రామసభలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు కలెక్టర్ భాస్కర్, ఇతర అధికారులు వేగేశ్వరపురం గ్రామాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

సాంకేతిక సమస్యలతో సతమతం

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: 'జన్మభూమి- మాఊరు' కార్యక్రమం అమల్లో భాగంగా నిర్వహిస్తున్న గ్రామసభల వివరాలను ఏరోజుకారోజు రాత్రికల్లా ఆన్‌లైన్‌లో పంపాలని ప్రభుత్వం నిబంధన విధించింది. అయితే ఆన్‌లైన్‌లో వివరాలను పంపేందుకు సాంకేతిక సమస్యలు ఎదురవుతుండటంతో అధికారులు, సిబ్బంది నానాతంటాలు పడుతున్నారు. ముందు రోజు జరిగిన గ్రామసభల వివరాలను సాంకేతిక సమస్యల వల్ల ఆన్‌లైన్‌లో పంపడానికి వీలుకాకపోతే మరుసటిరోజు పంపేందుకు అవకాశం ఉండటం లేదు. దీంతో రాత్రి పొద్దుపోయే వరకు కంప్యూటర్ల వద్దే పడిగాపులు కాయాల్సివస్తోందని అధికారులు, సిబ్బంది వాపోతున్నారు. అయినప్పటికీ సాంకేతిక సమస్యలు ఎదురవుతుండడటంతో ఏమిచేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

మావుళ్లమ్మ సేవలో రాష్ట్ర భూగర్భ గనులశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శ్రీధర్

మావుళ్లమ్మగుడి వీధి (భీమవరం ఆధ్యాత్మికం), న్యూస్‌టుడే : పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మను రాష్ట్ర భూగర్భగనులశాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శి శ్రీధర్ బుధవారం రాత్రి దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ప్రధానార్చకుడు కొడమంచిలి సుబ్రహ్మణ్యం అమ్మవారి ఆశీస్సులు, ధర్మకర్తల మండలి ఛైర్మన్ సత్యనారాయణమూర్తి, సభ్యులు అడ్డగర్ల ప్రభాకరగాంధీ, అడ్డాల సత్యనారాయణ శేషవస్త్రం, ప్రసాదం అందించారు. కార్యక్రమంలో సెన్సార్ బోర్డు సభ్యుడు కె.వెంకట్రాజు, ఆలయ సీనియర్ అసిస్టెంట్ కె.సోమశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శమూర్తి సావిత్రిబాయిపూలే

✷ ఘనంగా జయంతి వేడుక ✷ ఉత్తమ ఉపాధ్యాయినులకు సన్మానం

ఏలూరు విద్యావిభాగం, న్యూస్‌టుడే: భారతదేశ తొలి ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జయంతి వేడుకను ఏలూరు జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ, వృక్షమిత్ర ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ రాము సూర్యారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'చదవాలి- చదివించాలి' అనే నినాదంతో బాలికలను విద్యావంతులుగా చేయడం కోసం సావిత్రిబాయిపూలే అందించిన సేవలు ఎనలేనివన్నారు. ప్రతి ఒక్కరూ ఆడంబరాలకు పోకుండా సాధారణ జీవితం గడపాలని.. సాటివారికి చేతనైన సహాయం అందించాలని సూచించారు. డీఈవో రేణుక మాట్లాడుతూ సమాజ అభ్యున్నతి కోసం పాటుపడిన గొప్ప సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. నిజజీవితంలో ఎన్నో అవమానాలను ఎదుర్కొని కూడా దేనికీ వెరవకుండా సాటివారికి చేయూత అందించిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని ప్రశంసించారు. సర్వశిక్ష అభియాన్ పీవో వి.బ్రహ్మనందరెడ్డి మాట్లాడుతూ మహనీయుల జీవితాలను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం తగిన కృషిచేయాలని ఉద్బోధించారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సావిత్రిబాయిపూలే జీవిత విశేషాల గురించి వివరించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయినులను సన్మానించారు. పెంటపాడు మాజీ ఉప ఎంపీపీ గాయత్రీదేవి, ఈదరాడ వెంకటేశ్వరరావు, డీఈవో కార్యాలయ ఏడీ-2 టీఎస్ బాబు, వెంకటరమణ, ఏలూరు ఉపవిద్యాశాఖాధికారి డి.ఉదయకుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పురస్కారాలు పొందిన వారి వివరాలు ఇలా ఉన్నాయి.



సన్మానం పొందుతున్న డి.పుష్పలత- ఆచంట ఎంపీపీ బాలుర పాఠశాల,డి.విజయకుమారి- అత్తిలి ఏఆర్‌పేట ఎంపీపీ, వి.వేదమణి- గుండుగొలను సీఎస్ఐ ప్రాథమిక,,బి.వరలక్ష్మి- భీమవరం పురపాలక ప్రాథమిక, పి.కస్తూరిబాయి-బేతపూడి ఎంపీపీ, కేపీ వేద కుమారి-బుట్టాయిగూడెం ఎంపీపీ (ప్రధాన), నాగలక్ష్మి- గౌరిపట్టి ఎంపీపీ (ప్రత్యేక), శారదమ్మ- పోతునూరు ఎంపీపీ, లక్ష్మీబాయి-యర్నగూడెం ఎంపీపీ, ఎ.లక్ష్మీదేవి- ఏలూరు కేకేవీఎం ఎయిడెడ్, మాణిక్యరాణి- వీసీహెచ్ గూడెం ఎంపీయూపీ



టి.కె.నాగమణి- తాడువాయి ఎంపీపీ, ఎ.శ్రీలత-రామన్నపాలెం ఎంపీపీ, వి.విజయకుమారి-తడికలపూడి సీఎస్ఐ, వి.రామసీత-కలవపూడి జడ్పీ ఉన్నత, ఎన్ఎస్ గ్రేస్‌కుమారి-వేములూరు ఏఈడబ్ల్యు, ఏవీ నళిని- దిప్పకాయలపాడు ఎంపీయూఎ, కె.ఫాతిమా అగస్టీన్-పెదకావలిపేట ఎంపీపీ, జి.కనకదుర్గమ్మ- నల్లజర్ల ఎంపీపీ-3, జి.మరియమ్మ -సీహెచ్ మామిడిపల్లి ఎంపీపీ, బి.శ్రీదేవి-పెన్నాడ జడ్పీ ఉన్నత, కేజే పావని- కూచింపూడి జడ్పీ ఉన్నత, ఐ.రామలక్ష్మి- జట్లపాలెం ఎంపీయూపీ



కె.భూదేవి-సిద్ధాంతం ఎంపీపీ,ఎం.సత్యవతి- శెట్టిబలిజపేట ఎంపీపీ, కామేశ్వరి- ఖండవల్లి ఎంపీపీ,కృష్ణవేణి- బ్రాహ్మణచెరువు ఎంపీపీ, పీఎస్ కల్యాణి- సీహెచ్ గురవాయిగూడెం ఎంపీపీ, సీహెచ్ పద్మావతి- తాడేపల్లిగూడెం ఏపీఎస్‌ఎస్‌ఎస్ గురుకుల, ఎస్.జయప్రద- తేతలి ఎంపీపీ, షేక్ మస్తాన్‌బీబీ- ఉండ్రాజవరం ఎంపీపీ-I, బి.కృష్ణవేణి- గోపీనాథపాలెం ఎంపీపీ, కె.రాజరాజేశ్వరి-ఆకివీడు జడ్పీ ఉన్నత(బాలుర), జి.దివ్యవాణి- మట్లపాలెం ఏఏ ఎంపీపీ, శ్రీదేవి- పోణంగి జడ్పీ ఉన్నత



కేఎన్ఎల్ సుందరి- జె.కొమ్మర ఎంపీయూపీ, ఎం.వెంకటదుర్గారాణి- మాగమల్లపాలెం ఎంపీపీ, పి.సుగుణకుమారి- కొణిజర్ల సీఎస్ఐ ప్రాథమిక, ఎస్.శిరీష- గోకవరం ఎంపీపీ-I, ఆర్ఎన్‌టీ లక్ష్మి - భువనపల్లి ఎంపీపీ, పి.శైలజ- లంకలకోడేరు జడ్పీ ఉన్నత, ఎం.రాధ-కలపర్రు జడ్పీ ఉన్నత,కె.లక్ష్మి- ఉప్పేరు ఎంపీయూపీ, వై.యామినీకుమారి- వేగేశ్వరపురం ఎంపీపీ, కేవీ పద్మావతి- వీరవాసరం ఎంపీపీ, ఎస్.తులసీదేవి- కానూరు జడ్పీ ప్రాథమిక, జి.దుర్గాభవాని-పోలవరం ఎంపీపీ-2



జి.పద్మావతి- పెదపాడు జడ్పీ, సీహెచ్ గంగాదేవి -తాళ్లపూడి ఎంపీపీ, కె.ఇందిర-పెంటపాడు ఎస్‌డబ్ల్యుకే, ఎస్.మణెమ్మ- వాల్లూరిపల్లి, ఎం.వెంకమ్మ- పరిమెళ్ల జడ్పీ ఉన్నత, ఎస్‌పీ జ్యోతి- కృష్ణాయపాలెం ఎంపీపీ, ఎస్.కృపారాణి- పెంటపాడు, జి.సుచిత్ర-దర్శిపర్రు ఎంపీపీ-2 , ఎస్‌జే ప్రభావతి- వెంకటాపురం ఎంపీపీ, పి.అనురాధ- కాకరమిల్లి ఎంపీపీ, కె.అరుణ- పండితవల్లూరు ఎంపీపీ, సత్యవతి- శనివారపుపేట ఎంపీపీ

ఆకృతి వస్త్రాలయం ప్రారంభం

తణుకు, న్యూస్‌టుడే: తణుకు పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆకృతి వస్త్రాలయాన్ని శాసన సభ్యుడు ఆరిమిల్లి రాధాకృష్ణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాలకు దీటుగా వివిధ రకాల మోడల్స్‌తో కూడిన దుకాణాన్ని పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. వస్త్రదుకాణం అధినేత తాతాజీ మాట్లాడుతూ మహిళలకు కావాల్సిన అన్నీ రకాల వస్త్రాలను అందుబాటులో ధరల్లో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తొలుత ఇస్కాన్ మందిర అధ్యక్షుడు సత్యగోపినాథ్ ప్రభూజీ జ్యోతిని వెలిగించారు. లక్కీదుకాణం అధినేత రత్తయ్య మొదటగా కొనుగోలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వైటీ రాజా, తెదేపా రాష్ట్ర నాయకురాలు ముళ్లపూడి రేణుక, మున్సిపల్ ఛైర్మన్ పరిమి వెంకన్నబాబు, వైస్‌ఛైర్మన్ మంత్రిరావు వెంకటరత్నం, ఏఎంసీ ఛైర్మన్ తోట సూర్యనారాయణ, మాజీ ఛైర్మన్ బసవా రామకృష్ణ, డాక్టర్ దొమ్మేటి వెంకటసుధాకర్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ పట్టణ అధ్యక్షుడు గమిని రాంబాబు, వస్త్ర వ్యాపారులు బొమ్మన రాజ్‌కుమార్, చందన రమేష్, కాదా ఏడుకొండలు, చక్రధర్ ఆసుపత్రి అధినేత మోటూరి విష్ణుచక్రధరరావు తదితరులు పాల్గొన్నారు.



వస్త్రదుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి, మాజీ ఎమ్మెల్యే వైటీ రాజా తదితరులు

డివిజన్-3 ఈఈగా హుస్సేన్

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు డివిజన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా ఏఎస్‌ఏ హుస్సేన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన ఎన్.పుల్లారావు పదోన్నతిపై సీఏడీఏ ఎస్ఈగా వెళ్లారు. ఆయన స్థానంలో కర్నూలు జిల్లాలో డీఈగా పనిచేస్తున్న హుస్సేన్ ఎర్త్‌కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ ఈఈగా పదోన్నతిపై వచ్చారు.

ఈఈగా సుధాకర్



పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఈఈగా ఎంఎన్.సుధాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా తెలుగు గంగ ప్రాజెక్టులో డీఈగా పనిచేస్తోన్న ఆయన పదోన్నతిపై పోలవరం వచ్చారు. స్పిల్‌వేలో ఈఈగా పనిచేసిన కుమార్ సీఈగా పదోన్నతిపై కృష్ణా జిల్లాకు బదిలీపై వెళ్లారు.

శాఖాపరమైన చర్యలకు రంగం సిద్ధం

విచారణాధికారి నియామకం

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో జరిగిన భవన నిర్మాణాల్లో నిబంధనల అతిక్రమణలను గుర్తించకపోవడం, వాటిపై నివేదికలను ఉన్నతాధికారులకు అందజేయడంలో విఫలమైన నేపథ్యంలో సంబంధిత సిబ్బందిపై శాఖాపరమైన చర్యలకు రంగం సిద్ధమైంది. దీని నిమిత్తం ఏపీ సీఆర్‌డీఏ సంయుక్త సంచాలకుడు బి.బాలాజీని విచారణాధికారిగా నియమిస్తూ పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి విభాగం ముఖ్య కార్యదర్శి కరికాల వలెవన్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. విచారణకు సహాయ అధికారిగా నగరపాలక సంస్థ అసిస్టెంట్ సిటీప్లానర్ శ్రీనివాస్‌ను నియమించారు. గతంలో భవన నిర్మాణాల్లో అతిక్రమణలను గుర్తించకపోవడం, అధికారులకు సమాచారం ఇవ్వకపోవడంతో అప్పటి టీపీబీవోలు కేవీ కృష్ణారావు, ఎం.రంగప్రసాద్, పీఎస్ఆర్ శాస్త్రి, టీపీవో పీఎన్ సాయిబాబులపై ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై 2017 ఆగస్టు 9, సెప్టెంబర్ 29 తేదీల్లో సంబంధిత ఉద్యోగుల నుంచి రాతపూర్వక స్టేట్‌మెంట్‌లు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో వారిపై శాఖాపరంగా చర్యలు తీసుకొనేందుకు విచారణాధికారిని నియమిస్తూ జీవో జారీ చేశారు. రెండు నెలల్లో దీనిపై నివేదిక ఇవ్వాలని ఉత్వర్వుల్లో పేర్కొన్నారు.

రాట్నాలమ్మ ఆలయానికి విరాళాలు

పెదవేగి,న్యూస్‌టుడే: రాట్నాలమ్మ ఆలయ పునర్నిర్మాణానికి పెరికీడుకు చెందిన సత్యభాస్కర్‌గణేష్‌బాబు రూ.10,116, కరీంనగర్‌కు చెందిన పులికంటి నీరజ హరికృష్ణ రూ 6,011 విరాళం అందించారు. ఆలయ ఛైర్మన్ రాయల భాస్కరరావు, ఈవో అరుణ్‌కుమార్ చేతుల మీదుగా ఈ విరాళాలను అమ్మ వారి సన్నిధిలో అందజేశారు.

ఎనిమిది గ్రామాల్లో జన్మభూమి మా ఊరు

దెందులూరు, న్యూస్‌టుడే: మండలంలోని 8 గ్రామాల్లో 5వ విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమాలు గురువారం జరుగుతాయని ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు. పోతునూరు, దోసపాడు, కొవ్వలి, సోమవరప్పాడు, గోపన్నపాలెం, సానిగూడెం, గంగన్నగూడెం, గాలాయగూడెం గ్రామాల్లో కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

రంగవల్లులకు..
ఆహ్వానము

ముగ్గులు... మహిళల సృజనకు వేదికలు. ధనుర్మాసం వచ్చిందంటే చాలు ఇంటి ముంగిట వేసే రంగవల్లుల్లో ప్రావీణ్యాన్ని చూపించాలని ప్రతీ ఒక్కరు ఆరాటపడుతుంటారు. అలా మీరు వేసిన ముగ్గును ముద్రణలో చూడాలని అనుకుంటున్నారా..! ఆ అవకాశం మీకు 'ఈనాడు' కల్పిస్తోంది. చేయాల్సిందల్లా.. ఇంటి ఆవరణలో మీరు వేసిన ముగ్గుతోపాటు ఫొటో దిగి.. మీ పేరు, ఊరు, మండలం జతపరిచి వాట్సాప్‌లో కింది ఇచ్చిన నంబరుకు పంపించడమే. ఫొటో ప్రచురణ తుది నిర్ణయం నిర్వాహకులదే.

వాట్సాప్ నంబరు
96186 78906



యు. సాయి సింధూర
గంగన్నగూడెం, దెందులూరు





గోవర్ధిని
కె.కన్నాపురం, పెదవేగి

రూ-అర్బన్‌తో గ్రామాలకు మహర్దశ

ఏలూరు గ్రామీణ న్యూస్‌టుడే

రూ-అర్బన్‌తో పల్లెసీమలకు మహర్దశ కలగనుంది. నిధులు లేమితో కొట్టుమిట్టాడుతూ విద్యుత్తు బిల్లులు, సిబ్బంది జీతభత్యాలు కూడా చెల్లించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో నగరానికి, పట్టణాలకు సమీపంలోని గ్రామాలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. దీనిలో భాగంగా రాష్ట్రంలోని పలు మండలాలను ఎంపిక చేసి ఆ మండలాల్లోని గ్రామాల సమగ్ర సమాచారం సేకరిస్తోంది. కోట్లాది రూపాయల నిధులు కేటాయిస్తోంది. అధికారులు అందుకు సంబంధించిన సమగ్ర ప్రణాళికలు రూపొందించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. అనుమతులు మంజూరు అయితే ఆ గ్రామాలకు మహర్దశ కలుగనుంది.

నగరాలు, పట్టణాల్లోని పరిసర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో అభివృద్ధి చెందుతున్నాయి. అదే విధంగా నగరాలు, పట్టణాల్లో విలీనంకాని గ్రామాల్లో కూడా మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు మెరుగుపరచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. నగరానికి సమీపంలో 50 వేల మంది జనాభా నివసించే గ్రామాలను ఎంపిక చేసి ఆ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచేందుకు ప్రణాళికలు రూపొందించారు. దీనిలో భాగంగా రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి ఒక్కో మండలంను ఎంపిక చేసింది. దీనిలో భాగంగా మన జిల్లాలో ఏలూరు మండలాన్ని ఎంపిక చేసింది. మండలం పరిధిలో 22 గ్రామ పంచాయతీలు ఉండగా వీటిలో 7 గ్రామపంచాయతీలు ఏలూరు నియోజకవర్గం పరిధిలో ఉన్నాయి. మిగతా 15 గ్రామపంచాయతీలు దెందులూరు నియోజకవర్గం పరిధిలో ఉన్నాయి. తొలుత ఏలూరు నియోజకవర్గం పరిధిలోని వెంకటాపురం, పోణంగితో పాటు దెందులూరు నియోజకవర్గం పరిధిలోని మాదేపల్లి, కాట్లంపూడి, జాలిపూడి గ్రామాలను ఎంపిక చేశారు. ఏలూరు నియోజకవర్గంలోని వెంకటాపురం, పోణంగి గ్రామాలు భవిష్యత్తులో నగరంలో విలీనం కానున్నాయి. ఈ గ్రామాలు నగరంలో విలీనం అయితే నగరపాలక సంస్థ నుంచి నిధులు మంజూరై నగరంలోని ప్రాంతాలు మాదిరిగా ఈ గ్రామాలు కూడా అభివృద్ధి చెందుతాయని, అలా కాకుండా నగరంలో విలీనం కాని గ్రామాలను ఎంపిక చేయాలనే ఆలోచనకు వచ్చారు అధికారులు. ఈ నేపథ్యంలో ఏలూరు నియోజకవర్గం పరిధిలోని గ్రామాలు కాకుండా దెందులూరు నియోజకవర్గం పరిధిలో మిగిలిన 15 గ్రామ పంచాయతీలను రూ-అర్బన్ గ్రామాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు మంజూరు అయితే రూ.100 కోట్లు నిధులు మంజూరుకానున్నాయి. దీంతో ఈ గ్రామాలకు మహర్దశ కలగనుంది. ఈ నిధులతో గ్రామాల్లో సీసీ రహదారులు, భూగర్భ మురుగుకాలువలు, ఓవర్‌హెడ్‌ట్యాంకు నిర్మాణాలతో పాటు విద్య, వైద్య సదుపాయాలు మెరుగుపడనున్నాయి. ఇవే కాకుండా ఆయా గ్రామాల్లో లభించే వ్యవసాయ, అనుబంధ చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు

గ్రామాల నుంచి పనుల కోసం నగరానికి వెళ్లకుండా గ్రామంలోనే ఉపాధి కల్పించాలని దీని ఉద్దేశ్యం. ఈ క్రమంలో ఆయా గ్రామపంచాయతీల సర్పంచులు, కార్యదర్శులతో జిల్లా ఉన్నతాధికారులు సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ఏలూరు మండలంలో అధికంగా లంక గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో ఇప్పటికే అంతర్గత రోడ్లు, మురుగుకాలువలు, తాగునీటి సమస్యలు అధికంగా ఉన్నాయి. దీనికితోడు ఈ ప్రాంత ప్రజలు దూరప్రాంతాలకు పనుల నిమిత్తం వలసలు వెళ్తున్నారు. రూ-అర్బన్‌గా ఎంపిక అయితే తమ గ్రామాలు ఎంతగానో అభివృద్ధి చెందుతాయని స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు.



అధ్వానంగా అంతర్గత రహదారులు



దారుణంగా మురుగుకాలువ



ఏపూరు బీసీకాలనీలో భూగర్భ డ్రెయినేజీ పనులకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

భూగర్భ డ్రెయినేజీ పనులకు భూమిపూజ

ఏపూరు (పెదపాడు), న్యూస్‌టుడే: మేజర్ పంచాయతీ ఏపూరులోని బీసీ కాలనీలో భూగర్భ డ్రెయినేజీ పనులకు సర్పంచి దుడ్డు నాగేశ్వరరావు, తెదేపా గ్రామకమిటీ అధ్యక్షుడు జాస్తి బసవారావులు బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ నిధులు విడుదల చేసి అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఆయన జన్మదినం సందర్భంగా అభివృద్ధి పనులకు భూమిపూజ చేసినట్లు తెలిపారు. రూ.30 లక్షలతో భూగర్భ డ్రెయినేజీ, మరో రూ.30 లక్షల నిధుల అంచనాతో బీసీ కాలనీలో సీసీ రహదారులను నిర్మిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు దొడ్డి సుబ్రమణ్యం, తెదేపా నాయకుడు కూరపాటి రవిప్రకాష్, జన్మభూమికమిటీ సభ్యులు, పంచాయతీ పాలకవర్గం తదితరులు పాల్గొన్నారు.



బస్టాండ్ ఆవరణలో మాట్లాడుతున్న తహశీల్దార్ కుమార్

వ్యసనాలకు దూరంగా ఉండాలి

పెదపాడు, న్యూస్‌టుడే: పండుగల సందర్భంగా ఆహ్లాదపూరితంగా ఉండే గ్రామాల్లో జూదాలు తదితర వ్యసనాలకు దూరంగా ఉండాలని పెదపాడు తహశీల్దార్ జి.జె.ఎస్.కుమార్ పేర్కొన్నారు. పెదపాడు బస్టాండ్ వద్ద పోలీసుశాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెదపాడు ఎస్సై కె.రామకృష్ణ మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడవాలని కోరారు. కోడిపందేలు నిర్వహిస్తే రౌడీ షీట్ తెరిచేందుకు వెనుకాడమన్నారు.

సావిత్రిబాయిపూలే జీవితం ఆదర్శప్రాయం

దెందులూరు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయురాలిగా సమాజోద్ధరణకు నిరంతరం కృషిచేసిన సావిత్రి బాయిపూలే జీవితం ఆదర్శప్రాయమని యూటీఎఫ్ దెందులూరు మండల శాఖ అధ్యక్షుడు డి. రత్నప్రసాద్ అన్నారు. దెందులూరులో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆమె జయంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు ద్వారా ఎంతో మందికి విద్యనందించారన్నారు. సమాజంలో మహిళలు, దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడి వారికి అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కె.రంగారావు, ప్రధాన కార్యదర్శి కె.ప్రవీణ్, జయకుమార్, చినదాసు, తదితరులు పాల్గొన్నారు.



సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

పాఠశాలల్లో...

దెందులూరు, కొవ్వలి, మేదినరావుపాలెం (దెందులూరు) న్యూస్‌టుడే: మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే జయంతిని మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం నిర్వహించారు. దెందులూరులోని విజయనగేష్ డీఎడ్ కళాశాలలో ప్రిన్సిపల్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి మహిళా సంఘ సంస్కర్తగా మహిళల విద్యాభివృద్ధికి కృషిచేశారన్నారు. కులం, పితృస్వామ్యంపై పోరాడిన వనితన్నారు. ప్రత్యేక పాఠశాలలు నడిపి దళితులకు విద్యనందించారన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ఎస్.సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కొవ్వలి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎన్.ఆంజనేయులు, ఉపాధ్యాయులు సావిత్రి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆమె చేసిన కార్యాలను గుర్తు చేసుకున్నారు. మేదినరావుపాలెంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు.

సినిమాలు

ఏలూరు

విజయలక్ష్మి విమ్యాక్స్1	హలో
విజయలక్ష్మివిమ్యాక్స్2	మళ్లీ రావా..
అంబిక లిటిల్	టైగర్
అంబిక డీలక్స్	రాజా ది గ్రేట్
అంబికామినీ	జుమాంజీ
సత్యనారాయణ మినీ	ఒక్క క్షణం
సత్యనారాయణ	ఎంసీఏ (మిడిల్ క్లాస్ అబ్బాయ్)
సాయిబాలాజీ	2 కంట్రీస్
బాలాజీ	ఖాకి
క్రాంతి	ఒక్క క్షణం

దెందులూరు

నగరంలో ఈనాడు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే

★ **ఉదయం 10 గంటలకు:** కలెక్టరేట్‌లో లూయీ బ్రెయిలీ జయంతి వేడుక.
★ **సాయంత్రం 6.30 గంటలకు:** వైఎంహెచ్‌ఏ హాలులో 'జన్మభూమి-సంక్రాంతి' సాంస్కృతిక కార్యక్రమాలు.



ఇవేమి పనులు..?

- జాతీయ రహదారి పనులు సగం..సగం
- ప్రమాదకరంగా ఉన్న తీరు

ఫోకస్



కలపర్రు: టోల్‌ప్లాజా ప్రమాదకరంగా ఉన్న రహదారి

కలపర్రు (పెదపాడు), న్యూస్‌టుడే: జాతీయ రహదారికి ఇటీవల మరమ్మతులు చేపట్టారు. అవి అసంపూర్తిగా జరగడంతో ఈ రహదారి ప్రమాదకరంగా మారిందని వాహనచోదకులు పేర్కొంటున్నారు. సాధారణంగా ఒక రహదారిని పూర్తిస్థాయిలో పునర్నిర్మించేటప్పుడు గతంలో ఉన్నదానిని పూర్తిగా అభివృద్ధి చేయడం సహజం. అందుకు భిన్నంగా 16వ జాతీయ రహదారి విషయంలో అప్పనవీడు నుంచి గుండుగొలను వరకు జరిగిన రహదారి మరమ్మతుల పనులు అసంపూర్తిగా జరుగుతున్నాయి. ఇప్పటికే ఈ మార్గాన్ని రెండు పర్యాయాలు పునర్నిర్మించినా ఇపుడు కూడా పూర్తిస్థాయిలో చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. గతంలో ఎంత వరకు రహదారిని అభివృద్ధి పరిచారో అంతవరకు అభివృద్ధి చేయకుండా అసంపూర్తిగా అభివృద్ధి చేయడంపై వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలపర్రు టోల్‌ప్లాజా వద్ద పూర్తిగా అభివృద్ధి చేయకుండా వదిలేయడంతో రహదారి పెద్ద పెద్ద గోతులు ఉండి ప్రమాదకరంగా మారింది. జాతీయ రహదారి అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో అధికారులు తగురీతిలో స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుకుంటున్నారు.



కలపర్రు: పూర్తిస్థాయిలో వేయకుండా..



కలపర్రు: జాతీయ రహదారిపై కొక్కిరపాడు అడ్డరోడ్డు వద్ద మధ్యలో ఇలా ..

గ్రామ దర్శిని

పెదపాడు, న్యూస్‌టుడే

వట్లూరు: గోభూమిలో జరుగుతున్న ఎన్టీఆర్ గృహనిర్మాణాలను సర్పంచి గంచిరీ దేవికారాణి ఆధ్వర్యంలో వట్లూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు కొమ్మన లక్ష్మణ మోహన్, సొసైటీ అధ్యక్షుడు కొమ్మన వెంకటశ్రీధర్, గంచీరి వడ్డికాసులు బుధవారం పరిశీలించారు. లబ్ధిదారులకు పలు సూచనలు అందించారు. త్వరితగతిన పూర్తి చేసి ఉగాది నాటికి గృహప్రవేశాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆర్. ముత్తయ్య, వీఆర్వో శర్మ తదితరులు పాల్గొన్నారు.

వసంతవాడ: ఈ పట్టాదారుపాస్ పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు జన్మభూమి కార్యక్రమంలో భాగంగా పాస్ పుస్తకాలను అందించినట్లు వీఆర్వో ఎన్. జైపాల్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

బ్యాంకు కార్యకలాపాలపై అవగాహన కలిగి ఉండాలి

సత్యవోలు (పెదపాడు), న్యూస్‌టుడే: బ్యాంకు ఆర్థిక కార్యకలాపాలపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ నాయుడుగూడెం శాఖ మేనేజర్ వి. వి. ఎన్. ఎస్. ప్రకాష్ కోరారు. సత్యవోలు ఉన్నత పాఠశాలలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ నాయుడుగూడెం శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు గౌస్ మోహిద్దీన్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఆర్థిక అక్షరాస్యత గురించి తెలుసుకోవాలన్నారు. పొదుపుఖాతా, నగదు రహిత లావాదేవీలు, ఏటీఎం వినియోగం తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో సత్యవోలు సర్పంచి బేత అర్జునరావు, కె. రామకృష్ణంరాజు, బ్యాంక్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సత్యవోలు ఉన్నత పాఠశాల విద్యార్థులకు బ్యాంకు ఆర్థికాంశాలపై వివరిస్తున్న ప్రకాష్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

కోడిపందేలకు దూరంగా ఉండండి

ఏలూరు రూరల్ సీఐ సూచన

పెదవేగి, న్యూస్‌టుడే: కోడిపందేలు, కోతముక్క, గుండాట వంటి అసాంఘిక కార్యకలాపాలను ఉక్కుపాదంతో అణచి వేస్తామని ఏలూరు గ్రామీణ సీఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. పెదవేగి మండలం లక్ష్మీపురం, కవ్వగుంట గ్రామాలలో ప్రతిఏటా కోడిపందేలను నిర్వహించే బరులను ఆయన పరిశీలించారు. అనంతరం కవ్వగుంట గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులను అనుసరించి కోడిపందేల రాయుళ్లపై కఠిన చర్యలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కోడిపందేల నిర్వహించేవారిపై జీవహింస నిరోధక చట్టం కింద చర్యలు చేపడతామన్నారు. గ్రామీణ పరిధిలో విస్తృతంగా నిఘాబృందాలు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. కోళ్ల కాళ్లకు కత్తులు కట్టే పలువురిని ఇప్పటికే అదుపులోకి తీసుకున్నామన్నారు. సంక్రాంతి పండుగను ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో పెదవేగి ఎస్సై కాంతిప్రియ, తహశీల్దార్ నజీముల్లాషా, పెదవేగి సహకార సంఘం అధ్యక్షుడు ఉండవల్లి వెంకట్రావు, సర్పంచులు మేకా రంగారావు, సుగసాని లక్ష్మీకాంతం గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలపై దాడి: ఏడుగురి అరెస్ట్

రామశింగవరం(పెదవేగి)న్యూస్‌టుడే: పెదవేగి మండలం రామశింగవరం గ్రామంలో కోడిపందేల స్థావరాలపై దాడిచేసి ఏడుగురు పందెంరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్సై కాంతిప్రియ తెలిపారు. వారివద్ద నుంచి రూ 3200 నగదు, 3 కోళ్లు, 2 కోడికత్తులు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

బైండోవర్ కేసులు నమోదు

పెదవేగి మండలం రామశింగవరం గ్రామానికి చెందిన ఇద్దరు కోడి కాళ్లకు కత్తులు కట్టే వ్యక్తులను గుర్తించి వారిపై ముందస్తుగా బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై కాంతిప్రియ తెలిపారు. మండలంలో ఎక్కడైనా కోడిపందేలు, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని, సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతూ ఓ వ్యక్తి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమడోలు మండలం అన్నేవారిగూడేనికి చెందిన కుంచె కృష్ణమూర్తి(60) ఈనెల 2న పురుగుమందు తాగారు. దీనిని గమనించిన కుటుంబసభ్యులు ఆయనను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందారు. దీనిపై భీమడోలు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం తాగిన చోదకుడికి జైలు శిక్ష

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: మద్యం తాగిన వాహనం నడిపిన చోదకుడికి న్యాయస్థానం రెండురోజుల జైలుశిక్ష విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత సంవత్సరం డిసెంబరు 31న రాత్రి వాహనదారులకు శ్వాసనిర్ధణ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో పట్టుబడిన ఏలూరుకు చెందిన నారాయణను బుధవారం ఏలూరు ఎక్సైజ్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి పీఎస్ ప్రదీప్ నిందితుడికి రెండు రోజుల జైలుశిక్షతో పాటు రూ. 1000 అపరాధరుసుము విధించినట్లు పోలీసులు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలలో ఆరోగ్యం అందని ద్రాక్ష

ఏలూరు గ్రామీణ న్యూస్‌టుడే

రెండేళ్లుగా అందని ప్రథమ చికిత్స కిట్లు

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రథమ చికిత్స కిట్లు అందని ద్రాక్షగానే ఉన్నాయి. కేంద్రాల్లోని చిన్నారులకు చిన్న చిన్న గాయాలైనా ప్రథమ చికిత్స అందటం లేదు. ఏ ఒక్క కేంద్రంలో ప్రథమ చికిత్స కిట్లు మచ్చుకైనా కానరావటం లేదు. దీంతో అత్యవసర సమయాల్లో చికిత్స అందకుండా పోతోంది. దగ్గరలోని ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులను ఆశ్రయిస్తున్నారు. అధికారులు కేంద్రాలను సందర్శించి సమీక్షలు నిర్వహిస్తున్నారు కానీ చిన్నారులకు అవసరమైన ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉన్నాయా లేదా అనే విషయాలపై సమీక్షించటం లేదు. దాదాపు రెండేళ్లుగా చికిత్స కిట్లను కేంద్రాలకు అందచేయటం లేదనే సమాచారం.

ఐసీడీఎస్ పెదపాడు ప్రాజెక్టు పరిధిలో పెదపాడు, ఏలూరు, పెదవేగి మండలాలకు సంబంధించి 247 కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నారు కానీ ప్రథమ చికిత్స సరిగా అందని పరిస్థితి నెలకొంది. ప్రథమ చికిత్స అందకపోవటంతో ప్రైవేటు ఆసుపత్రులే దిక్కుగా మారుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు 2015లో ప్రథమ చికిత్స కిట్లు సరఫరా చేశారు. అప్పటి నుంచి నేటి వరకు వీటి ఊసేలేదు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్స అందించటానికి కిట్లను అందుబాటులో ఉంచుతారు. వీటిలో జ్వరానికి వాడే పారాసిటమాల్, గాయాలకు ఉపయోగించే దూది, ప్లాస్టర్లు, చిన్న పిల్లలకు దగ్గుమందు, విరేచనాలు, వాంతులకు సంబంధించిన మాత్రలు, గర్భిణులు, బాలింతలకు ఐరన్ బిళ్లలు, కాలినగాయాలకు ఉపయోగించే మందులు ఉంటాయి. ప్రస్తుతం ఏ ఒక్క అంగన్‌వాడీ కేంద్రంలోనూ ప్రథమ చికిత్స కిట్లు కనిపించటం లేదు. ప్రస్తుతం శీతాకాలం కావటంతో చలిగాలులకు చిన్నారులు జలుబు, దగ్గు, శ్వాసకోశవ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చిన్నారులను దూరప్రాంతాల్లోని వైద్యుల వద్దకు తీసుకెళ్లాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంక్షేమమే తమ ధ్యేయంగా పనిచేయాల్సిన అంగన్‌వాడీ కేంద్రాల్లో వనరులు సక్రమంగా లేకపోవటంతో ప్రభుత్వ లక్ష్యాలు క్షేత్రస్థాయిలో అమలుకునోచుకోవటం లేదు. ప్రజారోగ్య పరిరక్షణ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలను పరిపుష్టం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.



అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు

ఈ పరిస్థితుల్లో జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర సమీక్షలు నిర్వహించి అందుకు అనుగుణంగా కార్యచరణ చేపట్టాల్సి ఉంది. ఈ విషయమై ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు ఎస్. బేబీ సరోజిని న్యూస్‌టుడేతో మాట్లాడుతూ రెండేళ్ల క్రితం అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రథమచికిత్స కిట్లు అందాయన్నారు. ఆ తరువాత ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రథమచికిత్స కిట్లు సరఫరా కాలేదన్నారు. అత్యవసర సమయాల్లో దగ్గరుండి చిన్నారులను దగ్గర్లోని ప్రభుత్వ ఆరోగ్య ఉపకేంద్రాలకు తీసుకెళ్లి ఆరోగ్యకార్యకర్తలతో చికిత్స చేయిస్తున్నామని తెలిపారు.

ఈ నెల 14 నుంచి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు

రుస్తుంబాద(నరసాపురం పురపాలకం), న్యూస్‌టుడే: నరసాపురం పట్టణ పరిధి రుస్తుంబాదలో గోగులమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 18 వరకు 25వ జాతీయస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఉత్సవ కమిటీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకీరామ్, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి ఎం.రంగారావు బుధవారం రుస్తుంబాదలో వెల్లడించారు. ఈ పోటీల్లో ఏపీ, హైదరాబాద్, హర్యానా, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిషా, కోల్‌కత, తదితర ప్రాంతాల నుంచి 30 జట్లు పాల్గొంటాయని తెలిపారు. తొలిసారిగా మ్యాట్‌పై కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రో కబడ్డీ క్రీడాకారులు శ్రీకాంత్‌రెడ్డి, మనోజ్‌కుమార్ పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీఆర్ దాస్, దేశిన శ్రీనివాసరావు, ఒగ్గు సత్యనారాయణ, చినమిల్లి నాని, యాదంరెడ్డి నాగేశ్వరరావు, మహేశ్, గన్నాబత్తుల సత్యనారాయణ, కొప్పినీడి బాబాజీ, శీలం రాజేశ్, వర్ధినేని బాబ్జి, కప్పల ఆనంద్‌కుమార్, బళ్ల మణి, గంధం రవి, గరగ శంకర్, చాగంటి బాబి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకీరామ్

సీపీఎస్ రద్దు కోసం ఉద్యమం

9న తాలూకా కేంద్రాల్లో, 10న కలెక్టరేట్ వద్ద ధర్నాలు



ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకుల సంఘీభావం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు భాగస్వామ్య పింఛను విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమం నిర్వహించనున్నట్లు ఏపీఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు, ఐకాస జిల్లా ఛైర్మన్, పింఛను సాధన సమితి జిల్లా కన్వీనర్ ఆర్‌ఎస్ హరనాథ్ చెప్పారు. ఏలూరులోని ఎన్‌జీవో హోంలో బుధవారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేయాలనే ప్రధాన డిమాండ్‌తో ఈనెల 9న అన్ని తాలూకా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 10న ఏలూరులో భారీ ప్రదర్శన నిర్వహించి కలెక్టరేట్ వద్ద ధర్నాచేస్తామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, మేధావులు, ఉద్యోగ సంఘాల నాయకులతో ఫిబ్రవరి నెలాఖరులోగా రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే మార్చిలో 'చలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. ఏపీఎన్‌జీవో సంఘం జిల్లా కార్యదర్శి, పింఛను సాధన సమితి సభ్య కన్వీనరు చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగుల సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్నాయని విమర్శించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సీపీఎస్ విధానంవల్ల నష్టపోతున్న వారిలో ఎక్కువ శాతం మంది ఉపాధ్యాయులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీఏ సాల్మన్‌రాజు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దుచేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో తీర్మానించి కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గోపిమూర్తి మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దుచేయకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉద్యోగ, ఉపాధ్యాయులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. పింఛను సాధన సమితి జిల్లా అధ్యక్షుడు వి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగుల విషయంలో ప్రభుత్వం విభజించు, పాలించు అనే పద్ధతిని అమలు చేస్తుందని విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని ప్రభుత్వం రద్దుచేసేవరకు తమ ఉద్యమం ఆగదని పేర్కొన్నారు. ఏపీటీఎఫ్-1938 జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కృష్ణ, ఏపీఎన్‌జీవో సంఘ ఏలూరు తాలూకా యూనిట్ అధ్యక్షుడు ఐవీఎస్ ఎన్ రాజు, నాయకులు సత్యనారాయణమూర్తి, శ్రీధర్‌రాజు, పెద్దిరాజు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(వెన్‌కాబ్) (కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర 86 రిటైల్ ధర -108, చికెన్ విత్ స్కిన్ - 157, చికెన్ స్కిన్‌లెస్ - 178

బంగారం, వెండి ధరలు



10 గ్రాములు	3–1–18	2–1–18
22 క్యారెట్ల	రూ.28,235	రూ.28,165
24 క్యారెట్ల	రూ.30,190	రూ.30,140
వెండి కిలో	రూ.39,160	రూ.39,980

నిమ్మకాయల ధరలు




ఏలూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం నిమ్మకాయల ధరలు (క్వింటాలుకు రూపాయల్లో)

గరిష్ఠం	రూ.	1800
మోడల్ (సగటు)	రూ.	1400
కనిష్ఠం	రూ.	1000

పాలకొల్లు కొబ్బరి మార్కెట్



కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (వెయ్యింటికి రూ. లలో)
పాత కాయ పెద్ద సైజు	8,500
పాత కాయ చిన్న సైజు	7,000
పాత కాయ రాశి (పెద్ద,చిన్న సైజు)	8,000
కొత్త కాయ పెద్ద సైజు	7,600
కొత్త కాయ చిన్న సైజు	6,000
కొత్త కాయ రాశి (పెద్ద, చిన్న సైజు)	7,000
గండేరా పెద్ద సైజు	6,600
గటగట పెద్ద సైజు	5,200



చేపల ధరలు (భీమవరంలో)

(కిలో రూపాయల్లో)

శీలావతి	– రూ. 100
బొచ్చె	– రూ. 105
మోసు	– రూ. 54
ఫంగస్	– రూ. 58
కొర్రమేను	– రూ. 350
పండుగప్ప	– రూ. 370
పీతలు	– రూ. 600

వనామీ రొయ్యలు

20 కౌంటు	– రూ. 700
30 కౌంటు	– రూ. 420
40 కౌంటు	– రూ. 400
50 కౌంటు	– రూ. 350
60 కౌంటు	– రూ. 300
70 కౌంటు	– రూ. 280
80 కౌంటు	– రూ. 250
90 కౌంటు	– రూ. 230
100 కౌంటు	– రూ. 200



వసతి.. రూ.500: ఫిబ్రవరి 28 నుంచి మార్చి 31 వరకు ఖాళీలున్నాయి.

రూ.100: ఫిబ్రవరి 28 నుంచి మార్చి 31 వరకు ఖాళీలున్నాయి.

శ్రీనివాసం (రూ.200): ఫిబ్రవరి 28 నుంచి మార్చి 31 వరకు ఖాళీలున్నాయి.

దర్శనం.. రూ.300 (శీఘ్ర దర్శనం): జనవరి 10, 11, 21, 22, 29 నుంచి 30 వరకు, ఫిబ్రవరి 1 నుంచి 9 వరకు, 11 నుంచి 28 వరకు, మార్చి 2 నుంచి 12 వరకు, 14 నుంచి 17 వరకు, 19 నుంచి 31 వరకు ఖాళీలున్నాయి.

సంప్రదించాల్సిన ఫోన్ నెంబరు
ఏలూరు: 08812-232073
ప్రతి మంగళవారం సెలవు
వెబ్‌సైట్: www.ttdsevaonline.com

కోడిపందేలు.. కొత్త ఎత్తులు!

(మొదటిపేజీ తరువాయి) నమోదు చేయడం, కోళ్లను స్వాధీనం చేసుకోవడం విస్తృతంగా చేస్తున్నారు. ఇటువంటి నివేదికలను కూడా హైకోర్టు తోసిపుచ్చిన నేపథ్యంలో ఈసారి ఏవిధంగా ముందుకు వెళతారనేదానిపై సందిగ్ధత నెలకొంది. గడిచిన అయిదేళ్లుగా కోడిపందేల నిర్వహణ అనేది జిల్లాలో కొంతమంది నాయకులకు ముఖ్యంగా ఎమ్మెల్యేలకు ప్రతిష్ఠాత్మకంగా మారింది. కోర్టు ఆదేశాలను కూడా పట్టించుకోకుండా గతంలో కొంతమంది ఎమ్మెల్యేలు పందేల్లో పాల్గొనడం, ప్రారంభించడం చేశారు. అయితే ఈ ఏడాది ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా పందేలకు దూరంగా ఉండాలని సూచించారు. వివిధ ప్రాంతాల పందెం రాయుళ్లు తమ తమ ప్రాంతాల్లో పందేలు నిర్వహించాలని ఆయా ప్రాంతాలకు పోలీసులు రాకుండా చూడాలని స్థానిక నాయకులపైన ఒత్తిడి తీసుకొస్తున్న సందర్భాలు ఉన్నాయి. దీంతో సంబంధిత ఎమ్మెల్యేలు, కిందిస్థాయి నాయకులు పండుగ మూడు రోజులు... అనే విధానంతో అభ్యర్థన లేవదీసి సఫలత సాధిస్తున్నారు. ఈసారి ఉన్న పరిస్థితుల నేపథ్యంలో నియోజకవర్గస్థాయి నాయకులు వ్యూహాలు మార్చుకునే అవకాశం ఉంది.

ఇప్పటికే బరుల ఏర్పాటుకు ప్రయత్నం... సంవత్సరం మొత్తం ఒకెత్తయితే సంక్రాంతి పండుగ మూడురోజులు పందెంరాయుళ్లకు ఒకెత్తు. దీనికోసం కొంతమంది సంవత్సరం మొత్తం ఎదురుచూస్తుండగా కొందరు కోళ్లపెంపకం ద్వారా ఉపాధి పొందుతున్నారు. ఒక్కో కోడిని సంవత్సరం మొత్తం మేపడం ద్వారా దాని సామర్థ్యాన్ని బట్టి రూ. 50 వేల నుంచి రూ. 2 లక్షల వరకూ అమ్మకాలు, కొనుగోళ్లు జరుపుతున్నారు. ఇదేక్రమంలో ఈసారి పండుగకు కూడా భారీగా కోళ్ల కొనుగోళ్లు పూర్తయ్యాయి. భీమవరం, వెంప వంటి పాంతాల్లో బరులు సాధారణంగా ఏర్పాటుచేసే పాంతాల్లో కాకుండా ఇతర ప్రాంతాలకు తరలించాలని నిర్ణయించినట్లుగా సమాచారం. ఎప్పుడూ వార్తల్లో నిలిచే ప్రాంతాలను పక్కనపెట్టి ప్రత్యామ్నాయ ప్రాంతాల్లో పందేల నిర్వహణకు రంగం సిద్ధమవుతోంది. ప్రస్తుతానికి ఆయాప్రాంతాల్లో ఎటువంటి సందడి లేకపోయినా చిన్న చిన్న పందేలు ఇప్పటికే ప్రారంభించారు. అయితే వీటి వివరాలు ప్రాంతాలు ఎక్కడా బయటకు రాకుండా జాగ్రత్తపడుతున్నారు. ఈసారి కూడా జిల్లాల్లో భారీగా పందేలు నిర్వహిస్తారని భావిస్తున్నారు. పందేల ముసుగులో ఇతర జూద కార్యకలాపాలు భారీగా జరుగుతాయని భావిస్తున్నారు. వీటిని అడ్డుకోవడానికి పోలీసులు, అధికార యంత్రాంగం సిద్ధమవుతున్నాయి. కోర్టు జోక్యం నేపథ్యంలో ఇప్పుడు పోలీసులు, ఇతర అధికారులు ఏవిధంగా ఎదుర్కొంటారనేదే ఆసక్తిగా మారింది.

నియంత్రణ దిశగా ప్రయత్నాలు - స్థల యాజమానులకు తాఖీదులు

ఇప్పటికే జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ కోడిపందేల విషయంలో రాజీపడేది లేదని తెగేసి చెబుతుండగా మరోవైపు జిల్లా కలెక్టర్ కాటంనేని భాస్కర్ గ్రామాల్లో రెవెన్యూ ఉద్యోగులను బాధ్యులను చేస్తామంటూ హెచ్చరికలు చేశారు. తాజాగా పోలీసు, రెవెన్యూ అధికార యంత్రాంగం కలిసి గ్రామాల్లో ఎక్కడ కోడిపందేలు, జూదం ఆటలు జరగకుండా అరికట్టే దిశగా వ్యూహంతో నడుస్తున్నారు. ఆయా పోలీసు స్టేషన్లు, తహశీల్దార్ కార్యాలయాల పరిధిలో గతేడాది ఎక్కడెక్కడ కోడిపందేలు జరిగాయో ఆ వివరాలను సేకరించారు. ఈ పందేల నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదుచేసి రూ. లక్ష పూచీకత్తుపై విడుదల చేస్తున్నారు. ఈసారి ఎటువంటి పరిస్థితుల్లో పందేలు నిర్వహించరాదని హెచ్చరికలు చేస్తున్నారు. గతంలో పందేలు నిర్వహించిన స్థల యాజమానులకు ఈసారి ఆ స్థలాలు ఇస్తే చట్టపరమైన అన్నిరకాల చర్యలు తీసుకుంటామని తాఖీదులు జారీ చేశారు. కోళ్లకు కత్తులు కట్టే వ్యక్తులపైన బైండోవర్ కేసులు నమోదయ్యాయి. ఈ పరిణామాలతో అందరూ కలవరపడుతున్నారు. ప్రధానంగా స్థల యాజమానులకు తాఖీదులు అందడంతో ఇదెక్కడి తలనొప్పి అంటూ ఈసారి ఇచ్చేది లేదని ఖరాఖండిగా చెబుతున్నారు. దీంతో కొత్త స్థలాలు కోసం అన్వేషిద్దామన్నా ఈ విషయం తెలిసి ఆ స్థలాల యాజమానులు వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది. కోడి పందేలు, పేకాట ఆడే వ్యక్తులతో పాటు గుండాట, మూడుముక్కలాట వంటి నిర్వాహకులపైన నిఘా ఉంచారు. జిల్లా మొత్తమ్మీద ఇప్పటివరకు 500కుపైగా బైండోవర్ కేసులు నమోదు చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

కమీషన్ సొమ్ముకు సిగపట్లు

(మొదటిపేజీ తరువాయి) మౌలిక వసతుల నిర్మాణానికి వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఈ కేంద్రాల్లో కొనుగోళ్లు జరగడం లేదు. రైతుల నుంచి దళారుల ద్వారా నేరుగా రైసుల మిల్లులకే వెళ్లిపోతున్నాయి. అయితే అక్కడి నుంచి ట్రక్కుసీట్లు తెచ్చి కేంద్రాల్లో నమోదు చేయిస్తున్నారు. దాంతో కేంద్రాల్లో కొనుగోలు జరగకపోయినా కమీషను రూ. లక్షల్లో వచ్చేస్తుంది. ఊరికనే వస్తుండడంతో అధికార పార్టీ నాయకులు కేంద్రాల్లో నిర్వాహకులుగా తమ వారిని నియమించుకుంటున్నారు. తదనంతర కాలంలో కమీషనుల సొమ్ము పంపకాల్లో పీకపట్లు పడుతున్నారు. కేంద్రం తెరిచినట్లు చూపిస్తే చాలు రూ.లక్షలు వచ్చి ఖాతాలో పడిపోతాయి. కష్టపడే పనేలేదు. తేమ శాతం చూడక్కర లేదు. వచ్చిన రైతులకు సమాధానం చెప్పనక్కరలేదు. రైతులకు సంచులు సరఫరా చేయనవసరం లేదు. రైతుల వద్దకు ధాన్యం కేంద్రానికి తీసుకురండి అని చెప్పే అవసరం అసలు లేనేలేదు. ఏదో ఒక ప్రజాప్రతినిధితో కేంద్రం తెరిస్తే ఆ తరవాత జరగాల్సిన పని అంతా జరిగిపోతోంది. ఇంకో విషయం ఏమిటంటే రైతులు మాసూళ్లు చేసే సమయంలో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావు. అంతా అయిపోయిన తరవాత వస్తాయి. ముందుగా రైసుమిల్లులకు వస్తాయి. అక్కడ్నుంచి సిబ్బంది వచ్చి నమోదు చేసుకుంటారు.

ఇటీవల కొత్త బాగోతం ఇటీవల మరో కొత్త బాగోతం వెలుగులోకి వచ్చింది. కేంద్రాల్లో కొనుగోళ్లు జరగడం లేదు. రికార్డుల్లో నమోదు చేయిస్తే చాలు కమీషను వచ్చిపడిపోతుంది. దళారులు కొన్నా, రైసుమిల్లర్లు కొనుక్కున్నా చివరగా చేరేది రైసుమిల్లర్లకే. దాంతో రైసుమిల్లర్లు మేమే కొనుక్కుంటున్నాం. అందులో మీ భాగస్వామ్యం ఉండేది తక్కువ. కాబట్టి మేం కొనుక్కున్న ధాన్యం మీ కేంద్రాల్లో నమోదు చేయించాలంటే కమీషను ఇవ్వాలంటూ కొత్తప్రతిపాదన తెస్తున్నారు. అందుకే ఈ ఏడాది స్వయం సహాయక సంఘాలు నిర్వహించే కేంద్రాల్లో కొనుగోళ్లు తగ్గిపోయాయి. రైసుమిల్లర్లతో కుమ్మక్కయిన సహకార సంఘాల్లోనే ఈసారి ధాన్యం ఎక్కువగా కొనుగోళ్లు జరిగినట్లు రికార్డుల్లో నమోదయ్యాయి. వెలుగు ఆధ్వర్యంలో నిర్వహించే అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనూ ఇప్పటివరకు చాలా తక్కువ కొనుగోలు చేశారు. ఎందుకు తగ్గాయని ఆరా తీస్తే అసలు విషయం వెలుగులోకి వచ్చింది. తమను కమిషను అడుగుతున్నారని కేంద్ర నిర్వాహకులు 'ఈనాడు'తో చెప్పారు. తాము కమీషను ఇవ్వక పోవడంతో మరో కేంద్రానికి తరలించేసుకున్నారని మహిళలు చెబుతున్నారు. ఈ విషయాలను జిల్లా పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ కొండయ్య దృష్టికి తీసుకెళ్లగా ఇవేమీ తమ దృష్టికి రాలేదని, దీనిపై వివరాలు తెలుసుకుంటాం. ఏదైనా తప్పిదాలుంటే చర్యలు చేపడతామని చెప్పారు.

అంగన్‌వాడీ.. అందినంత దోపిడీ..!

(మొదటిపేజీ తరువాయి) 2017 అక్టోబరులో ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

పేద కుటుంబాల తల్లిదండ్రులకు చిన్నారుల ఆలనాపాలన చూడటం.. వారికి సరైన పౌష్టికాహారం అందించడంలో ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటుచేసింది. మొదట్లో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఈ కేంద్రాల్లో తరువాత పేద గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలకూ పౌష్టికాహారాన్ని అందించే ఏర్పాటు చేశారు. కోడిగుడ్లు, బియ్యం, పప్పు, నూనె, ఆకుకూరల కొనుగోలు, వంట గ్యాస్‌కు ప్రభుత్వం నిధులు ఇస్తోంది.

జిల్లాలో 3,889 కేంద్రాలు జిల్లాలో 18 సెక్టార్ల పరిధిలో 3889 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 3-6 సంవత్సరాల చిన్నారులు 66,480 మంది, ఆరు నెలల నుంచి మూడేళ్ల వయసు కలిగిన చిన్నారులు 1,09,348 మంది, తక్కువ బరువు కలిగిన చిన్నారులు 913 మంది, గర్భిణిలు, బాలింతలు 44,778 మంది, కిశోరబాలికలు 72 వేల మంది ఉన్నట్లు ఆ శాఖ లెక్కలు చెబుతున్నాయి. ఇవన్నీ అంగన్‌వాడీ కార్యకర్తలు నమోదు చేసుకునే పేర్లేనని పలు సందర్భాల్లో ఉన్నత స్థాయి అధికారులు తనిఖీ చేసిన సమయంలో తేటతెల్లమయ్యాయి. కేంద్రాలకు వచ్చే లెక్క ఒకటయితే.. హాజరు పట్టీలో రాసే పేర్లు మరోలా ఉంటాయి. సిబ్బంది చెప్పే రోజు వారీ గణాంకాలకు.. అసలు గణాంకాలకు దాదాపు 50 శాతం వ్యత్యాసం ఉంటుందనేది బహిరంగ రహస్యం. చిన్నారుల హాజరు అంతంత మాత్రంగానే ఉంటున్నా కాగితాల్లో మాత్రం ఎక్కువగా ఉంటోంది. వారందరికీ పోషకాహారం అందిస్తున్నట్లు దస్త్రాల్లో నమోదుచేసి పేదలకు అందాల్సిన పౌష్టికాహారాన్ని బయటకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

పౌష్టికాహారం పక్కదారి పడుతుందిలా.. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, బరువు తక్కువ చిన్నారులు, కిశోరబాలికల విషయంలో రికార్డుల్లో తప్పుగా నమోదు చేస్తున్నారు. ఏ ఒక్కరోజు అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి హాజరు పట్టీని పరిశీలించినా అందులోని హాజరుకు వాస్తవంగా ఉన్న వారి సంఖ్యకు పొంతన ఉండదు. కనీసం 30 శాతం మంది హాజరు తప్పుగా నమోదు చేసి ఉంటుంది. ఇలా తప్పుగా నమోదు చేసి వారికి అందాల్సిన పౌష్టికాహారాన్ని పక్కదారి పట్టిస్తున్నారు అంగన్‌వాడీ కార్యకర్తలు. నెలనెలా కోడిగుడ్లు, కందిపప్పు, ఆయిల్‌ను అమ్మేసి సొమ్ము చేసుకుంటున్నారు.

ప్రభుత్వ సొమ్ము పరాధీనం జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తప్పుడు లెక్కలతో పౌష్టికాహారాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. అధికారిక గణాంకాల ప్రకారం జిల్లాలోని కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారానికి రోజుకు సుమారు రూ.32 లక్షలను ఖర్చు చేస్తున్నారు. అందులో 30 శాతం అంటే సుమారు రూ. 9.6 లక్షల సొమ్ము పక్కదారి పడుతున్నట్లు చెబుతున్నారు. నెల మొత్తం పరిశీలిస్తే పక్కదారి పడుతున్న సొమ్ము రూ.కోట్లలో ఉంటోంది.

పట్టుబడినా చర్యలు అంతంతమాత్రం సెక్టార్ పరిధిలో సీడీపీవో గానీ, సూపర్‌వైజర్ గానీ తనిఖీకి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లిన సమయంలో అవకతవకలు జరిగినట్లు వారి దృష్టికి వచ్చినా సరైన చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణ వినిపిస్తోంది. అవినీతిపై ఫిర్యాదు చేసినా విచారణ జరిపి కేవలం మెమో ఇచ్చి మమ అనిపించడమే తప్ప పకడ్బందీ చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఇందుకు కారణం ఏమిటనే విషయం చర్చనీయాంశమవుతోంది.

సమయపాలన పాటించరు ఒక పక్క అవినీతికి పాల్పడుతున్నా.. సమయపాలన పాటిస్తారా అంటే అదీ ఉండదు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కేంద్రాలను తెరిచి ఉంచాలనే నిబంధన ఉన్నా ఏ ఒక్కరోజూ ఆ నిబంధనను అంగన్‌వాడీ సిబ్బంది పాటించరు. మారుమూల గ్రామాల్లో కొందరు సిబ్బంది ఉదయం వేళ కూడా తెరవడం లేదు. మూడొంతుల కేంద్రాలను మధ్యాహ్నం నుంచి మూసే ఉంచుతున్నారు. జనవరి ఒకటో తేదీ సోమవారం రోజు సెలవు లేకపోయినా జిల్లాలోని దాదాపు అన్ని కేంద్రాలను ఉదయం నుంచే మూసే ఉంచారు. దేవరపల్లి మండలం బుచ్చియ్యపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఉదయం వేళ కూడా తెరవకపోవడాన్ని గతంలో 'ఈనాడు' వెలుగులోకి తీసుకురాగా, ఆ ఒక్కరోజే తీయలేదని సంబంధిత ఉద్యోగి చెప్పారు.

అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం

అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. కేంద్రాలకు వచ్చిన చిన్నారుల ఫొటోలు తీసి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పంపించే విధానంలో అక్రమాలకు అవకాశం లేదు. పాత విధానంలో అక్కడక్కడ అవకతవకలు జరిగాయి. కొత్త విధానంలో అవతవకలపైనా దృష్టిసారిస్తాం. అవతవకలు రుజువైతే చర్యలు తీసుకుంటాం. **- విద్యావతి, ఐ.సి.డి.ఎస్. జిల్లా ప్రాజెక్టు సంచాలకురాలు, ఏలూరు**



ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టరు భాస్కర్, ఎస్పీ రవిప్రకాష్


కోడి పందేల విషయంలో..

హైకోర్టు ఉత్తర్వులను అమలు చేస్తాం

ఎస్పీ రవిప్రకాష్

పోలవరం, న్యూస్‌టుడే: కోడిపందేల విషయంలో హైకోర్టు ఉత్తర్వులను అమలు చేస్తామని జిల్లా ఎస్పీ ఎం.రవిప్రకాష్ వెల్లడించారు. ఈ నెల 8వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లా పర్యటనలో భాగంగా ముందుగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతానికి వస్తారు. తర్వాత తాళ్లపూడి మండలంలో జరిగే జన్మభూమి కార్యక్రమానికి హాజరవుతారు. ఈ నేపథ్యంలో కలెక్టరు కాటంనేని భాస్కర్‌తో కలిసి ఎస్పీ ప్రాజెక్టును బుధవారం సందర్శించారు. అనంతరం పోలవరం డీఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు పరిసరాల్లో 16 సీసీ కెమెరాలు ద్వారా ఏలూరులోని కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేస్తున్నామన్నారు. పోలవరం గ్రామం నుంచి ప్రాజెక్టు వరకు 150 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించి జల వనరుల శాఖకు నివేదిక అందజేశామని చెప్పారు. జాతీయ ప్రాజెక్టు కావడంతో భద్రతపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. వేలేరుపాడు, కుక్కునూరు, బుట్టాయగూడెం, పోలవరం అటవీ ప్రాంతాల్లో నిత్యం ప్రత్యేక దళాలు కూంబింగ్ జరుపుతున్నాయని వెల్లడించారు. ప్రాజెక్టు వెళ్లే మార్గంలో రెండు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, అక్కడ 24 గంటలు ఏడుగురు పోలీసులు వాహనాలు తనిఖీ చేసి వాటి వివరాలు నమోదు చేసుకుని వదులుతారని వివరించారు. ప్రాజెక్టు ముంపు గ్రామాల్లో జనమైత్రి సదస్సులు ఏర్పాటు చేయాలని పోలవరం డీఎస్పీ రవికుమార్‌కు సూచించామన్నారు. పునరావాస పరిహారం పొందిన గిరిజనులు చదువుకోని కారణంగా దళారుల మాటలు నమ్మి మోసపోతున్నారని, దీనిపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఆయన వెంట స్పెషల్ బ్రాంచి డీఎస్పీ ఎం.శ్రీనివాస్, ఎస్సై కె.శ్రీహరిరావు ఉన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఇలా ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 8న ఉదయం పోలవరం ప్రాజెక్టుకు చేరుకుంటారు. ముందుగా డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ ప్రాంతాన్ని, తర్వాత స్పిల్‌వే డీప్ కటింగ్‌లో జరుగుతున్న పనులతో పాటు గేట్ల తయారీ కేంద్రం సందర్శిస్తారు. ఆయా ప్రాంతాలను కలెక్టరు, ఎస్పీలు సందర్శించి చేయాల్సిన ఏర్పాట్లపై డీఈ బాలకృష్ణకు సూచించారు. నమూనా గేటును తయారు చేస్తున్నారని, అది పనిచేసే విధానం గురించి ముఖ్యమంత్రికి వివరించనున్నట్లు డీఈ తెలిపారు.



పత్తేపురం, పెదనిండ్రకొలను (నిడమర్రు), న్యూస్‌టుడే

విద్యార్థులు పాఠశాలకు వెళ్లి చదువుకోవడంతో పాటు తమలోని నైపుణ్యాన్ని పదును పెడుతుంటారు. ఈకోవకు చెందిన వారే పత్తేపురం, పెదనిండ్రకొలను ఉన్నత పాఠశాల విద్యార్థులు. జిల్లా స్థాయిలో నిర్వహించిన విద్యా వైజ్ఞానిక పోటీలో రాష్ట్ర స్థాయికి 12 నమూనాలు ఎంపిక చేశారు. వీటిలో రెండు నిడమర్రు మండలానికి దక్కడం విశేషం. పెదనిండ్రకొలను, పత్తేపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ నెల 3నుంచి 5వ తేదీ వరకు నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు వెళ్లారు.

భావి మేధస్సుకు దర్పణం..!

● పత్తేపురం, పెదనిండ్రకొలను విద్యార్థుల ప్రతిభ ● రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన నమూనాలు



పండుగల పేరుతో అనర్థాలు

ప్రాజెక్టు పేరు: ఆరోగ్యంపై పండుగల ప్రభావం

విద్యార్థులు: జీకేవీ సత్య, ఎల్ కుస్మంత్

పాఠశాల: పెదనిండ్రకొలను ఉన్నత పాఠశాల

సహకారం : చిన్నం జకబ్‌రాజు

రూపకల్పన: ప్రపంచాన్ని వేధిస్తున్న సమస్య కాలుష్యం. అనేక రకాలుగా కాలుష్యం వ్యాప్తి చెందడం వల్ల మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. కాలుష్యాన్నిఅరికట్టాల్సిన మానవుడు వివిధ పండుగల పేరుతో మరింత పెంచుతున్నాడు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ మొదలు, వివిధరసాయనాలతో తయారు చేసిన విగ్రహాలు నీటిలో నిమజ్జనం చేయడం వల్ల నీటిలో ఉండే జీవరాశులు చనిపోతున్నాయి. పండుగల సందర్భంగా కాల్చే బాణసంచా, పెద్ద ఎత్తున ఏర్పాటుచేసే ఫ్లెక్సీలు వల్ల అనర్థాలు వివరించారు.



జీవవైవిధ్యంతోనే మనుగడ

ప్రాజెక్టుపేరు: జీవవైవిధ్యం.. ప్రకృతికి నైవేద్యం

విద్యార్థినులు: ఎంజేరీ సత్యవతి, ఎస్ఎస్‌వీఎస్ వైష్ణవి

పాఠశాల: పత్తేపురం ఉన్నత పాఠశాల

సహకారం: సుబ్బరాజు, సైన్సు ఉపాధ్యాయుడు

రూపకల్పన: వాతావరణంలో మార్పులు కాలుష్యం ఆహార భద్రతకు ఆటంకం కలిగిస్తున్నాయి. ఆహార భద్రతకు ఆటంకం కలిగించే అంశాలను విశ్లేషించడం, వాతావరణ పరిస్థితులకు తగినట్లుగా ఆహార అలవాట్లలో మార్పులు, నాణ్యమైన విత్తనం సేకరణ, సేంద్రియ సాగును ప్రోత్సహించడం, ఆహార కల్తీలపై అవగాహన, ఆహార పదార్థాల వృథాను అరికట్టడం వంటి అంశాలు ప్రయోగంలో ఉన్నాయి.

క్విజ్‌లో ప్రతిభ

జిల్లా స్థాయిలో క్విజ్‌లో ప్రతిభ చూపి పత్తేపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంఎస్‌వీఎస్ సత్యవతి, ఎస్ఎస్‌వీఎస్ వైష్ణవి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. వీరికి డీఈవో సీవీ రేణుక ప్రశంసా పత్రాలు అందచేశారు.



పత్తేపురం విద్యార్థులకు బహుమతుల ప్రదానం

శతాబ్ద సేవల సాక్ష్యం..

పర్యాటక శోభతో పదిలం

హేవలాక్ విహార తోరణమయ్యేనా..


టెండరు ప్రక్రియతో పట్టాలెక్కనున్న కొత్త అందాలు

దక్షిణాది ప్రాంతంలోని ముఖ్య పట్టణాలను ఉత్తర భారతావనికి అనుసంధానించి గోదావరి నదిపై శతాబ్ద కాలం సేవలకు సజీవ సాక్ష్యమది.. అఖండ గోదావరికి ఆభరణంగా వందేళ్లు విలసిల్లి.. నేడు మణిహారంగా కాంతులీనేందుకు సిద్ధమవుతోంది.. దేశ చరిత్ర ప్రవాహంలో తొలిగా మన రైలు వంతెన పర్యాటక సొబగులు దిద్దుకుంటోంది. అద్భుత కట్టడంగా సుస్థిర స్థానాన్ని పొందిన కొవ్వూరు- రాజమహేంద్రవరం మధ్య గోదావరిపై హేవలాక్ వంతెన పర్యాటక అందాలు పట్టాలెక్కబోతోంది. పర్యాటక మంత్రిత్వశాఖ నేతృత్వంలో ఈపీసీ విధానంలో ఈ ప్రాజెక్టుకు టెండరు ప్రక్రియ ప్రారంభించారు. దీంతో ఉభయ గోదావరి జిల్లా వాసులే కాక నవ్యాంధ్రలో యావత్ ప్రజానీకంలో హర్షం వ్యక్తమవుతోంది. కొత్త ఏడాది 2018లో పర్యాటక అందాలకు నెలవుగా ఈ వంతెన, పరిసరాలు మారే క్రమంలో సర్వత్రా ఆసక్తి కనబడుతోంది.

-కొవ్వూరుపట్టణం, న్యూస్‌టుడే



హేవలాక్ వంతెన కొవ్వూరు వైపు ఇలా మారనుంది..


వంతెనపై ఆకర్షించేలా వ్యాపార సముదాయాలు


పర్యాటక సొబగులు అద్దితే ఇలా.. (ఊహా చిత్రం)

ఫలించిన పరిరక్షణోద్యమం..

సర్ ఆర్థర్ కాటన్ పర్యవేక్షణలో 1887లో ఆరంభించి 1897లో ఈ వంతెన నిర్మాణాన్ని పూర్తిచేశారు. అప్పటి ఇంజినీరు ఎఫ్.టి.జి.వాల్టన్ పనులను పర్యవేక్షించగా బ్రిటిష్ మేనేజరు హేవలాక్ వంతెనగా పేరు పెట్టారు. 2.95 కిలోమీటర్ల పొడవున 56 స్తంభాలతో నిర్మించి వందేళ్లయిన నేపథ్యంలో 1997 ఏడాదిలో రైళ్ల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. గతంలో రైల్వేశాఖ ఈ వంతెనపై ఉన్న ఇనుమును వేలం వేయాలని చేసిన ప్రయత్నాలను ఉభయగోదావరి జిల్లా వాసులు శాంతియుత, ప్రజాహిత ఉద్యమాలు చేసి ఆ ప్రయత్నాలను విరమింపజేశారు. దశలవారీగా పెద్దఎత్తున చేపట్టిన ఉద్యమాల ఫలితంగా రైల్వేశాఖ ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. ప్రజా పోరాటానికి ప్రజాప్రతినిధులు నాయకత్వం వహించారు.


ప్రస్తుతం హేవలాక్ వంతెన ఇలా..

ప్రత్యేక చొరవతో విహార తోరణం..

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చొరవతో వంతెనను పర్యాటకశాఖకు అప్పగించేలా చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఈ నేపథ్యంలో రైల్వేశాఖ అప్పటి మంత్రి సురేష్‌ప్రభు గతంలో వంతెన అభివృద్ధి దిశగా చేసిన ప్రకటనపై అప్పట్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. కేంద్ర మంత్రి ఇచ్చిన హామీ మేరకు వంతెనను విహార తోరణంగా మార్చే ప్రక్రియ పట్టాలెక్కే దిశలో పడింది.

జాతీయ స్మారకంగా మారనుందిలా..

కేంద్ర మంత్రి ఇచ్చిన హామీ మేరకు హేవలాక్ వంతెనను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ.110 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. పాదచారులతో పాటు ఉదయం యోగ, వ్యాయామం చేసుకునేలా ఈ వంతెనను మారుస్తారు. వంతెనపై రాత్రి బజారు, అఖండ గోదావరి ప్రాశస్త్యంలో లంకలు అనుసంధానం చేసే అతిథి భవనాలు నిర్మించనున్నారు.

❐ ప్రస్తుతం వంతెన వెడల్పు 12 అడుగులు ఉంది. వంతెన పొడవునా ఈ వెడల్పును పెంచటంతో పాటు అవసరమైన చోట 40 అడుగుల మేర విస్తరింపజేస్తారు. అక్కడక్కడ ఫుడ్‌కోర్టులు పెట్టి పగటిని తలపించేలా వెలుగులతో వంతెనపై రాత్రి బజారును ఏర్పాటు చేస్తారు.

❐ వంతెన పొడవునా ఉన్న పెద్ద పిల్లర్ల వద్ద ప్రత్యేక ఆకుపచ్చ కట్టడాలను నిర్మించి వరద ఉధృతి లేని సమయంలో కిందికి దిగి ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించేలా సౌకర్యాన్ని కల్పిస్తారు. గోదావరి మధ్య లంకల్లో క్షేత్రాలను నిర్మాణాలు చేపట్టి అవసరాలను బట్టి తొలగించేలా చర్యలు తీసుకుంటారు.

పర్యాటక శోభ వెల్లివిరిసేలా..

వందేళ్ల పైబడి చరిత్ర గల హేవలాక్ వంతెనను రైల్వేశాఖ పర్యాటక శాఖకు అప్పగించింది. రాష్ట్ర ప్రభుత్వం చూపిన చొరవతో ఈ వంతెన విహార తోరణంగా మార్చే కార్యాచరణ ప్రారంభమైంది. సుమారు రూ.110 కోట్లతో ప్రతిపాదించిన అద్భుత రీతిలో పనులు జరుగనున్నాయి. ఆధ్యాత్మికతతో పాటు పర్యాటకరంగంగా కొవ్వూరు మరింత శోభాయమానంగా మారుతుంది. సాంస్కృతిక, వ్యాపారాభివృద్ధితో పాటు ఈ ప్రాంత యువతకు మంచి ఉపాధి తోడ్పడుతుంది.

- జి.భీమశంకరరావు, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్, రాజమహేంద్రవరం

మొక్కలకు ఏసీ!

ఒకే వాతావరణం ఉండేలా ఏర్పాటు

తాళ్లపూడి న్యూస్‌టుడే: రైతులు కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పంటలు సాగుచేసినా వాతావరణం అనుకూలించడం లేదు. గాలి, వాన, తుపాన్ తదితర ప్రకృతి వైపరీత్యాలు, నీటి సమస్యలు, పంటలకు తెగుళ్లు, పురుగులు ఆశించి సరైన దిగుబడి రావడం లేదు దీంతో పెట్టుబడి పెరుగుతోంది. మార్కెట్ ధరలేక నష్టపోతున్నాడు. వీటన్నింటినీ అధిగమించడానికి పాలీహౌస్‌లో పంటలు సాగుచేయడానికి ఉద్యానశాఖ ప్రోత్సహిస్తోంది. వానాకాలం, ఎండకాలం, శీతాకాలం ఇలా ఒకే రకమైన వాతావరణాన్ని పంటకు కల్పించే సాంకేతిక పరికరాలు షేడ్‌నెట్‌లో పొందుపరిచి ఉన్నాయి . తాళ్లపూడి, చాగల్లు, కొవ్వూరు మండలాల్లో పాలీహౌస్‌లను రైతులు ఏర్పాటు చేశారు. వాటిలో ఆకుకూరలను సాగుచేస్తున్నారు. పలు రకాల కూరగాయల నారును పెంచుతున్నారు. పండ్లుజాతి మొక్కలను వృద్ధి చేస్తున్నారు. షేడ్‌నెట్‌లో నాలుగింతల దిగుబడి సాధించవచ్చని ఉద్యానశాఖాధికారులు వివరిస్తున్నారు.



వాలీబాల్.. కబడ్డీ.. ఖోఖో.. ఫుట్ బాల్.. పరుగు పందెం ఇవన్నీ అనాదిగా ప్రాచుర్యంలో ఉన్న క్రీడలు. వీటితో పాటు యూఎస్‌ఏ, ఆస్ట్రేలియా దేశాల్లో ఎక్కువగా ఆడే ఆటలపై జిల్లా యువత, విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారు. ఈక్రమంలో స్కేటింగ్‌పై దృష్టి సాధించిన తణుకు పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులు కఠోర సాధనతో జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. ఈ సందర్భంగా వారి ప్రతిభ, మనోభవాలు.. భవిష్యత్తు లక్ష్యాలపై కథనం.

స్కేటింగ్‌లో పతకాల పంట!

జాతీయ స్థాయిలో రాణిస్తున్న తణుకు విద్యార్థులు


స్కేటింగ్‌లో పతకాలు సాధించిన విద్యార్థులు

తణుకు, న్యూస్‌టుడే

తణుకు పట్టణానికి చెందిన గురజాడ విద్యానికేతన్ విద్యార్థులు స్కేటింగ్ క్రీడలో విశేష ప్రతిభ చూపుతున్నారు. ఎనిమిది మంది జాతీయ స్థాయిలో క్రమం తప్పకుండా పతకాలు సాధిస్తున్నారు. గతేడాది డిసెంబర్ 27, 28, 29 తేదీల్లో రోలర్ రిలే స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో నిర్వహించిన 24 ఛాంపియన్‌షిప్ పోటీల్లో వెండి, రజత పతకాలు సాధించారు. వీటితో పాటు అదే ఏడాది ఫిబ్రవరిలో గోవాలో నిర్వహించిన జాతీయ స్థాయి ఓపెన్ పోటీల్లో బంగారు పతకం, రెండు రజత పతకాలు సాధించి.. అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. అలాగే నవంబరులో రైవర్ రింక్ రోలర్ స్కేటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో నాలుగు బంగారు, మూడు కాంస్య, రెండు రజత పతకాలను కైవసం చేసుకున్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని..



రెండేళ్ల నుంచి స్కేటింగ్‌లో శిక్షణ పొందుతున్నా. ఇప్పటి వరకు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో నిర్వహించిన పలు పోటీల్లో రేసింగ్‌లో బంగారు, రజత పతకాలు సాధించా. భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని లక్ష్యంగా పెట్టుకున్నా. - **వి.రోహన్‌అక్షత్, ఆరో తరగతి**

పైలట్ అవ్వాలని..



రాజమహేంద్రవరం, ఔరంగాబాద్‌లలో జాతీయ స్థాయిలో నిర్వహించిన స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతకాలు సాధించా. అంతర్జాతీయ స్థాయికి ఎదిగి.. భవిష్యత్తులో పైలట్ అవుతా. - **ఎస్.హర్షిత్‌చౌదరి, మూడో తరగతి.**

చిత్ర పరిశ్రమలో అడుగుపెడతా..



నాకు క్రీడలు అంటే ఇష్టం. వీటితో పాటు చదువులోనూ రాణిస్తున్నా. రాజమహేంద్రవరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో బంగారు, ఇటీవల ఔరంగాబాద్‌లో నిర్వహించిన ఛాంపియన్ షిప్ పోటీల్లో వెండి పతకాలు సాధించా. భవిష్యత్తులో చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టి కథానాయక అవ్వాలని ఉంది. - **పి.నాగకీర్తిక, మూడో తరగతి.**

ఇంజినీర్ అవుతా



రెండు సంవత్సరాలుగా స్కేటింగ్‌లో శిక్షణ పొందుతున్నా. రాజమహేంద్రవరం, గోవాల్లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో పలు పతకాలు సాధించా. భవిష్యత్తులో ఇంజినీర్ అవుతా. - **కె.చరణ్, ఆరో తరగతి.**

వైద్యురాలిగా..



చిన్నతనం నుంచి స్కేటింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నాను. గతంలో రాజమహేంద్రవరం నిర్వహించిన జాతీయ స్థాయిలో స్కేటింగ్ పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించా. భవిష్యత్తులో వైద్యురాలినవుతా. - **ఎం.షైని, ఐదో తరగతి.**

ఉపాధ్యాయురాలినవుతా



చిన్నప్పటి నుంచి ఉపాధ్యాయురాలు కావాలనేది నాలక్ష్యం. దీన్ని దృష్టిలో ఉంచుకొని చదువుతున్నా. అలాగే క్రీడల్లో స్కేటింగ్‌లో శిక్షణ తీసుకున్నా. ఇటీవల రాజమహేంద్రవరంలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించా. **-ఎం.చరిత, రెండో తరగతి.**



యలమంచిలి, న్యూస్‌టుడే:

పల్లె సిగ.. 'నక్షత్రాల' నగ..!

● తారలనందుకుంటే ప్రగతి పథం

● వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రణాళిక

● సాధిస్తే రూ.10 లక్షల నజరానా

● కృషి చేస్తే పల్లెలన్నీ ప్రగతిమల్లెలే

పల్లెలు ప్రశాంతతకు నిలయాలు. నాగరికత పుట్టిందే అక్కడ. కానీ అభివృద్ధిలో మాత్రం అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి ముడిపడి ఉంటుందనేది జనమెరిగిన సత్యం. ఆచరణలో ఆ దిశగా అడుగులు మాత్రం పడడం లేదు. జనాభాలో 60 శాతం మంది పల్లెల్లోనే నేటికీ జీవిస్తున్నారు. వీరందరికీ సరిపడా మౌలిక వసతులు ఉన్నాయా అంటే లేవనే సమాధానం వస్తోంది. దీన్ని అధిగమించడానికి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది.

పథకం పేరు: ఏడు నక్షత్రాలు పేరిట ఈ కార్యక్రమాన్ని జిల్లాలో అమలు చేయడానికి రంగం సిద్ధమైంది.

లక్ష్యం: పల్లెల్లో పూర్తి మౌలిక సదుపాయాల కల్పన.

ప్రయోజనం: పంచాయతీల్లో ఆరోగ్యకరమైన పోటీ ఏర్పడి తద్వారా ప్రగతిబాటలు పరుచుకుంటాయి. ప్రభుత్వం విడుదలచేసిన తాజా ఆదేశాలతో త్వరలో అభివృద్ధి సంక్షేమకార్యక్రమాలు ప్రారంభమవుతాయి. పూర్తి ప్రగతి సాధిస్తే రూ.10లక్షలు ప్రోత్సాహకం అందుతుంది.

పర్యవేక్షణ ఇలా... గ్రామపరిపాలనలో మమేకమైన శాఖలన్నిటినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తారు. పంచాయతీరాజ్ విస్తరణాధికారులు పర్యవేక్షిస్తారు. సుమారు 40లక్షల జనాభా ఉన్న మన జిల్లాలో 909 పంచాయతీలకు లబ్ధి చేకూరుతుంది.

నక్షత్రాల కేటాయింపుఇలా

గ్రామాల్లో అందుబాటులోకి తెచ్చిన వనరులనుబట్టి ఒక్కో దానికి ఒక్కో నక్షత్రాన్ని కేటాయిస్తారు.

ప్రతి ఇంటికి విద్యుత్తు, వంటగ్యాస్



గ్రామాల్లోని ప్రతి ఇంటికి విద్యుత్తు, వంటగ్యాస్ తప్పనిసరిగా ఉండాలి. ఎల్‌ఈడీ వీధిదీపాలు ఉండాలి. ఇవన్నీ ఉంటే మొదటి నక్షత్రాన్ని కేటాయిస్తారు. జిల్లాలో 10 లక్షల కుటుంబాలుండగా ప్రతీ ఇంటికి విద్యుత్తు సౌకర్యాన్ని దీన్‌దయాళ్ పథకంలో పూర్తిచేశారు. ఇంటింటికీ వంట గ్యాస్ ఇచ్చి పొగరహితజిల్లాగా ప్రకటించారు. కొన్ని గ్రామాల్లో ఎల్యీడీ దీపాలు అమర్చగా మిగిలిన గ్రామాల్లోను పూర్తిచేస్తే మొదటినక్షత్రం సాధించడం తేలికే.

తాగునీటితోనే తంటా



పల్లెల్లో సురక్షిత తాగునీటిని సరఫరా చేస్తూ అంటువ్యాధులు రాకుండా చర్యలు చేపట్టాలి. చుట్టూనీరున్నా తాగడానికి చుక్క నీరేదన్నట్లు పశ్చిమలోను తాగునీటికి కటకటలాడుతున్న గ్రామాలు చాలా ఉన్నాయి. సుదూర ప్రాంతాల నుంచి నీరుతెచ్చుకుంటున్న గ్రామాలు వందల్లో ఉన్నాయి. వీటిని అధిగమిస్తే రెండో నక్షత్రం సాధ్యమవుతుంది. దీనికోసం జిల్లా గ్రామీణ నీటిసరఫరా అధికారులు తీవ్రంగా కృషిచేయాల్సి ఉంది.

పారిశుద్ధ్యం



ప్రతీ పంచాయతీలో పారిశుద్ధ్యం చక్కగా ఉండాలి. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి, చెత్తసేకరణలో ప్రత్యేకత, ఘనవ్యర్థాల కేంద్రం నిర్వహణ వంటివి సాధిస్తే మూడో నక్షత్రం అందుతుంది. రాష్ట్రంలోనే ఓడీఎఫ్ జిల్లాగా ప్రకటించినా పూర్తిస్థాయిలో అమలవుతున్నవి అరుదుగా ఉన్నాయి. ఘనవ్యర్థాళ కేంద్రంతోపాటు బహిరంగ మలవిసర్జన నిర్మూలనపై పంచాయతీలు దృష్టిసారిస్తే మూడోది చేరువవ్వడం చాలా తేలిక.

ప్రతీదీ 'పక్కా'గా



గ్రామపంచాయతీలకు, అంగన్‌వాడీలకు పక్కాభవనాలుండాలి. అంతర్గత రహదారులు అనుసంధానంగా ఉంటూ శ్మశానవాటికల నిర్వహణ, ఇంకుడు గుంతల తవ్వకం, వినియోగంలో పక్కాగా వ్యవహరించే పంచాయతీలు నాలుగో నక్షత్రాన్ని దక్కించుకోవచ్చు. ఉపాధి హామీ నిధుల పుణ్యమా అని జిల్లాలోని 909 పంచాయతీల్లో చాలాచోట్ల పంచాయతీ నిధులు జతచేసి పక్కాగా సీసీ రహదారులు నిర్మించారు. ఇంకుడు గుంతల్లోనూ ముందంజ వేయడం, అంగన్‌వాడీ భవనాల విషయంలో పురోగతి కొనసాగుతున్నందున మరికొంత మనసు పెడితే నాలుగు నక్షత్రం రాబెట్టడం కష్టమేమీ కాదని చెప్పొచ్చు.

పచ్చదనం పరిఢవిల్లాలి

పంచాయతీల్లో పచ్చదనం ప్రకాశించాలి. పెరటితోటల పెంపకంతోపాటు రహదారులకు ఇరువైపులా మొక్కలునాటడం వాటిని సంరక్షించే విషయంలో ముందున్న పంచాయతీలు ఆరో నక్షత్రానికి అర్హత సాధించినట్టే. మొక్కల పెంపకంలో జిల్లా పురోగతిలో ఉన్నందున ఒకింత ప్రయోజనం కలిగించే విషయం. గ్రామాల్లో నర్సరీలు, ఉద్యానాలు ఏర్పాటుచేస్తే మంచి ఫలితం వస్తుంది. వనం-మనంలో జిల్లా అటవీశాఖ 80 ప్రాంతాలను జియోట్యాగింగ్ చేసి 6,49,231 మొక్కలను నాటారు. తర్వాత దేవాదాయశాఖ 34 ప్రాంతాల్లో 244 మొక్కలను నాటారు.



జలం.. జటిలం



పంచాయతీల్లో సహజ వనరుల సంరక్షణ చేపట్టాలి. చెక్‌డ్యాంల నిర్మాణం, పంటకుంటల తవ్వకంలో రాణించాలి. జిల్లాలో పరిశీలిస్తే 38 చెక్‌డ్యాంలు మంజూరవ్వగా 32 పూర్తిచేశారు. ఐదెకరాల పంటకుంటల్లో బోణీ చేయలేదు. మెట్టప్రాంతంలో చిన్న పంటకుంటలు తవ్వీన నేపథ్యంలో ఆయా పంచాయతీలకు ఐదో నక్షత్రం అందుకోవడం సులభం. మిగిలిన పంచాయతీలు ఇక మీదట కృషి చేయాల్సిఉంది. లక్ష్యాన్ని పూర్తిచేయగలగాలి.

అతివ.. ఆదాయం



ప్రతి పంచాయతీ పరిధిలో ఉన్న నిరుపేద మహిళలు నెలకు రూ.10వేలు ఆర్జించడం ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం పొదుపు సంఘాల మహిళలకు జీవనోపాధికల్పించే పనుల్లో శిక్షణ ఇవ్వడం, ఇతరత్రా సౌకర్యాలు కల్పించడం, ప్రతి మహిళా పొదుపు సంఘంలో ఉండేలా చూడటం ద్వారా ఏడో నక్షత్రాన్ని అందుకోవచ్చు. ఇప్పటికే చాలాచోట్ల పొదుపు మహిళలకు వివిధ శిక్షణలు జిల్లాలో జరుగుతున్నాయి. మిగిలిన గ్రామాలు దీనిపై దృష్టిసారిస్తే ప్రయోజనం పూర్తిగా పొందవచ్చు.

హాయ్! బుజ్జీ!!




రంగు రంగుల పేపర్ వెయిట్‌లు...
వాటి లోపల్లోపల చిత్రమైన ఆకారాలు...
మధ్య మధ్యలో గాలి బుడగలు...
అక్కడక్కడా అలంకారాలు...
అన్నీ కలిసి గుండ్రటి ఆ గాజులో...
ఎలా దూరాయి చెప్మా?

పేపర్ వెయిట్.. తయార్!

మనం స్కూళ్లలో, కార్యాలయాల్లో గాజు పేపర్ వెయిట్‌లను చూస్తూనే ఉంటాం కదూ. పరీక్షించి వాటిని ఎప్పుడైనా చూశారా? లోపల బోలెడు రంగులుంటాయ్. ఆకులు, పువ్వుల్లాంటి డిజైన్‌లుంటాయ్. మధ్య మధ్య నీటి బిందువుల్లా కనిపించే గాలి బుడగలుంటాయ్. అవన్నీ లోపలికి ఎలా వెళ్లి ఉంటాయ్? ఎప్పుడైనా ఆలోచించారా? లోపలికి వెళ్లినట్టు ఎక్కడా దారి కనిపించదు. ఎక్కడా అతికినట్టూ అనిపించదు. మరి అంత అందంగా, గుండ్రంగా అవి ఎలా తయారవుతాయబ్బా?

తయారీ ఎలా?



1

◆ గాజు పేపర్ వెయిట్‌లను తయారు చేయడానికి మూల పదార్థంగా కరిగి ఉన్న గాజు ద్రవాన్ని వాడతారు. గాజు ముక్కల్ని 2000డిగ్రీల ఫారన్‌హీట్ దగ్గర మండించి ద్రవరూపంలోకి మారుస్తారు. అది ఒక కొలిమి దగ్గర ద్రవరూపంలో పై నుంచి కారుతుంటుంది. అక్కడ దూరం నుంచి గాలి ఊదడానికి వీలుగా ఉండేలా స్ట్రాలాంటి ఇనుప గొట్టాన్ని వాడతారు. దాని చివరను గాజు ద్రవం పడే దగ్గర పెట్టి గుండ్రంగా తిప్పుతూ ఉష్ణోగ్రతని తగ్గిస్తారు.



2

◆ అది కొంచెం కొంచెం గట్టి బడే సమయంలో చమ్కీల్లాంటివాటిని, రంగుల్నీ అద్దుతారు. పొడవు గొట్టాన్ని అటూ ఇటూ తిప్పుతూ మెత్తగా ఉన్న గాజును మెలికలు తిప్పి రకరకాల ఆకారాలు సృష్టిస్తారు.



3

◆ లోపలి డిజైన్ పూర్తయిన తర్వాత పైన మరోసారి గాజు ద్రవం పోసి గొట్టాన్ని గుండ్రంగా తిప్పుతారు. దాన్ని ఓ గుంట గరిటలాంటి దాంట్లో పెట్టి గుండ్రంగా తిప్పుతూ బంతి ఆకారం తెస్తారు.



4

◆ గొట్టానికి చివరిగా ఉన్న గాజు బంతిని చాకుతో కత్తిరించి అడుగుభాగాన్ని చదును చేస్తారు. అంతే. వేడి పూర్తిగా చల్లారే వరకూ పక్కన పెట్టి తర్వాత దాన్ని ప్యాక్ చేసేస్తారు. వాటినే మనం బజార్‌లో కొనుక్కుంటాం.

◆ ఇది సాధారణంగా గాజు పేపర్ వెయిట్ తయారీలో పాటించే విధానం. ప్రాంతాల్ని బట్టి ఈ విధానంలో కొన్ని మార్పులు ఉంటుంటాయి. కొన్నింటిని ఒక్కొక్కటిగా మనుషులే తయారు చేస్తే మరి కొన్ని ఫ్యాక్టరీల్లో పెద్ద ఎత్తున తయారవుతున్నాయి. గాజు పేపర్ వెయిట్‌లతోపాటు ఇప్పుడు ప్లాస్టిక్, రెజీన్‌లతో చేసిన పేపర్ వెయిట్‌లనూ ఎక్కువగా వాడుతున్నారు.

పుట్టింది ఎప్పుడంటే?


● 1845 నుంచి 1860ల మధ్యలో తొలిసారిగా యాంటిక్ పేపర్ వెయిట్‌లను తయారుచేశారు.
● జస్టిన్ స్కూబర్ట్ అనే ఆయన మొదటగా వీటిని తయారు చేశారని చెబుతారు. ఎక్కడంటే ఫ్రాన్స్‌లో.
● ఇప్పుడు మనం చూస్తున్న గాజు వెయిట్‌లు మాత్రం 1940ల తర్వాత పుట్టినవే.

లోపల పువ్వులెలా?

● ద్రవపు గాజు మెత్తబడే సమయంలో ప్రత్యేకమైన పరికరాల్ని ఉపయోగించి చిన్న పువ్వులు, ఆకుల్లాంటి డిజైన్‌లను ముందే చేసి పెట్టుకుంటారు. వాటిని వెయిట్ తయారు చేసేప్పుడు లోపలే ముందు అందంగా పేరుస్తారు. రంగులు అద్దడం అయినా అంతే. నీటి బిందువుల్లా కనిపించాలనుకున్న చోట స్ట్రాలాంటి గొట్టంలో నుంచి గాలిని ఊదుతారు. దీంతో లోపల సన్నని గాజు బుడగలొస్తాయి.



దారి కనుక్కోండి!




సబ్జెక్ట్ ల్యాబ్ - సైన్స్

ఇక్కడున్న బొమ్మలు, వాక్యాల ఆధారంగా ఖాళీల్లో వచ్చే పదాలేంటో కనుక్కోగలరా?

1. We [ ] with our (nose)
2. We [ ] with our (eyes)
3. We [ ] with our (ear)
4. We [ ] with our (tongue)
5. We [ ] with our (hands)

జవాబులు: స్కూల్ సవాల్: 1.1857 2.పోర్చుగల్ 3.రాయ్‌పూర్
కవలలేవి: 2,4 సబ్జెక్ట్ ల్యాబ్ - సైన్స్: 1.Smell 2.See
3.Listen 4.Taste 5.Touch

బింబో & బబ్లూ — అండమాన్‌లో సాహసాలు 1



ఛత్తీస్‌గఢ్ రాజధాని ఏది?

స్కూల్ సవాల్

1. మన దేశంలో సిపాయిల తిరుగుబాటు ఎప్పుడు జరిగింది?
2. వాస్కోడీగామా ఏ దేశస్థుడు?
3. ఛత్తీస్‌గఢ్ రాజధాని ఏది?



- షణ్ముఖరావు, తొమ్మిదో తరగతి
బి. నేతాజీ, ఏడో తరగతి,
జడ్‌పీహెచ్ స్కూల్, చల్లవానిపేట, శ్రీకాకుళం జిల్లా

ఆణిముత్యం


మంచిపనిని మించిన పూజలేదు, మానవత్వాన్ని మించిన సంపద లేదు
- మదర్ థెరిసా

నేర్చుకుందాం!

ఆంగ్లంలో చాలా పదాల్లో సైలెంట్ లెటర్స్ ఉంటాయి. తెలియక మనం వాటిని తప్పుగా పలికేస్తుంటాం. వాటి సరైన ఉచ్చారణ తెలుసుకుంటే సరి.

Thumb - థమ్
Subtle - సటల్

కవలలేవి? ఒకేలా ఉన్న జతను పట్టుకోండి



తుది పోరుకు భీమవరం-ఏలూరు జట్లు



భీమవరంలో జరుగుతున్న క్రికెట్ పోటీలు

మ్యాచ్‌ల వివరాలు

4-1-2018 (గురువారం) కేజీఆర్ఎల్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్, భీమవరం గ్రౌండ్‌లో (ఫైనల్)

ఉదయం 9 గం॥లకు: శ్రీమతి బి. సీత పాలిటెక్నిక్ కాలేజ్, భీమవరం X సర్ సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్ కాలేజ్, ఏలూరు

మధ్యాహ్నం 1 గం॥లకు: సర్ సీఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్, ఏలూరు X విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, భీమవరం

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: నారాయణ విద్యా సంస్థల సహకారంతో స్ప్రైట్ ప్రాయోజిత ఈసీసీ-2017 క్రికెట్ పోటీలు భీమవరంలోని కేజీఆర్ ఎల్ కళాశాల క్రీడా మైదానంలో ఎంతో ఉత్సాహంగా సాగుతున్నాయి. బుధవారం రెండు మ్యాచ్‌లు జరిగాయి. నాలుగు జట్లలో క్రీడాకారులు ఎంతో చక్కగా రాణించారు. కొందరు అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్‌లోనూ రాణించి ఆల్‌రౌండ్ నైపుణ్యాన్ని కనబరిచారు. ఫోర్లు, సిక్సర్లతో క్రీడా ప్రాంగణం అంతా సందడి వాతావరణం నెలకొంది.

కేజీఆర్ఎల్‌పై డీఎన్నార్ విజయం

తొలి మ్యాచ్‌లో కేజీఆర్ఎల్ డిగ్రీ కళాశాల (భీమవరం) జట్టుపై డీఎన్నార్ డిగ్రీ కళాశాల (భీమవరం) జట్టు 14 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదటి బ్యాటింగ్ చేసిన డీఎన్నార్ జట్టు నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 71 పరుగులు చేసింది. ఈ జట్టు కెప్టెన్ కె. ఈశ్వర్ బ్యాటింగ్, బౌలింగ్‌లో మెరుపులు మెరిపించి జట్టుకు విజయాన్ని అందించాడు. బ్యాటింగ్‌లో 2 ఫోర్లు, 1 సిక్సర్‌తో 15 బంతుల్లో 21 పరుగులు చేశాడు. బౌలింగ్‌లో 2 ఓవర్లు వేసి 6 పరుగులు మాత్రమే ఇచ్చి 3వికెట్లు తీశాడు. తర్వాత బ్యాటింగ్ చేసిన కేజీఆర్ఎల్ డిగ్రీ కళాశాల జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 57 పరుగులు మాత్రమే చేసింది.



ఆల్‌రౌండర్‌గా ప్రతిభ చూపిన డీఎన్నార్ జట్టు కెప్టెన్ ఈశ్వరరావు

కీలక మ్యాచ్‌లో విష్ణు కళాశాల గెలుపు

రెండో మ్యాచ్‌లో విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (భీమవరం) కళాశాల జట్టు - డీఎన్నార్ డిగ్రీ కళాశాల (భీమవరం) జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన డీఎన్నార్ కళాశాల జట్టు బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 71 పరుగులు చేసింది. ఈ జట్టు కెప్టెన్ ఈశ్వర్‌కుమార్ మరోసారి తన విశ్వరూపాన్ని చూపించాడు. 22 బంతుల్లో 34 పరుగులు సాధించాడు. దీంట్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు ఉన్నాయి. 2 ఓవర్లు బౌలింగ్ చేసి 4 పరుగులు మాత్రమే ఇచ్చి 2 వికెట్లు తీశాడు. తర్వాత బ్యాటింగ్ చేసిన విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జట్టు 9.2 ఓవర్లు ఆడి 5 వికెట్లు కోల్పోయి 72 పరుగులు చేసి విజయం సాధించింది. గెలిచిన జట్టులో హేమంత్‌కుమార్ 5 ఫోర్లతో 18 బంతుల్లో 27 పరుగులు చేశాడు.



విజయం సాధించిన డీఎన్నార్ డిగ్రీ కళాశాల జట్టు



విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జట్టు

తుది సమరం నేడే

జూనియర్, సీనియర్ విభాగాల్లో గురువారం జరగనున్న రెండు ఫైనల్ మ్యాచ్‌ల్లోనూ భీమవరం-ఏలూరు జట్లు పాల్గొననుండటం విశేషం. అది కూడా ఒకే విద్యాసంస్థలకు చెందిన రెండు జట్లు కావడం మరో విశేషం. భీమవరం నుంచి విష్ణు విద్యాసంస్థలకు చెందిన సీతాపాలిటెక్నిక్ కళాశాల, విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జట్టు, సీఆర్‌రెడ్డి విద్యాసంస్థల నుంచి సర్ సీఆర్‌రెడ్డి పాలిటెక్నిక్ కళాశాల, సర్ సీఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల (ఏలూరు) జట్లు తలపడనున్నాయి.

పలు ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్ (విజయవాడ) న్యూస్‌టుడే: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

తిరుపతి - విశాఖపట్నం - తిరుపతి (ఏసీ ప్రత్యేక రైలు)

రైలు నెంబరు 07487 ఏసీ ప్రత్యేక రైలు ఈ నెల 7, 14, 21, 28 ఫిబ్రవరి 4, 11, 18, 25 తేదీల్లో తిరుపతిలో రాత్రి 10.30కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.45కి విశాఖపట్నం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఇదే రైలు 07488 నెంబరుతో ఈ నెల 8, 15, 22, 29 ఫిబ్రవరి 5, 12, 19, 26 తేదీల్లో విశాఖపట్నంలో రాత్రి 7.20కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.10కి తిరుపతి చేరుకుంటుంది. ఈ రైలు రేణిగుంట, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ స్టేషన్లలో ఆగుతుంది.

కాచిగూడ - విశాఖపట్నం

రైలు నెంబరు 07016 ప్రత్యేక రైలు ఈ నెల 6, 13, 20, 27 తేదీల్లో కాచిగూడలో సాయంత్రం 6.45కి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.50కి విశాఖపట్నం చేరుకోనుంది. ఈ రైలు మల్కాజిగిరి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, అనకాపల్లి, దువ్వాడ స్టేషన్లలో ఆగుతుంది.

విశాఖపట్నం - తిరుపతి

రైలు నెంబరు 07479 ప్రత్యేక రైలు విశాఖపట్నంలో ఫిబ్రవరి 7, 14, 21, 28వ తేదీల్లో రాత్రి 7.05కి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.25కి తిరుపతి చేరుకుంటుంది. ఈ రైలు దువ్వాడ, అనకాపల్లి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగనుంది.

తిరుపతి - కాచిగూడ

రైలు నెంబరు 07146 ప్రత్యేక రైలు ఈ నెల 8, 15, 22 మార్చి 1వ తేదీల్లో తిరుపతిలో సాయంత్రం 5 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.30కి కాచిగూడ చేరుకుంటుంది. ఈ రైలు రేణిగుంట, శ్రీకాళహస్తి, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, మధిర, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, ఖాజీపేట, జనగాం స్టేషన్లలో ఆగుతుంది.

హైదరాబాద్ - విశాఖపట్నం - హైదరాబాద్

రైలు నెంబరు 07148 ప్రత్యేక రైలు ఈ నెల 10, 12 తేదీల్లో హైదరాబాద్‌లో సాయంత్రం 5.45కి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8.15కి విశాఖపట్నం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఇదే రైలు 07147 నెంబరుతో ఈ నెల 11, 13 తేదీల్లో విశాఖపట్నంలో సాయంత్రం 6.50కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.45కి హైదరాబాద్ చేరుకోనుంది. ఈ రైలు దువ్వాడ, అనకాపల్లి, తుని, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, భీమవరం, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్ స్టేషన్లలో ఆగుతుంది.


వ్యాన్లను ఢీకొట్టిన లారీ: ముగ్గురి దుర్మరణం

- మృతుల్లో ఇద్దరు పశ్చిమవాసులే
- మరో ఆరుగురు జిల్లావాసులకు గాయాలు

అశ్వాపురం, న్యూస్‌టుడే: అతివేగం, నిర్లక్ష్యం మూడు నిండు ప్రాణాల్ని బలిగొన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం భీమునిగుండం కొత్తూరు గ్రామం వద్ద బుధవారం ఉదయం మణుగూరు ప్రధాన రహదారిపై రెండు డీసీఎం వ్యాన్లను, ఓ లారీ వేగంగా వెనుకనుంచి ఢీకొట్టిన సంఘటనలో అక్కడికక్కడే ఇద్దరు మృతిచెందారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృతిచెందారు. ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు మణుగూరు ప్రధాన రహదారి మార్గంలో కొంతకాలంగా బీఎస్ఎన్ఎల్ హెచ్‌డీ పీఈ కేబుల్ లైన్ ఏర్పాటు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. తవ్వకాల కోసం పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం నుంచి పలు వడ్డెర కుటుంబాలు వచ్చాయి. అశ్వాపురం మండలంలోని నెల్లిపాక బంజర, మొండికుంట వద్ద తాత్కాలిక నివాసాలను ఏర్పాటు చేసుకుని కేబుల్ పనులు చేస్తున్నాయి. బుధవారం ఉదయం గుంటూరు నుంచి రెండు డీసీఎం వ్యాన్లలో హెచ్‌డీ పీఈ కేబుల్ బండిల్స్‌ను తీసుకువచ్చారు. వాటిని పనిచోట దించాల్సి ఉంది. ఇదే మండలంలోని భీమునిగుండం కొత్తూరు వద్ద తుమ్మలచెరువు చదలవాడ కాలువ సమీపంలో డీసీఎం వ్యాన్లను నిలిపి ఉంచగా.. సుమారు 15 మంది కూలీలు కేబుల్స్‌ను దించుతున్నారు. ఉదయం 7 గంటల సమయంలో మణుగూరు నుంచి కొత్తగూడెం వైపు వచ్చే ఓ బొగ్గులారీ రహదారి పక్కగా నిలిపి ఉంచిన వ్యాన్లలో ఒకదాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొంది. ప్రమాదం ధాటికి రెండు వ్యాన్లు కూడా పొలంలోకి పల్టీ కొట్టాయి. ప్రమాదానికి కారణమైన లారీ సుమారు అర కిలోమీటరు దూరం వరకూ ముందుకు దూసుకెళ్లి నిలిచిపోయింది. ఈ సంఘటనలో బండిల్స్‌ను దించుతున్న వారిలో పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన శివరాత్రి గోపయ్య (50), గుంటూరు జిల్లా కొండారెడ్డిగూడెం గ్రామానికి చెందిన వ్యాను డ్రైవరు తోడేటి భాగ్యారావు (23) అక్కడికక్కడే మృతిచెందారు. భద్రాచలంలోని ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం గ్రామానికి సన్నాసిపేట కనకారావు (43) అనే కూలీ మృత్యువాతపడ్డారు. జంగారెడ్డిగూడేనికి చెందిన ఒకే కుటుంబం, బంధువులైన మరో ఆరుగురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి భద్రాచలం ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు.



దూసుకువచ్చిన మృత్యు లారీ ఇదే



★ **శివరాత్రి గోపయ్య (50) :** పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు గ్రామానికి చెందిన వ్యక్తి. భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కూలీ పనులే జీవనాధారం. అశ్వాపురం మండలంలోని నెల్లిపాక బంజర వద్ద తాత్కాలిక నివాసాల్లో ఉంటున్నారు.



★ **సన్నాసిపేట కనకారావు (43):** పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం వాసి. భార్య, ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. కూలీ పనులే జీవనాధారంగా జీవిస్తున్నారు. మొండికుంట వద్ద తాత్కాలిక నివాసాల్లో ఉంటున్నారు.

గాయపడిన వారు వీరే..

క్షతగాత్రులంతా పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంకు చెందిన వారే. అందరూ ఒకే కుటుంబానికి చెందిన సభ్యులు, బంధువులు అవుతారు. కొందరు అశ్వాపురం మండలంలోని నెల్లిపాక బంజర, మరికొందరు మొండికుంట వద్ద తాత్కాలిక నివాసాల్లో ఉంటున్నారు.

★ శివరాత్రి రామచంద్రరావు (30) నడుం, కాళ్లూ చేతులకు తీవ్రగాయాలయ్యాయి. ★ శ్రీనివాస్ (36) కాలు, తలకు గాయాలయ్యాయి. ★ తురక వెంకన్న (25) కాళ్లూ చేతులకు తీవ్రగాయాలయ్యాయి. ★ బెజవాడ రాజు (20) పక్కటెముకలు విరిగాయి. కాళ్లూ చేతులకు గాయాలయ్యాయి. ★ సంపంగుల వెంకటేశ్ (45) ఛాతికి బలమైన దెబ్బలు తగిలాయి. ★ భద్రరాజు (54) కన్నుకు దెబ్బ తగిలింది. కాళ్లూ చేతులకూ గాయాలయ్యాయి.

ట్రాక్టర్ ట్రక్కు బోల్తా

★ మహిళ మృతి ★ ఏడుగురు కూలీలకు తీవ్ర గాయాలు

బుట్టాయగూడెం, పోలవరం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం కొవ్వాడ- లక్ష్మీపురం గ్రామాల మధ్య బుధవారం రాత్రి ఒక ట్రాక్టర్ ట్రక్కు బోల్తాపడి ఒక మహిళ మృతి చెందింది. ఏడుగురు వ్యవసాయ కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. బుట్టాయగూడం ఎస్సై ఎ.దుర్గారావు తెలిపిన వివరాల ప్రకారం.. గోపాలపురం మండలం రాజంపాలెం గ్రామానికి చెందిన కొంతమంది కూలీలు బుట్టాయగూడెం మండలం కొవ్వాడలో వ్యవసాయ పనులకు ట్రాక్టర్‌లో వచ్చారు. పత్తి పంట తీసే పనిని ముగించుకుని తిరిగి ఇంటికి వెళుతున్నారు. లక్ష్మీపురం సమీపంలో ప్రధాన రహదారిపై మలుపు తిరుగుతుండగా ట్రాక్టర్ - ట్రక్కుకు ఉన్న లింకు ఊడిపోయింది. ట్రక్కు రహదారి పక్కనే ఉన్న పెద్ద గోతిలోకి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఐనపర్తి మరియమ్మ (38) ట్రక్కు కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. ఈమెతో పాటూ ప్రయాణిస్తున్న కూలీలు పల్లి వెంకట్రావుకు ఎడమ కాలు, గంగారత్నంకు ఎడమ చేయి, అక్కాబత్తుల ధన లక్ష్మికి ఎడమ కాలు, పార్వతికి కుడి కాలు విరిగాయి. వర్ల సీతమ్మ, పిండెల్లి గన్నెమ్మ, ప్రత్తిపాటి మరియమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఎల్ఎన్‌డీ పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం తరలించారు. వైద్యుడు రవితేజ బాధితులకు అత్యవసర చికిత్సలు అందించారు. క్షతగాత్రుల్లో ముగ్గురిని రాజమహేంద్రవరం ఉన్నత వైద్యానికి తరలించారు. ఎస్సై, వీఆర్వో తెల్లం పోతురాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.



బోల్తా పడిన ట్రాక్టర్ ట్రక్కు



సంఘటనా స్థలంలో మరియమ్మ మృతదేహం

జంగారెడ్డిగూడెం డీఎంగా రామారావు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఆర్టీసీ జంగారెడ్డిగూడెం డిపో మేనేజరుగా బీవీ రామారావు నియమితులయ్యారు. కృష్ణా జిల్లా తిరువూరు డిపోలో మెకానికల్ ఫోర్ మెన్‌గా పనిచేస్తున్న ఆయనకు యాజమాన్యం పదోన్నతి కల్పించి జంగారెడ్డిగూడెం డీఎంగా నియమించింది. ఈ మేరకు రామారావు గురువారం ఏలూరులోని ఆర్ఎం కార్యాలయంలో రిపోర్టు చేయనున్నారు. ఇప్పటివరకు జంగారెడ్డిగూడెం డీఎంగా పనిచేసిన పి.అప్పారావు తెలంగాణ రాష్ట్రానికి బదిలీ అయ్యారు. ఆర్టీసీ పశ్చిమ రీజియన్‌లో సివిల్ ఇంజినీరింగ్ డిప్యూటీ ఈఈగా పనిచేసిన కె.సత్యనారాయణ కూడా ఇటీవల తెలంగాణకు బదిలీ అయ్యారు. డిప్యూటీ ఈఈ ఇన్‌ఛార్జి బాధ్యతలను రాజమహేంద్రవరం డీఈఈ అరుణ్‌కుమార్‌కు ఆర్టీసీ యాజమాన్యం అప్పగించింది.

'ఉపాధ్యాయులు, విద్యార్థులను మినహాయించాలి'

ఏలూరు విద్యావిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే 'జన్మభూమి' కార్యక్రమాలకు ఉపాధ్యాయులను, విద్యార్థులను మినహాయించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఐ.రాజగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి బీఏ సాల్మన్‌రాజు, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు డి.దావీదు, జిల్లా అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావులు కోరారు. ఈ మేరకు బుధవారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. జన్మభూమి కార్యక్రమాలకు కొంతమంది ఉపాధ్యాయులను నోడల్ అధికారులుగా నియమించారని, విద్యార్థులను గ్రామసభల్లో భాగస్వాములుగా చేస్తున్నారని పేర్కొన్నారు. దీనివల్ల చదువులు కుంటుపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పరీక్షల కాలం సమీపిస్తున్న తరుణంలో ఈ విధంగా ఉపాధ్యాయులను, విద్యార్థులను జన్మభూమి కార్యక్రమాలకు వినియోగించడం సరికాదన్నారు. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని డిమాండ్ చేశారు.

5న సీపీఎం జిల్లా కమిటీ సమావేశం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: సీపీఎం జిల్లా కమిటీ సమావేశాన్ని ఈనెల 5న తాడేపల్లిగూడెంలో నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ అప్‌ల్యాండ్ జిల్లా కార్యదర్శి చింతకాయల బాబూరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 10, 11, 12 తేదీల్లో భీమవరంలో పార్టీ రాష్ట్ర మహాసభలు జరుగుతాయన్నారు. వీటిని విజయవంతం చేసేలా చేపట్టాల్సిన చర్యలపై ప్రణాళిక రూపొందించేందుకు ఈనెల 5న తాడేపల్లిగూడెంలో జిల్లా కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కమిటీ సభ్యులంతా ఈ సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: సొంతింటి కల నెరవేరాలంటే చేయాల్సిన దానాలు?, వాస్తురీత్యా విద్యుత్ ఉపకరణాలు ఏ దిశలో ఉండాలి?, 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: ఆడదే ఆధారం (సీత, విసు).

మధ్యాహ్నం

12-00: తెలుగు'రుచి': ఘుమఘుమలు 'వంకాయ ఉలవకారం', మీ చేతివంట 'పన్నీర్ చెనా కర్రీ', 'ఆలూ పాలక్‌రైస్', జస్ట్ ఎ మినిట్ 'కాజూ గోబీపకోడి' తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు, 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: ఋతుగీతం (డైలీ సీరియల్), 04-30: వసంతం (డైలీ సీరియల్), 05-00: జీన్స్–2 (రిపీట్), 06-00: ఒకరి ఒకరు (డైలీ సీరియల్), 06-30: తేనెమనసులు (డైలీ సీరియల్).

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: జబర్దస్త్ – సూపర్‌హిట్ కామెడీ షో, 10-30: జబర్దస్త్ జల్సాటైం...

ఈటీవీ ప్లస్

ఉదయం

11:00 కిక్ రిపీట్

మధ్యాహ్నం

12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 డీజే రిపీట్
01:15 స్టే..పూలిష్ రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్
03:30 నా షో నా ఇష్టం రిపీట్

సాయంత్రం

04:30 ఎక్స్‌ప్రెస్ రాజా
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా

రాత్రి

07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 పోవే..పోరా
09:00 పటాస్
09:30 టాప్స్
10:00 కిర్రాక్ కిడ్స్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

- ★ మానస - బ్రహ్మకుమారి (ఉ. 6:00, రా. 11:30)
- ★ యోగమంత్ర (ఉ. 7:00, సా. 6:00, రా. 10:30)
- ★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 6:30, రా. 10:00)
- ★ అమృతం: డైరీ డిలైట్స్ (ఉ. 8:00, మ. 12:30, రా. 8:00)
- ★ హెల్దీ & టేస్టీ (ఉ. 8:30, మ. 1:00, రా. 8:30)
- ★ కౌంట్ యువర్ కేలరీస్ (మ. 1:30)
- ★ జీవనరేఖ చైల్డ్‌కేర్: మీ పిల్లలు ఆడుకునే బొమ్మలు - తీసుకోవాల్సిన జాగ్రత్తలు (ఉ. 9:30)
- ★ జీవనరేఖ చైల్డ్‌కేర్: మీ పిల్లలు తక్కువ బరువుతో పుట్టారా? (మ. 2:00, రా. 7:00)
- ★ సుఖజీవనం (ఉ. 10:00, మ. 2:30, రా. 9:30)
- ★ ఆరోగ్యమస్తు: 1. చెడు అలవాట్లు - కీళ్ల నొప్పులు, 2. నొప్పి నివారణ మాత్రలు - వాస్తవాలు, 3. చెవిలో శబ్దాలు (ఉ. 10:30)
- ★ ఆరోగ్యమస్తు: 1. మీ జుట్టు తీరు - మీ ఆరోగ్య స్థితి, 2. బాడీ పెయిన్స్ రావడానికి కారణాలు - పరిష్కారాలు, 3. మీ పళ్ళు జుంమంటున్నాయా? (మ. 3:00, రా. 9:00)
- ★ డా. ఈటీవీ: క్యాన్సర్ కేర్ (ఉ. 11:00)
- ★ డా. ఈటీవీ: దంత సంరక్షణ (ఉ. 11:15)
- ★ డా. ఈటీవీ: అజీర్తి సమస్యలు (మ. 3:30, రా. 7:30)
- ★ డా. ఈటీవీ: జనరల్ హెల్త్ (మ. 3:45, రా. 7:45)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: టెలిషాపింగ్, 7-00: సన్‌రైజ్ సినిమా: ఇద్దరు కొడుకులు (శోభన్‌బాబు, రాధ) 10-00: మార్నింగ్ షో: నిత్యాకల్యాణం పచ్చతోరణం (చలం) మధ్యాహ్నం: 1-00: మాట్నీ: దొంగమొగుడు (చిరంజీవి, రాధిక) సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ఒక సినిమాకథ (రాజేంద్రబాబు) రాత్రి: 7-00: ఫస్ట్ షో: వాడె వీడు (ఎన్టీఆర్, మంజుల) 10-00: ప్రముఖ దర్శకుడు పి.సి.రెడ్డితో గుర్తుకొస్తున్నాయి... (రెండవ భాగం).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - కాబూలీ చెనా ముల్లంగి పరాటా & మష్రూమ్ మఫిన్స్, ఉ.8.00, రా.9.00: బ్రేక్ ఫాస్ట్ షో - కీన్వ కాబూలినా టిక్కీ & జుకిని మిల్లెట్ మఫిన్స్, ఉ.8.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - మసాలా ఎనగ్గె, ఉ.9.30: సూపర్ భీమ్ - గేమ్ షో, ఉ.11.00: గోరుముద్దలు - సగ్గుబియ్యం టిక్కీస్, ఉ.11.15, రా.8.30: డైట్ మెనూ (మైగ్రేన్ నివారణకు) - బ్రొకోలి సూప్, ఉ.11.30, రా.8:00: గోదావరి నెయ్యి "బాబాయ్ హోటల్" - జొన్న రొట్టె & పండుమిరపకాయ పచ్చడి, మ.12.00, సా.5.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - మిక్స్డ్ వెజ్ సాగూ, మ.12.15, రా.10.15: మమ్మీస్ కిచెన్ - చెనా ఝూర్ గరం, మ.12.30, రా.8.45: సూపర్ చెఫ్ (మొగలై స్టైల్) - బెండకాయ మటన్ కర్రీ, మ.12.45, సా.6.15: ఛాట్స్ & సూప్స్ - మేతి బార్లీ సూప్, మ.1.00, సా.4.30: వావ్ ఏమి రుచి (పార్సీ క్యూసైన్) - పార్సీ బిర్యానీ & పాలక్ ఈడ, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) వంకాయ బజ్జీ, మ.1.45, రా.7.30: పెరటి రుచులు - ఆయుర్వేదిక పెరటి మొక్కలు - ఇంటి చిట్కాలు, మ.2.15: మటన్‌తో మస్తీ మస్తీ - మటన్ ఖీమ బిరానీ రైస్ & గోంగూర మటన్, మ.2.30, సా.6.00: మంత్రా డిటర్జెంట్ సోప్ "చోటా షెఫ్" - టమాటో అటుకులు, మ.2.45, రా.10.30: కారాలు, పొడులు - ఉసిరి కారం & రాగి తీపి అట్టు పొడి, మ.3.30: భళా మిస్టర్ బ్రహ్మచారి - చికెన్ ఫ్రైడ్ రైస్.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 ⁰, 08-30 యువ (రి), 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360 ⁰, 02-30 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: పిల్లలు.. అత్యవసర పరిస్థితులు, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, అలంపురం, పశ్చిమ గోదావరి జిల్లా, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 ⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రి), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 ⁰, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీసంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360 ⁰, 02-30 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, గంగారం, వికారాబాద్ జిల్లా, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: పిల్లలు.. అత్యవసర పరిస్థితులు, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 ⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

ఏ ఛానల్లో ఏముంది.. 04-01-2018

ఉదయం: 05-30 తిరుప్పావై - గోదాస్తుతి, 06-30 శుభోదయం + నిత్యపూజలివిగో, 07-00 విష్ణు సహస్రనామస్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తిరుప్పావడ సేవ), 08-00 శతమానం భవతి, 08-30 పూజకువేళాయె - దత్తాత్రేయస్వామి, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ శ్రీపద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 స్పెషల్ న్యూస్ + ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణుసహస్ర నామామృతం + లైవ్ డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం, **సాయంత్రం:** 04-30 యక్షప్రశ్నలు, 05-00 లైవ్ ఎస్.డి. సేవ + స్పెషల్ న్యూస్ + ఆళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + ఖడ్గమాలస్తోత్రం, 08-00 లైవ్ అధ్యయనోత్సవాలు నేను.. నా.. స్వామి, 08-30 మల్లికార్జున సుప్రభాతం - చాగంటి, 09-00 ఆలయదర్శనం - రామేశ్వరలక్ష్మణేశ్వర దేవస్థానం, 09-30 శివమహాపురాణం - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 శ్రీరామ రసవాహిని - సాటులూరి గోపాల కృష్ణమాచార్యులు.

ఉదయం: 6-00 శ్రీసాయి హారతి, 6-30 సద్గురుస్తోత్రం, 7-00 అర్చన, 7-30 సాయి గీతామృతం, 8-00 పుణ్యక్షేత్రం, 8-30 జ్యోతి స్వరూపా అయ్యప్ప, 9-00 సంపూర్ణ మహాభారతం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 4-30 పుణ్యక్షేత్రం, 5-00 శ్రీకనకధారస్తోత్రం, 5-30 సాయిగీతామృతం, 6-00 సద్గురుస్తోత్రం, 7-00 భక్తివిశేషాలు,7-30 అమృతకలశం, 8-00 పరిహారం, 8-30 శ్రీమద్భగవద్గీత 9-00 దుర్గాసప్తశతి, 9-30 మహాభారత పాత్రలు, 10-00 ధర్మ సందేహాలు, 10-30 భక్తివిశేషాలు, 11-00 గోదామృతం.

ఉదయం: 06-30 ఎంజాయ్ ఎవ్రిడే లైఫ్, 07-00 టెలిషాపింగ్, 07-30 శుభోదయం, 08-30 సినిమా: నాగవల్లి 11-30 వారెవా, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్‌రష్ 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం (రిపీట్), 03-30 కల్యాణ వైభోగం (రిపీట్), **సాయంత్రం:** 04-00 బిగ్ సెలబ్రిటి చాలెంజ్ ఇంటర్‌నేషనల్, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమ భాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 పున్నాగ, **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్దమందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మీ, 08-30 ఎవరే నువ్వు మోహిని, 09-00 కల్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 నా కోడలు బంగారం (రిపీట్),11-00 బిగ్ సెలబ్రిటి ఛాలెంజ్ ఇంటర్‌నేషనల్ (రిపీట్).

ఉదయం: 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 హరహర మహాదేవ, 08-00 రాశి ఫలాలు దినఫలం, 08-30 జానకి రాముడు, 09-00 సినిమా: చంద్రలేఖ, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 అగ్నిసాక్షి (రిపీట్), 01-00 కుంకుమపువ్వు (రిపీట్), 01-30 చూపులు కలిసిన శుభవేళ, 02-00 కార్తీక దీపం, 02-30 సినిమా: యమదొంగ, **సాయంత్రం:** 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 అగ్నిసాక్షి, **రాత్రి:** 07-00 లక్ష్మీ కల్యాణం, 07-30 కార్తీకదీపం, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 సుందరకాండ, 09-30 పవిత్రబంధం, 10-00 నీలికలువలు, 10-30 దసరా వచ్చిందయ్య (రిపీట్).

ఉదయం: 06-00 టెలీషాపింగ్, 07-00 అమృతకలశం, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం (రిపీట్), 08-30 సినిమా: దేవుళ్లు, 11-30 నాగిని -2 (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్) 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 శిరిడి సాయి, 03-00 సినిమా: ఆ నలుగురు, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 జై జై వినాయక, 08-00 మాతృదేవోభవ, 08-30 శనీశ్వరుని దివ్యచరిత్ర, 09-00 నందిని, 09-30 బోల్ బేబీ బోల్ - సీజన్ 10, 10-30 సినిమా: ఆర్య.

ఉదయం: 06-00 స్టార్ ట్రెక్ 2: ది రాత్ ఆఫ్ ఖాన్, 07-56 ది కరాటే కిడ్ పార్ట్ 2, 09-59 బ్యాక్ టు ది ఫ్యూచర్ పార్ట్ 3, మధ్యాహ్నం:12-03 మ్యాన్ ఆఫ్ స్టీల్, 02-27 పుష్ ఇన్ బూట్స్, **సాయంత్రం:** 04-03 వే ఆఫ్ ది డ్రాగన్, 5-53 ది డిక్టేటర్ రాత్రి: 07-08 ది లాస్ట్ ఎయిర్‌బెండర్, 09-00 కుంగ్ ఫూ పాండా 2, 10-40 పాల్.

మిరపలో తెగుళ్ల నివారణ

వాణిజ్య పంటలలో ప్రధానమైనది మిరప. ఈ పంటను ఎక్కువగా కృష్ణా, గుంటూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాలో పండిస్తారు. నష్టమైనా, లాభమైనా ఏటా ఎంతో కొంత విస్తీర్ణంలో సాగు చేస్తారు. అలాంటి మిరపకు కొన్నేళ్లుగా చీడపీడలు అధికమయ్యాయి. పెట్టుబడి ఎక్కువగా పెట్టే ఈ పంట సాగులో సరైన జాగ్రత్తలు తీసుకోకుంటే నష్టాలు తప్పవు. ప్రస్తుతం మిరప పూత, పిందె, కాయ దశలో ఉంది. ఈ ఏడాది బొబ్బర తెగులు (వైరస్) సోకి చాలా మంది రైతులు నష్టపోయారు. మిరపలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను పిడుగురాళ్ల ఉద్యానశాఖ అధికారి మోహన్ వివరించారు.

పైముడత: తామర పురుగులు ఆకుల అడుగు భాగంలో చేరి రసం పీల్చడం వల్ల ఆకులు పైకి ముడుచుకొని ఉంటాయి. దీని నివారణకు లీటరు నీటికి ట్రైజోఫాస్ 1.25 మి.లీ. లేదా పిప్రోనిల్ 2 మి.లీ. వేపనూనె 5 మి.లీ. జిగురు 1.5 మి.లీ. (గమ్)తోకలిపి పిచికారి చేయాలి.

కింది ముడత: ఇది నల్లి వల్ల వస్తుంది. నల్లి ఆశించిన ఆకులు కిందికి ముడుచుకొని తిరగబడిన పడవ ఆకారంలో కనిపిస్తాయి. ఇంకా ముదిరితే ఆకు పసుపు రంగులోకి మారి పూత, పిందె రావటం తగ్గిపోయి, వచ్చినవి రాలిపోతాయి. దీని నివారణకు ఫాసలోన్ 3 మి.లీ. డైకోపాల్ 5 మి.లీ. లీటరు నీటికి చొప్పున పిచికారి చేయాలి. దీనికి వేపనూనె, జిగురు కలపాలి. పైముడత, కింది ముడత రెండూ ఉన్నట్లయితే పెగాసిస్ లీటరు నీటికి 2 గ్రా. చొప్పున పైరుపై చల్లుకుని బొబ్బర తెగులు ఆశించకుండా చూసుకోవచ్చు.



పైముడత తెగులు

పేనుబంక: చిన్న పురుగులు గుంపులు గుంపులుగా చేరి లేత కొమ్మలు, ఆకుల కాండంపై చేరి రసం పీల్చడం వల్ల నల్లగా మారి వైరస్‌ను వ్యాప్తి చెందిస్తాయి. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. అంతేగాక పేనుబంక, తెల్లదోమను ముందుగానే గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టి, బొబ్బర తెగులు రాకుండా అరికట్టవచ్చు.

ఆకుమచ్చ: సర్కోస్పోర తెగులు వల్ల ఆకులపై గోధుమరంగు మచ్చలు ఏర్పడతాయి. నివారణకు బ్లైటాక్స్ 3 గ్రా. గానీ డైథేన్-ఎం-45 2.5 గ్రా./లీటరు నీటికి చొప్పున కలిపి, దానికి + స్ట్రెప్టోసైక్లిన్ 1 గ్రాము 10 లీటర్ల నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

బూడిద తెగులు: బూడిద తెగులు సోకిన ఆకులపై తెలుపురంగులో బూడిదలా కనిపించే మచ్చలు ఏర్పడతాయి. తెగులు మరింత ఉధృతమైనప్పుడు ఆకులు పుసుపు వర్ణంలోకి మారి రాలిపోతాయి. దీని వల్ల పూత, పిందె నిలబడకుండా రాలిపోతాయి. దీని నివారణకు కెరాథేన్ 1 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

ఎండు తెగులు: ఎండు తెగులు భూమిలోని శిలీంధ్రం వల్ల వస్తుంది. దీని వల్ల మొక్కలు గుంపులు గుంపులుగా ఎండిపోతాయి. దీని నివారణకు కిలో ట్రైకోడర్మావిరిడీ శిలీంధ్రాన్ని 100 కిలోల పశువుల ఎరువులో కలిపి పైరులో చల్లుకోవాలి. పంటకు నీటి తడులు అందించినప్పుడు ఈ శిలీంధ్రం వ్యాప్తి చెంది తెగులు పెరగకుండా ఆపుతుంది. అంతేగాక బైటాక్స్ 3 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి మొక్కలపై చల్లాలి.

పూత రావటానికి : పూత బాగా రావటానికి పొటాషియం నైట్రేట్ (13-0-45) 10 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. అంతేగాక వచ్చిన పూత పిందెగా మారి రాలుతుంటే ప్లానోఫిక్స్ 4 మి.లీ., 5 లీటర్ల నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. సూక్ష్మపోషకాల లోపం తలెత్తినప్పుడు ఫార్ములా-4, 5 గ్రా. + బోరాన్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి పైరుపై పిచికారి చేయాలి.

– న్యూస్‌టుడే, మాచవరం (గుంటూరు జిల్లా)

పాడి పరిశ్రమలో పాకల ప్రాధాన్యం

పాకలను ఒక వరుసలో కానీ, రెండు వరుసల్లో కానీ కట్టేసేలా నిర్మించుకోవచ్చు. ఈ పాకల నిర్మాణానికి ప్రభుత్వం- ఉపాధి హామి పథకం ద్వారా తోడ్పాటునిస్తోంది. గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేలా పాకలను గడ్డితో గానీ, షెడ్ రేకులతో గానీ కప్పి, నిర్మించుకోవచ్చు. పాకల్లో దాణా, పశుగ్రాసం తినేందుకు 'మేంజర్' ఏర్పాటుచేయాలి. పాకల్లో నేల జరుడుగా కాక, కాస్త గరుకుగా ఉండాలి. పాడి పశువులు కూర్చున్నప్పుడు, శరీర బరువులో సగానికిపైగా వాటి మోకాళ్ళపై పడుతుంది కాబట్టి రబ్బర్‌మ్యాట్లను పరచాలి.. తక్కువ ధరలో పాకల నిర్మాణం చేపట్టాలి. పశువుల మల మూత్రాలు నీటితో జారిపోయేలా వాలు ఉండేలా పాకలు నిర్మించాలి. షెడ్‌కు దగ్గరలోనే నీటి సౌకర్యం ఉండాలి. షెడ్‌నుండి వచ్చే పశువుల మూత్రం, పేడ, దగ్గరలోని పశుగ్రాస క్షేత్రాలకు మళ్ళించాలి. పాకల వల్ల చలి, ఎండబారి నుండి పశువులకు రక్షణ లభిస్తుంది. పశువుల ఆరోగ్యం మెరుగ్గా ఉండి, పాల దిగుబడి పెరుగుతుంది.

ఓ దేవుడా ఎగిరే వరమివ్వు

పోలవరం 39 గ్రామాలు 8 వేల మంది

బుట్టాయగూడెం 15 గ్రామాలు 4 వేల మంది

- 'దారీ' తెన్ను లేని కొండల్లో బతుకులు
- బస్సు సౌకర్యం లేని గ్రామాలు ఎన్నో..
- ట్రాక్టర్లు, ఆటోల్లో గుట్టలు దాటుకుంటూ



మన్యం ప్రజలు నిత్యావసర సరకుల కోసం ఇలా ట్రాక్టర్‌లో వస్తుంటారు



ఈ దృశ్యం చూడండి. మెత్తప్పకోటకు చెందిన గ్రామస్థులంతా పోలవరం సంతలో మంగళవారం నిత్యావసరాలు కొనుగోలుచేసి తిరిగి వెళ్తుండగా జరిగిన ట్రాక్టరు ప్రమాద ప్రాంతం. ఇందులో ఒకరు మృతి చెందారు. కనీసం రహదారి సరిగా లేదు కదా విద్యుత్తు సౌకర్యం లేకపోవడంతో చిమ్మచీకట్లో సెల్‌లైటు వెలుతురులో డ్రైవర్ ట్రాక్టర్ నడిపినట్లు గిరిజనులు చెప్పారు.

పోలవరం, న్యూస్‌టుడే

అనాధిగా అడవులను నమ్ముకుని.. అక్కడే జీవిస్తున్న అడవి పుత్రులకు దారీ తెన్ను కనిపించడం లేదు. 2019 చివరి నాటికి ప్రతి గ్రామానికి రహదారులు ఏర్పాటు చేస్తామని, ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు వేయిస్తామని, మట్టి రహదారి అనేది లేకుండా చేస్తామని చెబుతున్న పాలకులు మన్యంలోని పోలవరం, బుట్టాయగూడెం మండలాల్లోని కొండలపై ఉన్న గ్రామాలను వదిలేశారు. కొండలు.. గుట్టలే దారులుగా చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఆయా మార్గాల్లో బస్సు సౌకర్యం లేక ట్రాక్టర్లు, ఆటోలపై ప్రయాణం చేస్తూ తనువులు చాలిస్తున్నా అధికారులకు పట్టడం లేదు.

చుట్టూ తిరిగేది 30 కి.మీ

పోలవరం మండలం సున్నాలగండి నుంచి మెత్తప్పకోట వరకు రూ.40 లక్షలతో రెండు కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి నాలుగేళ్ల కిందట నిధులు మంజూరు చేశారు. అటవీ శాఖ అభయారణ్యంలో రోడ్లు వేయకూడదంటూ అభ్యంతరం తెలపడంతో పనులు జరగలేదు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టక ముందు మెత్తప్పకోట, ఉడతపల్లి గ్రామాల గిరిజనులు కాలినడకన తోటగొంది, దేవరగొంది, మామిడిగొంది, చేగొండపల్లి మీదుగా కొండలు దిగి పోలవరం వచ్చేవారు. ప్రాజెక్టు నిర్మాణంతో ఆ గ్రామాలు ఖాళీ చేయించడంతో పోలవరం రావడానికి దాదాపు 15 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోంది. రానుపోనూ 30 కిలోమీటర్లు నడవలేక పూర్వం వెదురు తరలింపు కోసం వేసిన మార్గాల్లో ట్రాక్టర్లపై వచ్చి ప్రమాదాలకు గురవుతున్నారు.



మెత్తప్పకోట గ్రామం వెళ్లే మార్గం

జనాలకు కాదు జంతువులకే

విజ్జరం - సున్నాలగండి నుంచి రెండు కిలోమీటర్ల వరకు మట్టిరోడ్డు రూ.5 లక్షలతో వేశారు. ఇదే మార్గంలో కల్వర్టు నిర్మాణ ప్రారంభించారు. అటవీ శాఖ అభయారణ్యంలో జంతువులు తిరగడానికి తప్ప జనాలకు లేదనడంతో పనులు నిలిచిపోయాయి.

నరకం చూడాల్సిందే

ఉడతపల్లి వెళ్లే మార్గం ఇది. కొండల్లో నీరు రహదారిపైనే ప్రవహిస్తుంది. మెత్తప్పకోట, ఉడతపల్లి గ్రామాల గిరిజనులు ఇక్కడి వరకు కలిసి ప్రయాణం చేస్తారు. అక్కడ నుంచి బాటలు విడిపోవడంతో ఎవరి గ్రామానికి వారు ప్రయాణమవుతారు. వారు పోలవరం నుంచి సున్నాలగండి వరకూ ఎనిమిది కిలోమీటర్ల మేర ప్రయాణం సాఫీగా సాగినా అక్కడ నుంచి ఘాట్‌లు, వర్షాలకు దెబ్బతిన్న రోడ్డుపై నరకం చూస్తున్నారు.



ఉడతపల్లి గ్రామం వెళ్లే మార్గంలో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

ద్విచక్ర వాహనాలే దిక్కు

ఎల్‌ఎన్‌డీపేట నుంచి పది కిలోమీటర్ల దూరంలో సరిపల్లికుంట, రామనర్సాపురం గ్రామాలున్నాయి. దాదాపు 200 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించే మార్గంలో నిర్మించిన రహదారిపై కల్వర్టు దశాబ్దం కిందట దెబ్బతింది. ద్విచక్ర వాహనాలు తప్ప ఆ గ్రామాలకు జీపులు, వాహనాలు తిరిగే పరిస్థితి లేదు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ద్విచక్ర వాహనాల పైనే ఆసుపత్రులకు తీసుకెళ్లాలి.



ఎల్‌ఎన్‌డీపేట నుంచి రామనర్సాపురం వెళ్లే మార్గంలో దెబ్బతిన్న కల్వర్టు

బస్సునే రద్దు చేశారు

దొండపూడి నుంచి ఎనిమిది గ్రామాలకు వెళ్లే మార్గం ఇది. జిల్లెళ్లగూడెం పంచాయతీ పరిధిలోని ఎనిమిది గ్రామాల ప్రజలు నిత్యం పది కిలోమీటర్ల దూరంలోని దొండపూడి వస్తుంటారు. రెండు సంవత్సరాల వరకు జంగారెడ్డిగూడెం డిపో వారు ఉదయం, సాయంత్రం రెడ్డికుంకాలకు బస్సును నడిపేవారు. రహదారి దెబ్బతిన్నందున బస్సును రద్దు చేయడంతో ప్రజలకు ఆటోలే దిక్కయ్యాయి. మనుగోపుల - జిల్లెళ్లగూడెం మధ్యలో పేడ్రాల కాలువపై వంతెన అప్రోచ్ రోడ్డు గతేడాది వాగులు పొంగడంతో కోతకు గురైంది. చీకటి పడిన తర్వాత కొత్త వారు వస్తే అందులో పడాల్సిందే.



దొండపూడి నుంచి రెడ్డి కుంకాల వెళ్లే మార్గంలో వంతెన ముందు కోత

పునరావాస కాలనీల ప్రధాన రహదారి

పోలవరం నుంచి రేపల్లెవాడ కూడలి వరకు నిర్మించిన పునరావాస కాలనీలతో పాటు 15 గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే మార్గంలో తోటగొంది పునరావాస కాలనీ సమీపంలోని కాజ్‌వే అయిదేళ్ల క్రితం దెబ్బతింది. అధికారులు ఎర్రగుడ్డలు పెట్టి చేతులు దులుపుకొన్నారు.



తోటగొంది సమీపంలో దెబ్బతిన్న కాజ్‌వే

చప్టా కొట్టుకుపోతే అంతే

వింజరం నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న సున్నాలగండి గ్రామానికి వెళ్లే మార్గంలో కాలువపై ఉన్న చప్టా ఇటీవల కొండ వాగుల ఉద్ధృతికి కొట్టుకుపోయింది. మెత్తప్పకోట, ఉడతపల్లి ప్రజలకు ఇదే ప్రధాన మార్గం. చప్టా కొట్టుకుపోతే రాకపోకలు నిలిచిపోతాయి.



సున్నాలగండి వెళ్లే రహదారి

నిర్వాసితుల పరిస్థితి దయనీయం

ఇటీవల మనువడి పెండ్లి చూపులు కోసం ద్విచక్ర వాహనంపై ఎల్‌ఎన్‌డీపేట నుంచి బయలుదేరిన వృద్ధురాలు కోండ్రుకోట సమీపంలో గోతిలో పడింది. ఈ సంఘటనలో బండిపై నుంచి పడటంతో మృతి చెందారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో 19 ముంపు గ్రామాల నిర్వాసితుల పరిస్థితి దయనీయంగా మారింది. రహదారికి మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆటోల్లో ప్రయాణించే ప్రజలు నరకం చవిచూస్తున్నారు.



గోదావరి నదీ పరీవాహక గ్రామాల నుంచి గిరిజనులను పోలవరం తీసుకువచ్చే జీపు

దారి బాగుజేతకు చందాలు వేసుకుంటున్నాం



ఏటా మెత్తప్పకోట, ఉడతపల్లి గ్రామాల ప్రజలు పోలవరం రావడం కోసం ఇంటికి రూ.500 చొప్పున చందాలు వేసుకుని రహదారి బాగు చేసుకుంటున్నాం. గతేడాది వర్షాలకు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. అధికారులెవరూ మా గ్రామాలను పట్టించుకోవడం లేదు. వృద్ధులు, మహిళలు అంతదూరం నడవలేక ట్రాక్టరును ఆశ్రయిస్తే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. **-కుంజ గంగరాజు, మెత్తప్పకోట.**

తాళాలు వేసి ఉన్న ఇళ్లే లక్ష్యం..!

- ఇద్దరు సభ్యుల దొంగల ముఠా అరెస్టు
- రూ.10లక్షల విలువ చేసే బంగారం, వెండి వస్తువులు స్వాధీనం



నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి వస్తువులు

ఆకివీడు, న్యూస్‌టుడే: తాళాలు వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు సభ్యుల ముఠాను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి.. ఆకివీడు, పాలకోడేరు ఎస్సైలు సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వరరావు కథనం మేరకు.. ఆకివీడు మండలం దుంపగడప గ్రామానికి చెందిన పులవర్తి లీలాసాయిగుప్తపై గతంలో కృష్ణాజిల్లా కైకలూరు గ్రామీణ, ఆకివీడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు కేసులు నమోదయ్యాయి. ఇతను ఆకివీడుకు చెందిన బొల్లా అభిరామ్‌తో పరిచయం పెంచుకుని, సులువుగా డబ్బు సంపాదించాలనే దురాశతో తాళం వేసి ఉన్న ఇళ్లలో రాత్రి సమయాల్లో దొంగతనాలకు పాల్పడుతూ వచ్చారు. ఈక్రమంలో గుంటూరు జిల్లా తాడేపల్లి, విజయవాడ నగరంలోని సత్యనారాయణపురం, మాచవరం, కృష్ణా జిల్లా వీరవల్లి, పశ్చిమగోదావరి జిల్లా పెదపాడు, ఉండి, పాలకోడేరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో దొంగిలించిన సొత్తును విజయవాడ చిట్టినగర్, ఆకివీడులోని మణప్పురం సంస్థలో, దుంపగడపలోని లీలాసాయిగుప్త తల్లి పులవర్తి భాగ్యవెంకటలక్ష్మీ ఇంట్లో దాచారు. ఏడాది పాటు చోరీలకు పాల్పడి దాచిన బంగారం, వెండిని అమ్మేందుకు భీమవరం వెళుతుండగా.. భీమవరం గ్రామీణ సీఐ నాగరాజుకు అందిన సమాచారం మేరకు.. పాలకోడేరు మండలం గొల్లలకోడేరు వద్ద వాహనాలు తనిఖీ నిర్వహించి.. సాయిగుప్త, అభిరామ్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.10 లక్షల విలువజేసే సుమారు 25 కాసుల బంగారం, మూడు కిలోల వెండి వస్తువులు, ఓ ద్విచక్రవాహనం, ల్యాప్‌ట్యాప్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను గురువారం భీమవరం కోర్టులో హాజరుపరుస్తామని వెల్లడించారు.



కొవ్వాసు రామయ్య మృతదేహం



విషాదంలో కుటుంబ సభ్యులు

మెత్తప్పకోటలో విషాదఛాయలు

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం మండలం మెత్తప్పకోట సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో మరణించిన కొవ్వాసు రామయ్య మృతదేహాన్ని శవపరీక్ష అనంతరం బుధవారం బంధువులకు అప్పగించినట్లు ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు. అదే ప్రమాదంలో స్వల్ప గాయాలతో బయటపడిన అదే గ్రామానికి చెందిన మడకం సురేష్‌బాబు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు వివరించారు. రామయ్య మృతదేహాన్ని సున్నాలగండి గ్రామం వద్దకు ట్రాక్టర్‌పై బుధవారం ఉదయం తీసుకొచ్చారు. అక్కడే పోలవరం సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జీవీకే.సుధాకర్ శవపరీక్ష చేశారు. మృతుడు రామయ్య తల్లి, అక్కాచెల్లెళ్లు, కుటుంబ సభ్యులు బోరున విలపించడం అందరినీ కలచివేసింది. భార్య లేని రామయ్య తల్లిని చెల్లెళ్లను చూసుకుంటూ జీవనం గడుపుతున్నట్లు గ్రామస్థులు చెప్పారు.



ప్రపంచ వాణిజ్య సంస్థ అంతర్జాతీయ వాణిజ్యాన్ని నియంత్రించడానికి ఏర్పాటైంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద అంతర్జాతీయ ఆర్థిక సంస్థ. భాగస్వామ్య దేశాల మధ్య జరిగే వస్తువులు, సేవలు, మేధోసంపత్తి హక్కుల వాణిజ్యాన్ని నియంత్రించడం, వాణిజ్య సంబంధాలను సమర్థంగా నిర్వహించేందుకు అనువైన కార్యాచరణను రూపొందించడం, వివాదాలను పరిష్కరించడం దీని ప్రధాన బాధ్యతలు. తాజాగా జరిగిన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) 11వ మంత్రుల స్థాయి సదస్సు ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు ఏ పరిష్కారం చూపకుండానే ముగిసింది.

ప్రతిభ

ఆహారానికి ఏదీ భద్రత...?

జనరల్ స్టడీస్

డబ్ల్యూటీవో మంత్రుల స్థాయి సదస్సు - 2017

ప్రపంచ వాణిజ్య సంస్థ 11 వ మంత్రులు స్థాయి సదస్సు అర్జెంటీనా రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో డిసెంబరు 10 నుంచి 13 వరకు నాలుగురోజుల పాటు జరిగింది. ఈ సదస్సులో 164 సభ్య దేశాలు పాల్గొన్నాయి. సేవా వాణిజ్యాన్ని సులభతరం చేయడం, ఈ-కామర్స్ సేవలు, మార్కెట్ సౌలభ్యం, దేశీయ నియంత్రణలు, ఆహారభద్రత, వాణిజ్యం - మహిళా సాధికారిత తదితర అంశాలపై చర్చ జరిగింది. ఈ సమావేశాల్లో ఆహారధాన్యాల నిల్వ, రాయితీల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశించినా ఎలాంటి పరిష్కారం చూపకుండానే చర్చలు ముగిశాయి. బహుళైచ్ఛిక వాణిజ్య విధానాల విషయంలోనూ ఎలాంటి పురోగతి లేదు. అయితే మత్స్య సంపదపై రాయితీల నిషేధం విషయంలో సభ్యదేశాలకు ఉన్న నిబద్ధతపై 2019 కల్లా పరిష్కారాన్ని చూపుతామనే భరోసా ఇచ్చేందుకు మంత్రుల స్థాయి సమావేశం ప్రయత్నించింది.

- ✦ భారత్, చైనా సహా పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎలాంటి కఠినతర నిబంధనలు లేకుండా తమ తమ దేశాల్లో ఆహారభద్రతా కార్యక్రమాలను అమలు చేసేందుకు అమెరికా మోకాలడ్డింది. దీంతో చర్చలు విఫలమయ్యాయి. ప్రధాన విషయాలకు సంబంధించి నిర్ణయాలు తీసుకోవడంలో ప్రపంచ వాణిజ్య సంస్థలోని భాగస్వామ్య దేశాలన్నీ మూకుమ్మడిగా ఏకాభిప్రాయానికి రావాల్సి ఉంటుంది. కాబట్టి ఏ ఒక్క దేశమైనా కావాలనుకుంటే ప్రక్రియను ముందుకు సాగనీయకుండా చేయొచ్చు.
- ✦ 2001 లో ప్రపంచ వాణిజ్య సంస్థ ఆవిర్భావం నుంచి నేటి వరకు ఎన్నో అపరిష్కృత సమస్యలకు పరిష్కారాలను ప్రతిపాదించకుండానే 'కొత్త అజెండా'ను తెరమీదకు తెచ్చేందుకు యూరోపియన్ సమాఖ్య (ఈయూ) దేశాలు పావులు కదుపుతున్నాయి. ఆహారభద్రత సాధనలో అభివృద్ధి చెందుతున్న దేశాల హక్కులపై 2001 లో దోహాలో జరిగిన చర్చలు ఎటూ తేలకుండా ముగిశాయి. నాటి నుంచి నేటి వరకు ఆహారభద్రత హక్కుల విషయమై ఇతమిద్ధంగా తేలిందేమీ లేదు. సమావేశం అనంతరం వెలువరించాల్సిన మంత్రుల ప్రకటన కూడా రద్దయ్యింది. దీంతో భారత్ సహా పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు తీవ్ర నిరాశకు గురయ్యాయి.
- ✦ సభ్య దేశాలు నిరాశకు గురవడం కొంత కటువైందైనప్పటికీ అవి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డబ్ల్యూటీఓ డైరెక్టర్ జనరల్ రాబర్టో అజ్వేడో వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ సమావేశాలకు భారత్ తరపున కేంద్రమంత్రి సురేశ్ ప్రభు హాజరయ్యారు. ఒక సభ్య దేశం వైఖరి కారణంగా ఎలాంటి నిర్ణయాలు లేకుండానే సమావేశాలు ముగిశాయని భారత్ ప్రకటించింది.

భద్రతలేని ఆహార హక్కు

ప్రపంచ వాణిజ్య సంస్థ మంత్రులు స్థాయి సమావేశంలో అమెరికా వ్యతిరేకత చూపినా భారత్ మాత్రం ఆహార భద్రత హక్కు విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాల పక్షాన గట్టిగానే వాదించింది. గత దశాబ్ద కాలంగా తమ దేశాల్లోని వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధరలను చెల్లిస్తూ రైతులకు అండగా నిలుస్తున్న అమెరికా, యూరోపియన్ సమాఖ్య దేశాలు ఇదే విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మాత్రం మోకాలడ్డుతున్నాయి.

- ✦ సంపన్న దేశాలకు అనుకూలంగా రూపొందించుకున్న డబ్ల్యూటీఓ నిబంధనలను సవరించాలని భారత్, చైనా ప్రతిఘటించినా అడుగు ముందుకు పడలేదు. ఆది నుంచి భారత్ ఈ దిశగా పట్టిన పట్టు విడవకుండా కృషి చేస్తోంది. సన్న, చిన్నకారు, అల్పాదాయవర్గ రైతుల నుంచి సరైన మద్దతు ధరకు ధాన్యాన్ని సేకరించి, తిరిగి దారిద్ర్యరేఖకు దిగువనున్న ప్రజలకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేసే యంత్రాంగాన్ని మెరుగుపరిచి, పటిష్టవంతం చేసే దిశగా భారత్ సుదీర్ఘ కసరత్తు చేస్తోంది.
- ✦ డబ్ల్యూటీఓ నిబంధనల ప్రకారం రైతుల నుంచి సేకరించే వ్యవసాయ ఉత్పత్తులకు, ఆహార రాయితీల కింద ఇచ్చే మొత్తం సొమ్ము, ఆ దేశ మొత్తం ఆహార ఉత్పత్తుల విలువలో (1986-88 నాటి ధరల ప్రకారం) 10 శాతానికి మించకూడదు. ఒకవేళ అభివృద్ధి చెందుతున్న దేశాలు రైతులకు అంతకు మించి చెల్లించినట్లయితే దాన్ని వాణిజ్య నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తారు. ఇలాంటి పరిమితులు తాము అమలు చేస్తున్న 'ఆహారభద్రత' కార్యక్రమానికి విఘాతం కలిగిస్తాయంటూ భారత్ తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది. 2013 లో బాలిలో జరిగిన సమావేశంలో కూడా దీనిపై చర్చించారు. అప్పట్లో ఈ విషయమై ఒక అంగీకారానికి వచ్చి 'శాంతి నిబంధన' ప్రతిపాదించారు. ఇది ఒకరకంగా భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు రక్షణ కవచం లాంటిది. దీని ప్రకారం ఏ దేశమైనా ఈ 10 శాతానికి మించి చెల్లించరాదనే నిబంధనను ఉల్లంఘిస్తే దాన్ని డబ్ల్యూటీఓలో సవాలు/ ఫిర్యాదు చేయకూడదనేది ప్రధాన సారాంశం. ఈ శాంతి నిబంధన ఉన్నా భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల సార్వభౌమ హక్కులను కాలరాసి, రైతులకు ఆహార రాయితీలు ఇవ్వకుండా, కనీస మద్దతు ధర చెల్లించకుండా సంపన్న రాజ్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. కాబట్టే భారత్ ఈ బ్యూనస్ ఎయిర్స్ సమావేశంలో 'శాంతి నిబంధన' లోని అంశాలను మరింత మెరుగుపరచి, ఆహార భద్రత సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని కనుక్కునేలా దీన్ని తీర్చిదిద్దాలని డిమాండ్ చేసింది. తృతీయ ప్రపంచ దేశాలు సైతం ఈ విషయంలో భారత్‌లో గొంతు కలిపాయి.
- ✦ నిజానికి అమెరికా, యూరోపియన్ దేశాలు ఉమ్మడిగా తమ రైతులకు ఏటా 16 వేల కోట్ల డాలర్లకు పైగా భారీ రాయితీలు ఇస్తున్నాయి. స్థూలదేశీయోత్పత్తిలో వ్యవసాయరంగం నుంచి సమకూరుతున్న వాటాలో అమెరికా తిరిగి సగభాగాన్ని రైతుల సబ్సిడీల కోసమే కేటాయిస్తోంది. అమెరికాతో పోలిస్తే భారత్ రాయితీల రూపంలో రైతులకు చెల్లిస్తున్నది అత్తెసరు మాత్రమే.

> *అమెరికా సేంద్రియ సాగు, పర్యావరణ పరిరక్షణ పేరు చెప్పుకుని వ్యవసాయ స్థూలదేశీయోత్పత్తి వాటాలో 40 శాతం నిధులను 'గ్రీన్ బాక్స్' పేరిట రాయితీల రూపంలో రైతులకు చెల్లిస్తోంది. అయినా ప్రపంచవాణిజ్య సంస్థ వీటిని మార్కెట్ విచ్ఛిన్నకర రాయితీలుగా పరిగణించకపోవడం దారుణం. అమెరికా లాంటి సంపన్న దేశాలు 'గ్రీన్ బాక్స్' పేరుతో డబ్ల్యూటీఓ నిబంధనలకు చిక్కకుండా తప్పించుకుంటున్నాయి.*

- ✦ సగానికిపైగా జనాభాకు వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న, మూడోవంతు జనం అర్ధాకలితో అలమటిస్తున్న భారత్ లాంటి దేశంలోని పరిస్థితులు అమెరికాకు పూర్తి భిన్నం. రైతులకు మద్దతు ధరలు చెల్లించడంతో పాటు వ్యవసాయ ఉత్పాదకాలపై రాయితీలు ఇవ్వక తప్పదు. ఈ తరహా చర్యలు ప్రపంచ వాణిజ్య సంస్థ నిర్దేశించిన 'మార్కెట్ విచ్ఛిన్నకర' రాయితీల పరిధిలోకి వస్తాయని ఐరోపా, అమెరికా దేశాలు గొంతు చించుకుంటున్నాయి. ఈ రకమైన సంపన్న దేశాల దాష్టీకాన్ని భారత్ మొదటి నుంచీ అనేక వేదికలపై ఎప్పటికప్పుడు ఎండగడుతూనే వస్తోంది.
- ✦ 2013 లో బాలిలో, 2015 లో నైరోబీ సదస్సుల్లో వర్ధమాన దేశాలను కూడగట్టుకుని, న్యాయమైన తమ హక్కులు, బడుగు బలహీన వర్గాల ఆహార భద్రత కోసం, రైతులను ఆదుకోవడానికి భారత్ తన వాదనను గట్టిగానే వినిపించింది. ఆహార భద్రత హక్కుల కోసం కృషి చేస్తున్న అభివృద్ధి చెందుతున్న దేశాలపై 10 శాతం పరిమితి నిబంధనను ఎత్తేయాలని గతంలోనే 45 దేశాలను కూడగట్టుకుని డబ్ల్యూటీఓలో వాదించింది. కానీ అమెరికా, యూరోపియన్ సమాఖ్య దేశాలు భారత్ వాదనను తోసిపుచ్చాయి. ఈసారి మాత్రం వర్ధమాన దేశాల గళం మరింత పదునెక్కింది. చైనాతో సహా 100 కు పైగా దేశాలు మద్దతు ఇచ్చాయి. ఎలాంటి నిర్ణయం లేకుండా సమావేశాలు ముగిసినా అమెరికా తీరుపై ధిక్కార స్వరం మరింత పెరగడం ఆ దేశ వైఖరిలో మార్పు తెస్తుందేమో చూడాలి.

ప్రపంచ వాణిజ్యం - మహిళా సాధికారత

ఆహారభద్రత విషయంలో ఎటూ నిర్ణయం తీసుకోలేకపోయిన డబ్ల్యూటీఓ - 17 సమావేశం 'మహిళా సాధికారత' పట్ల మాత్రం చారిత్రాత్మక నిర్ణయాన్ని ప్రకటించింది. ప్రపంచంలో నాలుగింట మూడోవంతు దేశాలు సభ్యులుగా ఉన్న డబ్ల్యూటీఓ వర్తక, వాణిజ్యాల్లో మహిళల భాగస్వామ్యంపై ఎదురవుతున్న అవరోధాలను తొలగించడానికి సత్వర చర్యలకు ఉపక్రమించాలని నిర్ణయించింది. లింగ సమానత, మహిళా సాధికారత కోసం విశేషంగా మద్దతు ఇస్తున్న భారత్ డబ్ల్యూటీఓలో మైనార్టీ వర్గంలో ఉన్నా, బాగా ప్రభావితం చేసేదిగా ఉండి కూడా ఈ విషయంపై సానుకూలంగా వ్యవహరించలేదు. లింగ భేదం వాణిజ్య సంబంధమైన విషయం కాదని, వాణిజ్య సంబంధిత అంశాలకు - మహిళా సాధికారకతకు లంకె పెట్టడం సమంజసం కాదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

- ✦ అభివృద్ధి చెందిన దేశాలు అవలంబిస్తున్న లింగపరమైన విధానాల్లో ఉన్నత ప్రమాణాలుగా పేర్కొంటున్నవి అభివృద్ధి చెందుతున్న దేశాల ఎగుమతులకు అడ్డుకట్ట వేయడమేకాక అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ మహిళలకు ప్రోత్సాహం కల్పించడాన్ని పరోక్షంగా నియంత్రిస్తున్నాయి. అలాగే లింగసంబంధమైన అంశాలపై చర్యలు చేపట్టడానికి డబ్ల్యూటీఓ వేదికగా, ఒక సరైన వేదిక అవసరమని భారత్ అభిప్రాయపడింది. ఎందుకంటే ప్రపంచ వాణిజ్య సంస్థ అనేది కేవలం వాణిజ్య సంబంధ సంస్థ. వాణిజ్యేతర అంశాలైన కార్మికులు, పర్యావరణం- ప్రమాణాలు మొదలైనవి చర్చించడానికి డబ్ల్యూటీఓలో మరొక విభాగాన్ని ఏర్పాటు చేయడం సమంజసమని భారత్ అభిప్రాయం.
- ✦ ప్రపంచ వాణిజ్య సంస్థ చరిత్రలోనే తొలిసారిగా 119 సభ్య దేశాలు 'మహిళలు - వాణిజ్యం' అనే బ్యూనస్ ఎయిర్స్ డిక్లరేషన్‌కు మద్దతు ఇచ్చేందుకు అంగీకరించాయి. మహిళల వాణిజ్య భాగస్వామ్యంలోని ప్రతిబంధకాలను తొలగించేందుకు, ఆర్థిక - వాణిజ్య రంగంలో మహిళా సాధికారతను వేగవంతం చేసేందుకు ఇది దోహదం చేస్తుంది. డిక్లరేషన్‌లో పొందుపర్చిన కార్యాచరణ మహిళలకు మరిన్ని మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని డబ్ల్యూటీఓ పేర్కొంది. లింగ సమానత ద్వారా సాధికారత సాధ్యమవుతుందని, తద్వారా ఐక్య రాజ్య సమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ఇవి దోహదం చేస్తాయని పేర్కొంది.
- ✦ వాణిజ్యంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా మహిళలకు సమానావకాశాలను కల్పించడం సాధ్యమవుతుందని, తద్వారా ప్రపంచ స్థూల దేశీయోత్పత్తికి 2025 నాటికి 28 ట్రిలియన్ డాలర్లు జతకూడతాయని ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్చనా గోంజాలెజ్ అభిప్రాయపడ్డారు.
- ✦ ఈ డిక్లరేషన్ మహిళల అభ్యున్నతికి ప్రతిబంధకంగా నిలుస్తున్న డబ్ల్యూటీఓ నిబంధనలను గురించి వెల్లడించడంలో విఫలమైందని, దీనికి బదులు అసమానతలు, అణిచివేతలకు దోహదం చేస్తున్న డబ్ల్యూటీఓ విధానాలకు ముసుగువేసి చూపించినట్లు ఉందని 160 దేశాలకు చెందిన మహిళా హక్కుల సంస్థలు ఒక సంయుక్త ప్రకటనలో ఖండించాయి. ప్రపంచంలోని అన్ని మహిళా హక్కుల సంఘాలు ఈ డిక్లరేషన్‌ను తిరస్కరించాయని, డబ్ల్యూటీఓ అనుసరిస్తున్న హానికారక విధానాల నుంచి దృష్టి మళ్లించడానికి చేపపిల్లలకు వేసిన ఎరగా దీన్ని ప్రకటించారని మహిళల న్యాయం, సంక్షేమ విభాగం, ఆసియా ఎకనామిక్ ఫోరం, గ్లోబల్ కో-ఆర్డినేటర్ కేట్ లాపిన్ అభిప్రాయపడ్డారు.

> *ప్రపంచ వ్యవసాయ వాణిజ్య నిబంధనలను ప్రజాస్వామికంగా సంస్కరించాలన్నదే భారత్ ప్రధాన ఆశయం. ఆకలి, దారిద్ర్యం నుంచి ప్రపంచానికి విముక్తి కల్పించాలనేది ఐక్య రాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో కీలకమైంది. ఆహారభద్రత కల్పనలో అభివృద్ధి చెందుతున్న దేశాల హక్కులను గౌరవించాల్సిన ఆవశ్యకత సుస్పష్టం.*

- ✦ డబ్ల్యూటీఓ సభ్య దేశాలు, మద్దతుదారులు మాత్రం వాణిజ్య, ఆర్థిక లావాదేవీల్లో మహిళల వెనుకబాటుతనాన్ని సరిదిద్ది, వారిని ప్రోత్సహించేదిగా ఉందని, మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇది దోహదం చేస్తుందని చెబుతున్నాయి. లింగ సమానత్వాన్ని దృష్టిలో ఉంచుకుని సభ్య దేశాలు విధానాలను రూపొందించి, మదింపు చేస్తాయని, దీని ప్రగతి నివేదిక 2019 లో విడుదల చేసే అవకాశం ఉందని ప్రపంచ వాణిజ్య సంస్థ పేర్కొనడం గమనార్హం. భారత్ మాత్రం ఈ చర్యను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది.

ఈ-కామర్స్

ఈ-కామర్స్ సేవలపై ప్రపంచవ్యాప్త నిబంధనలు ఉండకూడదని భారత్ వాదిస్తోంది. ఇలాంటి నిబంధనలకు తాము వ్యతిరేకం కాకపోయినా ఇవి తమకు ఇబ్బందికరంగా ఉంటాయని భారత్ అభిప్రాయం. ఈ-ట్రాన్స్‌మిషన్‌పై సభ్యదేశాలు కస్టమ్ డ్యూటీ విధించడాన్ని నిషేధించేందుకు ఉద్దేశించిన మారటోరియాన్ని విస్తరించడంపై అంగీకారం తెలిపేందుకు భారత్ ముందస్తు షరతులు విధించింది.

- ✦ 1998 లో జరిగిన రెండో మంత్రుల స్థాయీ సమావేశంలో 'గ్లోబల్ ఈ-కామర్స్ డిక్లరేషన్'లో ఈ మారటోరియాన్ని అమల్లోకి తెచ్చారు. దీని ప్రకారం సభ్య దేశాలు తమ ఈ-ట్రాన్స్‌మిషన్ కార్యకలాపాలపై కస్టమ్స్ సుంకం విధించడాన్ని కొనసాగించవచ్చని నిర్ణయించారు. ఇది తాత్కాలికమే అయినా ప్రతి రెండేళ్లకోసారి జరిగే మంత్రుల స్థాయీ సమావేశంలో దీన్ని పొడిగించుకుంటూ వస్తున్నారు. అభివృద్ధి చెందిన దేశాలు మాత్రం ఈ-ట్రాన్స్‌మిషన్ కార్యకలాపాలపై కస్టమ్స్ సుంకం విధించేందుకు 'శాశ్వత మారటోరియం' విధించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ చర్య అభివృద్ధి చెందుతున్న దేశాలు చూపుతున్న చొరవను ప్రభావితం చేసేదిగా ఉందని భారత్ అభిప్రాయపడింది. ఇలాంటి చర్యలు భారత్ సహా పలు దేశాల్లోని దేశీయ ఔషధ తయారీ పారిశ్రామిక రంగానికి హాని కలిగించవచ్చనేది అభివృద్ధి చెందుతున్న దేశాల వాదన. ప్రపంచ వాణిజ్య సంస్థకు చెందిన విభాగాల్లో రూపొందించిన వర్క్ ప్రోగ్రామ్ మార్గదర్శకాలు, ప్రస్తుతం అమల్లో ఉన్న విధానాన్ని అనుసరించి ఈ-కామర్స్‌పై చర్చలు కొనసాగించడానికి ఇతర సభ్యదేశాల అంగీకారాన్ని, మద్దతును బట్టి మారటోరియంపై భారత్ తన నిర్ణయాన్ని వెల్లడిస్తుందని పేర్కొంది.
- ✦ మొత్తానికి ఈ-కామర్స్‌పై ప్రతిబంధకంగా పరిణమిస్తున్న నిబంధనలను ఎత్తివేయాలని భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు అభిప్రాయపడుతున్నాయి. అలాగే తమ దేశ సాఫ్ట్‌వేర్, అకౌంటింగ్ నిపుణులు, నర్సులకు ఇతర దేశాల్లో అవకాశాలు కల్పించాలని భారత్ కోరుతోంది.



రచయిత:
డాక్టర్ జి.వి.ఎల్. విజయ్‌కుమార్

ఏపీ టెట్

చరిత్ర

ప్రతిభ

- సుమారు 100 కోట్ల సంవత్సరాల కిందట భూమి ఏర్పడింది.
- భూమిపై ఆవిర్భవించిన తొలి జీవ పదార్థం లార్వా.
- ప్లాజిల్లేటాను ప్రాథమిక జీవరాశిగా పేర్కొంటారు.
- ఏప్స్ అనే తోకలేని కోతి నుంచి మానవుడు ఆవిర్భవించాడు.
- మానవుడు నివసించిన తొలి ఖండం ఆఫ్రికా. ఆఫ్రికాలోని ఆదిమానవుడిని ఆస్ట్రలోపిథికస్ అంటారు.

భారత్‌లో ఆవిర్భవించిన తొలి సామ్రాజ్యం..?



రచయిత
బొత్స నాగరాజు
విషయ నిపుణులు

ఆహార సేకరణ నుంచి ఆహార ఉత్పత్తి వరకు ఆదిమానవుడు

- భారతదేశంలో నివసించిన ఆదిమానవుడిని రామా పిథికస్ అంటారు.
- ఐరోపాలో నివసించిన ఆదిమానవుడిని నియాండెర్తల్ నరుడు అంటారు.
- మొదటి మేధావి మానవుడిగా హోమో ఎరక్టస్‌ను పేర్కొంటారు.
- ఆధునిక మానవుడి శాస్త్రీయ నామం హోమో సెపియన్
- మానవుడి అభివృద్ధి మొత్తం 5 దశల్లో జరిగింది.
- ఆదిమానవుడి కాలాన్ని మూడు యుగాలుగా విభజించారు. అవి: 1. ప్రాచీన శిలాయుగం, 2. మధ్య శిలాయుగం, 3. నవీన శిలాయుగం
- ప్రాచీన, మధ్య శిలాయుగాల్లో మానవుడు వేటను ప్రధాన వృత్తిగా చేసుకుని సంచార జీవితాన్ని గడిపేవాడు. ఈ యుగాల్లో మానవుడు ఆహార సేకరణ/ ఆహార అన్వేషణ దశలో ఉండేవాడు.
- ప్రాచీన శిలాయుగంలో మానవుడు పెద్ద పెద్ద బండరాళ్లను పెచ్చులుగా కొట్టి ఆయుధాలుగా ఉపయోగించేవాడు. వాటినే ఛేదకాలు, దరకాలు, చేతి గొడ్డళ్లు అనేవారు.
- మానవుడు చేతి గొడ్డలిని వాడిన కాలం ప్రాచీన శిలాయుగం.
- మధ్య శిలాయుగంలో అతిచిన్న రాళ్లను ఆయుధాలుగా ఉపయోగించాడు. కాబట్టి ఈ యుగాన్ని సూక్ష్మ శిలాయుగం అంటారు.
- సూక్ష్మ శిలాయుగంలో మానవుడు నిప్పును కనుక్కున్నాడు. జంతువులను మచ్చిక చేసుకున్నాడు.
- నవీన శిలాయుగంలో మానవుడు వ్యవసాయాన్ని ప్రధాన వృత్తిగా మార్చుకుని, స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఈ యుగంలో రాతి గొడ్డలి, రాతి కొడవలి, రాతి పారలను ఆయుధాలుగా ఉపయోగించాడు.
- మధ్యప్రదేశ్‌లోని నంద్రా గ్రామంలో రాతి పనిముట్లు లభించాయి.
- జమ్మూ కశ్మీర్‌లో రాతితో చెక్కిన పరికరాలు లభించాయి.
- ఝార్ఖండ్‌లో పురాతన రాతి పనిముట్లు లభించాయి.
- తమిళనాడులోని గుడియం గుహల నుంచి సూక్ష్మరాతి పరికరాలను వెలికితీశారు.
- మహారాష్ట్రలోని నెవాస ప్రాంతంలో నవీన శిలాయుగపు పనిముట్లు లభించాయి.
- ఆదిమానవుడు ఉపయోగించిన రాతి గొడ్డలి ఆంధ్రప్రదేశ్‌లోని పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కామకూర్‌లో లభించింది.
- కర్నూలు జిల్లాలోని బెలూమ్ గుహలు, బేతంచెర్ల, బనగానపల్లి ప్రాంతాల్లో ఆదిమానవుడి ఆనవాళ్లను కనుక్కున్నారు.
- ఎముకలతో చేసిన పనిముట్లు కర్నూలు జిల్లాలోని ముచ్చర్ల చింతమానులో లభించాయి (ఇవి భారత ఉపఖండంలో ఇంకెక్కడా దొరకలేదు).
- ఆదిమానవుడు గుహల్లో చిత్రాలను గీసేవాడు.
- వై.ఎస్.ఆర్. కడప జిల్లా, ముద్దనూరు మండలంలోని చింతకుంట గ్రామంలో ఆదిమానవుడి పది రాతి చిత్రకళా స్థావరాలు లభించాయి.
- చింతకుంట రాతి చిత్రకళా స్థావరాల్లో మొత్తం 200 చిత్రాలున్నాయి. వీటిలో 10 తెలుపు రంగులో ఉండగా మిగిలినవి ఎరుపు రంగులో ఉన్నాయి.
- ఎరుపు రంగు చిత్రాల్లో ఒకే గుహలోని మూపురం ఉన్న ఎద్దు చిత్రం ప్రసిద్ధి చెందింది. ఈ గుహను స్థానికంగా ఎద్దుల, ఆవుల గుండు అని పిలుస్తారు.

ఆంధ్రదేశంలో ఉన్న ఇతర రాతి చిత్ర కళా స్థావరాలు

- బొల్లారం, కాలువబుగ్గ, కేతవరం, ఆథోని - కర్నూలు జిల్లా.
  - శ్రీకాళహస్తి, రేణిగుంట, వెంబ ఖండ్రిగ - చిత్తూరు
  - నాయుడుపల్లె, సింగరాయకొండ - ప్రకాశం
  - వేల్పుమడుగు, భోగదవి తెనగల్ - అనంతపురం
  - చింతకుంట, దాపల్లి - కడప
  - కావలి, నందిపాడు - నెల్లూరు
  - వినుకొండ - గుంటూరు
- 12000 సంవత్సరాల నుంచి మానవులు వ్యవసాయం చేసి, పంటలు పండించడం ద్వారా ఆహారాన్ని పొందుతున్నారు.

- **భారతదేశంలో ఆదిమానవుల ప్రారంభ వ్యవసాయ ఆనవాళ్లు లభించిన ప్రాంతాలు**
  బెలూచిస్థాన్ - 9000 సంవత్సరాల కిందటి ఆనవాళ్లు
  కశ్మీర్ - 5000 సంవత్సరాల కిందటి ఆనవాళ్లు
  బిహార్ - 4000 సంవత్సరాల కిందటి ఆనవాళ్లు
- ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో 5000 సంవత్సరాల కిందటి బూడిద దిబ్బలు బయటపడ్డాయి.
- అనంతపురం జిల్లాలోని పాళ్వాయిలో బూడిద దిబ్బలు/ మసి దిబ్బలు వెలుగు చూశాయి.
- ఆదిమానవులు అటవీ ప్రాంతంలో పోడు వ్యవసాయం చేసేవారు.
- మన రాష్ట్రంలో నేటికీ యానాదులు, చెంచులు సంచార జీవితాన్ని గడుపుతున్నారు.
- ఆదిమానవులు పురుషులు, స్త్రీలు, పిల్లలు అంతా కలిసి గుంపులు, గుంపులుగా వేటకు వెళ్లేవారు.
- వేట బాగా జరగాలని జంతువులు, వృక్షాలు, నదులు, పర్వతాలను పూజించేవారు.
- ఆదిమానవుడు తన ఆహార పదార్థాలను మట్టి పాత్రలు/ కుండల్లో దాచుకునేవాడు.
- చనిపోయిన వారికి రాక్షసగుళ్లు పేరుతో సమాధులు నిర్మించేవారు.

సామ్రాజ్యాలు, గణతంత్రాల ఆవిర్భావం

- 2700 సంవత్సరాల కిందట ప్రజలు గంగా, యమునా పరీవాహక ప్రాంతాల్లో స్థిరపడ్డారు.
- సంస్కృత భాషలో జన అంటే తెగ, పదం అంటే స్థిరపడిన ప్రాంతం.
- మహా జనపదాల కాలంలో దిల్లీ, ఆత్రంజిఖేర, కౌశాంబి, పట్నా, అయోధ్య, రాజగర్ లాంటి నగరాలు అభివృద్ధి చెందాయి. (రెండో నగరీకరణ).
- గమనిక: సింధు నాగరికత కాలాన్ని తొలి నగరీకరణగా పేర్కొంటారు.
- 16 మహాజనపదాల్లో 14 జనపదాలు రాచరిక వ్యవస్థను, 2 జనపదాలు గణతంత్రాలను కలిగి ఉండేవి.
- వజ్జి, మల్ల నాటి రెండు గణతంత్రాలు.
- ఎన్నికైన రాజ్యాధినేత ఉన్న రాజ్యాలను గణతంత్రాలుగా పేర్కొంటారు.
- భారతదేశంలో ఆవిర్భవించిన తొలి సామ్రాజ్యం మగధ సామ్రాజ్యం.
- వజ్జి గణరాజ్యం మగధకు ఉత్తర దిక్కులో ఉండేది.
- మహిళలు, బానిసలు, సేవకులకు గణరాజ్య సభల్లో పాల్గొనే హక్కు లేదు.
- బుద్ధుడు, మహావీరుడు గణ రాజ్యాలకు చెందినవారే.
- **మగధ తొలి సామ్రాజ్యంగా ఆవిర్భవించడానికి దోహదపడిన అంశాలు:**
  - శక్తిమంతమైన రాజులు, వంశాల పాలన
  - ఇనుప గనులు విస్తారంగా ఉండటం
  - సారవంతమైన నదీ తీరప్రాంతాలు ఉండటం.
- మగధ రాజ్యం గంగానదికి రెండు వైపులా విస్తరించి ఉంది.
- మగధ దక్షిణ భాగంలో ఇనుప గనులు విస్తారంగా ఉన్నాయి.
- హర్యంక వంశానికి చెందిన బింబిసారుడు, అజాతశత్రువు మగధను బలమైన రాజ్యంగా తీర్చిదిద్దారు.
- మహాపద్మనందుడి కాలంలో మగధ వాయవ్యం నుంచి ఒడిశా వరకూ విస్తరించింది.
- మహాజనపదాల కాలంలో భూయజమానులను గృహపతి/ గాహపతి అనేవారు.
- వ్యవసాయ కూలీలను భర్తుకా అని, బానిసలను దాసులు అని పిలిచేవారు.
- యుద్ధంలో ఓడిపోయిన సైనికులను దాసులుగా మార్చేవారు.
- రాజులు సిరిసంపదలతో ఉండటానికి పన్నులు అధికంగా వసూలు చేయడంతోపాటు నిత్యం ఇతర రాజ్యాలపై దండయాత్రలు చేసేవారు.
- పట్టణాల్లో ఉండే వృత్తిపనివారు ఒకరోజు రాజు పొలంలో ఉచితంగా పని చేయడం ద్వారా వృత్తి పన్ను చెల్లించేవారు.
- రైతులు రాజుకు చెల్లించే భూమి శిస్తును 'భాగ' అనేవారు. ఇది పంటలో 1/6 వంతు.
- గోండుల గ్రామపెద్ద పట్లాను పోలి ఉండేవాడు.
- గ్రామంలో అధిక ధనవంతుడైన వ్యక్తిని గ్రామపెద్దగా నియమించేవారు.
- గ్రామపెద్ద పాలనా, న్యాయ, పోలీస్ విధులు నిర్వహించేవాడు.
- నాణేల ముద్రణ, ఉపయోగం మహాజనపదాల కాలంలోనే ప్రారంభమైంది.

మొదటి సామ్రాజ్యాలు

- మౌర్య వంశ, మౌర్య రాజ్య స్థాపకుడు చంద్రగుప్త మౌర్యుడు. గొప్పవాడు అశోకుడు.
- మౌర్యుల పాలనకు ఆధారాలు: అశోకుడి శాసనాలు, అర్థశాస్త్రం, ఇండికా.
- కౌటిల్యుడు సంస్కృత భాషలో రచించిన అర్థశాస్త్రం ఒక పాలనాశాస్త్రం.
- గ్రీకు రాయబారి మెగస్తనీస్ చంద్రగుప్త మౌర్యుడి ఆస్థానంలో ఇండికా గ్రంథాన్ని గ్రీకుభాషలో రాశాడు.
- మౌర్యుల కాలంలో రాజ్యం నేటి అఫ్గనిస్థాన్ నుంచి దక్షిణాన కర్ణాటక వరకు, తూర్పున బెంగాల్ వరకు విస్తరించింది.
- మౌర్యుల రాజధాని పాటలీపుత్రం.
- పాటలీపుత్రం, దాని చుట్టూ ఉన్న ప్రాంతం చక్రవర్తి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉండేది.
- అధికారుల పనితీరును వేగుల ద్వారా రాజులు తెలుసుకునేవారు. దూతల ద్వారా రాజు తన సందేశాలను అధికారులకు పంపేవాడు.
- తక్షశిల, ఉజ్జయిని, సువర్ణగిరి, తోశాలి లాంటి ప్రాదేశిక రాజధానులను రాజకుమారులు పరిపాలించేవారు. వారిని గవర్నర్లు/ కుమారామాత్యులుగా పిలిచేవారు.
- మౌర్యుల కాలంలో సువర్ణగిరి బంగారు గనులకు ఎంతో ప్రసిద్ధి చెందింది.
- తక్షశిలలో విదేశీ వస్తువులు విరివిగా దొరికేవి.
- భారతదేశంలో తొలి శాసనాలు వేయించింది అశోకుడు. అతడి శాసనాలు ఎక్కువగా ప్రాకృత భాషలో, బ్రాహ్మీలిపిలో ఉన్నాయి.
- 'నేను చక్రవర్తి అయిన 8 సంవత్సరాలకు కళింగయుద్ధం (క్రీ.పూ. 261) చేశాను' అని అశోకుడు తన 13 వ శిలాశాసనంలో (దౌళి/ జౌగాడ శాసనం) పేర్కొన్నాడు.
- కళింగ యుద్ధంలో లక్షమందికి పైగా మరణించడంతో అశోకుడు హృదయ పరివర్తన చెంది, యుద్ధాన్ని త్యజించాడు.
- ఉపగుప్తుడి సలహాతో అశోకుడు బౌద్ధ మతాన్ని స్వీకరించాడు.
- ధమ్మ/ ధర్మ సిద్ధాంతాన్ని ప్రచారం చేయడానికి ధర్మ మహామాత్రులు అనే ఉద్యోగులను నియమించాడు.
- ధమ్మ ప్రాకృత పదం కాగా ధర్మ అనేది సంస్కృత పదం.
- సిరియా, ఈజిప్ట్, గ్రీస్, శ్రీలంక దేశాల్లో ధర్మాన్ని ప్రచారం చేయడానికి రాయబారులను పంపాడు.
- మనుషులకే కాకుండా జంతువులకు కూడా వైద్య సదుపాయాలు కల్పించిన తొలి భారతీయ చక్రవర్తిగా అశోకుడు పేరొందాడు.
- మౌర్యులకు సామంతులుగా ఉన్న శాతవాహనులు దక్కన్‌లో స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు.
- శాతవాహనుల రాజధాని ధాన్యకటకం (అమరావతి).
- గౌతమీపుత్ర శాతకర్ణి, వాశిష్ఠీ పుత్ర పులోమావి, యజ్ఞశ్రీ శాతకర్ణి లాంటి రాజులు గొప్పవారు.
- అమరావతి, భట్టిప్రోలు, వడ్డమానుకొండ లాంటి ప్రాంతాల్లో బౌద్ధ ఆలయాలు, స్తూపాలను నిర్మించారు.
- రోమ్, బెంగాల్‌తో సముద్ర వ్యాపారం చేశారు.
- రోమన్ నాణేలు, రోమ్ శైలి కుండలు వీరి రాజ్య భాగాల్లో లభించాయి.
- పులోమావి పాలనాకాలం నాటి మ్యాకదోని శాసనం కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి జిల్లాలో దొరికింది.
- పులోమావి 8 వ పాలనా సంవత్సరంలో మాక్యదోని శాసనం వేశారు.
- పులోమావి మహాసేనాపతి స్కందనాగుని శాతవాహన ఆహారంలో కుమారదత్త అధిపతిగా ఉన్న వేపుర గ్రామంలో కాంత తెగ నాయకుడు సమ్వ ఒక చెరువును తవ్వించినట్లు మాక్యదోని శాసనం పేర్కొంటోంది.
- వేపుర గ్రామాధిపతి - కుమారదత్త. కాంత తెగ నాయకుడు - సమ్వ
- శాతవాహనులను ఓడించి క్షాంతామూలుడు ఇక్ష్వాక రాజ్యాన్ని స్థాపించాడు.
- ఇక్ష్వాకుల రాజధాని విజయపురి (కృష్ణానది తీరం, నాగార్జున కొండ ప్రాంతం)
- వీరు రాముడి వంశానికి చెందినవారుగా చెప్పుకున్నారు.
- క్షాంతామూలుడు, వీరపురుషదత్తుడు లాంటి రాజులు అశ్వమేధ, రాజసూయ యాగాలు చేశారు.
- నాగార్జున కొండవద్ద అతిపెద్ద ఆరామం, స్తూపం నిర్మించారు. (స్తూపం, చైత్యం, విహారం ఈ మూడూ ఉన్న ప్రాంతాన్ని ఆరామం అంటారు.)

భారత ఉపఖండంలో కొన్ని ముఖ్యమైన సామ్రాజ్యాలు

కుషాణులు

- కుషాణులు రెండువేల సంవత్సరాలకు పూర్వమే చైనా ప్రాంతం నుంచి వలస వచ్చి అఫ్గనిస్థాన్ కేంద్రంగా తమ సామ్రాజ్యాన్ని స్థాపించారు.
- కుషాణుల్లో గొప్పవాడు కనిష్కుడు.
- కనిష్కుడు క్రీ.శ. 78 లో సింహాసనాన్ని అధిష్ఠించి, శక యుగాన్ని ప్రారంభించాడు.
- శక యుగాన్నే శాలివాహన శకం లేదా శతాబ్దంగా పేర్కొంటున్నారు.
- భారతదేశం శక క్యాలండర్‌ను అనుసరిస్తోంది. శక యుగం సాధారణ యుగానికి 78 సంవత్సరాల తర్వాత ఉంటుంది.
- భారత్‌లో కుషాణుల కాలంలో ఇరాన్, చైనా, రోమ్ దేశాలతో వ్యాపారం బాగా జరిగేది.

గుప్తులు

- గుప్తులు బిహార్‌లోని పాటలీపుత్రాన్ని రాజధానిగా చేసుకుని సామ్రాజ్యాన్ని స్థాపించారు.
- గుప్త వంశ మూలపురుషుడు శ్రీగుప్తుడు. (క్రీ.శ. 320 లో శ్రీగుప్తుడు గుప్త సామ్రాజ్యాన్ని స్థాపించినట్లు చెబుతారు)
- గుప్త రాజ్య స్థాపకుడు మొదటి చంద్రగుప్తుడు.
- గుప్త రాజుల్లో గొప్పవాడు రెండో చంద్రగుప్తుడు. ఇతడి బిరుదు విక్రమార్కుడు.
- రెండో చంద్రగుప్తుడి కాలాన్ని స్వర్ణయుగంగా పేర్కొంటారు.
- రెండో చంద్రగుప్తుడి ఆస్థానంలో నవరత్నాలు అనే కవులు ఉండేవారు. నవరత్నాల్లో కాళిదాసు గొప్పకవి.
- **ముఖ్యమైన గుప్తరాజులు:** మొదటి చంద్రగుప్తుడు, సముద్రగుప్తుడు, రెండో చంద్రగుప్తుడు, కుమారగుప్తుడు, స్కంధగుప్తుడు.



ఇదీ 'దారి'ద్ర్యం

ఇది బుట్టాయగూడెం మండలం మారుమూల గ్రామం గొట్టాలరేవు రహదారి. ఐదేళ్ల కిందట ఈ రహదారి అభివృద్ధికి రూ.35 లక్షలు మంజూరు చేశారు. గొట్టాలరేవు, పూచికగొంది గ్రామాల ప్రజలు బాహ్య ప్రపంచంలోకి వచ్చేందుకు ఇదే ప్రధాన మార్గం. అడుగుడుగునా లేచిపోయిన రాళ్లు, గోతులతో నిండిపోయి రాకపోకలకు అనువుగా లేకుండా తయారైంది. వైద్యం కోసం గ్రామాంతరం వచ్చేందుకు వీలు కాక కొండరెడ్లు నరకాన్ని చవిచూస్తున్నారు.

రూ. 40 లక్షలు నీటిపాలు

ఇది బుట్టాయగూడెం మండలంలో గాడిద బోరు వద్ద జల్లేరు వాగును అనుసంధానం చేసి నిర్మించిన ఎత్తిపోతల పథకం. దీనిని పదేళ్ల క్రితం సుమారు రూ.40 లక్షల అంచనా విలువతో ఐటీడీఏ ద్వారా మంజూరు చేసి నిర్మించారు. దాదాపు 200 ఎకరాల గిరిజన రైతుల భూములకు సాగు నీరు అందించే లక్ష్యంతో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మోటార్లు పనిచేయక మరుగున పడింది.



ఐటీడీఏ ఓ పాలేగూడు!

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే

మన్యంలో గిరిజనుల సంక్షేమాభివృద్ధి కోసం నెలకొల్పిన కోటరామచంద్రపురం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)కు గ్రహణం పట్టింది. ప్రభుత్వం ద్వారా మంజూరు అయ్యే పనుల ప్రగతి పరిశీలనకు, చేపట్టాల్సిన... చేయాల్సిన పనులకు సంబంధించి ప్రతి మూడు నెలలకు ఒకసారి ఐటీడీఏ పాలకవర్గం సమావేశం కావాలి. మన్యం ప్రగతికి అందులోనే కీలక నిర్ణయాలు తీసుకుంటారు. గత 20 నెలలుగా సమావేశం ఊసేలేక ఐటీడీఏ ద్వారా గిరిజన సంక్షేమం, అభివృద్ధి కోసం చేపడుతున్న పథకాల అమల తీరుపై పూర్తిస్థాయిలో సమీక్ష కొరవడింది.

కేఆర్‌పురం ఐటీడీఏను 1986లో అప్పటి ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్ ప్రారంభించారు. అంతకు ముందు ఏలూరులో గిరిజన సంక్షేమ శాఖ విభాగంలో కార్యకలాపాలు నిర్వహించే వారు. ప్రభుత్వ పాలనను మన్యంలోని గిరిజనులకు అందుబాటులోకి తీసుకురావాలని ఐటీడీఏను తెదేపా ప్రభుత్వం హయాంలో నెలకొల్పారు. ఇంతవరకూ 41 మంది ప్రాజెక్టు అధికారులు పనిచేశారు. ప్రస్తుత పీవో హరేంద్రియప్రసాద్ 42వ పీవో. ఈయన ఈ ఏడాది అక్టోబరులో బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం అమలు చేస్తోన్న గిరిజన సంక్షేమ పథకాలపై సమీక్షించి.. సమస్యలను పరిష్కరించేందుకు మూడు నెలలకు ఒకసారి పాలకవర్గం సమావేశాన్ని నిర్వహించాల్సి ఉంది. గతేడాది ఏప్రిల్‌లో ఆఖరిసారిగా సమావేశాన్ని నిర్వహించారు. తిరిగి ఇంతవరకూ దాని ఊసే లేదు. ఐటీడీఏ పాలకవర్గం ఛైర్మన్‌గా కలెక్టర్, వైస్ ఛైర్మన్‌గా పోలవరం శాసనసభ్యుడు, పీవో మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. వివిధ శాఖల జిల్లా అధికారులు సభ్యులుగా ఉంటారు.

కదలిక లేని ప్రతిపాదనలు

ఐటీడీఏలో గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్, ప్రత్యేక చిన్న తరహా నీటి పారుదల విభాగం, విద్య, వైద్య, ఉపాధిహామీ, ప్రత్యేక ఉపకలెక్టర్, వ్యవసాయ, ఉద్యాన తదితర శాఖలు ఉన్నాయి. ఈ శాఖల ద్వారా తయారు చేస్తున్న ప్రతిపాదనలు మంజూరుకు నోచుకోక మరుగున పడుతున్నాయి. కీలకమైన నీటి పారుదల విభాగం ద్వారా నీరు-చెట్టు కింద 30 పనులు మంజూరు కాగా 11 పురోగతిలో ఉన్నాయి, మరో రెండు పూర్తి అయ్యాయని చూపుతున్నారు. ఇదే పథకం కింద మరో 33 పనులకు ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రతిపాదించారు. ఎనిమిదేళ్ల కిందట ఈ విభాగం పర్యవేక్షణలో చేపట్టిన పోగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయినా కాలువల తవ్వకం, కాంక్రీట్ పనులు ఇంకా సాగుతూనే ఉన్నాయి.



ఐటీడీఏ సమగ్ర స్వరూపం

మండలాలు
బుట్టాయగూడెం, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి

గ్రామాలు
152 రెవెన్యూ గ్రామాలు (శివారు గ్రామాలతో కలిపి మొత్తం 419)

మన్యంలో గిరిజనుల సంఖ్య
97,029 మంది

☛ సమీక్ష ఉండదు.. ప్రగతి కానరాదు ☛ ఆదమరిచిన పాలకవర్గ సమావేశం
☛ నిధులు ఉన్నా.. కదలని పనులు ☛ ఏళ్ల తరబడి కీలక పోస్టులు ఖాళీ

కీలకమే అయినా..

ఐటీడీఏలో కీలకమైన అధికారుల పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. డిప్యూటీ డీఎంహెచ్‌వో, జిల్లా మలేరియా నివారణాధికారి ఉద్యోగాలు రెండేళ్లుగా ఖాళీగా ఉన్నాయి. డీఎస్‌వో ఏడాదిగా, మేనేజర్ ఉద్యోగం 5 నెలలుగా ఖాళీగా ఉన్నాయి. గిరిజన సంక్షేమశాఖ ఉపసంచాలకుడి ఉద్యోగం కూడా 4 నెలలుగా ఖాళీగా ఉంది. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన డీడీ మల్లికార్జున రెడ్డి 3 నెలల కిందట విజయవాడకు పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఆయనే ప్రస్తుతం ఇక్కడ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తూ వారంలో మూడు రోజులు ఇక్కడ, మూడు రోజులు విజయవాడలో పనిచేస్తున్నారు.

త్వరలో నిర్వహిస్తాం

ఐటీడీఏ పాలకవర్గం సమావేశాన్ని త్వరలో నిర్వహించేందుకు చర్యలు చేపడతాం. ఇందుకోసం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి తేదీని నిర్ణయిస్తా. కొన్ని శాఖల అధికారులు పని ఒత్తిడిలో ఉండటం కారణంగా ఈ సమావేశం నిర్వహణలో జాప్యమైంది.

- ఎంఎన్ హరేంద్రియప్రసాద్, పీవో



గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగం ద్వారా మంజూరు అవుతున్న అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి కావడం లేదు. పురోగతి దశను దాటడం లేదు. 2016-17లో మంజూరైన పనులు, తీరుతెన్నులు ఇలా..

☛ పాఠశాలల్లో అయిదు గోడల నిర్మాణానికి రూ.67.3 లక్షలు మంజూరు కాగా పనులు పురోగతిలో ఉన్నాయి.

☛ నాబార్డు ఆర్ఐడీఎఫ్-22 ద్వారా 9 ఆశ్రమ పాఠశాలల భవనాల నిర్మాణానికి రూ. 14.40 కోట్లు వచ్చాయి. ఇందులో ఇప్పటికి కేవలం రూ.98.57 లక్షలు ఖర్చు చేశారు.

☛ 2017-18లో పాఠశాలల 13 మౌలిక వసతుల పనులకు రూ.7.86 కోట్లు విడుదల అయ్యాయి. ఈ పనులన్నీ టెండర్ల దశలోనే ఉన్నాయి.

☛ నాబార్డు ఆర్ఐడీఎఫ్-23 కింద మన్యంలో, కృష్ణా జిల్లాలో పాఠశాలల అదనపు భవనాలకు రూ. 5.80 కోట్లు రాగా ఇంకా టెండర్ల దశ దాటలేదు.

☛ పాఠశాలల మరమ్మతులకు సంబంధించి ప్రణాళిక ద్వారా 33 పనులకు రూ.1.67 కోట్లు, ఆరు ప్రణాళికేతర పనులకు రూ.39 లక్షలు వచ్చాయి. ఈ పనులు పురోగతిలో ఉన్నట్లు చూపుతున్నారు.

☛ ఆశ్రమ పాఠశాలల్లో అదనపు భవనాలపై 12 అంతస్తుల పనులకు రూ.4.90 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు రెండేళ్ల క్రితం పంపగా మంజూరుకు నోచుకోవడం లేదు.

☛ ఐటీడీఏ ద్వారా ఉపాధి హామీ పథకం కింద మారుమూల గ్రామాలకు రహదారుల అభివృద్ధి కోసం రూ.13.17 కోట్ల అంచనా విలువతో 33 పనులు మంజూరయ్యాయి. ఇందులో కేవలం రెండు పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఇంతవరకూ రూ.1.10 కోట్లు ఖర్చు చేశారు.

☛ వాటర్‌షెడ్డు నిర్మాణ పథకం కింద రూ.2.20 కోట్ల అంచనా విలువతో 58 చెక్‌డ్యామ్ నిర్మాణాలు మంజూరు చేశారు. వీటిలో రూ.30 చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలు పూర్తి చేశారు. ఇందుకు రూ.8 లక్షలు ఖర్చు చేశారు.

పంటకాలువలో పడి ఇద్దరు యువకుల మృతి

రెండు రోజుల తర్వాత కాలువలో తేలిన మృతదేహాలు

దర్శిపర్రు (పెంటపాడు), న్యూస్‌టుడే: దర్శిపర్రు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ప్రమాదవశాత్తు మిడ్‌లెవల్ కాలువలో పడి మృతి చెందడం స్థానికంగా సంచలనం రేకెత్తించింది. ఈనెల ఒకటోతేదీ రాత్రి నుంచి కనబడకుండా పోయిన గుండుమోగుల ఫణిసందీప్(25), గుండుమోగుల అన్నవరం(26) బుధవారం మధ్యాహ్నం ఒంటిగంటకు దర్శిపర్రు వద్ద మిడ్‌లెవల్ కాలువలో శవాలై తేలారు. పెంటపాడు పోలీసుల కథనం మేరకు... ఫణి సందీప్, అన్నవరం సమీప బంధువులు, స్నేహితులు. నూతన సంవత్సరం, పుంతలో ముసలమ్మ జాతర మహోత్సవాల సందర్భంగా సోమవారం ఇద్దరూ కలిసి సంబరాలు చేసుకున్నారు. రాత్రి 10.30 గంటలకు మోటారు సైకిలుపై రాచర్ల వెళ్లి వస్తామని చెప్పి తిరిగి రాలేదు. దర్శిపర్రు వద్ద మిడ్‌లెవల్ కాలువలో బుధవారం ఆంజనేయ స్వామి గుడి వద్ద సందీప్ మృతదేహం, ఓ రైస్‌మిల్లు వద్ద అన్నవరం మృతదేహం పైకి తేలాయి. రెండు మృతదేహాలను కుటుంబ సభ్యులు వారి ఇళ్లకు తీసుకెళ్లిపోయారు. ఎస్సై వి.సుబ్రహ్మణ్యం దర్శిపర్రు వెళ్లి వివరాలు సేకరించారు. అనంతరం రాచర్ల వద్ద మిడ్‌లెవల్ కాలువలో మోటారుసైకిలును గుర్తించారు. ప్రమాదవశాత్తు వారు కాలువలోపడి మృతిచెందారని ఎస్సై వివరించారు.



అన్నవరం మృతదేహం



ఫణి సందీప్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

దర్శిపర్రులో విషాదఛాయలు: సందీప్, అన్నవరం కాలువలో శవాలై తేలారని తెలియగానే దర్శిపర్రులో విషాదఛాయలు అలుముకున్నాయి. వారిద్దరు గ్రామంలో అందరితో సరదాగా ఉంటూ వివాదాలకు దూరంగా ఉంటారు. సందీప్ ఇంజినీరింగ్ కోర్సు చదివి హైదరాబాదులోని ఓ ప్రైవేటు కంపెనీలో కొంతకాలం ఉద్యోగం చేశారు. ప్రస్తుతం గ్రామంలోనే ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నారు. సందీప్ తండ్రి శ్రీనివాసరావు పక్షవాతంతో బాధపడుతున్నారు. తాత సత్యనారాయణ కుటుంబ బాధ్యతలు చూస్తున్నారు. సందీప్‌కు ఇద్దరు అవివాహితులైన అక్కలు ఉన్నారు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లి వెంకటలక్ష్మి, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

● అన్నవరం తండ్రి వెంకటేశ్వరరావు వ్యవసాయం చేస్తుంటారు. తల్లి లక్ష్మి గృహిణి. వారి ముగ్గురు కొడుకుల్లో ఆఖరివాడైన అన్నవరం తాపీ మేస్త్రిగా పనిచేస్తున్నారు. నిత్యం కళ్లెదుట ఉత్సాహంగా తిరిగే అన్నవరం ఇక లేడనే విషయాన్ని ఆ కుటుంబం జీర్ణించుకోలేకపోతోంది.

ఈనాడు-ఈటీవీ ఆంధ్రప్రదేశ్ నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీ

జనవరి 2, 2018 విజేతలు

1. సి.హెచ్ జ్యోతి నిఖిల, జగ్గయ్యపేట; 2. వి. రమ్య, మధిర; 3. కె.పద్మ భారతి, యలమంచిలి; 4. ఎస్. శైలజ, జగ్గయ్యపేట; 5. కె. పూజిత, చిలకలూరిపేట; 6. డి. నాగయశస్వి, వైజాగ్; 7. దుర్గా స్రవంతి, కనుమోలు, కృష్ణా; 8. కె.వి. లావణ్య, బుచ్చిరెడ్డి పాలెం; 9. సి.హెచ్. సంధ్యారాణి, చీరాల; 10. శైలజ, రామదుర్గం, బళ్ళారి. విజేతల వివరాలు ఈనాడు డాట్ నెట్‌లో చూడవచ్చు.

జన్మభూమి సభల్లో ఇంటర్ విద్యామండలి కమిషనర్

ఏలూరు విద్యావిభాగం, న్యూస్‌టుడే: జన్మభూమి- మా ఊరు కార్యక్రమం అమలుతీరు పరిశీలన కోసం ఏలూరు శాసనసభ నియోజకవర్గానికి నోడల్ అధికారిగా నియమితురాలైన ఇంటర్ విద్యామండలి కమిషనర్ ఉదయలక్ష్మి బుధవారం ఉదయం నగరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ఐవో బి. ప్రభాకరరావు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఏలూరు తాపీమేస్త్రీకాలనీ, పుష్పలీలానగర్‌లో నిర్వహించిన జన్మభూమి-మాఊరు వార్డు సభల్లో ఆమె పాల్గొన్నారు. ఈనెల 11 వరకు జరిగే జన్మభూమి సభల నిర్వహణ తీరును ఉదయలక్ష్మి పర్యవేక్షిస్తారు.

ఆచంట



రాళ్లులేచి అధ్వానంగా చిట్టీతగుంట రహదారి

అడుగడుగునా గోతులు..
ప్రమాదాలకు హేతువులు..!

పోడూరు నుంచి పెనుమదం వెళ్లే రహదారిలో చిట్టీతగుంట వద్ద రాళ్లు లేచి, గోతులతో అధ్వానంగా ఉంది. దీంతో ఈ రహదారిపై ప్రయాణం ప్రాణసంకటంగా మారిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడుగడుగునా గోతులతో రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి నిర్మాణానికి తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, చిట్టీతగుంట, పెనుమదం (పోడూరు)

ఈ రహదారి.. ప్రమాదాల దరి..!



భారీ గోతులతో ప్రమాదకరంగా మార్టేరు-పాలకొల్లు రహదారి

జిన్నూరు(పోడూరు), న్యూస్‌టుడే: మార్టేరు నుంచి పాలకొల్లు ప్రధాన రహదారి భారీ గోతులతో ప్రమాదకరంగా మారింది. ప్రయాణంలో ఎదుటి వాహనాన్ని తప్పించే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో గొయ్యి కనిపించకపోవడంతో వాహనం గొయ్యిలో పడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులకు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు చంద్రన్న వైద్య సేవలు అందే ప్రాంతాలు

పోడూరు, న్యూస్‌టుడే: ఆచంట సీహెచ్‌సీ పరిధిలో గురువారం చంద్రన్న వైద్య(104) సేవలు అందించనున్నట్లు 104 వైద్యాధికారి డాక్టర్ డి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఉదయం కరుగోరుమిల్లి, మధ్యాహ్నం ముత్యాలవారిపాలెం ప్రాంతాల్లో వైద్య సేవలు అందించనున్నట్లు రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. ఈ అవకాశాన్ని ఇరు గ్రామల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన చెప్పారు.

వేలిముద్రలు పడకపోయినా బియ్యం ఇవ్వాల్సిందే

రాష్ట్రమంత్రి పితాని సత్యనారాయణ

కొడమంచిలి, పెనుమంచిలి(ఆచంట), న్యూస్‌టుడే: వేలిముద్రల సమస్య నెపంతో బియ్యం, పింఛను పంపిణీలో జాప్యం జరిగితే సహించేది లేదని వేలిముద్రలు పడకపోయిన లబ్ధిదారులకు సకాలంలో అందజేయాలని రాష్ట్రమంత్రి పితాని సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలోని సమస్యలను దశలువారిగా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. బుధవారం మండలంలోని పెదమల్లం, కోడేరు, పెనుమంచిలి, కొడమంచిలిలో ఆయా గ్రామ సర్పంచులు కొండేటి వీరాస్వామి, పెచ్చేట్టి సత్యనారాయణ, వర్ధనపు నవమోహిని, చిలుకూరి వీర వెంకటసత్యనారాయణ అధ్యక్షతన జన్మభూమి-మాఊరు గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పితాని స్థానికులను సమస్యలను ఆలకించారు. పెదమల్లంలో వేలిముద్రలు పడనివారికి రేషన్ బియ్యం ఇవ్వడం లేదన్న ఫిర్యాదులపై స్థానిక అధికారులు, రేషన్‌దుకాణం డీలర్లను ఆరాతీశారు. తక్షణమే బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు పీవీ కొండయ్యను ఆదేశించారు. కోడేరులో జరిగిన సభలో ఉత్తరపాలెం, దక్షిణపాలెంకు తాగునీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉత్తరపాలెంలో సామాజిక భవనం నిర్మాణానికి, దేవస్థానం సత్రం భవనం సౌకర్యాలు కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ ఏఈ శామ్యూల్‌ను ఆదేశించారు. ఎస్సీ కాలనీలో మిగిలిన ఇళ్ల స్థలాలను అర్హులైన పేదలకు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని తహశీల్దారు కె.రాజేంద్రప్రసాదుకు సూచించారు. రేషన్‌సరకులు సక్రమంగా పంపిణీ చేయడం లేదని స్థానికుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు డీలరును తక్షణమే మార్చాలని తహశీల్దారును ఆదేశించారు. ఇదే విధంగా కొడమంచిలి, పెనుమంచిలి పరిధిలో శివారు ప్రాంత రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమం సందర్భంగా పలువురికి రేషన్‌కార్డులు, చంద్రన్న బీమా పరిహారం, ఉపకారవేతనాల చెక్కులను పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. గ్రామసభల సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు, నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేకా పద్మకుమారి, ఏఎంసీ ఛైర్మన్ ఉప్పలపాటి సురేష్‌బాబు, తెదేపా మండల అధ్యక్షుడు కేతా మీరయ్య, సిద్ధాంతం డీసీ ఛైర్మన్ తమ్మినీడి ప్రసాదు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కోడేరులో రేషన్‌కార్డును అందజేస్తున్న మంత్రి పితాని



కొడమంచిలి పాఠశాల విద్యార్థినుల నృత్యాలు

ప్రజాసేవకే జన్మభూమి గ్రామసభలు

తూర్పుపాలెం, పండివిల్లూరు (పోడూరు), న్యూస్‌టుడే: ప్రజల ఆలోచన మేరకు అధికారంలోకి వచ్చిన తెదేపా ప్రభుత్వం ప్రజా సేవకే జన్మభూమి-మా ఊరు కార్యక్రమాలు నిర్వహిస్తుందని ఉపాధి, కార్మిక కల్పన శాఖ మంత్రి పితాని సత్యనారాయణ తెలిపారు. పోడూరు మండలంలోని తూర్పుపాలెం, పండితవిల్లూరు గ్రామాల్లో బుధవారం సర్పంచులు కారెం సుజాత, కొరిపల్లి రామచంద్రరావు అధ్యక్షతన నిర్వహించిన జన్మభూమి గ్రామసభల్లో మంత్రి పితాని ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ఇచ్చిన హామీలను పూర్తిచేశామని, మరికొన్ని దశలవారీగా పూర్తి చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతుందన్నారు. ప్రజా సమస్యలు తీర్చేందుకు, మిగిలిన సమస్యలు తెలుసుకుని పరిష్కరించేలా గ్రామసభలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బొక్కా నాగేశ్వరావు, తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి గణపతినీడి రాంబాబు, ఎంపీడీవో ఎంకె.ప్రసన్న, తహశీల్దార్ కె.శ్రీరమణి, ఏవో టి.సత్యానందం, మండల వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





సత్యశ్రీ, కవిటం

విద్యార్థుల ప్రతిభ

తణుకు పాతూరు, న్యూస్‌టుడే: ఇటీవల నెల్లూరులో నిర్వహించిన అంతర జిల్లాల టెన్నిస్, క్రికెట్ పోటీలలో వీరభద్రపురం చైతన్య పాఠశాల క్రీడాకారులు సీహెచ్ లోకేష్, కె.గిరీష్, పి.రాజ్యవర్ధన్‌కిషోర్ పాల్గొని ప్రతిభ చూపారని ప్రిన్సిపల్ పుష్పలత తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను, విజయానికి కారణమైన వ్యాయామ అధ్యాపకుడు కె.వెంకన్నబాబును ఉపాధ్యాయులు అభినందించారు.

రబీ పంటను కాపాడటమే లక్ష్యం

ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు



జిన్నూరు ఛానెల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామానాయుడు

జిన్నూరు పాలెం, జిన్నూరు, వేగంగిపాలెం, వేడంగి (పోడూరు), న్యూస్‌టుడే: సాగునీటి ఎద్దడి అధిగమించే దిశగా శ్రమిస్తానని, రబీ పంటను కాపాడడమే లక్ష్యంగా పని చేస్తానని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు తెలిపారు. పోడూరు మండలంలోని జిన్నూరుపాలెం, జిన్నూరు, వేడంగిపాలెం, వేడంగి గ్రామాలకు సాగునీరు అందించే జిన్నూరు ఛానెల్ ఉపకాలువపై బుధవారం ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి నీటి మట్టం తక్కువ ఉందన్నారు. సీలేరు జలాల ద్వారా రబీ పంటకు సాగునీరు అందించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. గ్రామాల్లో రైతులను నేరుగా కలుసుకుని నీటి ఎద్దడి ప్రాంతాలను గుర్తించారు. నీటి ఎద్దడి సమస్యతో వరితోపాటు కొబ్బరి ఫలసాయం దెబ్బతినే అవకాశం ఉందని, ప్రతి ఎకరాకి నీరు అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఉంగరాల లక్ష్మీనరసింహరాజు, సాయిరాజు, దాసరి రత్నరాజు, జీఎస్ఎన్.రాజు, కుక్కల సత్యనారాయణ, యల్లమెల్లి వెంకట్రావు, యర్రంశెట్టి పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సత్కారం



ఉపాధ్యాయురాలు అరుణాదేవిని సత్కరిస్తున్న బీసీ ప్రజా సంఘం ప్రతినిధులు

మార్టేరు (పెనుమంట్ర గ్రామీణ), న్యూస్‌టుడే: మార్టేరు శివరావుపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు టి.అరుణదేవిని బీసీ ప్రజా సంక్షేమ సంఘం బుధవారం ఘనంగా సత్కరించింది. దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అల్లాడ సూర్యభాస్కరరావు మాట్లాడారు. తొలుత మార్టేరు సెంటర్‌లో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆదర్శ ఉపాధ్యాయిని సావిత్రి బాయి పూలే

కొమ్ముచిక్కాల(పోడూరు), న్యూస్‌టుడే: ఆదర్శ ఉపాధ్యాయిని సావిత్రి బాయి పూలే అని, ప్రతి ఒక్కరూ ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలని ఎంపీపీ గుంటూరి వాణీ పెద్దిరాజు తెలిపారు. కొమ్ముచిక్కాలలో సావిత్రి బాయి పూలే జయంతిని ఏఎస్ఆర్ కాలనీ పాఠశాల హెచ్ఎం యెల్లమెల్లి సాల్మన్‌రాజు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ వాణీ పెద్దిరాజు, సర్పంచి గుడూరి దుర్గాభవాని, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎంవి.రాజశేఖర్ తదితరులు సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు.

సినిమాలు

పాలకొల్లు

అడబాల థియేటర్స్ స్క్రీన్1	ఎంసిఎ
అడబాల థియేటర్స్ స్క్రీన్ 2	జుమాంజీ
గీతా అన్నపూర్ణ	హలో
మారుతి	ఒక్క క్షణం
శ్రీనివాస డీలక్స్	2 కంట్రీస్
శ్రీనివాస మినీ	ఆక్సిజన్
శ్రీనివాస డిజిటల్	10
రంజని	మర్మదీవి

ఆచంట

> ప్రజాస్వామిక సంస్కారం బయట నుంచి వచ్చేది కాదు. మనిషి లోపలి నుంచి ప్రభవించాలి.
> - గాంధీజీ

న్యాయం చేయాలి

పెనుగొండ,న్యూస్‌టుడే: సంఘం నుంచి తనను వెలివేసి గ్రామంలో జీవించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తామరాడకు చెందిన మామిడిశెట్టి ఆదినారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు నరసాపురం డీఎస్పీకి, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కొందరు వ్యక్తులు గ్రామంలో ఇబ్బందులకు గురిచేస్తున్నారని మంగళవారం తన పశువుల పాకను తగుల పెట్టారని ఆయన పేర్కొన్నారు. తనకు న్యాయం చేయాలని కోరారు.

గ్రామ సంఘం భవనానికి మంత్రి పితాని శంకుస్థాపన

రామన్నపాలెం(పెనుగొండ), న్యూస్‌టుడే: రామన్నపాలెంలో డ్వాక్రా మహిళల గ్రామ సంఘం నిర్వహణ భవనానికి రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన మంత్రి పితాని సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. పితాని మాట్లాడుతూ రూ. 12 లక్షల వ్యయంతో భవన నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో పెనుగొండ, ఆచంట ఏఎంసీ ఛైర్మన్లు సానబోయిన గోపాలకృష్ణ, ఉప్పలపాటి సురేష్‌బాబు, ఏఎంసీ ఉప ఛైర్మన్ బడేటి బ్రహ్మాజీ, ఎంపీపీ పల్లి జూలీసురేఖ, జడ్పీటీసీ సభ్యుడు రొంగల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



వడలిలో ర్యాలీ చేస్తున్న సర్పంచి పీతల మంజుల తహశీల్దార్ బొడ్డు శ్రీనివాసరావు తదితరులు

ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలి

వడలి(పెనుగొండ),న్యూస్‌టుడే: గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకుని ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని వడలి సర్పంచి పితల మంజుల అన్నారు. బుధవారం వడలి పంచాయతీ పరిధిలో ఆత్మగౌరవ ప్రదర్శన నిర్వహించి మరుగుదొడ్లు నిర్మించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ బొడ్డు శ్రీనివాసరావు, గణపతినీడి శ్రీనివాసరావు, పీతల రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సత్తి శ్రీనివాసరెడ్డి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

దొంగరావిపాలెంలో శాశ్వత ఎత్తిపోతల పథకాన్ని నిర్మించాలి

ఆచంట, న్యూస్‌టుడే: రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని దొంగరావిపాలెం వద్ద శాశ్వత ఎత్తిపోతల పథకాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం నాయకులు దిగుపాటి రాజగోపాల్ డిమాండ్ చేశారు. శాశ్వత ఎత్తిపోతల పథకాన్ని నిర్మించాలని కోరుతూ సీపీఎం చేపట్టిన ప్రచార జాత బుధవారం ఆచంట చేరింది. ఈ సందర్భంగా స్థానిక కచేరిసెంటర్‌లో నిర్వహించిన సభలో రాజగోపాల్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కేతా గోపాలన్, రైతుసంఘం జిల్లా నాయకులు ఆకుల హరేరామ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: ఒక యువకుడు బుధవారం రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్సై ఎ.వి.ప్రసాద్ కథనం మేరకు... పాలకొల్లు స్టేషన్ సమీపంలో రైలుకింద ఓ వ్యక్తి తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా ఆచంట మండలం వల్లూరు శివారు కాసానివారిపాలెంనకు చెందిన మట్టా మణికంఠ (22)గా గుర్తించారు. ఇటీవల ఒక ప్రేమ వ్యవహారంలో తలెత్తిన సమస్యల కారణంగా మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి శవపంచనామాకు తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

పరామర్శ

జిన్నూరు(పోడూరు), న్యూస్‌టుడే: పోడూరు మండలంలోని జిన్నూరులో భూపతిరాజు వెంకటలక్ష్మీ నర్సింహరాజు(84)(శ్రీ సద్గురు నాన్నగారు) ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా మాజీ రాజ్యసభ సభ్యులు, మాజీ మంత్రి యర్రా నారాయణస్వామి గురువారం జిన్నూరులో సద్గురు నాన్నగారి భార్య అప్పలనర్సమ్మ, కుమారుడు సూర్యనారాయణరాజు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాన్నగారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

పోడూరు, కవిటం, పండితవిల్లూరు, వద్దిపర్రు (పోడూరు), న్యూస్‌టుడే: సంక్రాంతి పండుగలో భాగంగా కోడి పందేలను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ కె.శ్రీరమణి హెచ్చరించారు. పోడూరు మండలంలోని పోడూరు, కవిటం, పండితవిల్లూరు తదితర గ్రామాల్లో గతంలో నిర్వహించి స్థలాలను తహశీల్దార్, పోడూరు ఎస్సై కె.రామకృష్ణ సంయుక్తంగా పర్యటించి పరిశీలించి యజమానులతో మాట్లాడారు. గతంలో కోడి పందేలు ఏర్పాటు చేసిన నిర్వాహకులకు ఆంక్షలను వివరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలకు.. కొత్త అర్థం

- చిట్టి చేతుల నైపుణ్యం
- వృత్తి విద్యల్లో రాణిస్తున్న విద్యార్థినులు

జిన్నూరు (పోడూరు), న్యూస్‌టుడే

కృషి, పట్టుదల, ఆకాంక్ష ఉంటే చదువుతోపాటు వృత్తి విద్యల్లోనూ ప్రావీణ్యం సాధించవచ్చని జిన్నూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు నిరూపిస్తున్నారు. క్రాఫ్ట్ ఉపాధ్యాయుల శిక్షణతో ఐస్‌క్రీమ్ పుల్లలు, ఇసుక, థర్మాకోల్ బాల్స్, దిన పత్రికలు, రంగు పేపర్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు, నూలుదారాలు, పాలిథిన్ గ్లాసులతో అందమైన, అబ్బురపరిచే అలంకార వస్తువులను అవలీలగా తయారు చేస్తున్నారు. అందమైన పువ్వుల స్టాండ్లు చూడముచ్చటగా ఉంటున్నాయి. వీటిని తయారు చేసేందుకు శిక్షకురాలు కె.కనకదుర్గ విద్యార్థులకు ప్రత్యేకంగా తర్ఫీదును ఇస్తున్నారు.



తయారు చేసిన అలంకరణ వస్తువులను చూపుతున్న విద్యార్థులు

సకల విద్యల్లో ప్రావీణ్యం ఉంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. విద్యార్థులు మార్కులు, ర్యాంకుల కోసం పోటీ పడుతుంటే వృత్తివిద్య విద్యార్థులకు ఆట విడుపుగా ఉంటుందని, కొత్త ఆలోచనలకు మలుపుగా ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ఎంతో సంతోషంగా ఉంది...



వ్యర్థాలతో అలంకార వస్తువులు తయారు చేయడం మాకెంతో సంతోషంగా ఉంది. మొదట్లో సరదా కోసం నేర్చుకున్నా. మా ఉపాధ్యాయురాలు విభిన్న పద్ధతుల్లో బొమ్మలు తయారు చేసి చూపడంతో మాకిష్టంగా మారింది.

- ఎం.తేజశ్రీ విద్య, 9వ తరగత విద్యార్థిని.

గాజులను ఆకర్షణీయంగా ...



పనికిరాని, సాధారణ గాజులకు రంగురాళ్లు అతికించి ఆకర్షణీయంగా తయారు చేస్తున్నాం. కాగితాలతో పుష్పగుచ్ఛాలు, పాడైన వస్తువులు ఐస్‌క్రీమ్ పుల్లతో ఇసుక వినియోగించి అలంకరణ వస్తువుల తయారీ నేర్చుకున్నా. చేస్తుంటే ఎంతో ఆసక్తిగా ఉంటుంది.

- సి.హెచ్ తరుణి, 9వ తరగతి, విద్యార్థిని.

సరదాగా..ఆసక్తిగా...



క్రాఫ్ట్ శిక్షణ చాలా ఆసక్తిగా ఉంది. సరదాగా నేర్చుకుంటున్నాను. దారపు పోగులతో అల్లికలు, మ్యాట్‌లు, తయారీని నేర్చుకుని మా ఇంట్లో కూడా చేస్తు వివిధ వస్తువులు తయారు చేశాను. అమ్మకు కూడా నేర్పుతున్నాను. **- జి.భార్గవి, 10వ విద్యార్థిని.**

ఉపయోగకరంగా..



పాఠశాలలో నేర్చుకున్న కుట్టు, అల్లికల శిక్షణ ఖాళీ సమయాల్లో అలంకార వస్తువులు, దుస్తులకు ఎంబ్రాయిడరీ వర్కు చేయడానికి ఉపయోగపడుతుంది. అందుకే ఆసక్తితో క్రాఫ్ట్ శిక్షణను సద్వినియోగం చేసుకుని చక్కని అలంకరణ వస్తువులు తయారీ విధానాన్ని నేర్చుకుంటున్నాను.

- డి.సాయిదేవి, 8వ తరగతి విద్యార్థిని.

జీవన భృతికి అవకాశం..

కుట్టు అల్లికలు కేవలం వ్యాపకం అనుకోకూడదు. భవిష్యత్తులో విద్యార్థినులకు జీవన భృతిగా ఉపయోగపడుతుంది. ఈ కళల్లో నైపుణ్యం సాధించాను. ప్రస్తుతం ఉద్యోగినిగా సేవలు అందిస్తున్నాను. కేవలం ఉద్యోగంలా కాకుండా ఇష్టంతో పలువురికి ఉపయోగపడాలనే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నా. అందుకే నా విధుల ద్వారా విద్యార్థులను ప్రత్యేకంగా తీర్చిదిద్దేలా కుట్లు, అల్లికలపై శిక్షణ ఇస్తున్నా.

- కె.కనకదుర్గ, క్రాఫ్ట్ ఉపాధ్యాయురాలు, జిన్నూరు.

ప్రతిభను వెలికితీస్తున్నాం...

అల్లికలు, కుట్లు విద్యార్థులు ఆసక్తితో నేర్చుకుంటున్నారు. ఖాళీ సమయాల్లో పాఠశాల, కళాశాల, చదువు ఆపినవారికి కూడా ఈ శిక్షణ ఉపయోగపడుతుందని అవగాహన కల్పిస్తున్నాం. వీటిని నేర్చుకుని ఇంటి వద్ద ఉన్న తల్లిదండ్రులు సంతోషపడుతున్నారు. వారు కూడా ప్రోత్సాహకంగా నిలుస్తున్నారు. ప్రభుత్వంఏర్పాటు చేసిన శిక్షణ విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంది. **- పద్మినీకుమారి, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, జిన్నూరు.**

పరిసరాల శుభ్రతతోనే చక్కటి ఆరోగ్యం

కొడమంచిలి (ఆచంట), న్యూస్‌టుడే: బహిరంగ మలవిసర్జనకు పాల్పడకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచాలని జన్మభూమి-మాఊరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి బి. గంగయ్య సూచించారు. వ్యక్తిగత శుభ్రతతోపాటు, పరిసరాల పరిశుభ్రత వల్ల చక్కటి ఆరోగ్యం లభిస్తుందని చెప్పారు. గ్రామసభల సందర్భంగా వచ్చే ఫిర్యాదులు, దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. స్థానికంగా ఏ సమస్య ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజరు పీవీ కొండయ్య మాట్లాడుతూ క్రిస్మస్, సంక్రాంతి సందర్భంగా ఇస్తున్న చంద్రన్న కానుకలో 6 రకాల నాణ్యమైన సరకులను అందిస్తున్నామని తెలిపారు. సరకుల్లో నాణ్యత లోపిస్తే వాపస్ ఇస్తామని ఆయన తెలిపారు. నాణ్యత లోపించిన సరకుల పంపిణీని నిలిపివేయాలని ఆయన రేషన్‌డీలర్లకు సూచించారు.



మాట్లాడుతున్న నియోజకవర్గ ప్రత్యేకాధికారి గంగయ్య

ఆరోగ్యసూత్రాలను పాటించండి

పెనుమంచిలి(ఆచంట), న్యూస్‌టుడే: ప్రపంచ ఆరోగ్య సూత్రాలను పాటించి ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆచంట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి.శ్రీనివాసరావు కోరారు. జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా బుధవారం కళాశాల విద్యార్థులు పెనుమంచిలిలో ఆరోగ్య నియమాలపై అవగాహన, చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ఆరోగ్యనియమాలను వివరించారు. అనంతరం ప్రదర్శన చేశారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

కవిటం(పోడూరు), న్యూస్‌టుడే: విద్యతోపాటు క్రీడల్లో అవకాశాలను అందిపుచ్చుకుని రాణించాలని ఇన్‌ఛార్జి ఎంఈవో వి.శ్రీరామకృష్ణ తెలిపారు. కవిటం గ్రామంలో జన్మభూమి- మాఊరు కార్యక్రమంలో భాగంగా గ్రామస్థాయి ఆటల పోటీలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కవిటం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడుతూ ఉజ్వల భవితకు విద్యతోపాటు క్రీడలపై విద్యార్థులు ఆసక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో కవిటం, పోడూరు పీడీలు సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో ఆచంట విద్యార్థుల ప్రతిభ

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చాటి విజేతలుగా నిలిచారు. వల్లూరులో బుధవారం జరిగిన మండల స్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచారు. ఖోఖో బాలుర సీనియర్, జూనియర్, వాలీబాల్ బాలుర సీనియర్స్, జూనియర్స్, కబడ్డీ జూనియర్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారు. వ్యక్తిగతంలోనూ పలువురు విద్యార్థులు విజేతలుగా నిలిశారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.రాంబాబు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

భీమవరం

నేటి నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

తాలూకాఫీసురోడ్డు (భీమవరం సాంస్కృతికం), న్యూస్‌టుడే: త్యాగరాజ మ్యూజిక్ అకాడమి 99వ వార్షిక ఆరాధనోత్సవాలు ఈ నెల 4 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు అకాడమి కార్యదర్శి గమిని రాజు బుధవారం తెలిపారు. గురువారం సాయంత్రం 6.30 గంటలకు హైదరాబాద్‌కు చెందిన పసుమర్తి రామలింగశాస్త్రి బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుందని చెప్పారు.

మాజీ సర్పంచి యాకోబు మృతి

జొన్నలగరువు (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: జొన్నలగరువు మాజీ సర్పంచి విప్పర్తి యాకోబు బుధవారం మృతి చెందారు. రెండు సార్లు సర్పంచిగా పని చేసిన ఆయన గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారనే పేరు ఉంది. ఈయన భార్య విప్పర్తి రత్నమ్మ ప్రస్తుతం సర్పంచిగా పని చేస్తున్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

చినరంగనిపాలెం (భీమవరం గునుపూడి), న్యూస్‌టుడే: రెండో పట్టణంలో ఏర్పాటు చేస్తున్న ఇండోర్ విద్యుత్తు ఉపకేంద్రం పనుల నిమిత్తం గురువారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ డీఈ వీఎస్ఆర్.మూర్తి బుధవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు రెండో పట్టణ పరిధిలోని శ్రీరామపురం, ఉండి రోడ్డు, జువ్వలపాలెం రోడ్డు, శివరావుపేట, ఆదర్శనగర్, ఏఎస్ఆర్ నగర్, వంశీకృష్ణ నగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని చెప్పారు.

కోడిపందేలు నిషేధం

అనాకోడేరు, ఈలంపూడి (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా ఎవరూ కోడి పందేలు నిర్వహించరాదని గ్రామీణ పోలీస్‌స్టేషన్ ఎస్సై రామచంద్రరావు హెచ్చరించారు. బుధవారం అనాకోడేరు పంచాయతీ ఈలంపూడి గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కోడి పందేలు, జూదం వల్ల కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయని, అందరూ వాటికి దూరంగా ఉండాలని కోరారు. ఎక్కడ కోడి పందేలు జరిగినా తక్షణం సమాచారం అందించాలని పేర్కొన్నారు.

ఆపన్నులకు సాయం అభినందనీయం

జువ్వలపాలెం రోడ్డు (భీమవరం సాంస్కృతికం), న్యూస్‌టుడే: ఆపదలో ఉన్న పేదవారికి తమవంతు సాయం చేయడం అభినందనీయమని కాపు యువత జిల్లా అధ్యక్షుడు ఉండపల్లి రమేష్‌నాయుడు అన్నారు. డాక్టర్ విజయబాబు ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకుంటున్న బోణం దుర్గకు గ్రంధి శ్రీనివాస్ మిత్రమండలి సభ్యుడు నల్లం రాంబాబు రూ.10 వేలు రమేష్‌నాయుడకు చేతుల మీదుగా బుధవారం అందజేశారు. కార్యక్రమంలో వైకాపా జిల్లా కార్యదర్శి పేరిచర్ల సత్యనారాయణరాజు, కోయ తాతాజీ, ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో దీపోత్సవం

హౌసింగ్‌బోర్డు కాలనీ (భీమవరం ఆధ్యాత్మికం), న్యూస్‌టుడే: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా హౌసింగ్ బోర్డు కాలనీలోని పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి మందిరంలో దీపోత్సవం బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. కాలనీకి చెందిన కఠారి సుబ్బరాజు దంపతులు స్వామికి పూజలు చేసి దీపాలను వెలిగించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర భూగర్భ గనుల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శ్రీధర్ పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. మందిరం అధ్యక్షుడు కె.వెంకట్రాజు, కార్యదర్శి కె.వెంకటరత్నం ఆయనకు శేషవస్త్రం, ప్రసాదం అందించారు.

సంస్కృతి సంప్రదాయాలకు నెలవు

గునుపూడి (భీమవరం పట్టణం), న్యూస్‌టుడే: భారత దేశం సంస్కృతి సంప్రదాయాలకు నెలవు అని పురపాలక కమిషనర్ సీహెచ్.నాగనరసింహారావు అన్నారు. జన్మభూమి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రంగవల్లులు, ఆటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పీఎస్ఎం బాలికోన్నత పాఠశాలలో బుధవారం జరిగిన పోటీల్లో విద్యార్థినులు రంగులతో ముగ్గులు వేశారు. ప్రధానోపాధ్యాయుడు కోడె వెంకట్రావు, జన్మభూమి ప్రత్యేక అధికారిణి టి.సుధారాణి, రంగసాయి పాల్గొన్నారు.



రంగవల్లులు పరిశీలిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు

అర్హులందరికీ పింఛన్లు

ఎమ్మెల్యే రామాంజనేయులు

కొణితివాడ, మడుగుపోలవరం, నేలపోగుల (వీరవాసరం), న్యూస్‌టుడే: అర్హులైన పేదలందరికీ పింఛన్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకున్నట్లు శాసనసభ్యుడు పులపర్తి రామాంజనేయులు అన్నారు. 'జన్మభూమి మా ఊరు' కార్యక్రమంలో భాగంగా కొణితివాడ, మడుగుపోలవరం, నేలపోగుల గ్రామాల్లో గ్రామసభలు బుధవారం నిర్వహించారు. సర్పంచులు యరకరాజు వెంకట సుబ్రమణ్యంరాజు, లంక వెంకట సత్యనారాయణ, మాండ్రు విజయ్‌బాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభల్లో శాసనసభ్యుడు రామాంజనేయులు పాల్గొన్నారు. వీరవాసరం మండలంలో ఇప్పటికే 650 మందికి పింఛన్లు మంజూరు చేయించినట్లు చెప్పారు. అనంతరం రూ.6 కోట్లతో నిర్మిస్తున్న కొణితివాడ - రాయకుదురు ఆర్‌అండ్‌బీ రహదారి పనులను పరిశీలించారు. జన్మభూమి నియోజకవర్గ సమన్వయకర్త బి.శ్రీధర్, మండల పార్టీ అధ్యక్షుడు పోలిశెట్టి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు యరకరాజు గోపాలకృష్ణరాజు, ఏఎంసీ ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, ఎంపీపీ కవురు శ్రీనివాస్, మండల కార్యదర్శి పాలా వెంకటేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్లు గొలగాని సత్యనారాయణ, కడలి నెహ్రూ, కొణితివాడ పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేగి మాధవరావు, నీటి సంఘం అధ్యక్షుడు యరకరాజు లక్ష్మీనరసింహరాజు, భోగిరెడ్డి గోవిందరావు, సొసైటీల అధ్యక్షులు పంజా రామచంద్రరావు, నూకల అప్పాజీ, సందక రామ్మోహనరావు, నాగళ్ల చింతారావు, మండల ప్రత్యేకాధికారి ఎస్.శ్రీనివాసరావు, ఎంపీడీవో పి.జగదాంబ, విద్యుత్తు శాఖ ఏఈ పి.శ్రీనివాసరాజు, గృహ నిర్మాణ శాఖ ఏఈ పీటర్ బోలార్ పాల్గొన్నారు.



కొణితివాడ - రాయకుదురు రహదారి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు



శ్రీరాంపురంలో అధికారులను నిలదీస్తున్న స్థానికులు

సమస్యలపై నిలదీత

కొవ్వాడ, తుందుర్రు, శ్రీరాంపురం (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: భీమవరం మండలంలో రెండో రోజు బుధవారం జన్మభూమి కార్యక్రమం రసాభాసగా జరిగింది. పింఛన్లు సక్రమంగా ఇవ్వడం లేదని, విద్యుత్తు లోవోల్టేజి సమస్య గురించి అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ప్రజలు ప్రజాప్రతినిధుల సమక్షంలోనే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీరాంపురం గ్రామంలో పింఛన్ల విషయంలో ప్రజలు నిలదీయడంతో అంతా గందరగోళ వాతావరణం నెలకొంది. కొంత మందికి వేలిముద్రల పడక రెండేళ్లుగా రేషన్ ఇవ్వడం లేదంటూ నిరసన వ్యక్తం చేశారు. చివరికి స్థానిక నాయకులు నచ్చజెప్పడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. కొవ్వాడ గ్రామంలో గ్రామ నాయకులు, ప్రజలు కూడా అధికారుల తీరుపై విరుచుకుపడ్డారు. ముఖ్యంగా విద్యుత్తు విషయంలో ఇబ్బందులు పడుతున్నామని ఆరోపించారు. శాసనసభ్యుడు పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ అధికారులకు ఎంతో స్వేచ్ఛ ఇచ్చానని, దాన్ని దుర్వినియోగం చేసుకోవద్దని హితవు పలికారు. తక్షణం సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు మంచిపేరు రావాలంటే అధికారులు బాధ్యతగా పని చేయాలని పేర్కొన్నారు. ఏఎంసీ ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, ఎంపీపీ బండి సుజాత, సర్పంచులు అట్టాడ మంగాదేవి, ఆరేటి అబ్బులు, సానబోయిన తులసి, ఎంపీటీసీ సభ్యులు పేరిచర్ల రాంబాబు, జవ్వాది వెంకటరమణ, కలిదిండి బలరామకృష్ణంరాజు, నాయకులు అట్టాడ సీతారామయ్య, అల్లూరి సుబ్రహ్మణ్యంరాజు, తహశీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో బాలాజీ, పంచాయతీరాజ్ ఏఈ రమేష్‌బాబు పాల్గొన్నారు.

పట్టణంలో..

చినరంగనిపాలెం (భీమవరం పట్టణం), న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని శాసనసభ్యుడు పులపర్తి రామాంజనేయులు అన్నారు. పట్టణంలోని 5 - 8 వార్డుల్లో జన్మభూమి గ్రామసభలు బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని వార్డుల్లో నూరు శాతం రహదారులు, మురుగు కాలువల నిర్మాణం వచ్చే ఏడాది లోపు పూర్తి చేస్తామని అన్నారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. పురపాలక సంఘాధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, ఉపాధ్యక్షుడు ముదునూరి సూర్యనారాయణరాజు, ఏఎంసీ ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, వైస్ ఛైర్మన్ చెల్లబోయిన వెంకట సుబ్బారావు, కమిషనర్ సీహెచ్.నాగనరసింహారావు, ఏంఈ సీహెచ్.శ్రీనివాసరావు, జన్మభూమి ప్రత్యేకాధికారిణి టి.సుధారాణి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న విద్యార్థులు

ప్రభుత్వ పథకాలపై ప్రచారం

కొణితివాడ (వీరవాసరం), న్యూస్‌టుడే: జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించే పనిని విద్యార్థులు తీసుకున్నారు. వీరవాసరం ఎస్ఎంబీటీఏవీ అండ్ ఎస్ఎన్ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు కొణితవాడలో జన్మభూమి ఉద్దేశాన్ని ప్రజలకు తెలియజెప్పడంతో పాటు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో ప్రదర్శన చేయడంతో పాటు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎం.రామకృష్ణ, అధ్యాపకురాలు బి.గీతాకుమారి పాల్గొన్నారు.



లోసరిలో రహదారిపై ధర్నా చేస్తున్న స్థానికులు



స్థలాలను సర్వే చేస్తున్న అధికారులు

రహదారి విస్తరణలో అన్యాయం

లోసరి, గూట్లపాడు (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: జాతీయ రహదారి 216ఏ విస్తరణలో అధికారులు పెద్దలకు కొమ్ముకాస్తూ నిబంధనలకు విరుద్ధంగా సర్వే చేస్తున్నారని లోసరి పంచాయతీ గరవళ్లదిబ్బ గ్రామస్థులు బుధవారం ఆందోళన చేశారు. జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. తమ ప్రాంతంలో ప్రభుత్వ భూములు ఉన్న వైపు కాకుండా సామాన్యుల స్థలాల వైపు సర్వే చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారి విస్తరణ కోసం ఇటీవల గ్రామంలో సామాజిక భవనాన్ని కూడా ఎలాంటి సమాచారం లేకుండా తొలగించారని ఆరోపించారు. గతంలో పంచాయతీ పైప్‌లైన్లను ధ్వంసం చేయడంతో నెల రోజులు తాగునీరు కూడా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

మావుళ్లమ్మగుడి వీధి (భీమవరం ఆధ్యాత్మికం), న్యూస్‌టుడే: పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన గొట్టుముక్కల సత్యనారాయణరాజు రూ.50,100 విరాళం బుధవారం అందించారు. ఆలయ ప్రాంగణంలో ధర్మకర్తల మండలి ఛైర్మన్ కె.సత్యనారాయణమూర్తి, సభ్యుడు లంకి శ్రీనివాసరావు దాతకు శేషవస్త్రం, ప్రసాదం అందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సత్యనారాయణ, తనిఖీదారుడు లోకనాథం, సిబ్బంది పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న సత్యనారాయణరాజు

సినిమాలు

భీమవరం

విజయలక్ష్మీ	ఆక్సిజన్
మహాలక్ష్మి	మళ్లీ రావా
పద్మాలయఎ/సి	ఎంసీఏ
శ్రీపద్మాలయమినీ	హలో
నటరాజ్	---
కిషోర్	ఒక క్షణం
కిషోర్‌మినీ	ప్రాజెక్ట్
అన్నపూర్ణ	2 కంట్రీస్

భీమవరం

చీరల వేలం ఆదాయం రూ.43,060


మావుళ్లమ్మగుడి వీధి (భీమవరం ఆధ్యాత్మికం), న్యూస్‌టుడే: భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మ ఆలయంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలకు బహిరంగ వేలం పాట బుధవారం నిర్వహించారు. ఈ పాటలో రూ.43,060 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇన్‌ఛార్జి ఈవో ఎన్‌ఎస్.చక్రధరరావు తెలిపారు. ధర్మకర్తల మండలి సభ్యులు అడ్డగర్ల ప్రభాకరగాంధీ, అడ్డాల సత్యనారాయణ పాల్గొన్నారు.

కాలమానిని ఆవిష్కరణ

తాలూకాఫీసు రోడ్డు (భీమవరం పట్టణం), న్యూస్‌టుడే: ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరం న్యాయస్థాన ఆవరణలో హైకోర్టు సెలవు దినాల కాలమానిని బుధవారం ఆవిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడిమళ్ల నరసింహం, ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్. రంగారావు, వీరవల్లి ప్రభాకరరావు, కామన రామకృష్ణ, పి. రమేష్, బి.అశోక్ పాల్గొన్నారు.



కాలమానిని ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తులు



రాయకుదురు - 2 ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న రైతులు



పశ్చిమ కాలువలోకి వెళ్తున్న నీరు

కల తీరింది.. పంట పండనుంది

● ఎత్తిపోతల పథకాలకు ప్రయోగ పరీక్ష ● విజయవంతంతో ఆనందంలో రైతులు

రాయకుదురు (వీరవాసరం), న్యూస్‌టుడే: రాయకుదురు రెవెన్యూ ఆయకట్టు పరిధిలో రైతులకు సాగునీటి కష్టాలు తీరాయి. ఎట్టకేలకు రాయకుదురు, చింతలకోటిగరువు గ్రామాల్లో నిర్మించిన రెండు ఎత్తిపోతల పథకాలకు అధికారులు ప్రయోగ పరీక్షలు జరిపి నీటిని విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ నీటి పారుదల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాయకుదురు - 2 పేరుతో రాయకుదురులో గొంతేరు మురుగు డ్రెయిన్‌పై రూ.2.44 కోట్ల వ్యయంతో ఒకటి, రాయకుదురు - 1 పేరుతో చింతలకోటిగరువు గ్రామంలోని బసవరాజు మురుగుకోడుపై రూ.4.40 కోట్లతో మరొక ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేశారు. శాసనసభ్యుడు పులపర్తి రామాంజనేయులు చొరవతో పథకాలకు విద్యుత్తు సరఫరా కావడంతో పనులను పూర్తిచేసిన అధికారులు తొలిదశ పరీక్షలను పూర్తి చేసినట్లు ఆంధ్రప్రదేశ్ నీటి పారుదల అభివృద్ధి సంస్థ డీఈ ఎన్.శేషగిరిరావు, ఏఈ వీజీఎల్.శాస్త్రి బుధవారం చెప్పారు. ఎత్తిపోతల పథకాల అధ్యక్షులు యిర్రింకి మాధవపురుషోత్తం, ముప్పన మధుసూదనరావు ఆధ్వర్యంలో తొలిదశ పరీక్షలను నిర్వహించి నీటిని విడుదల చేశారు.

ఇబ్బందులు తొలగుతాయి



చాలా కాలంగా రాయకుదురు రెవెన్యూ ఆయకట్టు పరిధిలోని చింతలకోటిగరువు, రాయకుదురు, నడపన వారిపాలెం, వీరవల్లి పాలెం గ్రామాల్లోని భూములకు నీరు సరిగా విడుదల కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లం. బోరు నీటిని ఉపయోగించడం వల్ల భూములు చౌడుబారిన పడి పంట దెబ్బతినేది. పథకాలు వినియోగంలోకి రావడంతో సాగునీటి ఇబ్బందులు తొలగుతాయి.

- వీరవల్లి గోవిందరావు, రైతు

అధికారికంగా ప్రారంభించాలి



ఎత్తిపోతల పథకాలు వినియోగంలోకి రావడం ఆనందంగా ఉంది. ఏటా సాగునీటి ఇబ్బందులను అధిగమించడానికి అదనపు ఖర్చులు చేయాల్సి వచ్చేది. ప్రయోగ పరీక్షలు పూర్తయ్యాయి కాబట్టి అధికారికంగా పథకాలను ప్రారంభిస్తే బాగుంటుంది.

- లక్ష్మణరావు, రైతు

వివాహిత అనుమానాస్పద మృతి

పీపీరోడ్డు (భీమవరం పట్టణం), న్యూస్‌టుడే: ఒకటో పట్టణ పరిధి చినపేటకు చెందిన కె.భవాని(20) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు సీఐ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తూర్పుగోదావరి జిల్లా అమలాపురం సమీపంలోని పాలగుమ్మికి చెందిన కె.దొరబాబును ప్రేమ వివాహం చేసుకుని భీమవరంలో స్థిరపడ్డారు. బుధవారం ఉదయం 9 గంటల సమయంలో ఆమె భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లి గంట తర్వాత తిరిగొచ్చేసరికి తలుపులు మూసి ఉన్నాయి. తలుపులు పగలగొట్టి చూసేసరికి గదిలోని గాలి పంకాకు చీరతో ఉరివేసుకుని మృతి చెంది ఉంది. ప్రస్తుతం ఆమె భర్తను అదుపులోకి తీసుకున్నామని, మృతురాలి తల్లిదండ్రులు వస్తున్నట్లు సమాచారం ఇవ్వడంతో పాటు ఇంకా ఎవరూ ఫిర్యాదు చేయలేదని సీఐ చెప్పారు.



భవాని మృతదేహం

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

రాయకుదురు (వీరవాసరం), న్యూస్‌టుడే: పంజావేమరం ప్రాథమిక పాఠశాలలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని మండల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయిలో సావిత్రిబాయి పూలే అవార్డు గ్రహీత కేవీ.పద్మావతిని ఘనంగా సత్కరించారు. అంతకుముందు ఉపాధ్యాయులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు దేవి రెడ్డి పుల్లారావు, నేలపాటి ప్రసాద్‌బాబు, కండిబోయిన నాగమునేశ్వరరావు, ఎన్. భానుమూర్తి, పి.సీతారామరాజు, సీతారామయ్య, హేమలత, దేవి పద్మజ, ధనలక్ష్మి, పి. శ్రీదేవి, జి.భూలక్ష్మి, భవానీ, మౌనిక హేమ, పి.దివ్యకళ తదితరులు పాల్గొన్నారు.



సత్కార గ్రహీత పద్మావతితో ఉపాధ్యాయులు

ద్విచక్రవాహనంపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

విస్సాకోడేరు (పాలకోడేరు), న్యూస్‌టుడే: విస్సాకోడేరులో ద్విచక్రవాహనంపై నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన బుధవారం జరిగింది. పాలకోడేరు ఎస్సై వి.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు .. తూర్పుగోదావరి జిల్లా మలికిపురానికి చెందిన పి.రాము(40) భీమవరంలోని ఓ ఆసుపత్రికి వచ్చి తిరిగి ద్విచక్రవాహనంపై వెళుతుండగా.. విస్సాకోడేరు సమీపంలో ఉన్నట్టుండి వాహనంపై నుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

చింతలపూడి







టి.మధుబాల, జంగారెడ్డిగూడెం



కాసంగి ప్రశాంతి, చింతలపూడి

కేసు నమోదు

లక్కవరం(జంగారెడ్డిగూడెం గ్రామీణ), న్యూస్‌టుడే: మద్యం సేవించి తన భర్త నిత్యం వేధిస్తున్నాడని కళ్లెం లలిత బుధవారం లక్కవరం స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. లక్కవరం గ్రామానికి చెందిన లలితకు కృష్ణా జిల్లా తేలప్రోలు గ్రామానికి చెందిన నాగిరెడ్డికి గతంలో వివాహం జరిగిందని అన్నారు. అయితే ఇటీవల కాలంలో భర్త నాగిరెడ్డి మద్యం సేవించి వేధిస్తుండడంతో తల్లిదండ్రుల వద్దకు వచ్చి ఉంటుందని చెప్పారు. అయినా నిత్యం చరవాణి ద్వారా నాగిరెడ్డి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని లలిత ఫిర్యాదులో పేర్కొన్నట్లు వివరించారు. ఈ మేరకు ఎస్సై వి.జగదీశ్వరరావు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: తనను ప్రేమించాలంటూ ఇబ్బంది పెడుతున్నాడంటూ కోడూరి రవితేజ అనే వ్యక్తిపై ఓ విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జంగారెడ్డిగూడెం ఎస్సై జి.జే.విష్ణువర్ధన్ తెలిపారు.

వ్యక్తిపై ఫిర్యాదు

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: తన భర్త పేరున ఉన్న భూమి పత్రాలు ఇప్పిస్తానని కొంత సొమ్ము తీసుకుని మోసం చేశాడంటూ షేక్ షాహీదా ఫిర్యాదు చేసినట్లు జంగారెడ్డిగూడెం పోలీసులు తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో 1.20 ఎకరాల భూమి తన భర్త పేరున ఉందని రామారావు అనే వ్యక్తి వాటి పత్రాలను తన పేరున మార్పిస్తానని చెప్పి రూ.1.50 లక్షలు తీసుకుని మోసం చేశాడని షాహీదా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై విష్ణువర్ధన్ కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

బైండోవర్ కేసులు నమోదు

లక్కవరం(జంగారెడ్డిగూడెం గ్రామీణ), న్యూస్‌టుడే: సంక్రాంతి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో పేకాట, కోడి పందేలు వంటి జూద క్రీడలు అరికట్టేందుకు ముందస్తు చర్యలో భాగంగా నాగులగూడెం గ్రామానికి చెందిన 8 మందిపై హెచ్‌సీ రాజ్‌కుమార్ బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు లక్కవరం పోలీసులు తెలిపారు. అనంతరం వీరిని తహశీల్దార్ కోర్టుకు హాజరు పర్చినట్లు తెలిపారు.

తనపై దాడి చేశారంటూ ఫిర్యాదు

లక్కవరం(జంగారెడ్డిగూడెం గ్రామీణ), న్యూస్‌టుడే: తనపై దాడి చేశారంటూ నిమ్మలగూడెం గ్రామానికి చెందిన తానిగడప సుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు లక్కవరం ఎస్సై వి.జగదీశ్వరరావు తెలిపారు. గత కొంత కాలంగా నిమ్మలగూడెం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం మరి కొందరు వ్యక్తుల మధ్య పాత కక్షలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం కొక్కిరపాటి రాంబాబు మరో ఇద్దరు తనపై దాడికి పాల్పడ్డారని ప్రాణ భయంతో పారిపోయినట్లు సుబ్రహ్మణ్యం ఫిర్యాదులో పేర్కొన్నాడని ఎస్సై వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

దాడిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన సందీప్ అతని స్నేహితుడు మంగళవారం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మల్లిపూడి పెద్దిరాజు అనే వ్యక్తి రాయితో దాడి చేసినట్లు సందీప్ ఫిర్యాదు చేశాడని జంగారెడ్డిగూడెం ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

కదలని యంత్రాంగం.. వదలని కంపు..!

☛ పారిశుద్ధ్య నిర్వహణపై కొరవడిన కార్యాచరణ

☛ కలెక్టర్ ఆదేశాలు బేఖాతారు

జంగారెడ్డిగూడెంఅర్బన్, న్యూస్‌టుడే:

జిల్లాలోని అన్ని పురపాలక సంఘాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక కార్యాచరణతో పనులు చేపట్టాలని జిల్లా కలెక్టరు నవంబరులోనే కమిషనర్ల సమావేశంలో ఆదేశాలిచ్చారు. ప్రతి పట్టణంలో ప్రతి వార్డుకు ఒక ప్రత్యేకాధికారిని నియమించి సంపూర్ణ పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమం జంగారెడ్డిగూడెంలో మాత్రం 'మమ' అనిపించారు. ప్రస్తుతం పట్టణంలో పరిస్థితి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా ఉంది. స్థానిక మార్కెట్ యార్డు వద్ద ఉన్న ప్రధాన డ్రెయిన్‌లో మురుగును మోటార్ల సాయంతో తోడారు. అయితే ప్రస్తుతం అక్కడ మురుగు ఎప్పటిలాగానే ఉంది. పాతబస్టాండు సమీపంలో శ్మశాన వాటిక ఎదుట డ్రెయినేజీ పరిస్థితి అధ్వానంగా తయారయ్యింది. జంగారెడ్డిగూడెం పట్టణం నుంచి రాజమహేంద్రవరం వెళ్లే ప్రధాన రహదారి కావటంతో నిత్యం మురుగుతో వస్తున్న కంపుతో అనేక మంది ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. నగరపంచాయతీలో దాదాపు 80 మంది వరకూ పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు. వీరందరికి నెలకు రూ.9 లక్షలు పైనే జీతాలు చెల్లిస్తున్నారు. పట్టణంలో పందులతోపాటు కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతూ ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తున్నాయి. మురుగు కాల్వలు పూడిక తీయక కొన్ని చోట్ల రహదారులపైనే పొంగి పొర్లుతున్నాయి. అనేక నిషేధిత ప్రాంతాల్లో వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగించడంలో సిబ్బంది పూర్తిగా అలసత్వం వహిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వస్తున్నారంటేనే తప్ప ఆయా వార్డులను శుభ్రం చేయటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా నగరపంచాయతీ అధికారులు నిద్ర లేచి పట్టణ పారిశుద్ధ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.



మార్కెట్ యార్డు వద్ద ఉన్న మురుగు కాల్వ పరిస్థితి



శ్మశాన వాటిక ఎదురుగా డ్రెయినేజీ పరిస్థితి

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెడతాం...

పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెడతాం. నిత్యం ఉదయం మా సిబ్బందితో కలిసి నగర పర్యటన చేస్తున్నాం. గతంలో పట్టణంలో చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య పనులు మంచి ఫలితాన్ని ఇచ్చాయి. వాల్‌పోస్టర్లు, ప్లాస్టిక్ కవర్లపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందిస్తాం. మురుగు, పాలిథిన్ వ్యర్థాలతో పూడుకుపోయిన డ్రెయిన్లను పరిశీలించి సక్రమంగా మురుగు పారేలా చర్యలు తీసుకుంటాం.

- కె.ఎ.కొండలరావు, కమిషనరు, జంగారెడ్డిగూడెం

కలెక్టరు రూపొందించిన కార్యాచరణ వివరాలు ఇలా..

- ★ పోస్టర్లు, ఫ్లెక్సీలు, బ్యానర్లను పూర్తిగా తొలగించాలి.
- ★ అన్ని మురుగుకాలువల్లో పూడికను తీసి ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలి.
- ★ రహదారులు, కాలువల పక్కన ప్రభుత్వ పురపాలక, ప్రైవేటు ఖాళీ స్థలాల్లో ఉన్న పిచ్చిమొక్కలు, చుట్టూ ఉన్న పొదలు తొలగించాలి.
- ★ అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్తు, ఇతర తీగలను పూర్తి స్థాయిలో సరిచేయాలి.
- ★ పట్టణంలో పందులు, కుక్కలను నియంత్రించాలి.
- ★ బహిరంగ ప్రదేశాల్లో చెత్తను తొలగించి ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలి.

మహిళలే విద్యాభివృద్ధిలో కీలకం

లింగపాలెం, న్యూస్‌టుడే : మహిళలు విద్యాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని మండల విద్యాశాఖ అధికారి కె.రామారావు తెలిపారు. మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి భాయి పూలె జన్మదిన వేడుకల సందర్భంగా మండల వ్యాప్తంగా పలు పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ముడిచర్ల గ్రామంలో ఉపాధ్యాయురాలు రత్నదీప్తి సేవలను ఆయన అభినందించి ఆమెను సత్కరించారు. ప్రధానోపాధ్యాయులు నగరం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ముడిచర్లలో ఉపాధ్యాయురాలికి సన్మానం

మహిళలు... మహారాణులు మంత్రి జవహర్

చింతలపూడి, న్యూస్‌టుడే: ఒకప్పుడు సావిత్రి బాయి పూలే, ఆ తర్వాత కాలంలో ఎన్టీఆర్ వంటి మహనీయుల కృషి ఫలితంగా నేటి సమాజంలో మహిళలు అన్నిరంగాల్లో పురుషులతో సమానంగా, మహారాణుల్లా వెలుగొందుతున్నారని రాష్ట్ర మంత్రి కె.ఎస్.జవహర్ తెలిపారు. చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూసా నిధులు రూ.70 లక్షలతో మంజూరైన అదనపు తరగతి గదుల నిర్మాణానికి బుధవారం మంత్రి స్థానిక ఎమ్మెల్యే పీతల సుజాతతో కలసి భూమిపూజ జరిపారు. అనంతరం ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళల్లో ఆత్మవిశ్వాసం నింపుతూ ఆర్థిక స్వావలంబన వైపు నడిపిస్తున్నారని ఆయన వివరించారు. ఎమ్మెల్యే సుజాత మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కొత్తకోర్సులు తెచ్చి మరింతగా అభివృద్ధి పరుస్తామని చెప్పారు. ముందుగా వీరిరువురు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సావిత్రిబాయి పూలే అవార్డు గ్రహీత ఎం.ఎల్.వి.కుమారి, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయని కె.సుజాతలను వీరు సత్కరించారు. తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ప్రిన్సిపల్ సీహెచ్.ఉదయ శంకరం కళాశాల నివేదిక సమర్పించారు. అంతకుముందు మంత్రి, ఎమ్మెల్యేలు నూతనంగా ఇక్కడ నిర్మించిన పశువుల ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించారు. ఎంపీపీ దాసరి రామక్క, సర్పంచి మారిశెట్టి జగన్, మండల తెదేపా అధ్యక్షుడు శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న మంత్రి జవహర్, ఎమ్మెల్యే సుజాత

ఆడమిల్లి(కామవరపుకోట), న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కె.జవహర్ తెలిపారు. కామవరపుకోట మండలంలోని ఆడమిల్లి గ్రామంలో బుధవారం జరిగిన 'జన్మభూమి- మాఊరు' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. గ్రామంలోని ఉన్నత పాఠశాల క్రీడాస్థలాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆడమిల్లిలో ఇళ్లస్థలాల సమస్యపై ఎమ్మెల్యే పీతల సుజాతకు పలువురు మహిళలు విన్నవించారు. తదనంతరం రాయితీపై ప్రభుత్వం అందించే ట్రాక్టర్లను రైతులకు అందజేశారు. ఎంపీపీ సుబ్బలక్ష్మి, చినబాబు, గ్రామసర్పంచి అమృతరావు పాల్గొన్నారు.

సినిమాలు

చింతలపూడి

శ్రీరత్న	ఎంసీఏ(మిడిల్ క్లాస్ అబ్బాయ్)
శ్రీరత్నమినీ	హలో
శ్రీ శారద	ఒక్క క్షణం
శ్రీ గౌరీ	2 కంట్రీస్

జంగారెడ్డిగూడెం

లక్ష్మీ	హలో...!
సౌభాగ్య	జ్యూ మంజి 3డి (వెల్కంటు జంగల్)
సౌభాగ్య మినీ	2 కంట్రీస్
శ్రీరాజరాజేశ్వరి	ఎంసీఏ(మిడిల్ క్లాస్ అబ్బాయ్)
శ్రీపద్మ	ఒక్క క్షణం

ఏలూరు

విజయలక్ష్మి విమ్యాక్స్1	హలో
విజయలక్ష్మివిమ్యాక్స్2	మళ్లీరావా
అంబిక లిటిల్	టైగర్
అంబిక డీలక్స్	రాజా ది గ్రేట్
అంబికామినీ	జుమాంజీ
సత్యనారాయణ మినీ	ఒక్క క్షణం
సత్యనారాయణ	ఎంసీఏ (మిడిల్ క్లాస్ అబ్బాయ్
సాయిబాలాజీ	2 కంట్రీస్
బాలాజీ	ఖాకి
క్రాంతి	ఒక్క క్షణం

పల్లెకబుర్లు

కామవరపుకోట,న్యూస్‌టుడే: చిన్నమరావుపాలెం: గ్రామం నుంచి ద్వారకాతిరుమల వెళ్లేదారిలో మలుపుల వద్ద ప్రమాదసూచికలు ఏర్పాటు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు సంభవిస్తున్నాయని పలువురు వాపోతున్నారు.

వడ్లపల్లి: రామాలయం వద్ద చెత్త వేయకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. దోమలువ్యాప్తి చెందడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

చింతలపూడి

గెలుపే ‘గమ్యం’

☛ క్రీడల్లో వ్యాయామ విద్యార్థుల ముందంజ
☛ జాతీయ స్థాయిలో రాణింపు



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

వేగవరం(జంగారెడ్డిగూడెం గ్రామీణ), న్యూస్‌టుడే: వ్యాయమ విద్యతోపాటు, క్రీడల్లోనూ జాతీయ స్థాయిలో రాణిస్తూ తమ సత్తా సాటుతున్నారు వేగవరం వ్యాయామ కళాశాల విద్యార్థులు. దక్షిణ భారత దేశం, అధికవి నన్నయ్య విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన క్రీడా పోటీలలో తమ ప్రతిభను చూపుతూ పతకాల పంట పండిస్తున్నారు. 800, 100 మీటర్ల పరుగు, వాలీబాల్, తైకాండో, రిలే పరుగు, అథ్లెటిక్స్ క్రీడలు, ఖోఖో ఇలా జరిగిన ప్రతి పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలుస్తూ విజయాలు నమోదు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఇంటర్ యూనివర్సిటీ స్థాయి నుంచి జాతీయ స్థాయి పోటీల వరకూ సుమారు 18 మంది విద్యార్థులు పోటీలకు అర్హత సాధించారు. వ్యాయమ విద్యార్థుల ఎంపిక పరీక్షలో అత్యున్నత ర్యాంకులు సాధించి కళాశాలలో వ్యాయామ శిక్షణ పొందుతూ భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్నారు.

ప్రభుత్వ ఉద్యోగం కోసం...



గుంటూరు, కాకినాడ, గుంతకల్లు తదితర పట్టణాల్లో జరిగిన ఇంటర్ యూనివర్సిటీ క్రీడా పోటీల్లో రాణించాను. సౌత్ జోన్ స్టేట్ మీట్‌లో 4 పర్యాయాలు 100 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించాను. 2017 ఇంటర్ యూనివర్సిటీ పరుగు పందెంలో రెండు సార్లు గోల్డ్ మెడల్ కైవసం చేసుకోవడంతోపాటు రెండు కాంస్య పతకాలు, రెండు వెండి పతకాలతో యూనివర్సిటీ స్థాయిలో విజేతగా నిలిచాను. బీపీడీ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగం పొందాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాను.

-చేకూరి శివకుమార్, బీపీడీ మొదటి సంవత్సరం

ఎన్ఐఎస్ స్థానం సాధిస్తా...



20 కి.మీ నడక పోటీల్లో నాలుగు పర్యాయాలు విజేతగా నిలవడంతోపాటు బంగారు పతకాన్ని అందుకున్నాను. ఇంటర్ యూనివర్సిటీ పరిధిలో జరిగిన భీమవరం, కాకినాడ, గోపన్నపాలెం, పెద్దాపురం తదితర ప్రదేశాల్లో జరిగిన పరుగు, కాలినడక పోటీల్లో పాల్గొన్నాను. ఇప్పటి వరకూ మూడు బంగారు, రెండు వెండి పతకాలు సాధించాను. ఎన్ఐఎస్(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్)లో చేరాలన్నదే నాధ్యేయం. - **వి.శాంతకుమార్, బీపీడీ, ప్రథమ సంవత్సరం.**

తైక్వాండోలో రాణించాలి..



అల్ ఇండియా యూనివర్సిటీ స్థాయిలో తైక్వాండో పోటీలకు ఎంపికయ్యాను. జావలింగ్ త్రోలో ద్వితీయ, తృతీయ స్థానం సాధించాను. తైక్వాండోలో మరింత శిక్షణ తీసుకుని జాతీయ స్థాయిలో రాణించాలని నిరంతరం సాధన చేస్తున్నాను.

- టి.శ్రీనివాస్, బీపీడీ, ప్రథమ సంవత్సరం.

వ్యాయామ ఉపాధ్యాయురాలిని అవుతా



చిన్నతనం నుంచి ఖోఖో క్రీడపై ఎంతో ఆసక్తితో శిక్షణ పొందుతున్నాను. ఇప్పటి వరకు వివిధ పట్టణాల్లో జరిగిన సుమారు 22 పోటీల్లో పాల్గొన్నాను. రాష్ట్ర స్థాయిలో తమిళనాడులో చింతంపల్లి, సౌత్ ఇండియా స్థాయిలో చెన్నై నగరంలో జరిగిన పోటీల్లో ఆడాను. సౌత్ ఇండియా స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన చూపడంతో బంగారు పతకం అందుకున్నాను. వ్యాయామ ఉపాధ్యాయురాలు కావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాను.

- జి.మమత, బీపీడీ, ప్రథమ సంవత్సరం

అథ్లెటిక్స్ కోచ్ కావడమే లక్ష్యం...



వ్యాయామ విద్యార్థుల ఎంపిక పరీక్షలో 50వ ర్యాంకు సాధించాను. పాఠశాల దశ నుంచి క్రీడలపై శ్రద్ధతో నిరంతర సాధనతో విజయాలు సొంతం చేసుకున్నాను. బీపీడీ మొదటి సంవత్సరం చదువుతున్నాను. 2014వ సంవత్సరం నుంచి ఇప్పటి వరకూ 800, 400 మీటర్ల పరుగు, 4 పర్యాయాల 100 మీటర్ల రిలై పరుగు పందాల్లో పలు ప్రథమ, ద్వితీయ పతకాలు అందుకున్నాను. వాటిలో బంగారు పతకాలు 8, వెండి పతకాలు 9 ఉన్నాయి. జాతీయ స్థాయిలోను రాణించి అథ్లెటిక్స్ కోచ్ కావాలన్నదే నా లక్ష్యం.

- పి.నాగదుర్గరాజు, బీపీడీ, ప్రథమ సంవత్సరం

ఫిజికల్ డైరెక్టర్ కావాలి...



అథ్లెటిక్స్ 200 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం సాధించాను. 100 మీటర్ల పరిధిలో యూనివర్సిటీ స్థాయిలో జరిగిన పరుగు పందెంలో రెండు సార్లు స్వర్ణ పతకాలు సొంతం చేసుకోవడంతో పాటు ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో 4 పర్యాయాలు, 100 మీటర్ల పరుగులో రెండు దఫాలు ప్రథమ స్థానంలో నిలిచాను. ఇప్పటి వరకూ పాల్గొన్న పోటీల్లో అన్నింటితో కలిపి 10 బంగారు, 11 వెండి పతకాలు అందుకున్నాను. బీపీడీ శిక్షణ పూర్తి చేసి ఎంపీడీ చేయడంతో పాటు ఫిజికల్ డైరెక్టర్ ఉద్యోగం సాధించాలని పట్టుదలతో కృషి చేస్తున్నాను. **- షేక్ మున్నీర్ అహ్మద్, బీపీడీ, ప్రథమ సంవత్సరం.**

సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి

జంగారెడ్డిగూడెంఅర్బన్, న్యూస్‌టుడే: సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని విద్యుత్తు ఒప్పంద ఉద్యోగులు జంగారెడ్డిగూడెం డివిజనల్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. జెన్ కో, ట్రాన్స్‌కో, డిస్ట్రిబ్యూషన్ కంపెనీలలో పని చేస్తున్న విద్యుత్తు ఒప్పంద ఉద్యోగులందరిని విద్యుత్తు సంస్థలోకి విలీనం చేసుకుని నేరుగా విద్యుత్తు శాఖ నుంచే జీతాలు ఇవ్వాలని డిమాండు చేశారు.

అన్నదాన పథకానికి రూ.50 వేల విరాళం



అన్నదాన విరాళాన్ని ఈవోకు అందజేస్తున్న భక్తులు

గుర్వాయిగూడెం(జంగారెడ్డిగూడెం గ్రామీణ), న్యూస్‌టుడే: గుర్వాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామివారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి విరాళాలు వెల్లువలా వస్తున్నాయి. ఆలయంలో నిత్యాన్నదానం ప్రారంభించిన నాటి నుంచి భక్తులు విశేషంగా స్పందిస్తూ విరాళాలు అందిస్తున్నారు. బుధవారం ద్వారకతిరుమల మండలం పంగిడిగూడెం గ్రామానికి చెందిన వడ్లపూడి వెంకటరత్నం, నాగమణి దంపతులు శాశ్వత నిత్యాన్నదాన పథకానికి రూ.50 వేలు కార్యనిర్వాహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు చేతుల మీదుగా దేవస్థానానికి అందించారు. ఈ సందర్భంగా దాతలకు ధర్మకర్తల మండలి ఛైర్మన్ ఇందుకూరి రంగరాజు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా లోకానికి సావిత్రిబాయిపూలే ఆదర్శం

శ్రీనివాసపురం(జంగారెడ్డిగూడెం గ్రామీణ), న్యూస్‌టుడే: సావిత్రిబాయిపూలే మహిళా లోకానికి ఆదర్శంగా నిలిచారని శ్రీనివాసపురం ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పగం శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా స్థానిక పాఠశాలలో విద్యార్థులకు సమాజంలో ఆమె చేపట్టిన సంస్కరణలు, సేవలను వివరించారు.

చింతలపూడి, న్యూస్‌టుడే: భారతదేశ ప్రథమ మహిళా ఉపాధ్యాయురాలు, ప్రముఖ సంఘసేవకురాలు సావిత్రిబాయి పూలే జయంతిని బుధవారం చింతలపూడి భారతీయ జనతాపార్టీ మహిళామోర్చ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా మోర్చ కార్యవర్గ సభ్యురాలు పట్నాల విజయలక్ష్మి తదితరులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

చింతంపల్లి, ఊటసముద్రం (చింతలపూడి గ్రామీణ), న్యూస్‌టుడే: అన్నివర్గాల వారికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని ఏలూరు ఆర్డీవో చక్రధరరావు తెలిపారు. బుధవారం ఆయన ఊటసముద్రంలో జరిగిన ‘జన్మభూమి- మాఊరు’ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 126 దరఖాస్తులు వచ్చినట్లు తహశీల్దార్ మైఖేల్‌రాజ్ తెలిపారు. గ్రామస్థులకు సంక్రాంతి కానుకలను అధికారులు అందజేశారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారి బి.గోపీకుమార్, ఏవో ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

రుణమాఫీ జరగలేదని రైతుల ఆందోళన

ఊటసముద్రం గ్రామంలో రైతులందరికీ 3వ విడత రుణమాఫీ జరిగినట్లు అధికారులు చెబుతుండగా మధ్యలో రైతులు కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. తమకు రుణమాఫీ నగదు జమ కాలేదని వీరు ఆందోళన చేపట్టారు. త్వరలోనే రైతులందరికీ రుణమాఫీ నగదు జమ అవుతుందని అధికారులు సర్దిచెప్పడంతో కార్యక్రమం తిరిగి ప్రారంభమయింది.

చింతంపల్లి: జన్మభూమి కార్యక్రమంలో 123 దరఖాస్తులు వచ్చినట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో రాజగోపాల్ తెలిపారు. మండల ప్రత్యేకాధికారి డీఆర్డీఏ పీడీ శ్రీనివాసులు మాట్లాడారు.

నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ శివలక్ష్మి

పాతబస్టాండు, బోసుబొమ్మ కూడలి, పేరంపేట రోడ్డు, ఆర్డీవో కార్యాలయం (జంగారెడ్డిగూడెం నగరపంచాయతీ), న్యూస్‌టుడే: ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను స్వయంగా తెలుసుకుని సత్వర పరిష్కార మార్గం చూపేందుకే ‘జన్మభూమి- మా ఊరు’ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశ పెట్టారని నగరపంచాయతీ ఛైర్‌పర్సన్ బంగారు శివలక్ష్మి తెలిపారు. పట్టణంలోని 5, 6, 7, 8 వార్డుల్లో వేర్వేరుగా బుధవారం నిర్వహించిన జన్మభూమి ప్రత్యేక సమావేశాల్లో ఆమె మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారు తమ ఆధార్‌కార్డు, ఫోన్ నంబరును తప్పనిసరిగా దరఖాస్తుకు జతచేసి సంబంధిత అధికారులకు అందించాలని కోరారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, వ్యక్తిగత శుభ్రత పాటించడం వల్ల అనేక రుగ్మతల నుంచి తప్పించుకోవచ్చని చెప్పారు. సభకు హాజరైన నగర పంచాయతీ కమిషనరు కొండలరావు, వైస్ ఛైర్మన్ అట్లూరి రామమోహనరావు, ప్రత్యేక అధికారిణి వై.అమ్మాజీ, పట్టణ అధ్యక్షుడు షేక్ ముస్తాఫా, తెదేపా సీనియర్ నాయకులు పెనుమర్తి రాంకుమార్, అబ్బిన దత్తాత్రేయ, మందపల్లి లక్ష్మయ్య, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కె.ప్రసాద్, కౌన్సిలర్లు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.



మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ శ్రీనివాసులు



మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ బంగారు శివలక్ష్మి

శ్రీనివాసపురం, మైసన్నగూడెం, పట్టెన్నపాలెం, అక్కంపేట(జంగారెడ్డిగూడెం (గ్రామీణ), న్యూస్‌టుడే: సమస్యలపై ప్రజల వినతులు, అధికారుల వాగ్దానాల నడుమ జన్మభూమి-మాఊరు కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. మైసన్నగూడెం, పట్టెన్నపాలెం గ్రామాల్లో ఎంపీడీవో పి.శ్రీదేవి, అక్కంపేట, శ్రీనివాసపురం గ్రామాల్లో తహశీల్దార్ జి.వి.వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా శ్రీనివాసపురం గ్రామంలో ఏడు కొత్తరేషన్ కార్డులు అందించడంతోపాటు రైతు రుణమాఫీ పత్రాలు, డ్వాక్రా మహిళలకు వడ్డీ రాయితీ పత్రాలు అందించారు. అక్కంపేటలో పంచాయతీ కార్యాలయం, ఎస్సీ కాలనీలో 11 కేవీ విద్యుత్ తీగలు ఇళ్ల మధ్యలో ప్రమాదకరంగా ఉన్నాయని ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్ల మంజూరు చేయాలంటూ అక్కంపేట 30, శ్రీనివాసపురం 170, మైసన్నగూడెం 29, పట్టెన్నపాలెం 13 వినతులను ప్రజల నుంచి అధికారులు స్వీకరించారు. మైసన్నగూడెంలో ఎస్సీ కాలనీలో మంచినీటి సమస్య ఉందని పరిష్కరించాలని కాలనీ వాసులు అధికారులకు విన్నవించారు. నాల్గో విడత జన్మభూమిలో వచ్చిన వినతులను దాదాపు పరిష్కరించామని జన్మభూమి ప్రత్యేక అధికారి డీఎఫ్‌వో నాగేశ్వరరావు వివరించారు. ఈ కార్యక్రమాల్లో జడ్పీటీసీ శీలం రామచంద్రరావు, తెదేపా నాయకులు పెనుమర్తి రామ్‌కుమార్, కొడవటి సత్యరాజు, పసుపులేటి సూర్యచంద్రం, దాసరి శ్యామ్‌సుందర్, ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సింగగూడెం, లింగపాలెం, న్యూస్‌టుడే : పారదర్శకంగా అర్హులను పథకాలకు ఎంపిక చేస్తున్నట్లు ఎంపీపీ మల్లికార్జునరావు తెలిపారు. బుధవారం మండలంలోని సింగగూడెం, లింగపాలెం గ్రామాల్లో నిర్వహించిన 5వ విడత జన్మభూమి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నూతన రేషన్ కార్డుల మంజూరు త్వరలో చేపడుతున్నట్లు జడ్పీటీసీ సభ్యుడు పెదబాబు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ సోమశేఖరరావు, ఎంపీడీవో కృష్ణకుమారి, వివిధ శాఖల అధికారులు, వైద్యులు, పోలీసులు పాల్గొన్నారు.

ఏలూరు

స్పీడ్‌గన్‌తో వాహన తనిఖీలు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఏలూరు శివారు సోమవరప్పాడు సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం ట్రాఫిక్ పోలీసులు స్పీడ్‌గన్‌తో వాహనాల వేగాన్ని తనిఖీ చేశారు. నిబంధనలు మీరి అతివేగంతో ప్రయాణిస్తున్న 21 వాహనాలను గుర్తించి వాటి చోదకులపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నమాజు వేళలు



ఫజర్	ఉదయం	5.50 గం.
జొహర్	మధ్యాహ్నం	1.30 గం.
అసర్	సాయంత్రం	4.15 గం.
మగరిబ్	సాయంత్రం	5.42 గం.
యిషా	రాత్రి	8.15 గం.



ఏలూరు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:

వామనమూర్తిగా వాసుదేవస్వామి

పవర్‌పేట, అగ్రహారం(ఏలూరు ఆధ్యాత్మికం), న్యూస్‌టుడే: ధనుర్మాస మహోత్సవాల సందర్భంగా పవరుపేటలోని శ్రీవాసుదేవ ఆలయంలో స్వామిని బుధవారం శ్రీవామనావతారమూర్తిగా అలంకరించారు. తిరుప్పావై, విష్ణుసహస్ర నామ పారాయణలు చేశారు.

★ అగ్రహారం జనార్ధనస్వామి ఆలయంలో స్వామిని శ్రీపరశురామావతారమూర్తిగా అలంకరించారు. గోష్టి బృందం సభ్యులు తిరుప్పావై దివ్యప్రబంధ పారాయణలు చేశారు.



వామనావతారమూర్తిగా శ్రీవాసుదేవస్వామి

రాట్నాలమ్మ ఆలయానికి విరాళాలు

పెదవేగి,న్యూస్‌టుడే: రాట్నాలమ్మ ఆలయ పునర్నిర్మాణానికి పెరికీడుకు చెందిన సత్యభాస్కర్‌గణేష్‌బాబు రూ.10,116, కరీంనగర్‌కు చెందిన పులికంటి నీరజ హరికృష్ణ రూ 6,011 విరాళం అందించారు. ఆలయ ఛైర్మన్ రాయల భాస్కరరావు, ఈవో అరుణ్‌కుమార్ చేతుల మీదుగా ఈ విరాళాలను అమ్మవారి సన్నిధిలో అందజేశారు.

సహాయ కేంద్రం ఏర్పాటు

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ ఆధ్వర్యంలో ఈనెల 5న రాజమహేంద్రవరం వద్ద నన్నయ వర్సిటీలో, 6న అమలాపురం వద్ద ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో జాబ్ మేళాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి వందన జీవన్‌శ్యామ్, నగర అధ్యక్షుడు అబ్బూరి అనిల్‌లు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ జాబ్ మేళాలకు హాజరయ్యే వారి కోసం ఏలూరు మండలం వెంకటాపురం వద్ద వినాయక్‌నగర్‌లో ఉన్న మాలమహానాడు కార్యాలయంలో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దీనిద్వారా అభ్యర్థులకు తగిన సలహాలు, సూచనలు అందిస్తామన్నారు.

మద్యం తాగిన చోదకుడికి జైలు శిక్ష

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: మద్యం తాగిన వాహనం నడిపిన చోదకుడికి న్యాయస్థానం రెండురోజుల జైలుశిక్ష విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత సంవత్సరం డిసెంబరు 31న రాత్రి వాహనదారులకు శ్వాసనిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో పట్టుబడిన ఏలూరుకు చెందిన నారాయణను బుధవారం ఎక్సైజ్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి పీఎస్ ప్రదీప్ నిందితుడికి రెండు రోజుల జైలుశిక్షతో పాటు రూ. 1000 అపరాధరుసుము విధించినట్లు పోలీసులు తెలిపారు.

400 మందికి ఉచిత నేత్ర పరీక్షలు

అగ్రహారం(ఏలూరు సాంస్కృతిక), న్యూస్‌టుడే: అగ్రహారంలోని సీతారామభర్తియా మర్చంట్స్ ఛాంబర్ కల్యాణ మండపంలో బుధవారం సూర్యా గ్రూప్స్ ఛైర్మన్ చామర్తి కృష్ణారావు సౌజన్యంతో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరం (వేమగిరి) శ్రీపరమహంస యోగానంద నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో 400 మందికి ఉచితంగా నేత్ర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేసి కళ్లజోళ్లు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యనిర్వాహకులు చామర్తి దిలీప్, మానేపల్లి రామారావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీస్ జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల రాజేంద్ర, సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మార్పు కోసం మమేకం..!

★ రౌడీ కార్యకలాపాల నియంత్రణపై పోలీసుల దృష్టి
★ కౌన్సెలింగ్‌తో పాటు కుటుంబీకుల్లో చైతన్యం



ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రమైన ఏలూరులో గత కొన్నేళ్లుగా హత్యలు, హత్యాయత్నాలు, భూకబ్జాలు, అవహరణలు, సెటిల్‌మెంట్లు, కిరాయి నేరాలు పెరుగుతుండటంతో జనం భయాందోళనలతో గడపాల్సిన పరిస్థితి నెలకొంది. వీటన్నింటికీ రౌడీలు, అల్లరిమూకల ఆగడాలు పెరగడమే ప్రధాన కారణం. వారి కార్యకలాపాలను సమూలంగా అరికడితే హింసాయుత ఘటనలకు అడ్డుకట్ట పడుతుంది. ప్రస్తుతం ఏలూరు సబ్ డివిజన్ పోలీసులు ఇలాంటి ప్రయత్నమే చేస్తున్నారు. నగరంతో పాటు పరిసర గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు వినూత్న చర్యలు చేపట్టారు. సమస్య మూలాలను గుర్తించి అక్కడ అడ్డుకట్ట వేసే దిశగా కొద్ది కాలం నుంచి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఏలూరు సబ్ డివిజన్ పరిధిలో 218 మందిపై రౌడీ షీట్‌లున్నాయి. ఏలూరు నగరంలోనే 110 మందిపై రౌడీషీటర్‌లు ఉన్నారు. తాజాగా మరో 45 మందిపై రౌడీషీట్‌లు తెరిచారు. దీంతో పాటు నేర ప్రవృత్తి కలిగిన 30 మంది జాబితాను సిద్ధం చేసి వారిపై కూడా రౌడీషీట్‌లు తెరిచేందుకు రంగం సిద్ధం చేశారు. రౌడీయిజాన్ని పూర్తిగా రూపుమాపాలన్న సంకల్పంతోనే పోలీసులు ముందుకు వెళుతున్నారు. ఏడాది క్రితం నుంచి నగరంలో జరిగిన హత్యలు, హత్యాయత్నాల కేసులతో సంబంధం ఉన్న ముద్దాయిలపై రౌడీషీట్‌లు తెరిచారు. వీరి కదలికలపై నిరంతరం నిఘా పెట్టడంతో పాటు వారు నేరాలకు పాల్పడకుండా నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

ద్విముఖ వ్యూహం..

రౌడీషీటర్లలో మార్పు తెచ్చే దిశగా పోలీసులు కొత్త విధానాలను అమల్లోకి తెచ్చారు. గతంలో వారంతా రౌడీలను పోలీసుస్టేషన్లకు పిలిపించి కౌనెలింగ్ నిర్వహించేవారు. ఎస్పీ రవిప్రకాష్ ఈ పద్ధతో మార్పులు చేశారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా పోలీసు అధికారులే రౌడీషీటర్లకు వెళ్లి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. వారి కుటుంబీకులు, చుట్టుపక్కల వారితో కూడా మాట్లాడి వివిధ అంశాలపై ఆరా తీస్తున్నారు. రౌడీషీటర్ల ఆదాయ వనరులు ఏమిటి, కుటుంబాన్ని ఎలా పోషించుకుంటున్నారు అనే విషయాలను తెలుసుకుంటున్నారు. కష్టపడి పనిచేసి సంపాదిస్తున్నారా లేక అక్రమ మార్గంలో దందాలు, కిరాయి నేరాలకు పాల్పడి డబ్బు సంపాదిస్తున్నారా అనేది తెలుసుకుంటున్నారు. వారి కుటుంబ సభ్యులతో మమేకమై పిల్లలు చదువులకు సంబంధించి విషయాలను తెలుసుకుంటున్నారు. రౌడీషీటర్లు నేరప్రవృత్తిని విడిచిపెడితే పిల్లలను బాగా చదివించడంతో సమాజంలో గౌరవప్రదంగా జీవించవచ్చనే విషయాన్ని కుటుంబ సభ్యులకు వివరిస్తున్నారు. నేరాలను విడిచిపెట్టి కుటుంబ సభ్యులతో హాయిగా జీవిస్తే రౌడీషీట్ తొలగించడంతో పాటు పోలీసు నిఘాను ఉపసంహరిస్తామని చెబుతున్నారు. ఇలా పోలీసు శాఖా పరంగా, కుటుంబ సభ్యుల ద్వారా వారిలో మార్పుతెచ్చేందుకు ప్రయత్నిసున్నారు. దీంతో పరిస్థితిలో కొంత మార్పు వచ్చిందని.. కొందరు నేర ప్రవృత్తిని వీడి సత్ప్రవర్తనతో మెలుగుతున్నారని పోలీసు అధికారులు చెబుతున్నారు.

గ్రేడులతో గుర్తింపు..

మార్పుకోసం పలు ప్రయత్నాలు చేసిన తరువాత కూడా నగరంలో 37 మంది రౌడీషీటర్లు తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం వీరిని ఏ గ్రేడు రౌడీషీటర్లుగా విభజించారు. వీరి కదలికలపై నిరంతరం నిఘా ఉంచడం ద్వారా నేరాలను అరికడతామని పోలీసు అధికారులు చెబుతున్నారు.

అడ్డుకట్ట వేస్తాం..



ఎస్పీ రవిప్రకాష్ సూచనల ప్రకారం రౌడీషీటర్లలో మార్పు తీసుకువచ్చి వారు సమాజంలో మంచి పౌరులుగా జీవించే అవకాశం కల్పించేలా తగిన కౌన్సెలింగ్ ఇస్తున్నాం. దీనికి సమాంతరంగా క్రియాశీలకంగా ఉన్న రౌడీషీటర్ల కదలికలపై పూర్తి నిఘా పెట్టాం. తద్వారా నేరాలు జరగకుండా ముందుగానే పసిగట్టి ఛేదిస్తున్నాం. ఈ చర్యలతో నగరంలో రౌడీయిజాన్ని తగ్గించగలిగాం. క్రమంగా పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేస్తాం.

- కె.ఈశ్వరరావు, డీఎస్పీ, ఏలూరు

జీవో 151 అమలు కోరుతూ ధర్నా

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: పురపాలక ఒప్పంద కార్మికులకు జీవోనెం.151 ప్రకారం జీతాలు పెంచి అమలు చేయాలని, 17 నెలల అరియర్స్ ఇవ్వాలని కోరుతూ నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద కార్మికులు బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర, ఆరోగ్య అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. మునిసిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ పిలుపు మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో ఒప్పంద కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ధర్నాను ఉద్దేశించి సంఘం ప్రధాన కార్యదర్శి బి.సోమయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఒప్పంద సిబ్బందికి జీతాలు పెంచుతూ జీవో విడుదల చేసి 17 నెలలు కావస్తున్నా నగరపాలక సంస్థ అధికారులు అమలు చేయడంలేదని తెలిపారు. జీవో అమలైతే ఒప్పంద కార్మికుల వేతనం రూ.11 వేల నుంచి రూ.12 వేలకు జరుగుతుందన్నారు. దీంతో పాటు 17 నెలల అరియర్స్ వస్తాయన్నారు. నగరపాలక అధికారులు మూడు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో కార్మికుల కుటుంబాలు పస్తులు ఉండాల్సి వస్తోందన్నారు. జీవో 151 అమలుచేసి జీతాలు పెంచాలని, 17 నెలల అరియర్స్, 3 నెలల బకాయి జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పనులు నిలుపుదల చేసి ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.



ధర్నా చేస్తున్న కార్మికులు

కోడిపందేలకు దూరంగా ఉండండి

పెదవేగి, న్యూస్‌టుడే: కోడిపందేలు, కోతముక్క, గుండాట వంటి అసాంఘిక కార్యకలాపాలను ఉక్కుపాదంతో అణచి వేస్తామని ఏలూరు గ్రామీణ సీఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. పెదవేగి మండలం లక్ష్మీపురం, కవ్వగుంట గ్రామాలలో ప్రతిఏటా కోడిపందేలను నిర్వహించే బరులను ఆయన పరిశీలించారు. అనంతరం కవ్వగుంట గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులను అనుసరించి కోడిపందేల రాయుళ్లపై కఠిన చర్యలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కోడిపందేల నిర్వహించేవారిపై జీవహింస నిరోధక చట్టం కింద చర్యలు చేపడతామన్నారు. గ్రామీణ పరిధిలో విస్తృతంగా నిఘాబృందాలు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. కోళ్ల కాళ్లకు కత్తులు కట్టే పలువురిని ఇప్పటికే అదుపులోకి తీసుకున్నామన్నారు. సంక్రాంతి పండుగను ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో పెదవేగి ఎస్సై కాంతిప్రియ, తహశీల్దార్ నజీముల్లాషా, పెదవేగి సహకార సంఘం అధ్యక్షుడు ఉండవల్లి వెంకట్రావు, సర్పంచులు మేకా రంగారావు, సుగసాని లక్ష్మీకాంతం గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురి అరెస్ట్: రామశింగవరం గ్రామంలో కోడిపందేల స్థావరాలపై దాడిచేసి ఏడుగురు పందెంరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్సై కాంతిప్రియ తెలిపారు. వారివద్ద నుంచి రూ 3200 నగదు, 3 కోళ్లు, 2 కోడికత్తులు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

మృతుడి ఆచూకీ లభ్యం

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో ఇటీవల అనుమానాస్పదంగా మృతిచెందిన వ్యక్తి ఆచూకీ లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకివీడుకు చెందిన బంకి నర్సింహులు (41)కు అనారోగ్యంగా ఉండటంతో గతనెల 24న కుటుంబసభ్యులు అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా టీ తాగేందుకు ఆసుపత్రి బయటకు వచ్చిన నర్సింహులు కనిపించకుండా పోయాడు. కుటుంబసభ్యులు ఆ ప్రాంతంలో గాలించినా ఆచూకీ లభించలేదు. ఈ నెల 1న పాతబస్టాండ్ సమీపంలోని కోడేలు వంతెన వద్ద అతడు చనిపోయి ఉండటంతో పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. దీనిపై బుధవారం పత్రికల్లో వచ్చిన సమాచారం ఆధారంగా కుటుంబసభ్యులు విషయం తెలుసుకుని ఏలూరు వచ్చి పోలీసులకు వివరాలు వెల్లడించారు. ఇతను ముఠాకూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవారని పోలీసులు తెలిపారు. అనారోగ్య కారణాల వల్లే చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతూ ఓ వ్యక్తి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమడోలు మండలం అన్నేవారిగూడేనికి చెందిన కుంచె కృష్ణమూర్తి(60) ఈనెల 2న పురుగుమందు తాగారు. దీనిని గమనించిన కుటుంబసభ్యులు ఆయనను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందారు. దీనిపై భీమడోలు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఏలూరు

విజయలక్ష్మి విమ్యాక్స్1	హలో
విజయలక్ష్మివిమ్యాక్స్2	మళ్లీ రావ..
అంబిక లిటిల్	టైగర్
అంబిక డీలక్స్	రాజా ది గ్రేట్
అంబికామినీ	జుమాంజీ
సత్యనారాయణ మినీ	ఒక్క క్షణం
సత్యనారాయణ	ఎంసీఏ (మిడిల్ క్లాస్ అబ్బాయ్)
సాయిబాలాజీ	2 కంట్రీస్
బాలాజీ	ఖాకి
క్రాంతి	ఒక్క క్షణం

ఏలూరు

6న ప్రాంగణ ఎంపికలు

ఏలూరు విద్యావిభాగం, న్యూస్‌టుడే: జవహర్ నాలెడ్జి కేంద్రం, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 6న ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రధానాచార్యుడు డాక్టర్ ఐకేవీ ప్రసాద్ తెలిపారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తిచేసి 18 నుంచి 25 సంవత్సరాలలోపు వయసున్న యువకులు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం 81063 52242 నెంబరులో సంప్రదించవచ్చని తెలిపారు.

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే:

ఉదయం 10 గంటలకు: కలెక్టరేట్‌లో లూయీ బ్రెయిలీ జయంతి వేడుక.

సాయంత్రం 6.30 గంటలకు: వైఎంహెచ్‌ఏ హాలులో 'జన్మభూమి-సంక్రాంతి' సాంస్కృతిక కార్యక్రమాలు.

సావిత్రిబాయి పూలే సేవలు చిరస్మరణీయం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: సావిత్రిబాయి పూలే మహిళల కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు ఎన్. జగదాంబ, గాళ్ళ శారద పేర్కొన్నారు. జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం ఏలూరు స్ఫూర్తిభవన్‌లో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే భర్త ప్రోత్సాహంతో ఇంట్లోనే అక్షరాభ్యాసం చేసి విద్యావంతురాలయ్యారన్నారు. అట్టడుగు వర్గాల మహిళలకు చదువు ద్వారానే విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన సావిత్రిబాయి భర్తతో కలిసి పుణేలో తొలి బాలికల పాఠశాలను ప్రారంభించారన్నారు. నూతన వ్యవస్థ కోసం ప్రాణాల్ని సైతం పణంగా పెట్టి పోరాటం చేశారన్నారు. సావిత్రిబాయిపూలే ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాని పిలుపునిచ్చారు. మహిళా సమాఖ్య నగర అధ్యక్షురాలు ఆర్. రోజా, నాయకులు రామలక్ష్మి, భాగ్యలక్ష్మి, ఉప్పులూరి లక్ష్మి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: దేశం సమగ్రాభివృద్ధి సాధించాలంటే మహిళా సాధికారత అనివార్యమని బహుజన ప్రజానిక సంఘం జిల్లా అధ్యక్షురాలు ఘంటసాల వెంకటలక్ష్మి అన్నారు. సావిత్రిబాయి లే జయంతిని పురస్కరించుకొని ఏలూరు జిల్లా పరిషత్తు కార్యాలయ ఆవరణలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే,



జ్యోతిబాపూలే, సావిత్రిబాయి విగ్రహాలకు పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న మహిళా నాయకులు

సావిత్రిబాయిపూలే విగ్రహాలకు ఆమెతో పాటు సంఘం ఉపాధ్యక్షురాలు మొతిక రాఘవలు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ సావిత్రిబాయి జయంతిని జాతీయ మహిళా టీచర్స్‌డేగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సావిత్రిబాయిపూలే స్ఫూర్తితోనే దేశంలో మహిళలు, బాలికలు విద్యను అభ్యసిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక కమిటీ సభ్యుడు మేతర అజయ్‌బాబు, బి. కనకదుర్గ, జ్యోతిపుష్ప తదితరులు పాల్గొన్నారు.

బాలికా విద్యాభివృద్ధికి కృషి

ఏలూరు విద్యావిభాగం, న్యూస్‌టుడే: బాలికా విద్యాభివృద్ధికి ఎనలేని కృషిచేసిన మహనీయురాలు సావిత్రిబాయిపూలే అని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. గోపిమూర్తి కొనియాడారు. సావిత్రిబాయి పూలే జయంతి వేడుకను స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. తొలుత సావిత్రిబాయిపూలే చిత్రపటానికి యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సాబ్జీ పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గోపిమూర్తి మాట్లాడుతూ మహిళా ఉపాధ్యాయులకు తగిన గుర్తింపుతెచ్చిన ఘనత సావిత్రిబాయికే దక్కుతుందన్నారు. సాబ్జీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయినుల కోసం తగిన సదుపాయాలను కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి. జయకర్, నాయకులు కనకదుర్గ, నరసింహారావు, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఆపస్ ఆధ్వర్యంలో..

సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) ఆధ్వర్యంలో ఉపాధ్యాయినులకు గోడపత్రాలను పంపిణీ చేశారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా ఉత్తమ ఉపాధ్యాయినులుగా సన్మానం పొందినవారికి ఆపస్ జిల్లా అధ్యక్షుడు రాజకుమార్ గోడపత్రాలను పంపిణీ చేశారు.



కె. నాగశ్రీవల్లి, హనుమాన్ నగర్, ఏలూరు



జి. ప్రసూన, తంగెళ్లమూడి



నాగమణి బుద్ధదేవ్ శిష్యబృందం కూచిపూడి నృత్యాలు

సందడిగా సంక్రాంతి సంబరాలు

అగ్రహారం(ఏలూరు సాంస్కృతిక), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం, భాషా సాంస్కృతిక విభాగం సంయుక్త ఆధ్వర్యంలో అగ్రహారంలోని వైఎంహెచ్‌ఏ హాలులో బుధవారం నిర్వహించిన జన్మభూమి- సంక్రాంతి సంబరాలు అలరించాయి. ఏలూరుకు చెందిన శ్రీనివాస్ ఇంద్రజాల ప్రదర్శన, జన్మభూమి కళాబృందాల సమన్వయకుడు ఎల్‌ఆర్. కృష్ణబాబు, దువ్వి రామారావు బృందం పాడిన జన్మభూమి పాటలు అలరించాయి. నాట్యాచారిణి నాగమణిబుద్ధదేవ్ శిష్య బృందం కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు విజయాంజలి, పూజిత, అమూత్య, మౌనిక, యశశ్విక, వినీల, తేజ, హేమ అనుష్క, విష్ణుప్రియ ప్రదర్శించిన నృత్యాలు రంజింపజేశాయి. ఎమ్మెల్సీ రాము సూర్యారావు, సమాచార శాఖ ఏడీ వి. భాస్కరనరసింహం, నందిఅవార్డు గ్రహీత ఎండీ ఖాజావలి, యల్‌ఆర్. కృష్ణబాబు తదితరులు ప్రసంగించారు.



కళాకారుల నృత్య ప్రదర్శన

సొంతింటి కల సాకారం చేస్తా: ఎమ్మెల్యే

సత్రంపాడు, శనివారపుపేట (ఏలూరు గ్రామీణ) న్యూస్‌టుడే: అర్హులైన పేదలందరికీ సొంతింటి కల సాకారం చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే బడేటి బుజ్జి చెప్పారు. శనివారపుపేట, సత్రంపాడు గ్రామాల్లో జన్మభూమి సభలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర సమీపంలోని గ్రామాలు నగరపాలకసంస్థలో విలీనం అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం శనివారపుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పైకా భవనాన్ని ఆయన ప్రారంభించారు. శనివారపుపేట, సత్రంపాడు గ్రామాల నుంచి మొత్తం 307 అర్జీలను అధికారులు స్వీకరించారు. వీటిలో అధికంగా ఇళ్లస్థలాలకు సంబంధించినవే ఉన్నాయి. శనివారపుపేటలో 153, సత్రంపాడులో 75 మంది ఇళ్ల స్థలాలు కోసం దరఖాస్తు చేసుకున్నారు. మరికొందరు రేషన్ కార్డులు, పింఛన్లు, గృహనిర్మాణం కోసం దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మోరు హైమావతి, తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో మురళీగంగాధర్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

యువజనోత్సవాల విజయవంతానికి పిలుపు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి నిర్వహించనున్న యువజనోత్సవాలను విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ నాయకుడు సీహెచ్ భరత్ పిలుపునిచ్చారు. డీవైఎఫ్ఐ నగర కార్యకర్తల సమావేశాన్ని స్థానిక సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ రోజుల్లో యువత జూద క్రీడలవైపు మళ్లకుండా చేయడం కోసం యువజనోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 8 నుంచి 13 వరకు స్థానిక సీఆర్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 12న స్థానిక కాశీవిశ్వేశ్వర కల్యాణ మండపంలో జిల్లాస్థాయి చదరంగం, 13న లఘుచిత్రాల పోటీని నిర్వహిస్తామన్నారు. వీటిలో పెద్ద ఎత్తున యువత పాల్గొనాలని కోరారు.

సీసీ కెమెరాలతో నేర నియంత్రణ

ఏలూరు నేరవార్తలు న్యూస్‌టుడే: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని నగర సీఐ అడపా నాగమురళి అన్నారు. ఏలూరు డీఎస్పీ కె. ఈశ్వరరావు ఆదేశాల మేరకు మెయిన్‌బజారులోని బంగారు ఆభరణాల దుకాణాల యజమానులకు వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ఆవరణలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమురళి మాట్లాడుతూ బంగారు దుకాణాల్లో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. దీని వల్ల దుకాణ యజమానులతో పాటు వినియోగదారులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రాత్రి సమయాల్లో చోరీలు జరిగినా, పగటిపూట వినియోగదారుల సొత్తు అపహరణకు గురైన సీసీ కెమెరా పుటేజీ ద్వారా సులభంగా నేరస్థులను గుర్తించవచ్చన్నారు. వెంటనే కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలిన సూచించారు. దీనికి స్పందించిన యజమానులు మాట్లాడుతూ 60 శాతం దుకాణాల్లో ఇప్పటికే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, మిగిలిన వాటిలో కూడా త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్సై ఎన్. ఆర్. కిషోర్‌బాబు, జ్యూయలరీ బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పయిడేటి రామారావు, కార్యదర్శి కొనకళ్ల దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

కోళ్లకు కత్తులు కట్టే వ్యక్తిపై కేసు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పందెం కోళ్లకు కత్తులు కట్టే ఓ వ్యక్తిపై కేసు నమోదైంది. ఏలూరు గ్రామీణ ఎస్సై నాగేంద్రప్రసాద్ తెలిపిన ప్రకారం.. సంక్రాంతి కోడిపందేలను నిలువరించే చర్యల్లో భాగంగా బుధవారం ఏలూరు మండలం శ్రీపర్రుకు చెందిన ముంగర సోమయ్యను అదుపులోకి తీసుకుని బైండోవర్ కేసు నమోదు చేశారు. గ్రామీణ పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో కోడిపందేలు జరిపిన నిర్వాహకులపై, కోళ్లకు కత్తులు కట్టే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



బీటీఏ దైనందినిని విడుదల చేస్తున్న డీఈవో రేణుక

ఉత్తమ బోధన అందించండి

ఏలూరు విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యతతోకూడిన విద్యను అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక చెప్పారు. బహుజన ఉపాధ్యాయుల సంఘం (బీటీఏ) ఆధ్వర్యంలో రూపొందించిన దైనందినిని స్థానిక డీఈవో కార్యాలయంలో బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రేణుక మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను ఉపాధ్యాయులు సద్వినియోగం చేయాలన్నారు. బీటీఏ జిల్లా అధ్యక్షుడు జి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ఆనందకరమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల అభ్యున్నతికి తమవంతు కృషిచేస్తామని పేర్కొన్నారు. బీటీఏ జిల్లా ఉపాధ్యక్షుడు లాల్ నెహ్రూ, నాయకులు జి. కనకదుర్గ, జి. నాగేశ్వరరావు, కేసీహెచ్ సుబ్బారావు, ఆనంద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గోపాలపురం

నేడు వాలీబాల్, ముగ్గుల పోటీలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా ద్వారకాతిరుమలలో ఈనెల 4న ముగ్గులు, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు మల్లిపెద్ది వెంకటేశ్వర రావు తెలిపారు.

మొండి గోడలు.. భావి వేతలు..!



ఇసుకలో కూర్చున్న విద్యార్థులు

దేవరపల్లి,న్యూస్‌టుడే : గుత్తేదారు నిర్లక్ష్యం విద్యార్థులకు శాపంగా మారుతోంది. దేవరపల్లి మండలం దుద్దుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద నూతన తరగతి గదుల భవన సముదాయ నిర్మాణానికి రూ.25లక్షల నిధులు 2015లో మంజూరయ్యాయి. భవన నిర్మాణాన్ని చేపట్టిన గుత్తేదారు అసంపూర్తిగా పనులు వదిలేశారు. దీనికి సంబంధి ంచి రూ.14 లక్షల బిల్లు కూడా గుత్తేదారు అందుకున్నారు.



అసంపూర్తిగా భవన సముదాయం

నిర్మాణాన్ని పూర్తి చేస్తే చెల్లించడానికి మిగిలిన నిధులు కూడా సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం నిర్మాణ ముడిసరకుల ధరలు విపరీతంగా పెరిగాయి. ఒప్పంద సమయంలో ఉన్న ఎస్.ఎస్.ఆర్. ప్రకారం కాకుండా ప్రస్తుతం ఉన్న ఎస్.ఎస్.ఆర్.ప్రకారం సొమ్ములు చెల్లించాలంటూ ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణణాతీతంగా ఉన్నాయి.

తరగతి గదులకు అడుగున ఫ్లోరింగ్ చేయలేదు. అసౌకర్యంగా ఉన్న గదుల్లోనే విద్యార్థులకు బోధన చేయాల్సిన పరిస్థితి వచ్చింది.

సంక్రాంతికి నిర్మాణం పూర్తి

భవన నిర్మాణాన్ని సంక్రాంతి నాటికి పూర్తిచేయించి, సెలవుల అనంతం విద్యార్థులు భవనాన్ని వినియోగించేలా దృష్టిసారిస్తానని **సర్వశిక్షాఅభియాన్ ఏఈ రాజ్‌కుమార్** తెలిపారు. నిర్మాణ పనులు చేసేందుకు గుత్తేదారు అయిష్టంగా ఉన్నారన్నారు. పూర్తి స్థాయిలో నిర్మాణం అయ్యాకే బిల్లులు మంజూరు చేస్తామన్నారు.

ఆర్థిక సాయం అందజేత

జి.కొత్తపల్లి (ద్వారకాతిరుమల), న్యూస్‌టుడే: మధుమేహ వ్యాధి కారణంగా మండలంలోని జి.కొత్తపల్లికి చెందిన ఆల్‌పాంసకు ఒక కాలు తొలగించారు. ఆమెకు స్థానిక మానవత స్వచ్ఛంద సంస్థ తరఫున రూ.25వేలు ఆర్థిక సాయం బుధవారం అందజేశారు. అలాగే ఇటీవల అగ్ని ప్రమాదంలో నివాసాన్ని కోల్పోయిన లింగాల కుమారికి రూ.2వేలు, 25కేజీల బియ్యం ఇచ్చారు. వీటిని ఎంపీపీ వడ్లపూడి ప్రసాద్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు పోలేపల్లి అప్పారావు, దావులూరి ప్రభాకర్, రేవూరి రాంబాబు, ఘంటా నరసింహారావు తదితరులుపాల్గొన్నారు.

క్రీడా దుస్తులు...

పోతవరం (నల్లజర్ల), న్యూస్‌టుడే: పోతవరం ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.10వేలు విలువ చేసే క్రీడా దుస్తులను తెదేపా మండలాధ్యక్షుడు ఏలేటి సత్యనారాయణ బుధవారం అందజేశారు.

రేపటి నుంచి అవగాహన సదస్సు

తెలికిచర్ల (నల్లజర్ల), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ- విజిట్ ఇంజినీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో తెలికిచర్ల విజిట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 4,5,6 తేదీలలో ఇంజినీరింగ్ ఈఈఈ, ఈసీఈ మూడు, నాలుగు సంవత్సరాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జీవీ రాజు తెలిపారు. ఈ టెక్నాలజీపై అవగాహన పెంచుకుంటే వినియోగదారుల వస్తు రంగం, రక్షణ శాఖలో ఉద్యోగావకాశాలు పొందే వీలుంటుందన్నారు.



గోడపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

రేపు చోదక అనుమతి మేళా

నల్లజర్ల, న్యూస్‌టుడే: నల్లజర్ల ఏకేఆర్‌జీ కళాశాలలో ఛైర్మన్ చావా రామకృష్ణారావు, ఏలూరు ఆర్టీవో సహకారంతో మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 5న చోదక అనుమతి మేళా నిర్వహించనున్నట్లు మానవత స్వచ్ఛంద సేవాసంస్థ మండలాధ్యక్షుడు కామిని వెంకటదుర్గాప్రసాద్ తెలిపారు. ఉదయం 10గంటల నుంచి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్యాస్‌సమాచారం

దేవరపల్లి,న్యూస్‌టుడే: దేవరపల్లిలోని పద్మశ్రీనివాసా గ్యాస్ ఏజెన్సీ నుంచి గురువారం పల్లంట్ల, గౌరీపట్నం, దేచర్ల, పోతవరం, గొల్లగూడెం, గోపాలపురం, పెద్దాపురం, చిట్యాల, వెంకటాయపాలెం, చెరుకుమిల్లి, వేళ్లచింతలగూడెం, వాదాలకుంట, వెదుళ్లకుంట, గుడ్డిగూడెం, భీమోలు, తొక్కిరెడ్డిగూడెం, సూర్యనారాయణపురం గ్రామాలకు గ్యాస్‌సిలిండర్లను సరఫరా చేస్తారు.

మధ్యాహ్న భోజన సామగ్రి అందజేత

పోతవరం (నల్లజర్ల), న్యూస్‌టుడే: పోతవరం ఉన్నత పాఠశాలలో ఆఫీసు సబార్డినేట్‌గా పనిచేసిన వసంతాడ మరియమ్మ.. ఇటీవల ప్రకాశరావుపాలెం బదిలీపై వెళ్లి అక్కడే పదవీ విరమణ పొందారు. అనంతరం తాను పనిచేసిన పాఠశాలకు ఏదైనా చేయాలనే తలంపుతో మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ప్రకాశరావుపాలెం ఉన్నత పాఠశాలకు రూ.10వేలు విలువచేసే డిజిటల్ స్క్రీన్ అందించగా.. పోతవరం ఉన్నత పాఠశాలకు రూ.10వేలతో 200 భోజన కంచాలు, స్టాండు, వడ్డన సామగ్రిని తెదేపా మండలాధ్యక్షుడు ఏలేటి సత్యనారాయణ, తెదేపా నాయకుడు రావూరి వెంకటరమణ చేతులమీదుగా ప్రధానోపాధ్యాయుడు బి.యోహానుకి బుధవారం అందజేశారు.



విద్యార్థులకు మధ్యాహ్నభోజన సామగ్రిని బహూకరిస్తున్న మరియమ్మ

బియ్యం అక్రమ రవాణా అడ్డగింత

దేవరపల్లి,న్యూస్‌టుడే: దేవరపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం నుంచి బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు సిబ్బంది ప్రయత్నించగా ఎస్.ఎఫ్.ఐ.ప్రతినిది అనిల్ బుధవారం అడ్డుకున్నారు.

కేసుల నమోదు

వెలగపాడు (టి.నరసాపురం), న్యూస్‌టుడే: వెలగపాడుకు చెందిన మల్లపు మేరి గత నెల 31న రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా శీలం సాయివినయ్, మరికొందరు కలసి ఇంటి తలుపులు పగులకొట్టారు. మేరీని, ఆమె మేనల్లుడు అభిరాంను, కరిపోతు రాజును కులం పేరుతో దూషించి కొట్టారు. అలాగే బొడ్డు విజయకుమారిని బొడ్డు భాస్కరరావు మరికొందరు కలసి ఆమె దుస్తులు చించి వేసి కొట్టారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరో కేసులో వెలగపాడుకు చెందిన లింగాల నాగమణి గత నెల 31 రాత్రి చర్చికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా ఉమ్మడి గంగరాజు మరో ఇద్దరు కలసి ఆమె దుస్తులు చించివేసి అసభ్యకరంగా ప్రవర్తించి కులం పేరుతో దూషించారు. అలాగే గెడ్డం బాలరాజును బొడ్డు శ్రీను మరో ముగ్గురు కలసి కర్రలతో తలపై బలంగా కొట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు బుధవారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.రాంబాబు తెలిపారు.

నలుగురు వ్యక్తుల బైండోవర్

మధ్యాహ్నపువారిగూడెం (టి.నరసాపురం), న్యూస్‌టుడే: సంక్రాంతిని పురస్కరించుకుని కోడి పందేలు నిర్వహించేందుకు సిద్ధం అయిన మధ్యాహ్నపువారిగూడేనికి చెందిన ఇద్దరిని, టి.నరసాపురానికి చెందిన ఇద్దరిని బుధవారం బైండోవర్ చేసినట్లు ఎస్సై వి.రాంబాబు తెలిపారు.

సీపీఎస్‌కు వ్యతిరేకంగా 9న ధర్నా

టి.నరసాపురం, న్యూస్‌టుడే: సీపీఎస్‌కు వ్యతిరేకంగా టి.నరసాపురంలో ఈ నెల 9న ధర్నా నిర్వహించనున్నట్లు ఏపీటీఎఫ్ 1938 సంఘం మండల శాఖ అధ్యక్షుడు జి.నెహ్రూ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎం.రమేష్‌బాబు, పి.రామదాసుతో పాటు ఏడుగురు ఉపాధ్యాయులు తమ శాఖ సభ్యత్వాన్ని తీసుకున్నారని చెప్పారు.

తాడేపల్లిగూడెం డివిజన్లో తొమ్మిది విద్యుత్తు ఉపకేంద్రాల నిర్మాణం

పుల్లలపాడు(నల్లజర్ల),న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం డివిజన్లో వివిధ పథకాల కింద తొమ్మిది విద్యుత్తు ఉపకేంద్రాల నిర్మాణం జరుగుతున్నట్లు డీఈ శ్యాంబాబు తెలిపారు. పుల్లలపాడు విద్యుత్తు ఉపకేంద్రాన్ని సందర్శించిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇంటిగ్రేటెడ్ పవర్ డెవలెప్‌మెంట్ పథకం కింద తాడేపల్లిగూడెం పట్టణంలోని కొండయ్యచెరువు, తణుకు పట్టణంలోని సజ్జాపురం, దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామజ్యోతి యోజన పథకం కింద పుల్లలపాడు, కైకరం, ఉంగుటూరు, చిన తాడేపల్లిలో, ప్రపంచబ్యాంకు నిధులతో తాడేపల్లిగూడెం మండలం యాగర్లపల్లి, అత్తిలి మండలం కొమ్మరలో 13/11 కె.వి విద్యుత్తు ఉపకేంద్రాలను ఒక్కోటి రూ.1.50కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. హైవోల్టేజీ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ కింద బోర్ల వద్ద పాత పరివర్తకాలను మార్పు చేసి, కొత్తవి ఏర్పాటుచేస్తున్నామన్నారు. 1005 బోర్లకు 754 విద్యుత్తు పరివర్తకాలు అమర్చుతున్నామన్నారు. వీటిలో 16కేవీ 92, 25కేవీ 351, 40కేవీ 311 పరివర్తకాలు ఉన్నాయన్నారు. మొత్తం 594 విద్యుత్తు పరివర్తకాల ఏర్పాటు పూర్తయిందన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా



పరిశ్రమ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

తిమ్మాపురం (ద్వారకాతిరుమల), న్యూస్‌టుడే: రెండు నెలల వేతన బకాయిలు ఇవ్వాలని కోరుతూ ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురంలోని సౌత్ స్టార్ సిరామిక్ పరిశ్రమ ఉద్యోగులు బుధవారం ధర్నా చేశారు. గేట్‌కి తాళం వేసి నిరసన తెలిపారు. తామంతా వేతనాలపై ఆధారపడి జీవిస్తున్నామని.. ఇవ్వకుంటే ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈవిషయమై యాజమాన్యాన్ని నిలదీస్తే వారి మధ్య ఉన్న అంతర్గత గొడవలను సాకుగా చూపుతూ తప్పించుకుంటున్నారని తెలిపారు. అలాగే ఆరు నెలలుగా తమకు కూడా వేతనాలు ఇవ్వడం లేదని పలువురు సెక్యూరిటీ సిబ్బంది పేర్కొన్నారు. ఈమేరకు స్థానిక తహశీల్దారు, కార్మికశాఖ జిల్లా అధికారికి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి లింగరాజు ఉద్యోగులకు మద్దతుగా నిలిచారు. కార్యక్రమంలో కె.వెంకట్రావు, పాకిన సత్యనారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరాలపై దాడి

కోడిగూడెం(ద్వారకాతిరుమల),న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం కోడిగూడెంలో కోడిపందేల స్థావరంపై ఎస్సై వీర్రాజు ఆధ్వర్యంలో బుధవారం దాడి చేశారు. ఈసందర్భంగా ఇద్దరు వ్యక్తులను అందుపులోకి తీసుకుని నగదు, కోడి పుంజు, కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ముషళ్లకుంట (నల్లజర్ల), న్యూస్‌టుడే: మండలంలోని ముషళ్లకుంటలో కోడిపందేల స్థావరంపై నల్లజర్ల ఎస్సై వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో దాడి చేశారు. ఈసందర్భంగా 13మందిని అరెస్టు చేసి, రూ.21,300 నగదు, ఆరు కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

సినిమాలు

దేవరపల్లి

రామ్‌నాథ్	ఒక్క క్షణం
శ్రీత్రినాథ్	మిడిల్‌క్లాస్ అబ్బాయి

తాడేపల్లిగూడెం

వెంకట్రామ	మిడిల్‌క్లాస్ అబ్బాయి
శేషమహల్	ఒక్క క్షణం
రంగమహల్	2 కంట్రీస్
చలపతి	మోసంగి
శ్రీపద్మజ	హలో
లక్ష్మీనారాయణ సినీమేక్స్	హలో
లక్ష్మీనారాయణస్క్రీన్స్2	జుమాంజీ

గోపాలపురం



ఘర్షణలో ఇద్దరికి గాయాలు

స్టాక్‌నగర్(దేవరపల్లి),న్యూస్‌టుడే: ఘర్షణలో ఇద్దరికి గాయాలైన ఘటనపై బుధవారం కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. దేవరపల్లి మండలం స్టాక్‌నగర్‌కు చెందిన తాడిగడప శాంతిబాబు, తాడిగడప భూషణంలను అదేగ్రామానికి చెందిన రాపాక వెంకటేశు మరో ఇద్దరు కలిసి దాడి చేశారు. కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

జి.కొత్తపల్లి, మద్దులగూడెం, దొరసానిపాడు (ద్వారకాతిరుమల), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెదేపా ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీపీ వడ్లపూడి ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని జి.కొత్తపల్లి, మద్దులగూడెం, దొరసానిపాడు గ్రామాలలో జన్మభూమి-మాఊరు కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నార న్నారు. అనంతరం చంద్రన్న సంక్రాంతి కానుకలు, కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు చేశారు. వీరికి ఎంపీపీ ఆధ్వర్యంలో చీరలు, సారె అందజేశారు. జడ్పీటీసీ సభ్యురాలు మొగతడకల లక్ష్మీరమణి, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు డీవీఎస్ చౌదరి, మాజీ ఎంపీపీ ఏపూరి దాలయ్య, రేగంటి రాంబాబు, ఘంటా నరసింహారావు, కారుమంచి మురళి, ఆయా గ్రామాల సర్పంచులు మొగతడకల సత్యనారాయణ, జొన్నకూటి అంకాలయ్య, స్వర్ణలత, ఎంపీటీసీ సభ్యులు రాయపాటి సోమేశ్వరరావు, కస్సే చక్రధరరావు పాల్గొన్నారు.



నల్లజర్ల: సభలో మంత్రి కేఎస్ జవహర్

దొరసానిపాడులో రసాభాస

గ్రామ సర్పంచి మొగతడకల సత్యనారాయణ, ఇటీవల గ్రామ సంఘం అధ్యక్షురాలుగా పనిచేసిన సత్యవతి ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలు చేసుకోవడంతో దొరసానిపాడులో జన్మభూమి-మాఊరు కార్యక్రమం రసాభాసగా మారింది. గ్రామ సంఘం నిధులు రూ.8లక్షలు సత్యవతి కాజేశారని సర్పంచి ఆరోపించగా.. ఆయా నిధులను వసూలు చేసి రూ.5లక్షలు సర్పంచికి ఇచ్చానని.. ఈ విషయం బయటకొస్తుందనే తనపై ఆరోపణలు చేస్తున్నారని సత్యవతి అన్నారు. ఇద్దరి మధ్య వాదోపవాదాలు జరగటంతో గందరగోళం నెలకొంది. గ్రామ పెద్దలు జోక్యం చేసుకుని గొడవను సద్దుమణిగించారు. పింఛను అందలేదన్న కారణంతో ఆత్మహత్య చేసుకున్న ఎం.నాగరాజు కుటుంబాన్ని ప్రభుత్వం తరపున ఆదుకుంటామని అధికారులు, ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీ నెరవేరలేదని మాజీ జడ్పీటీసీ సభ్యుడు బుసనబోయిన సత్యనారాయణ అన్నారు. ఈవిషయం కలెక్టర్ దృష్టిలో ఉందని తహశీల్దారు సుజాత చెప్పారు.

నల్లజర్ల, అనంతపల్లి (నల్లజర్ల), న్యూస్‌టుడే: ఎంత కష్టమైనా.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చి.. ధీమాగా ప్రజల ముందుకు వస్తున్నామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కేఎస్ జవహర్ అన్నారు. నల్లజర్ల, అనంతపల్లిలో బుధవారం నిర్వహించిన జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా తెదేపా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వమూ చేయని విధంగా.. అన్నీ వర్గాలకు లాభం చేకూరేలా పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికే దక్కిందన్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే.. తెలుసుకుని వాటిని నెరవేర్చేందుకు జన్మభూమి-మాఊరు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జడ్పీఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం అంటే నల్లజర్ల మండలాన్ని చూస్తే తెలుస్తుందన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోతున్న ఘనత ముఖ్యమంత్రిదేనన్నారు. ఏపీఈపీడీసీఎల్ సీఎండీ అజయ్‌జైన్ మాట్లాడుతూ వ్యవసాయానికి నిరంతరంగా విద్యుత్తు అందిస్తున్నామన్నారు. ఈసందర్భంగా కొత్త రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇళ్లు, స్థలాల కోసం ప్రజలు వినతులు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ జమ్ముల సతీష్, జడ్పీటీసీ సభ్యురాలు కొఠారు అనంతలక్ష్మి, సర్పంచులు యలమాటి శ్రీనివాసరావు, కనుమూరి మంగమ్మ, తెదేపా నాయకులు పాల్గొన్నారు. నల్లజర్లలో రైతులకు రైతు రథం ట్రాక్టర్లు పంపిణీచేశారు.



చంద్రన్న సంక్రాంతి కానుకలు అందజేస్తున్న ఎంపీపీ ప్రసాద్

సమస్యలను వెంటనే పరిష్కారిస్తాం..

చెరుకుమిల్లి, కరగపాడు, జగన్నాథపురం (గోపాలపురం)న్యూస్‌టుడే: అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల వద్దకు వచ్చి సమస్యల పరిష్కార వేదికగా జన్మభూమి మాఊరు ఉపయోగపడుతుందని నియోజకవర్గ ప్రత్యేక అధికారి కె.శ్రీనివాస్ అన్నారు. అయిదో విడత జన్మభూమి మాఊరు కార్యక్రమం చెరుకుమిల్లి, కరగపాడు, జగన్నాథపురం గ్రామాల్లో ఆయా గ్రామ సర్పంచుల అధ్యక్షతన బుధవారం జరిగింది. ముందుగా జన్మభూమి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి కె.శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి పి.శ్రీనువాసరావు పాల్గొన్నారు. జగన్నాథపురంలో కృష్ణ ప్రసాద్ అధ్వర్యంలో అధికారుల బృందం నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచి నాగరత్నం రేషన్‌కార్డులు, పింఛన్లు, 87మందికి విద్యార్థులకు ఉపకారవేతనాలు అందజేశారు. చెరుకుమిల్లిలో తహశీల్దారు నరసింహమూర్తి, సర్పంచి కాశీఅన్నపూర్ణ అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ అరుణకుమారి, జడ్పీటీసీ సభ్యురాలు ఈలి మోహినిపద్మజరాణి పాల్గొన్నారు. 32మంది విద్యార్థులకు ఉపకారవేతనాల మంజూరుపత్రాలు అందించారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కరగపాడులో ఈఓపీఆర్‌డీ భాస్కర్ అధ్వర్యంలో, సర్పంచి తెలే వెంకటేశ్వరావు, ఎంపీటీసీ సభ్యురాలు తొర్లపాటి జ్యోతి చేతుల మీదుగా 3రేషన్ కార్డులు , 11 పింఛన్లు, 17మంది విద్యార్థులకు ఉపకారవేతనాల మంజూరుపత్రాలు అందజేశారు.

అర్హు లందరికీ సంక్షేమ ఫలాలు

దుద్దుకూరు(దేవరపల్లి),న్యూస్‌టుడే: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పనశాఖ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. దేవరపల్లి మండలం దుద్దుకూరులో బుధవారం సాయంత్రం నిర్వహించిన జన్మభూమి గ్రామసభలో స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గంలో రేషనుకార్డులకు అర్హతకలిగిన వారిసంఖ్యకంటే, మంజూరైన కార్డుల సంఖ్యతక్కువగా ఉందని పేర్కొన్నారు. అర్హులందరికీ రేషనుకార్డులు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకరించారని, వచ్చే 45రోజుల్లో వీటిని పంపిణీ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. దేవరపల్లి మండలపరిషత్ అధ్యక్షుడు శ్రీకాకొళపు వెంకటనరసింహారావు, జడ్పీటీసీ సభ్యురాలు సుధారాణి, సర్పంచి కె.సౌధామణి, మండలపరిషత్ ఉపాధ్యక్షురాలు బాదంపూడి ఇందిర, మండలప్రత్యేకాధికారి ఎస్.జె.వి. రామ్మోహనరావు, తహశీల్దారు వై.రవికుమార్, ఎంపీడీవో కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సంగాయగూడెంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో అధికారులు జన్మభూమి-మాఊరు గ్రామసభ నిర్వహించారు.



విద్యుత్తు ఉపకేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఎండీ అజయ్‌జైన్

విద్యుత్తు పరివర్తకాల భద్రతపై ప్రత్యేక దృష్టి

యర్నగూడెం(దేవరపల్లి),న్యూస్‌టుడే: విద్యుత్తు పరివర్తకాల చోరీల నివారణపై దృష్టిసారిస్తామని రాష్ట్ర ఇంధనశాక ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ తెలిపారు. దేవరపల్లి మండలం యర్నగూడెంలో నూతనంగా నిర్మించిన 132/33కె.వి. ఉపకేంద్రాన్ని బుధవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఉపకేంద్ర ఆవరణలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లోఉన్న 250 వ్యవసాయ విద్యుత్తు సర్వీసులను వెంటనే మంజూరు చేయాల్సిందిగా ఆదేశించినట్లు చెప్పారు. యర్నగూడెం ఉపకేంద్రానికి అవసరమైన సౌకర్యాలను కల్పించాలని గోపాలపురం ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఏపీట్రాన్స్‌కో, ఏపీఈపీడీసీఎల్ సంస్థలకు చెందిన పలువురు అధికారులు ఉన్నారు.

పుల్లలపాడులో...

పుల్లలపాడు (నల్లజర్ల), న్యూస్‌టుడే: అల్ప విద్యుత్తు సమస్యల పరిష్కారానికి ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్తు ఉపకేంద్రాల పనులు వేగంగా జరుగుతున్నట్లు ఏపీఈపీడీసీఎల్ సీఎండీ అజయ్‌జైన్ అన్నారు. మండలంలోని పుల్లలపాడులో నిర్మాణంలో ఉన్న 13/11కేవీ విద్యుత్తు ఉపకేంద్రం పనులను బుధవారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఉపకేంద్రం పరిధిలో మొక్క నాటారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్తును అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం డీఈ శ్యాంబాబు, ఏఈడీ సతీష్, ఏడీఈ(నిర్మాణం) శ్రీనివాస్, ఏఈ రెడ్డి సుబ్రహ్మణ్యం, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు బలుసు అచ్యుతదామోదరరావు, మాజీసర్పంచి వేగి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

మినీ రైతుబజార్ వెలవెల



గోపాలపురం న్యూస్‌టుడే: రైతులు పండించిన కూరగాయలను తక్కువ ధరకు నేరుగా వినియోగదారులకు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన మినీ రైతుబజారు నేడు వెలవెలబోతున్నాయి. వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధులు రూ.8.50 లక్షలతో అప్పటి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముళ్లపూడి వెంకట్రావు ఆధ్వర్యంలో గోపాలపురం మార్కెట్ యార్డులో రైతు బజార్ షెడ్డులు నిర్మించారు. అనతికాలంలోనే ఆయా గ్రామాలోని రైతులు వచ్చి తాము పండించిన కూరగాయలు తెచ్చి మినీ రైతు బాజారులో అమ్మకాలు చేశారు. కూరగాయలు విక్రయించేందుకు రైతులు వచ్చినప్పటికీ మీని రైతు బజారు గ్రామానికి దూరంగా ఉండటంతో కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపకపోవడంతో ఇది నిరుపయోగంగా మారింది.

సావిత్రిబాయిపూలే జయంతి

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సీహెచ్ జగన్మోహనరావు మాట్లాడుతూ స్త్రీ విద్య అభ్యున్నతికి సావిత్రిబాయి పూలే చేసిన కృషి అభినందనీయమన్నారు. మండల అధ్యక్షుడు జి.దేవానందరావు, ఉపాధ్యాయినులు మహాలక్ష్మి, భీమేశ్వరి, సత్యప్రియ, జ్యోతి, సంధ్యారాణి పాల్గొన్నారు.



ద్వారకాతిరుమలలో నినాదాలు చేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమలలో...

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల గురుకుల బాలికల కళాశాలలో స్వేరోస్ జిల్లా శాఖ అధ్యక్షుడు మానుకొండ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సావిత్రిమియి పూలే జయంతి బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపల్ వై.సుధారాణి, ఉత్తమ ఉపాధ్యాయిని గౌరి మహాలక్ష్మిని సత్కరించారు. కార్యక్రమంలో బి.మంగరాజు, ఎన్.శ్రీను, వీరవెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో...

దేవరపల్లి,న్యూస్‌టుడే మహాత్మా జ్యోతిరావు పూలేభార్య సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలను దేవరపల్లిలోని అంబటి సత్యనారాయణరావు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల వద్ద బుధవారం నిర్వహించారు. సావిత్రిబాయిపూలేచిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయినిగా ఆమె చేసిన సేవలను ప్రధానోపాధ్యాయుడు పి.వీర్రాజు, యూటీఎఫ్ జిల్లా నాయకుడు వుస్సే శంకరుడు వివరించారు.

చెరువులోపడి వ్యక్తి మృతి

త్యాజంపూడి(దేవరపల్లి),న్యూస్‌టుడే: దేవరపల్లి మండలం త్యాజంపూడిలోని ఆవచెరువులో చేపలవేటకు వెళ్లిన వ్యక్తి చెరువులోపడి మరణించాడని స్థానికులు తెలిపారు. త్యాజంపూడికి చెందిన పెంటగంటి సత్యనారాయణ(30) చెరువులోమునిగి దుర్మరణం పాలయ్యాడన్నారు. కొంగువారిగూడెంప్రాజెక్టునీటిని ఇటీవల విడుదల చేశారు. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఇన్వర్టరు పంపిణీ

దేవరపల్లి,న్యూస్‌టుడే: దేవరపల్లిలోని శాఖాగ్రంథాలయానికి ఇన్వర్టరు సౌకర్యం ఏర్పడింది. దేవరపల్లికి చెందిన నందిన లచ్చన్న,సుబ్బమ్మ దంపతుల జ్ఞపకార్థం వారికుమార్తె పెందుర్తి సత్యవతి రూ.11,500 విలువచేసే ఇన్వర్టరును ఇచ్చారు. ఆమె తరఫున దేవరపల్లి మాజీ సర్పంచి కాట్రు భీమరాజు బుధవారం అందజేశారు. గ్రంథాలయఅభివృద్ధికమిటీ అధ్యక్షుడు దాపర్తి సోమరాజు, గ్రంథాలయాధికారి గద్దే శ్రీనివాస్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొవ్వూరు

పట్టణ కబుర్లు

కొవ్వూరుపట్టణం, న్యూస్‌టుడే : గోష్పదక్షేత్రం: క్షేత్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేసి హారతులు సమర్పించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో అయ్యప్ప శరణుఘోషతో మార్మోగింది.

సత్యవతినగర్: శివారు ప్రధాన డ్రెయిన్లలో చెత్తాచెదారాలు పేరుకుపోవడంతో మురుగు కదలడం లేదు. దీంతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు.



ఇది రహదారంటే నమ్ముతారా..?

మండలంలోని గజ్జరం నుంచి పోచవరం వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. పెద్దపెద్దగోతులతో వాహనచోదకులు పలు ఇబ్బందులు పడుతున్నారు. పంటపొలాల నీరు గోతిలో చేరడంతో మడుగులా కనిపిస్తోంది. గత జన్మభూమిలో ఈరహదారి సమస్యను తెలియజేశారు. ఏడాది అవుతున్నా ఈరహదారిని పట్టించుకున్న దాఖలాలు లేవు. నిత్యం స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

-పోచవరం (తాళ్లపూడి), న్యూస్‌టుడే

సంక్షేమ వారధి.. సాధికార సారధి

- పథకాల సమగ్ర అమలుకు కార్యాచరణ
- 415 క్లస్టర్లలో సాధికారమిత్రల ఏర్పాటు

కొవ్వూరుపట్టణం, న్యూస్‌టుడే

పేదల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయి. ప్రతి ఏటా కోట్లాది రూపాయలను వెచ్చిస్తోంది. ఇదంతా బాగానే ఉన్నా క్షేత్రస్థాయిలో ఆ పథకాల ఫలాలు అర్హులకు అందడంలో పొరపాట్లు జరుగుతున్నాయి. పథక అమలులో నాయకుల ప్రమేయం, అధికారుల అలసత్వం వెరసి అనర్హులు లబ్ధి పొందుతున్న ఘటనలు దర్శనమిస్తున్నాయి. ఫలితంగా సర్కారుపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. దీనిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల పరిశీలన, కార్యాచరణ కోసం పొదుపు మహిళలను సాధికార మిత్రలుగా మారుస్తోంది. జనవరి 2వ తేదీ నుంచి ప్రారంభమైన అయిదో విడత జన్మభూమి-మావూరు కార్యక్రమంలో వీరిని ప్రజలకు పరిచయం చేస్తున్నారు. ప్రజలు, ప్రభుత్వానికి మధ్య సాధికారమిత్రలు వారధిగా నిలిచి పనితీరు చూపాల్సి ఉంది.

- కొవ్వూరు పట్టణం 23 వార్డుల పరిధిలో ఉండగా 12,130 గృహాల్లో సుమారు 40 వేల మంది జనాభా నివసిస్తున్నారు. ప్రతి 35 కుటుంబాలను 415 క్లస్టర్లుగా విభజించి ఒకొక్క క్లస్టరుకు ఒకరు చొప్పున సాధికారమిత్రలను ఎంపిక చేశారు.
- పట్టణంలో 680 స్వయం సహాయక గ్రూపులు ఉన్నాయి. వీటిలో 6,920 మంది మహిళా సభ్యులున్నారు. అలాగే ఎస్.ఎల్.ఎఫ్.లు, 23 మంది ఆర్పీలు ఉన్నారు. 537 సంఘాలకు రెండు దశలుగా పెట్టుబడి నిధిని అందించారు. 2014 తరువాత ఏర్పడిన 89 సంఘాలకు రూ.8.90 లక్షలు ఆర్.ఒ., ఆర్.ఎఫ్. నిధులుగా ఇచ్చారు.



స్వయం సహాయక సంఘ మహిళా సభ్యులు



శిక్షణ పొందుతున్న సాధికార మిత్రలు

అర్హులకు అన్నీ అందేలా చూడాలి

గతంలో నిర్వహించిన ప్రజాసాధికార సర్వే ద్వారా ఎంపిక చేసిన ప్రతి 35 కుటుంబాలకు ఒక సాధికార మిత్రను నియమించారు. ఎన్నుకోబడిన సాధికార మిత్ర ఈ కుటుంబాలకు సంబంధించిన సమగ్ర సమాచారం సేకరించాలి. ప్రభుత్వ పథకాలైన పక్కా గృహాలు, వ్యక్తిగత మరుగుదొడ్డి, రాయితీ రుణాలు, పింఛన్లు, రేషన్‌కార్డులు, చంద్రన్న బీమా తదితరాలు అందేలా చూడాలి. పథకాలు ఇప్పటివరకు ఎన్ని కుటుంబాలకు అందాయి, అర్హత కలిగి ఉన్నా పథకం అందని వారి వివరాలు నమోదు చేస్తారు. స్వయం ఉపాధిపై శిక్షణ పొందిన విద్యావంతులు ఉంటే వారి గురించి ఆరా తీయాలి. క్షేత్రస్థాయిలో సేకరించిన అన్ని రకాల వివరాలను ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన అంతర్జాలంలో నమోదు చేయాలి.

పూర్తయిన ఎంపిక, శిక్షణ

సంక్షేమ పథకాల పరిశీలనకు జిల్లాలోనే కొవ్వూరులో ప్రథమంగా సాధికారమిత్రలను ఎంపిక చేశారు. వీరు పనిచేయాల్సిన క్లస్టర్లలో అవలంబించాల్సిన చర్యలు, సర్వేలు, ప్రజలతో ఎలా మమేకం కావాలనే విషయాలను రెండ్రోజుల పాటు శిక్షణ కూడా ఇచ్చారు. మిత్రలకు మెప్మా శాఖతోనే కాకుండా మిగిలిన ప్రభుత్వ శాఖలపై కూడా అవగాహన కల్పించారు. ప్రజలకు ఏ శాఖకు సంబంధించిన సమస్యను ఎదుర్కొంటున్నారో తెలుసుకుని వారికి సంబంధిత అధికారుల వద్దకు తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలి.

కీలకపాత్ర పోషిస్తాం..



పేద ప్రజలకు ప్రభుత్వం వర్తింపజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందించేలా చూడటంలో తమ పాత్ర కీలకంగా మారనుంది. పక్కా గృహాలు, వ్యక్తిగత మరుగుదొడ్ల ఉపకార వేతనాలు, పింఛన్లు, రేషన్‌కార్డులు లేని అర్హులను క్షేత్రస్థాయిలో గుర్తిస్తాం. ఇలాంటి వారి వివరాలను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- దొంతంశెట్టి చంద్రకళ, సాధికారమిత్ర, కొవ్వూరు

సమగ్ర సమాచార సేకరణ..



గతంలో చేపట్టిన ప్రజాసాధికార సర్వే వివరాలను అప్పగించారు. ఒకొక్క సాధికారమిత్రకు 35 కుటుంబాలు అప్పగించారు. ఈ కుటుంబాలకు సంబంధించిన సమగ్ర సమాచారంలో భాగంగా కుటుంబ ఆర్థిక, సామాజిక పరిస్థితులు తెలుసుకుంటాం. కుటుంబ సభ్యులు, పిల్లలు, విద్య, కుటుంబ సభ్యుల జీవనోపాధిపై వివరాలు సేకరించడం వల్ల భవిష్యత్తులో ఎన్నో ప్రయోజనాలున్నాయి.

- సంగడి వెంకటలక్ష్మి, సాధికారమిత్ర, కొవ్వూరు

ప్రభుత్వ పథకాలతో ప్రగతి పథాన పల్లెలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజ్యలక్ష్మి, తదితరులు

పెనకనమెట్ట, ధర్మవరం (కొవ్వూరు గ్రామీణ), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలతో పల్లెలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయని ఎంపీపీ వాడపల్లి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. జన్మభూమి-మాఊరు 5వ విడత కార్యక్రమాలను మండలంలోని పెనకనమెట్ట, ధర్మవరం గ్రామాల్లో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీపీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ తెదేపా ప్రభుత్వ పరిపాలనలో ప్రతి పల్లె నూతన శోభను సంతరించుకున్నాయన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు గారపాటి శ్రీదేవి, మండల తెదేపా అధ్యక్షుడు గారపాటి వెంకట కృష్ణ, సర్పంచులు నీరుడు రాణి, టి.వియ్యపురాజు, ఉప సర్పంచులు కలగర గంగారావు, ముత్యాల రాంబాబు, తహశీల్దార్ కె.విజయ్‌కుమార్, ఎంపీడీవో ఏ.రాము, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఏబీఎన్ కళాశాలలో రక్తదాన శిబిరం

కొవ్వూరుపట్టణం, న్యూస్‌టుడే : రక్తదానం చేయడాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించి ఆచరించాలని ఏబీఎన్ కళాశాల ప్రిన్సిపల్ ఎన్.వి.సుబ్బారావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లా వైద్య విధాన పరిషత్తు ఆధ్వర్యంలో ఈనెల 4న కొవ్వూరు తమ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలన్నారు. వైద్యాధికారుల పర్యవేక్షణలో ఉదయం 10 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందని సుబ్బారావు తెలిపారు.

తాళ్లపూడిలో సావిత్రిబాయి పూలే జయంతి

తాళ్లపూడి న్యూస్‌టుడే: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సావిత్రిభాయిపూలే జయంతిని బుధవారం నిర్వహించారు. రాగోలపల్లి పాఠశాలలో జరిగిన సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు దుర్గారావు మాట్లాడుతూ పూలే చేసిన సేవలను వివరించారు. పెద్దేవం జిల్లాపరిషత్తు ఉన్నతపాఠశాలలో పూలే జయంతిని నిర్వహించారు. సావిత్రిబాయిపూలే అవార్డులను అందుకున్న ఉపాధ్యాయురాలు వై.మణికుమారి, గంగాదేవిలను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

ఇద్దరిపై కేసు నమోదు

కొవ్వూరు నేరవిభాగం, న్యూస్‌టుడే: తనను కొట్టారని మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం మండలంలోని సావరంలో నివాసం ఉంటున్న ఈ.పద్మావతి బంగారు ఆభరణాలు ఇటీవల చోరీకి గురయ్యాయి. ఈ నేపథ్యంలో ఆమె గుర్తు తెలియని వారిని నిందిస్తుండగా సమీపంలో నివాసం ఉంటున్న ఎంజీ.కుమారితో పాటు ఆమె కుమారుడు తమనే నిందిస్తున్నట్లు భావించి తగాదాకు దిగారు. ఇరువురూ పద్మావతిని కొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొనడంతో పట్టణ సీఐ ఎస్.శుభాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

‘శాంతి, భద్రతలు కరవయ్యాయి’

వైకాపా నేత మోషేన్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న కొయ్యే మోషేన్ రాజు, తదితరులు

సత్యవతి నగర్(కొవ్వూరు గ్రామీణ), న్యూస్‌టుడే: వైకాపా కార్యకర్తలపై, నాయకులపై కేసులు పెట్టడంతో పాటు తెదేపా పార్టీలోనే భద్రత కరువైన పరిస్థితి ఏర్పడిందని వైకాపా పార్లమెంటరీ నియోజక వర్గ అధ్యక్షులు కొయ్యే మోషేన్ రాజు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాకా గోపాల కృష్ణ దారుణ హత్యతో పాటు చాగల్లు, ఊనగట్ల, తాళ్లపూడిలోని హత్యలు జరిగిన తీరు నియోజక వర్గంలో శాంతిభద్రతలను ప్రశ్నిస్తుందన్నారు. తెదేపా నాయకులే మంత్రిపై కేసు పెట్టినా పోలీసులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మంత్రి జవహర్‌పై వచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని వెంటనే దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. నియోజక వర్గ కన్వీనర్ తానేటి వనిత మాట్లాడుతూ అధికారంలో ఉన్న నాయకత్వం హత్యారాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రస్తుత పరిస్థితిపై విచారణ చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, నాయకులు బండి అబ్బులు, ముప్పిడి విజయరావు, రుత్తల విజయభాస్కరరావు, బురుజు బాల మురళీకృష్ణ, మారిన రామకృష్ణ, పరిమి సోమరాజు, వర్రే నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

కొవ్వూరు

గాయత్రి	ఒక్క క్షణం
అనన్య	ఎంసీఏ

చాగల్లు

వెంకటకృష్ణ	ఏంజెల్
వెంకట్రామ	రాజా ది గ్రేట్

బ్రాహ్మణగూడెంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

బ్రాహ్మణగూడెం(చాగల్లు)న్యూస్‌టుడే: మండలంలోని బ్రాహ్మణగూడెంలో సుమారు 100 మంది వృద్ధులకు బుధవారం దుప్పట్లను పంపిణీ చేశారు. రామలింగేశ్వరస్వామి భవన నిర్మాణకార్మికుల సంఘం ఆధ్వర్యంలో వీటిని అందజేశారు. ఈసందర్భంగా సంఘం అధ్యక్షుడు జి. గోవింద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి రామకృష్ణలు పాల్గొన్నారు.

☛ ఉత్తమ స్థాయి నుంచి అధమ స్థాయికి చేరుకోవడానికి అడుగుచాలు.
-నెపోలియన్

సమన్వయ కార్యాచరణతో సమాజ వికాసం

4, 5, 6 వార్డులలో జన్మభూమి సభలు

క్రిస్టియన్‌పేట, మెరకవీధి, పాత ఊరు (కొవ్వూరుపట్టణం), న్యూస్‌టుడే : అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధుల సమన్వయ కార్యాచరణతో సమాజ వికాసానికి బాటలు పడతాయని తెదేపా రాష్ట్ర కార్యదర్శి, కొవ్వూరు పరిశీలకులు రాయిపాటి రంగారావు పేర్కొన్నారు. అయిదో విడత జన్మభూమి-మావూరు కార్యక్రమాన్ని పట్టణంలోని 4, 5, 6 వార్డులలో బుధవారం నిర్వహించారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు సభకు అధ్యక్షత వహించగా ఛైర్‌పర్సన్ జొన్నలగడ్డ రాధారాణి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధుల సద్వినియోగంతో శివారు ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించడమే జన్మభూమి కార్యక్రమ సంకల్పమన్నారు. కుటుంబ సంక్షేమ, వైద్య ఆరోగ్యశాఖ, ఆరోగ్య సంరక్షణ అంశాలపై ఆయా శాఖల అధికారులు వివరించారు. ప్రగతి కార్యాచరణపై చర్చించారు. మాలమహాసభ జాతీయ అధ్యక్షుడు బొంతా శ్యామ్‌రవిప్రకాష్, ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ 3, 4 వార్డులలో పారిశుద్ధ్య పరిస్థితిపై మాట్లాడారు. జగ్జీవన్‌రామ్ విశ్రాంత ఉద్యోగ సంఘ అధ్యక్షుడు పెనుమాక జయరాజు మాట్లాడుతూ ప్రధాన డ్రెయిను నిర్మాణం చేపట్టాలని, ఈ ప్రాంత ప్రజలకు శాశ్వత ప్రయోజనం చేకూరేలా అభివృద్ధి కార్యాచరణ చేపట్టాలన్నారు. వీటిపై రాధారాణి స్పందిస్తూ త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అతిథులు చంద్రన్నబీమా చెక్కులు, ఉపకార వేతనాలు, పింఛన్లు, రేషన్‌కార్డులు లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమాన్ని కమిషనర్ టి.నాగేంద్రకుమార్ పర్యవేక్షించగా వైస్‌ఛైర్మన్ దుద్దుపూడి రాజారమేష్, కౌన్సిలర్లు పాతాళ చంద్రకళ, కడిమి పోశమ్మ, కౌన్సిలర్లు, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉపకార వేతన పత్రాన్ని అందిస్తున్న తెదేపా రాష్ట్ర కార్యదర్శి రాయిపాటి రంగారావు, ఛైర్‌పర్సన్ జొన్నలగడ్డ రాధారాణి

పోచవరం, రాగోలపల్లి, తుపాకులగూడెం, ఊనగట్ల, ఎస్.ముప్పవరం(చాగల్లు, తాళ్లపూడి) న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని తాళ్లపూడి, చాగల్లు మండలాల్లో జన్మభూమి- మా ఊరు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. తాళ్లపూడి మండలంలోని పోచవరం పంచాయతీ పరిధిలోని రాగోలపల్లి, తుపాకులగూడెంలో నిర్వహించిన సమావేశంలో పలువురు సమస్యలను విన్నవించారు. కొవ్వాడ కాల్వపూడి పోయిందని, చింతలపూడి భూముల సమస్యలను తెలియజేశారు. అనంతరం లబ్ధిదారులకు రేషన్, పింఛన్ తదితర మంజూరు పత్రాలను అందజేశారు. గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో సర్పంచి రమేష్, ఎంపీపీ అనంతలక్ష్మి, ఎంపీడీవో జ్యోతిర్మయి, ఇన్‌ఛార్జి తహశీల్దార్ నాగలక్ష్మమ్మలు పాల్గొన్నారు

చాగల్లు మండలంలో..

చాగల్లు మండలంలోని ఊనగట్ల, ఎస్.ముప్పవరం గ్రామాల్లో జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో లబ్ధిదారులకు రేషన్, పింఛన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు సత్యవతి, ఫణీంద్ర, ఎంపీడీవో పురుషోత్తమరావు, తహశీల్దార్ మెరికమ్మ, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

పెనకనమెట్టలో అపశ్రుతి

పెనకనమెట్ట(కొవ్వూరు గ్రామీణ), న్యూస్‌టుడే: జన్మభూమి-మా ఊరు 5వ విడత కార్యక్రమాల్లో మండలంలోని పెనకనమెట్ట గ్రామంలో అపశ్రుతి చోటు చేసుకుంది. పింఛన్ మంజూరు కావడంతో వేదిక వద్దకు వచ్చిన వృద్ధుడు గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పసలపూడి వెంకట్రావు(65) కూలి పని చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్‌కు అర్హుడిగా వెంకట్రావు పేరును జాబితాలో చేర్చడంతో బుధవారం గ్రామంలో నిర్వహించిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమానికి వచ్చాడు. వేదికలో కూర్చున్న వెంకట్రావుకు అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో అతనికి ప్రథమ చికిత్స అనంతరం ఆటోలో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో 108 వాహనం ఎదురైంది. 108 వాహనంలోని సిబ్బంది వెంకట్రావును పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధరించారు.

కొల్లేపరకు కోశాధికారి పదవి

బస్టాండు కూడలి (కొవ్వూరుపట్టణం), న్యూస్‌టుడే : వాసవి ఇంటర్నేషనల్ సంస్థ జిల్లా సంయుక్త కోశాధికారిగా కొల్లేపర శ్రీనివాస్ ఎన్నికవ్వడం పట్ల ఆర్యవైశ్య నాయకులు బుధవారం హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా కొవ్వూరు ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు గ్రంథి వీరభద్రస్వామి మాట్లాడుతూ వాసవి క్లబ్‌లో దశాబ్ద కాలంగా చేపట్టిన కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ పదవి దక్కిందన్నారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ మట్టే నారాయణమూర్తి మాట్లాడుతూ సేవే లక్ష్యంగా పనిచేసిన వారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందన్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ తోటి వాసవీయన్లు, సంఘ ప్రతినిధుల సహకారంతో సామాజిక సేవా కార్యాచరణను విస్తృత పరుస్తానన్నారు. హర్షం వ్యక్తంచేసిన వారిలో క్లబ్ అధ్యక్షుడు గ్రంథి ప్రవీణ్, నాయకులు మద్దుల సత్యనారాయణ, వలివేటి ప్రసాద్, నూలు సత్యనారాయణ, వంకాయల శివరామకృష్ణ, బోనగిరి అయ్యప్ప, బంగారు కాశీఅన్నపూర్ణ తదితరులున్నారు.

తెదేపా ప్రతిష్ఠను దెబ్బతీయవద్దు

■ సామరస్యంగా చర్చించాలి.. నీచ రాజకీయాలు మానాలి ■ నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తల సందడి..

థియేటర్ల కూడలి (కొవ్వూరుపట్టణం), న్యూస్‌టుడే : క్రమశిక్షణకు మారుపేరైన తెదేపా ప్రతిష్ఠను దెబ్బతీసే రాజకీయాలు చేయడం సరి కాదని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కాకర్ల బ్రహ్మాజీరావు పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో మంత్రి కె.ఎస్.జవహర్‌పై అనుచిత వ్యాఖ్యలు, ఆయనపై కేసు పెట్టాలన్న ఫిర్యాదును ఖండిస్తూ నియోజకవర్గ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు బుధవారం సమావేశమయ్యారు. పట్టణంలో పార్టీ కార్యాలయం వద్ద బ్రహ్మాజీరావు మాట్లాడుతూ దళితుడైన మంత్రి జవహర్‌తో ప్రజాసేవలో పోటీ పడాలన్నారు. పార్టీలో ఏదైనా సమస్య ఉంటే సమన్వయ సమావేశాల ద్వారా చర్చించాలన్నారు. అనవసర రాద్ధాంతాలతో ప్రతిపక్షాలు మాట్లాడే అవకాశం ఇవ్వద్దన్నారు. ఏఎంసీ ఛైర్మన్ వేగి చిన్నా మాట్లాడుతూ అర్థం లేని ఆరోపణలతో పార్టీ ప్రతిష్ఠతను దెబ్బతీస్తే సహించమన్నారు. పార్టీశ్రేణులంతా ఏకతాటిపై ఉన్నారన్నారు. మున్సిపల్ వైస్‌ఛైర్మన్ దుద్దుపూడి రాజారమేష్ మాట్లాడుతూ వ్యక్తిగత అజెండాతో మంత్రి జవహర్ హావభావాలు, వ్యక్తిగత అంశాలపై సామాజిక మాధ్యమాల్లో పోస్టింగులు పెట్టడం దుర్మార్గమన్నారు. వర్గ రాజకీయాలను ప్రోత్సహించవద్దన్నారు. జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు, కౌన్సిలర్ పొట్రు శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీని దిగజార్చే విధంగా రెండ్రోజులుగా జరుగుతున్న పరిణామాలు దురదృష్టకరమన్నారు. పార్టీ కార్యక్రమాలు, సమావేశాల్లో ఎప్పుడూ కనిపించని వారు సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుని బాధ్యతాయుతంగా పనిచేస్తున్న మంత్రిపై ఆరోపణలు చేయడం అర్థరహితమన్నారు. సీనియర్ నాయకుడు ఇల్లూరి బాబ్జి మాట్లాడుతూ పార్టీలో జరుగుతున్న ప్రస్తుత పరిణామాలతో కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారన్నారు. నాయకులమని చెబుతూ మంత్రిపై బురద జల్లే ప్రయత్నాలను శ్రేణులు తిప్పి కొడతామన్నారు. పార్టీలో క్రమశిక్షణను ఉల్లంఘించి రాజకీయాలు చేస్తే అధిష్ఠానం చర్యలు తీసుకుంటుందన్నారు. నాయకులు కోడూరి ప్రసాద్, బూరుగుపల్లి వీరరాఘవులు తదితరులు మాట్లాడగా యనమదల సుబ్రహ్మణ్యం, పొట్రు సిద్ధూ, మద్దుకూరి రవిప్రసాద్, మద్దిపాటి సత్యనారాయణ, రాయిపాటి సుబ్బారావు, వరిగేటి కాంతరాజు, ముళ్లపూడి రాజేంద్రప్రసాద్, పసలపూడి బోసు, రాపాక తిలక్, నియోజకవర్గ పరిధిలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని పార్టీ జెండాలతో సందడి చేశారు.



మాట్లాడుతున్న తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు కాకర్ల బ్రహ్మాజీరావు

అవాస్తవ ఆరోపణలు మానాలి

బస్టాండు కూడలి (కొవ్వూరుపట్టణం), న్యూస్‌టుడే : మంత్రి కె.ఎస్.జవహర్‌పై అవాస్తవ ఆరోపణలు మానాలని ఎమ్మార్పీఎస్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు బుంగ సంజయ్‌మాదిగ పేర్కొన్నారు. కొవ్వూరులోని మంత్రి క్యాంపు కార్యాలయానికి ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం వచ్చి జవహర్‌కు మద్దతు పలికారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని 13 జిల్లాలలోని మాదిగ సామాజిక వర్గానికి అండగా నిలుస్తున్న మంత్రిపై అనుచిత ధోరణితో వ్యవహరించడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా యువసేన అధ్యక్షుడు ఉప్పలపాటి నెపోలియన్, ప్రధాన కార్యదర్శి చిర్రా శ్రీనివాస్, బుంగ సునీల్‌దత్, లంక శ్యామ్, కొడమంచిలి సూరి, ఎం. సురేష, కొమ్ము సందీప్ తదితరులున్నారు.



సభాస్థలిని పరిశీలిస్తున్న కలెక్టర్ భాస్కర్, మంత్రి జవహర్

8న ముఖ్యమంత్రి పర్యటన ఖరారు

తాళ్లపూడిలో జన్మభూమి - మా ఊరు కార్యక్రమానికి ఏర్పాట్లు

తాళ్లపూడి న్యూస్‌టుడే: తాళ్లపూడిలో ఈనెల 8న నిర్వహించే జన్మభూమి-మాఊరు కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. దీనికి సంబంధించి కలెక్టరు భాస్కర్ తాళ్లపూడిలోని పలు ప్రాంతాలను బుధవారం పరిశీలించారు. తాళ్లపూడి ఏటిగట్టు కింద ఉన్న లేవుట్ వద్ద కార్యక్రమాన్ని నిర్వహించేలా కలెక్టరు భాస్కర్, మంత్రి జవహర్, ఎస్పీ రవిప్రకాష్‌లు స్థల పరిశీలన చేశారు. సభ ప్రాంగణం, హెలీప్యాడ్, వాహనాల నిలుపుదలకు సంబంధించిన స్థలాలను చూశారు. సభకు దూరంగా హెలిప్యాడ్ ఏర్పాటు, సభ ప్రాంగణం వద్ద వ్యవసాయ, ఉద్యాన తదితర శాఖలకు సంబంధించి స్టాల్స్ ఏర్పాటుకు కావాల్సిన స్థలాలను పరిశీలించారు. వాహనాల నిలుపుదలకు పంచాయతీ ఎదురుగా ఉన్న స్థలాన్ని ఎంపికచేశారు. ఈసందర్భంగా కలెక్టరు భాస్కర్ మాట్లాడుతూ ఈనెల 8న తాళ్లపూడిలో జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరుకానున్నారని వివరించారు. దీనికి సంబంధించి పలు ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో అదనపు జాయింట్ కలెక్టరు షరీఫ్, ఆర్డీవో సత్యనారాయణరావు, డీఎస్పీ వెంకటేశ్వరరావు, స్పెషల్‌బ్రాంచి డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నిర్మల, ఇన్‌ఛార్జి తహశీల్దార్ నాగలక్ష్మమ్మ, సొసైటీ అధ్యక్షుడు సుబ్బారాయచౌదరి, మాజీ సర్పంచి నామన పరమేశ్వరావులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోగ్రాం అధికారి వీరస్వామి

సేవా కార్యక్రమాల్లోనూ భాగస్వాములు కావాలి

తాళ్లపూడి న్యూస్‌టుడే: చదువుతో పాటు పలు సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని జడ్పీటీసీ సభ్యురాలు మంగాభవాని పిలుపునిచ్చారు. మండలంలోని వేగేశ్వరపురం కెఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. గౌరీపట్నం సెంట్‌మేరిస్ డిగ్రీ మహిళా కళాశాల విద్యార్థులు విచ్చేశారు. ఎన్ఎస్ఎస్ పోగ్రాం అధికారి వీరస్వామి మాట్లాడుతూ వేగేశ్వరపురం గ్రామంలో వారం రోజుల పాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభత్ర, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర అంశాలపై ప్రచారం నిర్వహిస్తామన్నారు. ప్రజలకు అగహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి కుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, తెదేపా మండల మాజీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాసరావు , సిస్టర్ జోస్విన్‌లు పాల్గొన్నారు.

నరసాపురం

తాంత్రిక పూజలు నిర్వహించారనడం సబబు కాదు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో అర్చకులు తాంత్రిక పూజలు నిర్వహించారనడం సబబు కాదని నరసాపురం బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు చక్రావధానుల రెడ్డప్ప ధవేజీ, కార్యదర్శి కస్తూరి శ్రీనివాస్ అన్నారు. కనకదుర్గ ఆలయ అర్చకులు, పురోహితులపై వచ్చిన ఆరోపణలను ఆ సంఘం ఆధ్వర్యంలో నరసాపురంలో బుధవారం వారు ఖండించారు. ఆగమశాస్త్ర ప్రకారమే అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం యువజన విభాగం అధ్యక్షుడు చిట్టావఝ్జల మురళి, కార్యదర్శి రామవరపు శ్రీరాం, ముత్య ఫణి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గుర్తింపు కార్డుల అందజేత

మోళ్ళపర్రు (మొగల్తూరు), న్యూస్‌టుడే: మీనాక్షి కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో పేరుపాలెంసౌత్ పంచాయతీ పరిధిలోని మోళ్లపర్రు మండల పరిషత్తు ప్రాథమికోన్నత విద్యార్థులకు బుధవారం గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ ఆప్తాలమిస్ట్ బి.శ్రీనివాసరావు, జి.వీరబాబు, శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ సమావేశాలకూ 'బయోమెట్రిక్'

ఈ-మీటింగ్ విధానాన్ని అమల్లోకి తెచ్చిన ప్రభుత్వం

నరసాపురం గ్రామీణ (న్యూస్‌టుడే): పల్లె సీమలే దేశాభివృద్ధికి పట్టుగొమ్మలన్నారు జాతిపిత మహాత్మా గాంధీ. గ్రామ స్వరాజ్యం సాధించాలన్న ఆయన సంకల్పాన్ని నిజం చేయడానికే గ్రామపంచాయతీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అటువంటి పంచాయతీలకు సాంకేతికతను ఆపాదించి పల్లె పాలనను ప్రభుత్వం కొత్త పుంతలు తొక్కిస్తోంది. ఇప్పటికే పలు శాఖల్లో వినియోగిస్తున్న బయోమెట్రిక్ హాజరు విధానాన్ని పంచాయతీ పాలకవర్గ సమావేశాలకూ అమలు చేస్తున్నారు. నరసాపురం డివిజన్‌లోని 250 పంచాయతీలకు సంబంధించిన కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఈ విధానంపై శిక్షణ ఇస్తున్నారు.

ఈ-మీటింగ్ విధానంలోని అంశాలు...

- సమావేశం నిర్వహణకు మూడు రోజుల ముందే సభ్యులకు అజెండా పంపించాలి.
- మూణ్నెల్లకు ఒకసారైనా పంచాయతీ సమావేశం నిర్వహించాలి. ఏదైనా జాప్యం జరిగితే సమాచార రూపంలో కార్యదర్శిని హెచ్చరించే విధంగా రూపకల్పన చేశారు.
- ఆయా అంశాలను చర్చించాక సభ్యుల అంగీకారాన్ని బయోమెట్రిక్ ద్వారా తెలియపర్చాలి. అజెండాలో లేని అంశాలను చర్చించినా కచ్చితంగా నమోదు చేయాల్సి ఉంటుంది.
- సమావేశం ముగింపులో మరోసారి బయోమెట్రిక్ యంత్రంపై సభ్యులు వేలిముద్ర వేయాలి.

కోరం ఉంటేనే సమావేశం...

పంచాయతీ పాలకవర్గం సమావేశాలు ఇప్పటి వరకు మొక్కుబడిగా సాగాయి. సరిపడా కోరం లేకున్నా తూతూమంత్రంగా కానిచ్చేశారు. సమావేశానికి హాజరుకాని సభ్యుల ఇళ్లకు వెళ్లి సంతకాలు తీసుకొని తీర్మానాలు ఆమోదించుకునేవారు. మహిళా సభ్యుల స్థానంలో వారి భర్తలు హాజరయ్యేవారు. వీటన్నింటినీ అరికట్టి సమావేశాలు పక్కాగా జరిగేందుకు ప్రభుత్వం ఈ-మీటింగ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇకపై సమావేశానికి హాజరయ్యే సభ్యులంతా విధిగా బయోమెట్రిక్ యంత్రంపై వేలిముద్ర వేయాల్సిందే. కోరం ఉంటేనే సమావేశం నిర్వహణకు ఆన్‌లైన్ సహకరిస్తుంది.

అత్యవసర సమావేశాలకు మినహాయింపు ఇవ్వాలి

గ్రామ పంచాయతీ పాలకవర్గ సమావేశాలు బయోమెట్రిక్ హాజరు ద్వారా నిర్వహించాలనే ప్రభుత్వ నిర్ణయం మంచిదే. మూడు సమావేశాలకు హాజరు కాని సభ్యులను పదవి నుంచి తప్పించేలా నిబంధనలు తీసుకురావాలి. అత్యవసరంగా ఏర్పాటు చేసుకునే సమావేశాలకు సరిపడా సమయం ఉండదు కాబట్టి మినహాయింపు ఇవ్వాలి. అలాంటి పరిస్థితుల్లో పాత విధానంలోనే సమావేశం నిర్వహించుకునే అవకాశం కల్పించాలి.

- కూనపరెడ్డి విజయరంగారావు, గౌరవ అధ్యక్షుడు, మండల సర్పంచుల ఛాంబర్, నరసాపురం



సీతారాంపురం సౌత్ పంచాయతీ కార్యాలయం

బయోమెట్రిక్ విధానం తప్పని సరి

ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీ పాలకవర్గ సమావేశాలకు బయోమెట్రిక్ విధానం తప్పనిసరి. ఈ-మీటింగ్ పద్ధతిలోనే సమావేశాలు నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులకు ఇప్పటికే ఆదేశాలు జారీచేశాం.

- జి.మల్లికార్జునరావు, ఇన్‌ఛార్జ్ డీఎల్‌పీవో, నరసాపురం

వక్తృత్వ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

సీతారాంపురం సౌత్ (నరసాపురం గ్రామీణ), న్యూస్‌టుడే: విద్యుత్తు పొదుపు వారోత్సవాల్లో భాగంగా నరసాపురం వై.ఎన్.కళాశాలలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో మండలంలోని సీతారాంపురం నార్త్‌లోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. నవ్య పద్మిని (ప్రథమ), మైఖేల్ (ద్వితీయ), దుర్గా భుజంగరావు (తృతీయ), మౌనిక (చతుర్థ) బహుమతులు సాధించారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సత్రశాల రమేశ్‌బాబు, ఉపాధ్యక్షుడు సత్రశాల కీర్తికుమార్, ప్రధానాచార్యులు డాక్టర్ ఎం.శ్రీనివాసకుమార్, డాక్టర్ టి.మధు, కోశాధికారి కేవీ స్వామి, పాలకవర్గ సభ్యుడు అడ్డాల శ్రీహరి బుధవారం అభినందించారు.

ఆరోగ్యంపై అవగాహన సదస్సు

సీతారాంపురం సౌత్ (నరసాపురం గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలోని సీతారాంపురం సౌత్ గ్రామంలో నరసాపురం బీజీబీఎస్ మహిళా కళాశాల ఆధ్వర్యంలో ఆరోగ్యంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ కళాశాల విద్యార్థినులు పరిసరాల పరిశుభ్రత, వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి అడబాల అయ్యప్పనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు డీవీఆర్ ప్రసాద్, ఏఎన్ఎం రేఖారాణి, అమ్మాజీ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక యర్రమిల్లివారివీధిలో బుధవారం గంటాలమ్మ జాతర ఉత్సవాల్లో ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి ఛైర్మన్ బండారు పటేల్‌రాజానాయుడు, ఆలయ ధర్మకర్త బొడ్డు దేశిరాజు, మార్కేండేయులు, కౌన్సిలర్లు ఆరేటి వేణు, భగవాన్, మల్లాడి సోము, సత్యనారాయణ పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని అధిగమించాలి

ఎల్‌బీచర్ల(తూర్పుతాళ్లు), న్యూస్‌టుడే: విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమిస్తే ఏ రంగంలోనైనా విజయం సాధిస్తారని ఎల్‌బీచర్ల బాలయోగి గురుకుల బాలుర కళాశాల ప్రిన్సిపల్ బీహెచ్‌బీ రామకృష్ణమూర్తి సూచించారు. మానసిక ఒత్తిడి నివారణ, జ్ఞాపకశక్తి పెంపొందించుకోవడంపై నరసాపురం హార్ట్‌ఫుల్‌నెస్ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న శిక్షణ ముగింపు కార్యక్రమంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హార్ట్‌ఫుల్‌నెస్ కేంద్రం సమన్వయకర్తలు ఆకుల స్వామి, కె.రాజేశ్, వి.గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

సావిత్రిబాయి పూలే జయంతి

మొగల్తూరు, న్యూస్‌టుడే: మొగల్తూరులోని యూటీఎఫ్ భవనంలో సావిత్రిబాయి పూలే జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయురాలు ఎన్.సత్యవాణిని సన్మానించారు. కార్యక్రమంలో పి.కృష్ణకుమారి, ఎస్.ఉషామాధవి, ఎం.శ్రీదేవి, ఎ.సుజాత తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరు, న్యూస్‌టుడే: ముత్యాలపల్లి జడ్పీహెచ్‌ఎస్, చింతరేవు ప్రాథమిక పాఠశాలల్లో ఆరోగ్య వర్షిణీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ ఉపాధ్యాయురాలు సుజాతను సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో నాగిడి రాంబాబు, ఉపాధ్యాయులు కొపనాతి నరేశ్ కుమార్, బీబీ జాన్, హరికృష్ణ, శ్రీనివాస్, స్పందన, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీతారాంపురం సౌత్ (నరసాపురం గ్రామీణ), న్యూస్‌టుడే: సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా మండలంలోని సీతారాంపురం సౌత్‌లోని వెంకట్రావుతోట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర సంచారజాతుల సంఘం ఆధ్వర్యంలో విద్యా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెండ్ర వీరన్న, పెండ్ర శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్‌బీచర్ల(తూర్పుతాళ్లు), న్యూస్‌టుడే: మండలంలోని ఎల్‌బీచర్ల గురుకుల బాలుర పాఠశాలలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపల్ బీహెచ్‌బీ రామకృష్ణ మూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మహిళా ఉపాధ్యాయునులను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బి.పూర్ణచంద్రరావు, ఎన్.సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న చింతరేవు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు



చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపల్ రామకృష్ణ మూర్తి

బండిముత్యాలమ్మ హుండీ ఆదాయం రూ.15.17 లక్షలు

ముత్యాలపల్లి (మొగల్తూరు), న్యూస్‌టుడే: ముత్యాలపల్లి లోని బండిముత్యాలమ్మ అమ్మవారి హుండీ ఆదాయాన్ని ఆలయ సిబ్బంది, విద్యార్థులు బుధవారం లెక్కించారు. భక్తులు గత 19 రోజులుగా హుండీలో వేసిన కానుకల ద్వారా రూ.15,17,525 ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు. దీంతో పాటు 20 గ్రాముల బంగారం, 286 గ్రాముల వెండి సమర్పించారని తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో భీమవరం దేవస్థానాల ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, ఆలయ ఛైర్‌పర్సన్ దాసరి అమ్మాజి, ఆలయ ఇన్‌ఛార్జ్ ఈవో ఎ.సతీశ్‌కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది, విద్యార్థులు

టెలికం ఉద్యోగి రాజుకు ఉత్తమ ప్రతిభ అవార్డు

పాలకొల్లు, న్యూస్‌టుడే : టెలిఫోన్ వినియోగదారుల నుంచి బాకీలను వసూలు చేయడంలో పాలకొల్లును జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిపిన పాలకొల్లు బీఎస్ఎన్ఎల్ కార్యాలయ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వి.వి.ఎస్.ఎన్.రాజును పలువురు అభినందించారు. ఈ సందర్భంగా టెలికం కార్యాలయంలో జరిగిన అభినందన సభలో ఆయనను జిల్లా టెలికం మేనేజర్ కె.ఎస్.వరప్రసాద్ సన్మానించి ప్రతిభా అవార్డును అందించారు. పాలకొల్లు డీఈ జె.వి.బాపారావు మాట్లాడుతూ విధి నిర్వహణలో రాజు చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో భీమవరం డీఈ రాంబాబు, పాలకొల్లు ఉప విభాగ ఇంజనీర్లు డి.రవీంద్రకుమార్, జి.వి.రత్నాకర్, నరసాపురం ఎస్.డి.ఈ టి.వెంకటేశ్వరరావు, బీఎస్ఎన్ఎల్ జె.టి.ఓలు, లైన్‌మేన్‌లు, సహా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

నరసాపురం	
కనకదుర్గ	ఎంసీఏ
అన్నపూర్ణ	----------
రాజరాజేశ్వరి	హలో
మొగల్తూరు	
శ్రీదేవి జానకి	ఎంసీఏ
శ్రీదేవి జానకిమినీ	2కంట్రీస్

నరసాపురం

విద్యార్థులకు రక్త నిర్ధరణ పరీక్షలు

ఎల్‌బీచర్ల(తూర్పుతాళ్లు), న్యూస్‌టుడే: నరసాపురం గౌతమి విద్యాసంస్థల ఆధ్వర్యంలో మండలంలోని ఎల్‌బీచర్ల జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు బుధవారం ఉచిత రక్త నిర్ధరణ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉమా కుమారి, అధ్యాపకుడు జి.జయప్రకాశ్, ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే మాధవనాయుడు

సరిపల్లి (నరసాపురం గ్రామీణ), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు సూచించారు. 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమంలో భాగంగా బుధవారం సరిపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం స్వయం సహాయక సంఘాల మహిళల పిల్లలకు మంజూరైన ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాతాడి కనకరాజు, వైస్ ఎంపీపీ అందే రామకృష్ణ, ఎంపీడీవో కన్నమనాయుడు, సర్పంచి కేదాసు రమాకాసుమణి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ రాయుడు శ్రీరాములు, గ్రామ కార్యదర్శి రాధా శకుంతల, మండల తెదేపా అధ్యక్షుడు కొట్టు నర్సింహమూర్తి, నాయకులు నడిపూడి కృష్ణ, మైలాబత్తుల బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



సరిపల్లిలో మాట్లా డుతున్న ఎమ్మెల్యే మాధవనాయుడు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు అన్నారు. 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమంలో భాగంగా స్థానిక 4, 6, 7, 8 వార్డుల్లో బుధవారం నిర్వహించిన సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. 1038 రకాల వ్యాధులకు ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా చికిత్స అందిస్తున్నామన్నారు. ప్రతి కుటుంబం వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని సూచించారు. నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో పురపాలక ఛైర్‌పర్సన్ పసుపులేటి రత్నమాల, ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పొత్తూరి రామరాజు, పురపాలక వైస్ ఛైర్మన్ పొన్నాల నాగబాబు, కమిషనర్ ఎస్. వెంకటరమణ, జన్మభూమి ప్రత్యేక అధికారి ఎం.వెంకటరావు, కౌన్సిలర్లు ఆరేటి వేణు, పతివాడ పద్మ, పెదసింగు మణి, తిరుమాని శశిదేవి, అబేదాసుల్తానా, బళ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరు, న్యూస్‌టుడే: పేరుపాలెంసౌత్‌లోని సొసైటీలో జరిగిన అవకతవకలపై విచారణ పారదర్శకంగా జరుగుతుందని ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు తెలిపారు. బుధవారం పేరుపాలెంసౌత్, పేరుపాలెంనార్త్‌లో జరిగిన 'జన్మభూమి-మాఊరు' సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని పేరుపాలెంసౌత్‌లోని సొసైటీ బాధిత రైతులు ఎమ్మెల్యేను కోరారు. దీనిపై స్పందించిన ఆయన విచారణ ఈ నెల 8వ తేదీలోపు పూర్తవుతుందని తెలిపారు. అనంతరం నూతనంగా మంజూరైన రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. చంద్రన్న సంక్రాంతి కానుకలు, విద్యార్థులకు ఉపకారవేతనాలు పంపిణీ చేశారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సంకు మురళీకృష్ణ, ఎంపీడీవో జి.రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ ఎస్.హరినాథ్, ఏరియా ఆసుపత్రి ఛైర్మన్ బండారు ప్రతాప్‌నాయుడు, ఎంపీపీ కత్తిమండ ముత్యాలరావు, జడ్పీటీసీ సభ్యుడు గుబ్బల నాగరాజు, వైస్‌ఎంపీపీ అంద్రాజు రామన్న, ఎంపీటీసీ సభ్యులు మేళం లక్ష్మీ పద్మవేణి, కడలి ప్రభావతి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సేవా సంస్థ వితరణ



బియ్యం, నిత్యావసరాలు అందజేస్తున్న సేవా సంస్థ సభ్యులు.

కొత్తకాలనీ(నరసాపురం పురపాలకం), న్యూస్‌టుడే: నరసాపురం పట్టణ పరిధి 22వ వార్డు కొత్తకాలనీలో మంగళవారం అగ్ని ప్రమాదం జరిగిన విషయం విదితమే. ఈ ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు నరసాపురానికి చెందిన మన ఆదరణ సామాజిక సేవా సంస్థ వారు బియ్యం, ఇతర నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పి.చిన్ని, కార్యదర్శి ఎం.మనోజ్‌కుమార్, కోశాధికారి కె.బన్ను, సభ్యులు ఎ.జానీ, కె.చెన్నా, బి.నాని, కె.వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

యడ్లబజారు ప్రాంతం (పాలకొల్లు), న్యూస్‌టుడే : స్థానిక శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ కళాశాల ఎన్.ఎస్.ఎస్ విభాగం సేవా కార్యక్రమంలో భాగంగా రెండో రోజు బుధవారం ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని పాలకొల్లు శాసనసభ్యుడు నిమ్మల రామానాయుడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో కార్యకర్తలు చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. కళాశాల ప్రధానాచార్యుడు కె.శ్రీరామమూర్తి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వలన విద్యార్థుల్లో సేవా తత్పరత కలుగుతుందని, తద్వారా సమాజంలో ఓ ప్రత్యేక గుర్తింపును పొందుతారన్నారు. ఎన్.ఎస్.ఎస్ విభాగాల సమన్వయకర్తలు పి.రాజబాబు, కె.రామనారాయణలు మాట్లాడుతూ రాజవల్లి రాధారమణ్ లయన్స్ కంటి ఆసుపత్రి సిబ్బంది వైద్యపరీక్షలు చేశారన్నారు. సుమారు 256 మందిని పరీక్షించగా 30 మందికి కళ్ళజోళ్లను పంపిణీ చేశారు. ఎన్.ఎస్.ఎస్ కార్యకర్తలు స్వచ్ఛభారత్‌ను నిర్వహించారు. కళాశాల ఉప ప్రధానాచార్యుడు డాక్టర్ పి.సాయిబాబు, సీపీడీసీ కార్యదర్శి బి.వి.రాఘవయ్య, బొండాడ రాధారమణ గుప్త, గాదె జనార్ధన గుప్త, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

✺ కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో సావిత్రి భాయిపూలే జయంతి పురస్కరించుకుని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ప్రధానాచార్యుడు శ్రీరామమూర్తి సావిత్రి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహిళా విభాగ సమన్వయకర్త టి.వి.వకుళప్రియ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల యాజమాన్యానిదే బాధ్యత

మొగల్తూరు, న్యూస్‌టుడే: పేరుపాలెంబీచ్‌లో ఈ నెల 1న జిట్స్ కళాశాల విద్యార్థి తిగురుపల్లి మెహిపాల్ అంబేడ్కర్ (17) గల్లంతయ్యాడు. గాలింపు చర్యల్లో భాగంగా ఆ కళాశాల సిబ్బంది బుధవారం పేరుపాలెం వచ్చారు. తమ బిడ్డ ఆచూకీ తెలపాలని సదరు విద్యార్థి కుటుంబ సభ్యులు వారిని నిలదీశారు. దీనిపై సిబ్బంది ఇచ్చిన సమాధానానికి వారు సంతృప్తి చెందలేదు. అంబేడ్కర్‌ను తిరిగి అప్పగించాల్సిన బాధ్యత కళాశాల యాజమాన్యానిదేనన్నారు. అనంతరం పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని ఎమ్మెల్యే మాధవనాయుడుకు వారు వినతిపత్రం సమర్పించారు. దీనికి స్పందించిన ఆయన విచారణ జరిపిస్తానని హామీఇచ్చారు.



జిట్స్ కళాశాల సిబ్బందిని నిలదీస్తున్న విద్యార్థి బంధువులు

ప్లాస్టిక్ వ్యర్థాల్ని మేసేస్తున్నాయి...

మొగల్తూరు, న్యూస్‌టుడే: పర్యావరణ కాలుష్యానికి కారణమవుతున్నా ప్లాస్టిక్ వాడకం తగ్గడం లేదు. ప్లాస్టిక్‌తో చేసిన సంచులు, ఇతర వస్తువులను వినియోగించాక ప్రధాన రహదారుల వెంట వేస్తున్నారు. రోడ్ల వెంట పశువులు వీటిని ఆహారంగా భావించి మేస్తున్నాయి. ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఆలయ సమీపంలో రోడ్డు వెంట గోవులు ప్లాస్టిక్ వ్యర్థాల్లో మేస్తున్న దృశ్యం బుధవారం న్యూస్‌టుడేకు చిక్కింది. ఇవి అనారోగ్యం పాలై మృతి చెందుతాయని పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా రోడ్ల వెంట ప్లాస్టిక్ వ్యర్థాలు వేసే వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



ప్లాస్టిక్ వ్యర్థాల్లో మేతకోసం అన్వేషిస్తున్న గోవులు

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం ఆర్యవైశ్య సంఘం మహిళా విభాగం నూతన కార్యవర్గ సభ్యులు స్థానిక ఆర్యవైశ్య రామాలయంలో బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షురాలు అప్పన శ్రీదేవి, కార్యదర్శి దేవత విశాల, కోశాధికారి పాలెపు విజయదుర్గ, ఉపాధ్యక్షురాలు అప్పన మాళవి, సంయుక్త కార్యదర్శి రాతికింది లక్ష్మీతో గౌరవాధ్యక్షురాలు ఆత్మూరి రమ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెంకటనరసయ్య, అచంట నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: ఒక యువకుడు బుధవారం రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్సై ఎ.వి.ప్రసాద్ కథనం మేరకు... పాలకొల్లు స్టేషన్ సమీపంలో రైలుకింద ఓ వ్యక్తి తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా ఆచంట మండలం వల్లూరు శివారు కాసానివారిపాలెంనకు చెందిన మట్టా మణికంఠ (22)గా గుర్తించారు. ఇటీవల ఒక ప్రేమ వ్యవహారంలో తలెత్తిన సమస్యల కారణంగా మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి శవపంచనామాకు తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.





కుసుమ, కాళిపట్నం





రత్నశ్రీ, కొప్పరు

రాయితీపై నిత్యావసరాలు అందించాలి

ఎల్‌బీచర్ల(తూర్పుతాళ్లు), న్యూస్‌టుడే: చౌక ధరల దుకాణాల ద్వారా అన్ని రకాల నిత్యావసరాలను రాయితీపై అందించాలని సీపీఎం మండల కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చౌక ధరల దుకాణాల స్థానంలో షాపింగ్‌మాల్స్ ఏర్పాటు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని మండలంలోని ఎల్‌బీచర్లలో సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ ధర్నాలో జల్లి రామ్మోహనరావు, తోట సూర్యనారాయణ, పొన్నమండ సత్యనారాయణ, గుబ్బల సత్యనారాయణ, జల్లి బాబురావు, పొన్నమండ ముత్యాలమ్మ, జల్లి నాగేశ్వరరావు, కటకంశెట్టి రెడ్డినాయుడు, గుబ్బల పుల్లంశెట్టి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

నిడదవోలు

విద్యార్థి ప్రతిభ

పెరవలి,న్యూస్‌టుడే: పెరవలి మండలం ఖండవల్లి గ్రామానికి చెందిన దాసరి సతీష్ జిల్లా నుంచి నన్నయ విశ్వవిద్యాలయం తరఫున క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇతను తణుకులో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. విజయనగరం జిల్లాలో ఈనెల 5న నిర్వహించే పోటీల్లో పాల్గొంటాడు.




సృజన శ్రీనివాస్, గోపవరం





శిరీష, గోపవరం

ధాన్యం.. భద్రం..!

గ్రామాల్లో విరివిగా గాదెల వినియోగం



రేకుతో తయారు చేసిన గాదె



తాడిపర్రులో చెక్కతో తయారు చేసిన గాదె

ఉండ్రాజవరం,న్యూస్‌టుడే : పూర్వం నుంచే ఆహార భద్రతకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకునేవారు. వర్షాకాలంలో బియ్యం కొరత లేకుండా గాదెల్లో నిల్వ ఉంచేవారు. ఏడాదికి సరిపడ ధాన్యాన్ని ఈ విధంగా భద్రం చేసుకునేవారు. ఉండ్రాజవరంతో పాటు పరిసర ప్రాంతాల్లో గాదెల్లో ధాన్యం ఉంచుతున్నారు. అవసరం మేరకు ధాన్యం వెలికితీసి మరాడిస్తున్నారు. టేకు చెక్కతో తయారు చేసిన గాదె సుమారు రూ. లక్ష విలువ చేస్తుంది. ఇంట్లో ఇతర సామగ్రితో పాటు ఇళ్ల వద్ద గాదెలను తయారు చేసుకుని సిద్ధంగా ఉంచుకుంటున్నారు. వెదురు కర్రలతో బుట్టలుగా తీర్చిదిద్ది పలు గాదెలను తయారు చేశారు. ఇటీవల రేకులతో తయారు చేసిన గాదెలను సైతం వినియోగిస్తున్నారు. నాటి నుంచి ఇప్పటి వరకు వాటిని జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నారు. అవసరమైన వాటికి మరమ్మతులు చేయిస్తున్నారు. ఉండ్రాజవరం,కాల్దరి,వేలివెన్ను,మోర్త,పసలపూడి,తాడిపర్రు,సత్యవాడ తదితర గ్రామాల్లో ఈ గాదెలు విరివిగా వినియోగిస్తున్నారు. సుమారు 50 నుంచి 100 బస్తాల సామర్థ్యం గల ధాన్యం గాదెలు ఇప్పటికీ అందుబాటులో ఉన్నాయి. నాడు ఉమ్మడి కుటుంబాలకు ఇవి ఎంతగానో ఉపకరించేవి. వందలాది మంది ఆహారం పొందటానికి వీటిలో నిల్వ ఉంచిన ధాన్యం ఉపయోగపడేదని రైతు కరుటూరి సత్యం తెలిపారు. తమ ఇంటి వద్ద ఇప్పటికీ రెండు గాదెలు వినియోగిస్తున్నామన్నారు. చెక్క,మట్టితో తయారు చేసిన గాదెల్లో ధాన్యం నిల్వ ఉంచటం వల్ల ధాన్యం దెబ్బతినకుండా ఉండేదన్నారు.

పూలే దంపతులు ఆదర్శప్రాయులు



సావిత్రిబాయి పూలేకి నివాళులర్పిస్తున్న దృశ్యం

గాంధీబొమ్మకూడలి, రైల్వేగేటుకూడలి, బస్టాండ్‌కూడలి (నిడదవోలు), న్యూస్‌టుడే: పూలే దంపతులు అందరికీ ఆదర్శప్రాయమని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ అన్నారు. సావిత్రి బాయి పూలే జయంతిని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.లక్ష్మి అధ్యక్షత వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

★ బీఎస్పీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను బస్టాండ్‌కూడలిలోని అంబేడ్కర్ గ్రంథాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం జరిగిన సభకు బీఎస్పీ నాయకులు తాడేపల్లి రాజన్ బాబు అధ్యక్షత వహించారు.



ధర్నా చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

కేవీపీఎస్ ఆధ్వర్యంలో ధర్నా

చర్చిపేట, రాయిపేట (నిడదవోలు), న్యూస్‌టుడే: మహారాష్ట్రలో ఆంగ్లేయుల పాలనలో దళితులు నిర్వహించిన చారిత్రాత్మక భీమా కొరెగావ్ పోరాటానికి 200 ఏళ్లు నిండిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో యువకుడి మృతిపై కేవీపీఎస్-చర్చిపేట యూత్ ఆధ్వర్యంలో నిడదవోలు సంతమార్కెట్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు జువ్వల రాంబాబు, అంబటి వెంకటరమణ, గండి శ్రీనివాసరావు, జి.దానియేలు, శ్రీను, సీహెచ్ డొనాల్డ్, అక్కుబత్తుల చినసత్యానందం, కిషోర్, గండి శేఖర్, తలారి గాంధీలు పాల్గొన్నారు.

✳ నిడదవోలులో సంఘ అధ్యక్షుడు అంబటి ఆస్కరరావు అధ్యక్షతన బుధవారం జరిగిన మండల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీస్ సంక్షేమ సంఘ సమావేశం తీవ్రంగా మహారాష్ట్రలో జరిగిన ఘటనను ఖండించింది. సంఘ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్, కోశాధికారి బి.నాగేశ్వరరావు, అబ్దుల్‌అజీజ్, నక్కా నారాయణమూర్తి, బాషా, ఎస్‌కే ఆలీ, బి.చినవెంకట్రావులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి ఊరేగింపు

మోర్త,తాడిపర్రు,పాలంగి,ఉండ్రాజవరం,వేలివెన్ను (ఉండ్రాజవరం), న్యూస్‌టుడే: మండలంలోని వివిధ గ్రామాల్లో వేణుగోపాలస్వామి పల్లకీ ఊరేగింపును వైభవంగా బుధవారం నిర్వహించారు. మోర్త,తాడిపర్రు,వేలివెన్ను, ఉండ్రాజవరం తదితర గ్రామాల్లో స్వామి వారికి వాయిద్యాల మధ్య గ్రామోత్సవం చేపట్టారు.

తాడిమళ్లలో ఎమ్మార్పీఎస్ నాయకుల దీక్షలు

తాడిమళ్ల (నిడదవోలు), న్యూస్‌టుడే: మందకృష్ణ మాదిగ అరెస్టుకు నిరసనగా నిడదవోలు మండలం తాడిమళ్లలో బుధవారం రిలేనిరాహార దీక్షలు నిర్వహించారు. దీక్షల్లో ఎంఆర్‌పీఎస్ నాయకులు గెల్లా నటరాజ్‌మాదిగ, చెట్టే రామకృష్ణమాదిగ, భీమడోలు కిరణ్‌కుమార్‌మాదిగ, మారుగుడి సురేష్‌మాదిగ, సనమండ్ర రాజ్‌కుమార్, గాలింకి ప్రేమ్‌కుమార్, చాపల నరేష్, సనమండ్ర వెంకట్రావులు దీక్షల్లో కూర్చున్నారు. యర్రా సాయికృష్ణ, మునికోటి బాలాజీలు సంఘీభావం ప్రకటించారు.

మహిళ విద్యతోనే ప్రగతి

సమిశ్రగూడెం, అట్లపాడు (నిడదవోలు), న్యూస్‌టుడే: మహిళల విద్య ద్వారానే దేశం అభివృద్ధి చెందుతుందని నిడదవోలు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రధానాచార్యురాలు పి.సరళ అన్నారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో విద్యార్థులు, అధ్యాపకులు బృందంగా ఏర్పడి పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అట్లపాడులో జరిగిన జన్మభూమి గ్రామసభలో పాల్గొని విద్య ప్రాధాన్యాన్ని వివరించారు. అధ్యాపకులు ఎం.కిరణ్మయి, ఎన్.సుజాత, పీఎల్ఎన్‌వీ ప్రసాద్, ఎ.కోటేశ్వరరావు, కె.సూర్యనారాయణ, డి.విమలకుమారి, ఎం.నాగమణిలు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

నిడదవోలు, న్యూస్‌టుడే: శెట్టిపేట గ్రామంలోని నంగాలమ్మ ఆలయ సమీపంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురిని బుధవారం అరెస్టు చేసినట్లు నిడదవోలు ఎస్ఐ జి.సతీష్ తెలిపారు. వారి నుంచి రూ. 1000 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఒప్పంద కార్మికుల నిరసన



ధర్నా చేస్తున్న ఒప్పంద సిబ్బంది

విద్యానగర్ (నిడదవోలు), న్యూస్‌టుడే: ఏపీ విద్యుత్తు కాంట్రాక్టు కార్మికుల ఐక్యవేదిక పిలుపు మేరకు నిడదవోలు డివిజన్ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో ఒప్పంద కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాంట్రాక్టు కార్మికుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పి.కాశీమదు బాబు మాట్లాడుతూ విద్యుత్తు సంస్థలో 20 ఏళ్లుగా 23వేల మంది కార్మికులు చాలీచాలని జీతాలతో పని చేస్తున్నారని అన్నారు. కేవీఎస్ రాజు, రవి, గణేష్, బాబు, పద్మారావు, వీర్రాజు, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలి

నిడదవోలు, న్యూస్‌టుడే: విద్యలో విద్యార్థులు రాణించి పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని 8వ వార్డు కౌన్సిలర్ కేదారిశెట్టి సునీత అన్నారు. నిడదవోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పి.శ్రీఆంధ్రాజవహర్ జ్ఞాపకార్థం ఆయన భార్య రమాజవహర్, కుటుంబ సభ్యులు వేదికను నిర్మించారు. దీనిని మండల విద్యాశాఖాధికారి పీవీ పాపారావు, సునీత, రమాజవహర్‌లు బుధవారం ప్రారంభించారు. కళాశాల ప్రధానాచార్యుడు ఎంవీఎస్ శర్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డేవిడ్ రాజు, విలియమ్స్, ఆర్.నాగేశ్వరరావు, రవికుమార్, మంతెన రామచంద్రరాజు, తురగ రామకృష్ణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమాజవహర్‌ను సత్కరించారు.

సినిమాలు

నిడదవోలు

శ్రీగణపతి	ఒక్కక్షణం..
(ఉదయం 11 గం. సా. 6 గంటలు)	
శ్రీగణపతి	హలో
(మ. 2 గంటలు. రా. 9 గంటలు)	
రాధాకృష్ణ	ఎంసీఏ

తణుకు

వెంకటేశ్వర	హలో
శ్రీచిత్ర	ఇది
నరేంద్ర	గరుడవేగ
మినీ నరేంద్ర	మాతంగి
ప్రత్యూష	ఎంసీఏ
ప్రత్యూష మినీ	ఎంసీఏ
లక్ష్మి	ఒక్కక్షణం
లక్ష్మి మినీ	టూ కంట్రీ

నిడదవోలు

స్వచ్ఛ భారత్ మిషన్‌తో మరుగుదొడ్ల నిర్మాణం

సత్యవాడ,కె.సావరం,తాడిపర్రు,పాలంగి,కాల్దరి (ఉండ్రాజవరం), న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రతి ఇంట వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించడానికి స్వచ్ఛ భారత్‌మిషన్ ఎంతగానో ఉపయోగపడిందని పలువురు సర్పంచులు తెలిపారు. ఆత్మగౌరవదీక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో గ్రామసభలు బుధవారం నిర్వహించారు.

భూసేకరణపై ఆందోళన..!

పెరవలి, న్యూస్‌టుడే :

తణుకు పట్టణానికి మంచినీటిని అందించడంలో భాగంగా పెరవలి మండలంలోని నిడదవోలు-నరసాపురం కాలువ పక్కన 60 ఎకరాల భూమిని సేకరించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనిలో చెరువు తవ్వి, ఆ నీటిని పట్టణానికి అందించాలన్నదే నాయకుల ప్రణాళిక. దీనిపై స్థానిక రైతుల నుంచి నిరసన వ్యక్తం అవుతోంది.

అజ్జరం, వెంకట్రాయపురం, సీతారామపురం, కాకరపర్రు గ్రామాల రైతులకు చెందిన 60 ఎకరాలను సేకరించడానికి ఇప్పటికే దస్త్రాలు సిద్ధం చేశారు 52 మంది సన్నచిన్నకారు రైతులు దీనివల్ల తమ జీవనోపాధి దెబ్బతింటుందని వాపోతున్నారు. తణుకు నియోజకవర్గం అభివృద్ధి పేరుతో.. నిడదవోలు నియోజకవర్గానికి చెందిన భూములను సేకరించాలనుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు..



పంట పొలాల వద్ద రైతుల ఆందోళన



అజ్జరంలోని పంట పొలాలు

భూములే ఆధారం



ఈ భూములే మాకు ఆధారం. కొన్నేళ్లుగా ఇక్కడే వ్యవసాయం చేస్తూ జీవనం చేస్తున్నాం. ఎక్కడో తాగునీటి కోసం మా ఉపాధిని దెబ్బతీయవద్దు. **-కోనాల నాగిరెడ్డి, రైతు**

మేం జీవించేది ఎలా..?



వరి పొలంపైనే ఆధారపడి జీవిస్తున్నాం. వీటిని తీసుకుంటే మేం ఎలా జీవించాలి..? పొలాలు ఇవ్వడానికి సిద్ధంగా లేం. **-కె.సత్యవతి,పెరవలి.**

పరిహారం తీసుకోవడానికి రైతులు ముందుకు రాలేదు



భూసేకరణకు సంబంధించి రైతులకు సొమ్ము వచ్చినట్లు ఆదేశాలు వచ్చాయి. పరిహారం అందించడానికి యత్నించగా వారు వ్యతిరేకించారు. **-వజ్రపు జితేంద్ర, తహశీల్దార్,పెరవలి**



అన్నవరప్పాడులో ప్రమాదకరంగా కూలీల ప్రయాణం

'వెంట్రుకవాసి'లో గండం
ఆదమరిస్తే గాలిలో ప్రాణం..!

పెరవలి గ్రామీణ, న్యూస్‌టుడే: వాహనదారులు నిబంధనలు పాటించకపోవడంతో పలు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అన్నవరప్పాడులో ఇరుకు రహదారిపై ఓ లారీలో కూలీలు ప్రమాదకర ప్రయాణం చేశారు. పైన విద్యుత్తు తీగలు వేలాడుతూ..కూలీలను తాకే విధంగా ఉన్నాయి.

-పెరవలి గ్రామీణ,న్యూస్‌టుడే

సమస్యల పరిష్కార వేదిక జన్మభూమి మా ఊరు



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రామ్మోహనరావు

విద్యానగర్, శాంతినగర్, బస్టాండ్‌కూడలి (నిడదవోలు), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక జన్మభూమి కార్యక్రమమని ప్రత్యేకాధికారి ఎం.మోహనరావు అన్నారు. పట్టణంలోని 3, 7, 17వ వార్డుల్లో జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. నూతనంగా మంజూరైన రేషన్‌కార్డులు అందించారు. అంగన్‌వాడీ ఆధ్వర్యంలో సీమంతాలు నిర్వహించారు. మున్సిపల్ ఛైర్మన్ బొబ్బా కృష్ణమూర్తి, పట్టణ తెదేపా అధ్యక్షుడు గూడపాటి వెంకట్రావు, మున్సిపల్ కమిషనర్ జి.కృష్ణమోహన్, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ పేరూరి సాయిబాబా, పట్టణ తెదేపా కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ, కౌన్సిలర్లు పువ్వల రతీదేవి, నందిగం సుబ్బారాయుడు, అధికారులు పాల్గొన్నారు.

✳ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని నిడదవోలు నియోజకవర్గ ప్రత్యేకాధికారి, మహిళా, శిశుసంక్షేమ శాఖ ప్రత్యేక కమిషనర్ సీహెచ్ అరుణ్‌కుమార్ అన్నారు. తిమ్మరాజుపాలెం, కాటకోటేశ్వరం, అట్లపాడు గ్రామాల్లో జన్మభూమి మా ఊరు గ్రామసభలు బుధవారం నిర్వహించారు. ఈ గ్రామాల్లో విద్యార్థులు నిర్వహించిన వివిధ రకాల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ముగ్గుల పోటీల్లో విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు. మండల ప్రత్యేకాధికారి ఎం.సూర్యభగవాన్, తహశీల్దారు ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎ.ఆంజనేయులు, ఈవోఆర్‌డీ లక్ష్మికాంతం, సర్పంచులు పోలిమాటి వీరాస్వామి, మరపట్ల శ్రీరామ్మూర్తి, పి.సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చివటం,వడ్లూరు(ఉండ్రాజవరం), న్యూస్‌టుడే: అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా కృషి చేస్తున్నట్లు జడ్పీటీసీ సభ్యుడు కోమట్లపల్లి వెంకటసుబ్బారావు అన్నారు. చివటం,వడ్లూరు గ్రామాల్లో జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. చివటంలో పలువురు మహిళలు తమకు పింఛను మంజూరు చేయాలని విన్నవించుకున్నారు. ఎంపీపీ తొర్లపాటి సర్వేశ్వరరావు, సర్పంచులు మట్టా సుబ్బారావు,సింగారపు పద్మ,ఎంపీటీసీ సభ్యులు,ప్రత్యేకాధికారి ఎం.రామారావు,జన్మభూమి కమిటీ మండలశాఖ అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, ఎంపీడీవో బి.వీరాస్వామి,తహశీల్దార్ ఈది జాన్ రాజు పాల్గొన్నారు.



ఖండవల్లిలో మాట్లాడుతున్న అశోక్‌కుమార్



కాటకోటేశ్వరంలో విద్యార్థినుల ప్రదర్శన

ఖండవల్లి, అన్నవరప్పాడు(పెరవలి),న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతను పాటించి ఆరోగ్యపరిరక్షణను పెంపొందించుకోవాలని జన్మభూమి మా ఊరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి అశోక్‌కుమార్ అన్నారు. ఖండవల్లిలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. సభకు సర్పంచి భూపతిరాజు వరాహనరసింహరాజు, గుత్తుల లక్ష్మి అధ్యక్షత వహించారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు



కోడి పందేలు నిర్వహించే ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎస్.ఐ, తహశీల్దారు

పెరవలి గ్రామీణ, న్యూస్‌టుడే : సంక్రాంతి పండుగ ముసుగులో కోడిపందేలు, జూదాలు వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్.ఐ పేరూరి నాగరాజు హెచ్చరించారు. బుధవారం ఖండవల్లిలో కోడిపందేలు నిర్వహించే ప్రాంతాలను తహశీల్దారు వజ్రపు జితేంద్రతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోడిపందేలు, జూదాలు అడ్డుకునేందుకు కఠిన చర్యలు చేపట్టామన్నారు. సలాది కృష్ణమూర్తి, సలాది ఉదయభాస్కరరావు పాల్గొన్నారు.

సమాజసేవకు ముందుకు రావాలి



తిమ్మరాజుపాలెంలో ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

తిమ్మరాజుపాలెం (నిడదవోలు), న్యూస్‌టుడే: విద్యార్థులు సమాజసేవకు ముందుకు రావాలని నిడదవోలు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అయినపర్తి మురళీకృష్ణ అన్నారు. తిమ్మరాజుపాలెంలో నిడదవోలు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా గ్రామంలో శ్రమదానం నిర్వహించారు. దీనిలో భాగంగా వలంటీర్లు రహదారులను శుభ్రం చేసి చెత్తాచెదారాలను తొలగించారు. అనంతరం బ్లీచింగ్ చల్లారు. అనంతరం ఎంపీయూపీ పాఠశాలలో జరిగిన జన్మభూమి గ్రామసభలో పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. అధ్యాపకులు కె.వేణు, త్రిమూర్తులు పాల్గొన్నారు. అనంతరం యోగా గురువు సానెపు వెంకట సుబ్బారావు యోగా తరగతులు నిర్వహించారు.

పాలకొల్లు

నేడు చంద్రన్న వైద్య సేవలు అందే ప్రాంతాలు

పోడూరు, న్యూస్‌టుడే: ఆచంట సీహెచ్‌సీ పరిధిలో గురువారం చంద్రన్న వైద్య(104) సేవలు అందించనున్నట్లు 104 వైద్యాధికారి డాక్టర్ డి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఉదయం కరుగోరుమిల్లి, మధ్యాహ్నం ముత్యాలవారిపాలెం ప్రాంతాల్లో వైద్య సేవలు అందించనున్నట్లు రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. ఈ అవకాశాన్ని ఇరు గ్రామల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన చెప్పారు.

టెలికం ఉద్యోగి రాజుకు ఉత్తమ ప్రతిభ అవార్డు

పాలకొల్లు, న్యూస్‌టుడే : టెలిఫోన్ వినియోగదారుల నుంచి బాకీలను వసూలు చేయడంలో పాలకొల్లును జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిపిన పాలకొల్లు బీఎస్ఎన్ఎల్ కార్యాలయ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వి.వి.ఎస్.ఎన్.రాజును పలువురు అభినందించారు. ఈ సందర్భంగా టెలికం కార్యాలయంలో జరిగిన అభినందన సభలో ఆయనను జిల్లా టెలికం మేనేజర్ కె.ఎస్.వరప్రసాద్ సన్మానించి ప్రతిభా అవార్డును అందించారు.



నీటిశుద్ధి పరికరాల పంపిణీలో దాతలు

దాతల చలవే విద్యాలయాలకు వరం

మేడపాడు (యలమంచిలి), న్యూస్‌టుడే: దాతల చలవ విద్యాలయాలకు వరంగా మారిందని మేడపాడు సొసైటీ అధ్యక్షుడు అడ్డాలవాసుదేవరావు అన్నారు. మేడపాడు స్పెషల్ పాఠశాలకు అదేగ్రామానికి చెందిన దాత వీరవల్లి రాంబాబు తాగునీటి శుద్ధియంత్రాలను రెండు ఏర్పాటుచేశారు. స్థానిక నాయకుడు కె.సూరయ్య అధ్యక్షత వహించారు. దాత మాట్లాడుతూ చదువుకున్న పాఠశాలకు సొంతగ్రామానికి మనవంతు సాయంగా చేయూతనివ్వాలని కోరారు. తాగునీటివల్ల అనేక రుగ్మతలు సంభవిస్తున్నా మౌలికవసతుల్లో తాగునీటికి ప్రాధాన్యం లభించడం లేదన్నారు. పాఠశాలల్లో దాతలవలనే కొన్ని సౌకర్యాలు సమకూరాలని ఉపాధ్యాయులు నాగబాబు అన్నారు. ఉపాధ్యాయసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదర్శంగా ఎన్ఎస్ఎస్ సేవాకార్యక్రమాలు

యడ్లబజారు, (పాలకొల్లు పట్టణం), న్యూస్‌టుడే: జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) కార్యక్రమాలు ఆదర్శనీయంగా ఉంటాయని శాసనసభ్యుడు డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా కంటి వైద్యశిబిరం బుధవారం ఆయన ప్రారంభించారు. 256 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 30 మందికి కళ్లజోళ్లు, 26 మందికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ పి.సాయిబాబు, కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి డాక్టర్ బి.వి.రాఘవయ్య, ఎన్ఎస్ఎస్ యూనిట్ సమన్వయకర్తలు పి.రాజబాబు, కె.రామనారాయణ, ప్రముఖ వ్యాపారవేత్త బొండాడ రాధారమణగుప్త, గాదె జనార్ధనగుప్త, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సంక్షోభంలోనూ సంక్షేమం

మావుళ్లమ్మపేట, (పాలకొల్లు పట్టణం), న్యూస్‌టుడే: సంక్షోభంలోనూ సంక్షేమాన్ని అమలు చేసి అవరోధాలను అధిగమించి రాష్ట్ర అభివృద్ధి జరుగుతోందని శాసనసభ్యుడు డాక్టర్ నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. స్థానిక 3, 4, 29 వార్డు కౌన్సిలర్లు బేరం శ్రీరామచంద్రమూర్తి, బొబ్బిలి శ్రీనివాసరావు, చందక ఉమాశైలజ అధ్యక్షతన బుధవారం జరిగిన జన్మభూమి- మాఊరు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి కొక్కిరిగడ్డ జయరాజు మాట్లాడుతూ ఎన్నికలలో తెదేపా ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేర్చిందన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం చేశారు. స్థానికులు వ్యక్తిగత సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. వాటిపై సంబంధిత అధికారులతో ఆయన చర్చించారు. అనంతరం చంద్రన్న బీమా చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు, మున్సిపల్ అధ్యక్షుడు వల్లభు నారాయణమూర్తి, ఉపాధ్యక్షురాలు కర్నేని రోజారమణి, తెదేపా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బోణం నర్శింహరావు, గండేటి వెంకటేశ్వరరావు, ధనాని సూర్యప్రకాశ్, పెచ్చేటి బాబు, పర్యవేక్షణ అధికారి దుర్గాప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ఎ.రామ్మోహన్, తెదేపా నాయకులు తమ్మినీడి సత్యనారాయణ, మజ్జి రవిశంకర్, మేడిశెట్టి సత్యనారాయణ, కుడిపూడి నాగేశ్వరరావు, జుత్తిగ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



బీమా చెక్కు అందజేస్తున్న శాసనసభ్యుడు రామానాయుడు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి జయరాజు

పేదల దరిచేరని ప్రభుత్వ పథకాలు

అవగాహన లేక అవస్థలు పడుతున్న గర్భిణులు, బాలింతలు

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు మాతాశిశుసంరక్షణకు అనేక పథకాలు అమలు చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి ప్రచారం లేకపోవడం వల్ల లబ్ధిదారులకు అవి పూర్తిగా చేరడంలేదు. పేద, మధ్యతరగతి వర్గాల గర్భిణులు, బాలింతలకు ఈ పథకాలపై అవగాహన లేక ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయించి ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. తల్లీబిడ్డా సంక్షేమం కోసం ప్రభుత్వాసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలను పేద ప్రజలకు చేరువ చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఈ పథకాలపై వారికి అవగాహన కల్పించి వాటిని సద్వినియోగం చేసుకొనేలా చూడాల్సి ఉంది. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి. చాలామందికి పథకాలపై అవగాహనలేక పూర్తిస్థాయి పొందలేకపోతున్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ పథకాల సమాచారం మీ కోసం..

✳ **వివిధ సేవలు:** గర్భిణులను ఆసుపత్రికి తీసుకురావడం, ప్రసవం అనంతరం ఇంటికి తీసుకువెళ్లేందుకు అంబులెన్స్ సర్వీస్ ఏర్పాటు చేశారు. 104 ద్వారా గ్రామాల్లో అవసరమైన వైద్యసేవలతోపాటు ఉచితంగా క్రమం తప్పకుండా మందులు పంపిణీ చేస్తారు. 108 సర్వీస్ ద్వారా గర్భిణులు, బాలింతలకు అవసరమైన వైద్యపరీక్షల నిమిత్తం ఆసుపత్రికి చేరుస్తారు. ప్రసవం అనంతరం ప్రభుత్వాసుపత్రి నుంచి క్షేమంగా తల్లీబిడ్డలను 102, తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ ద్వారా సురక్షితంగా ఇంటికి చేరవేస్తారు. ఈ అత్యవసర సేవలన్నీ అన్ని వేళల్లోనూ అందుబాటులో ఉంటాయి.

✳ **జననీ సురక్ష:** జననీ సురక్ష పథకం ద్వారా ప్రభుత్వాసుపత్రిలో ఎక్కువ ప్రసవాలు జరిగే విధంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. ఉచిత ఆరోగ్యపరీక్షలు, అవసరమైన మేరకు ఉచిత శస్త్రచికిత్సలు, ప్రసవాల కోసం ఆసుపత్రిలో చేరే గర్భిణులకు భోజన వసతి, పుట్టిన బిడ్డకు వెంటనే అందించాల్సిన టీకాలు, ఇతర వైద్యసదుపాయాలు, మందులు ఉచితంగా ఈ పథకంలో అందిస్తారు. ప్రభుత్వాసుపత్రిలో ప్రసవం జరిగితే తల్లికి వెయ్యి రూపాయల ప్రోత్సాహం అందిస్తారు.

✳ **ఎన్టీఆర్ బేబీ కిట్:** ఎన్టీఆర్ బేబీ కిట్ పథకం ద్వారా ప్రభుత్వాసుపత్రిలో ప్రసవం జరిగిన తరువాత తల్లీబిడ్డా సంరక్షణ కోసం సుమారు వెయ్యి రూపాయల విలువైన కిట్‌ను అందిస్తారు. ఈ కిట్‌లో చిన్నారులకు అవసరమైన దోమతెర, సబ్బు, పౌడర్, బెడ్, టవల్ తదితర వస్తువులు ఉంటాయి.

✳ **అన్న అమృతహస్తం:** ఈ పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ ద్వారా పౌష్టికాహారం అందిస్తారు. ప్రతిరోజు గర్భిణులకు ఒక పూట సంపూర్ణ ఆహారంతోపాటు వారానికి 6 కోడిగుడ్లు, పాలు అందజేస్తారు. 3 ఏళ్ల చిన్నారులకు రోజుకు 100 గ్రాముల చొప్పున నెలకు 2.5 కేజీల బాలామృతం అందిస్తారు. ప్రీ స్కూల్ పిల్లలకు మధ్యాహ్న భోజనంతోపాటు 4 గుడ్లు అందజేస్తారు. తక్కువ బరువు ఉన్న చిన్నారులకు ప్రతిరోజు గుడ్డుతోపాటు 100 మిల్లీలీటర్ల పాలు కూడా అందిస్తారు.



గర్భిణీకి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

✳ **సురక్షిత మాతృత్వ యోజన:** ఈ పథకం ద్వారా గర్భిణులకు ప్రతినెలా 9న సమీపంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, సీహెచ్‌ఈలు, ప్రాంతీయ జిల్లా సామాన్య ఆసుపత్రుల్లో క్రమం తప్పకుండా ఉచితంగా వైద్యపరీక్షలు చేస్తారు. అవసరమైన హెచ్‌బీ, హెచ్‌ఐవీ, యూరిన్, చెక్కెర తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తారు. అతిప్రమాదకర కేసులకు అవసరాన్ని బట్టి స్కానింగ్ పరీక్షలు చేస్తారు.

✳ **ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన:** ఈ పథకం ద్వారా దారిద్ర్యరేఖకు దిగువన ఉండి తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం అయితే రూ.6 వేలు ప్రోత్సాహం అందిస్తారు. గర్భందాల్చిన 3వ నెలలో ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేయించుకొని పీహెచ్‌సీలో దరఖాస్తు అందజేసినట్లైతే వాటిని పరిశీలించి న్యూఢిల్లీ ఎన్ఆర్‌హెచ్ఎంకు పంపిస్తారు. అక్కడ నుంచి మొదటి విడత రూ.2 వేలు నేరుగా వారి ఖాతాలో జమ అవుతుంది. 6వ నెలలో క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకున్నట్లు వైద్యుల సలహా ప్రకారం పౌష్టికాహారం తీసుకుంటూ మందులు వాడుతున్నట్లైతే మరో 2 వేలు అందిస్తారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవానంతరం బిడ్డకు అన్ని రకాల రక్షణ టీకాలు అందించిన తరువాత వెయ్యిరూపాయలు, జననీ సురక్ష పథకంనకు చెందిన వెయ్యితో కలిసి మొత్తం రూ. 6 వేలు అందిస్తారు.

✳ **మార్పు కార్యక్రమం:** మార్పు కార్యక్రమం ద్వారా ప్రతి నెలా 4వ శనివారం ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహిస్తారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది ప్రతి బుధవారం క్షేత్రస్థాయిలో గర్భిణులు, చిన్నారులు, బాలింతల ఆరోగ్య సంరక్షణ కోసం టీకాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తారు., చిన్నారులకు పుట్టినవెంటనే పోలియో, హెపటైటిస్-బి టీకాలు వేస్తారు. ఒకటిన్నర, రెండున్నర, ముడున్నర నెలల వయస్సులో పోలియో, డీపీటీ, హెపటైటిస్-బి టీకాలు మూడు మోతాదుల్లో ఇస్తారు. 3 నెలలు నిండిన చిన్నారులకు విటమిన్-ఎ ద్రావణంతోపాటు అవసరమైన వైద్యం అందిస్తారు.

పోడూరు సమగ్ర శిశు సంక్షేమ అభివృద్ధి పథకం (ఐసీడీఎస్) పరిధిలో వివరాలు ఇలా:

మండలం	అంగన్‌వాడీ కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు	3సం చిన్నారులు	3-6 సం మధ్య చిన్నారులు
ఆచంట	71	311	430	1637	1214
పోడూరు	70	323	405	1804	1256
పాలకొల్లు పట్టణం	25	228	265	1244	478
పాలకొల్లు మండలం	78	340	421	1906	1230
మొత్తం	244	1202	1521	6591	4178

ఉపాధ్యాయులను జన్మభూమి నోడల్ అధికారులుగా నియమించొద్దు

పురపాలకసంఘ కార్యాలయ ప్రాంతం (పాలకొల్లు) న్యూస్‌టుడే : ప్రభుత్వం నిర్వహించే జన్మభూమి - మా ఊరు కార్యక్రమాలకు నోడల్ అధికారులుగా ఉపాధ్యాయులను నియమించరాదని కోరుతూ పాలకొల్లు పురపాలక కమిషనర్ ఎ.రామమోహన్‌రావుకు బుధవారం పట్టణ యుటీఎఫ్ శాఖ ప్రతినిధులు వినతిపత్రాన్ని అందించారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో ఆయనను సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి డి.యేసుబాబు, పలువురు ఉపాధ్యాయులు కలిశారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులకు కేటాయించరాదని చట్టాలు చెబుతుంటే మన రాష్ట్రంలో రోజురోజుకు బోధనేతర పనులు ఎక్కువై విద్యాబోధన కుంటుపడుతుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు పాఠశాలలను ప్రచార వేదికలుగా మార్చరాదని తెలిపింది. పాలకొల్లు పట్టణ పరిధిలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులను నోడల్ అధికారులుగా నియమించడం వలన బోధనకు ఇబ్బంది కల్గుతున్నందున వెంటనే తొలగించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, జి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



కమిషనర్ రామమోహన్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ప్రధానమంత్రి సురక్ష బీమాను సద్వినియోగం చేసుకోవాలి

దగ్గులూరు (పాలకొల్లుగ్రామీణ), న్యూస్‌టుడే : ప్రధానమంత్రి సురక్ష బీమాయోజన పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలని స్థానిక ఆంధ్రాబ్యాంకు మేనేజర్ జి.సురేష్ అన్నారు. గ్రామానికి చెందిన గుండుబోయిన సోమరాజు ఇటీవల విద్యుత్తుషాక్‌కు గురై మృతిచెందారు. అతని బీమా సొమ్ము రూ. 2 లక్షలు భార్య రాధాకుమారికి బుధవారం అందజేశారు. నెలకు రూ. 1 చొప్పున 12 నెలలు చెల్లిస్తే ఈ బీమా వర్తిస్తుందని ప్రతి ఒక్కరు బీమాలో భాగస్వాములవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సామంతపూడి అవతారరాజు, గుండుబోయిన వెంకటేశ్వరరావు, గ్రామస్థులు ఉన్నారు.



బీమా సొమ్మును అందిస్తున్న దృశ్యం

ఎన్.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

యడ్లబజారు ప్రాంతం (పాలకొల్లు), న్యూస్‌టుడే : స్థానిక శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ కళాశాల ఎన్.ఎస్.ఎస్ విభాగం సేవా కార్యక్రమంలో భాగంగా రెండో రోజు బుధవారం ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని పాలకొల్లు శాసనసభ్యుడు నిమ్మల రామానాయుడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో కార్యకర్తలు చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. కళాశాల ప్రధానాచార్యుడు కె.శ్రీరామమూర్తి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వలన విద్యార్థుల్లో సేవా తత్పరత కలుగుతుందని, తద్వారా సమాజంలో ఓ ప్రత్యేక గుర్తింపును పొందుతారన్నారు. ఎన్.ఎస్.ఎస్ విభాగాల సమన్వయకర్తలు పి.రాజబాబు, కె.రామనారాయణలు మాట్లాడుతూ రాజవల్లి రాధారమణ్ లయన్స్ కంటి ఆసుపత్రి సిబ్బంది వైద్యపరీక్షలు చేశారన్నారు. సుమారు 256 మందిని పరీక్షించగా 30 మందికి కళ్ళజోళ్లను పంపిణీ చేశారు. ఎన్.ఎస్.ఎస్ కార్యకర్తలు స్వచ్ఛభారత్‌ను నిర్వహించారు. కళాశాల ఉప ప్రధానాచార్యుడు డాక్టర్ పి.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

పాలకొల్లు

అడబాల థియేటర్స్ స్క్రీన్1	ఎంసిఎ
అడబాల థియేటర్స్ స్క్రీన్ 2	జుమాంజీ
గీతా అన్నపూర్ణ	హలో
మారుతి	ఒక్క క్షణం
శ్రీనివాస డీలక్స్	2 కంట్రీస్
శ్రీనివాస మినీ	ఆక్సిజన్
శ్రీనివాస డిజిటల్	10
రంజని	మర్మదీవి

పాలకొల్లు

పరామర్శ

జిన్నూరు(పోడూరు), న్యూస్‌టుడే: పోడూరు మండలంలోని జిన్నూరులో భూపతిరాజు వెంకటలక్ష్మీ నర్సింహరాజు(84)(శ్రీ సద్గురు నాన్నగారు) ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా మాజీ రాజ్యసభ సభ్యులు, మాజీ మంత్రి యర్రా నారాయణస్వామి గురువారం జిన్నూరులో సద్గురు నాన్నగారి భార్య అప్పలనర్సమ్మ, కుమారుడు సూర్యనారాయణరాజు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాన్నగారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

గాంధీబొమ్మలసెంటర్ (పాలకొల్లు), న్యూస్‌టుడే : భారతదేశపు ప్రప్రథమ మహిళా ఉపాధ్యాయిని, సంఘ సేవికరాలు సావిత్రిబాయి పూలే 187వ జయంతి వేడుకలు బుధవారం పాలకొల్లు పట్టణంలో నిర్వహించారు. స్థానిక గాంధీబొమ్మలసెంటర్‌లో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సాహిత్య అకాడమి ఆధ్వరంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పురపాలక ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమణి, సంఘ అధ్యక్షుడు కోలాటి పెద్దిరాజు, కాగిత సూర్యనారాయణ, షేక్ బాబాజీ తదితరులు పాల్గొన్నారు.

✻ స్థానిక ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎంబీసీ, మైనార్టీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో పెట్టెల రాజేష్, వెంకటేష్ వడయార్‌లు చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు ఉప్పరపు శ్రీనువాస్, వద్దరపు శ్రీనివాస్, డాక్టర్ వై.నామగిరి, ఎం.చంద్రకళ, వర్ధనపు కాసు, దొమ్మేటి శ్రీనివాస్, రాజా నారాయణ, ఎ.జె.సుధాకర్, పాశర్ల మహింధర్, ఎం.గణేష్, ఆడమ్, కొలుకులూరి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.



సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళులు

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయ్ జ్యోతిరావ్‌పూలే 187వ జయంతి సందర్భంగా ఉపాధ్యాయులు నాగేశ్వరరావు దంపతులను ఆయన నివాసంలో బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు మాట్లాడుతూ సావిత్రీబాయ్‌పూలే స్త్రీవిద్యకు ఎనలేని కృషి చేసిన మహనీయులన్నారు. కార్యక్రమంలో చినిమిల్లి గణపతిరావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ శేషుబాబు

✻ సావిత్రీ జ్యోతిరావ్‌పూలే 187వ జయంతి సందర్భంగా స్థానిక రాహుల్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు బుధవారం పండ్లు పంపిణీ చేశారు. రాష్ట్ర బీసీ నాయకులు ముద్దాడ గణేష్ యాదవ్ మాట్లాడుతూ సావిత్రీబాయ్ పూలే మహిళల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఆమె చూపిన చొరవ, అంకితభావం వలనే మహిళల విద్య సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో కొప్పర్తి సూర్యనారాయణ, కాగిత సూర్యనారాయణ, కొలుకులూరి అర్జునరావు, మోర్త గిరీష్, కోరుకొండ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆదర్శం సావిత్రిబాయ్‌పూలే

లక్ష్మీపాలెం, కలగంపూడి (యలమంచిలి), న్యూస్‌టుడే: మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిభాయ్‌పూలే నేటితరం ఉపాధ్యాయులకు కూడా ఆదర్శనీయమని పలువురు ఉపాధ్యాయులు అన్నారు. బుధవారం ఆమె జయంతి సందర్భంగా లక్ష్మీపాలెం, కలగంపూడి తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఆమె చరిత్రను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచారు. సావిత్రిభాయ్‌పూలే చిత్రపటంతో విద్యార్థులు బృందచిత్రాలు దిగారు. యువతులు ఉపాధ్యాయవృత్తిలోకి రావాలంటే సావిత్రిభాయ్‌పూలే ఆదర్శంగా తీసుకోవాలని బాలికలకు ఉపాధ్యాయులు సూచించారు. ఉపాధ్యాయులు చేగొండి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు. మండలవ్యాప్తంగా అన్నిపాఠశాలల్లోను ఈకార్యక్రమాన్ని నిర్వహించి మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు.



స్కాలర్‌షిప్‌లు పంపిణీచేస్తున్న ఎమ్మెల్సీ అంగర, సబ్ కలెక్టర్ గాంధీ

సంక్షేమపథకాలు అందించడమే జన్మభూమి ఉద్దేశం : ఎమ్మెల్సీ అంగర

గవరపేట (పాలకొల్లుగ్రామీణ), న్యూస్‌టుడే : రాష్ట్రంలో ఆర్థిక అసమానతలు ఉన్నప్పటికీ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమపథకాలు అందించి వారిని ఆదుకోవడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషిచేస్తున్నారని స్థానిక శాసన మండలి సభ్యుడు అంగర రామ్మోహన్ అన్నారు. మండలంలోని గవరపేటలో బుధవారం జన్మభూమి --- మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. సబ్ కలెక్టర్ వరుణ్‌గాంధీ మాట్లాడుతూ అర్హతకలిగి ప్రభుత్వ సంక్షేమపథకాలు అందనివారు జన్మభూమి --- మా ఊరు కార్యక్రమంలో ధరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను వారు పంపిణీచేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు కోడి విజయలక్ష్మి, సర్పంచి యెల్లపు వెంకటరమణ, తహశీల్దారు దాసి రాజు తదితరులు పాల్గొన్నారు.

✻ **అరట్లకట్ట గ్రామంలో .....** స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన జన్మభూమి --- మా ఊరు కార్యక్రమంలో సర్పంచి చింతపల్లి లక్ష్మీకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమపథకాలను, పేదలకు అండగా ఉండేందుకు ప్రవేశపెట్టిన చంద్రన్నబీమాను అందరు సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలకు రుణమాఫీ పత్రాలను, లబ్ధిదారులకు చంద్రన్న సంక్రాంతి కానుకలను అందజేశారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: ఒక యువకుడు బుధవారం రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్సై ఎ.వి.ప్రసాద్ కథనం మేరకు... పాలకొల్లు స్టేషన్ సమీపంలో రైలుకింద ఓ వ్యక్తి తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా ఆచంట మండలం వల్లూరు శివారు కాసానివారిపాలెంనకు చెందిన మట్టా మణికంఠ (22)గా గుర్తించారు. ఇటీవల ఒక ప్రేమ వ్యవహారంలో తలెత్తిన సమస్యల కారణంగా మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి శవ పంచనామాకు తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

లజపతిరాయ్‌పేట, (పాలకొల్లు పట్టణం), న్యూస్‌టుడే: తాళం వేసిన ఇంటిని పర్యవేక్షించే సాంకేతికత (ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్)ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోసుకోవాలని పట్టణ సీఐ బి.కృష్ణకుమార్ అన్నారు. స్థానిక ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో పోలీస్‌యాప్ పనితీరుపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలు జరుగుతున్నాయన్నారు. దూరప్రాంతాలు వెళ్లే ఇంటి యజమానులు ముందుగా ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌లో నమోదు చేసుకుంటే ఆ ఇంటికి సీసీ కెమెరాల పర్యవేక్షణ ఏర్పాటు చేస్తామన్నారు. తద్వారా దొంగతనాలను అరికట్టడమే కాకుండా దొంగలను కూడా సులభంగా పట్టుకోవచ్చన్నారు ఇలా సీసీ కెమెరాల పర్యవేక్షణలో కడప, నెల్లూరులలో కరుడు కట్టిన నేరస్థులను పట్టుకున్నామన్నారు. ఇది పట్టణాలకే పరిమితమని తెలిపారు. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొనే విధానం, పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాలకొల్లు రవాణాశాఖ అధికారి శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించి విలువైన ప్రాణాలను సంరక్షించుకుందామన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారికి డ్రైవింగ్ లైసెన్స్ త్వరితగతిన అందిస్తామని, ఇందులో దళారుల ప్రమేయం అవసరం లేదని పేర్కొన్నారు. గ్రామీణ సీఐ కె.రజనీకుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, ఈ దశలో చెడు స్నేహాల వలన ఎంతో ఉన్నతమైన భవిష్యత్తు నిర్వీర్యమౌతుందన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొప్ప సత్యనారాయణ, ప్రిన్సిపల్ కె.వి.కృష్ణవర్మ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఛాంబర్స్ డిగ్రీ కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి శ్రీనివాసరావుగుప్త, కోశాధికారి మాటూరి నారాయణమూర్తి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు రేవూరి సూర్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పట్టణ సీఐ కృష్ణకుమార్

పేదల సంతృప్తే ప్రభుత్వానికి సంతోషం

రాష్ట్ర తెదేపా కార్యదర్శి జయరాజు

అడవిపాలెం(యలమంచిలి), న్యూస్‌టుడే: పేదల సంతృప్తే ప్రభుత్వానికి సంతోషమని రాష్ట్ర తెదేపా కార్యదర్శి కొక్కిరిగడ్డ జయరాజు అన్నారు. మండలంలోని అడవిపాలెంలో బుధవారం సాయంత్రం జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సభకు సర్పంచి గోడి అశోక్‌కుమార్ అధ్యక్షత వహించారు. జయరాజు మాట్లాడుతూ పేదలసమస్యలను తక్షణమే పరిష్కరించాలని అవసరమైతే అత్యవసరసాయాన్ని కోరైన తగిన న్యాయంజరిగేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించిన మేరకు అధికారులుకూడా తక్షణమే స్పందిస్తున్నారన్నారు. ఎంపీపీబొప్పన సుజాత మాట్లాడుతూ తెదేపా ప్రభుత్వం భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలముంగిటకు తీసుకురానుందన్నారు. జడ్పీటీసీ బోణంనాని మాట్లాడుతూ పార్టీకోసం శ్రమించిన కార్యకర్తలను ఎన్నడూ విస్మరించకుండా సరైన గుర్తింపుననిస్తుందని చెప్పారు. గర్భిణీలకు సీమంతాలు చేశారు. నూతనంగా మంజూరైన రేషన్‌కార్డులు, రుణమాఫీ పత్రాలు పంపిణీ చేశారు.



అడవిపాలెంలో గర్భిణులకు సీమంతంచేస్తున్న జయరాజు

ఎంపీటీసీ విస్సా సరస్వతి, మార్కెట్‌కమిటీ ఉపాధ్యక్షుడు చిట్టూరి ఆంజనేయులు, డైరెక్టర్ పీతలశ్రీనివాస్, తెదేపా నాయకులు బొప్పన హరికిషోర్, గంధంశ్రీనివాస్, కాపిశెట్టి సోంబాబు పాల్గొన్నారు.

అబ్బిరాజుపాలెంలో ఎమ్మెల్సీ: సంక్షేమానికి పెద్దఎత్తున ప్రాధాన్యతనివ్వడంద్వారానే ఏటా జన్మభూమి కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలుచేస్తుందని ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ అన్నారు. అబ్బిరాజుపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెదేపా నాయకులు వలవల ఆంజనేయులు, బాబి తదితరులు పాల్గొన్నారు.

రంగవల్లులకు..

ఆహ్వానము

ముగ్గులు... మహిళల సృజనకు వేదికలు. ధనుర్మాసం వచ్చిందంటే చాలు ఇంటి ముంగిట వేసే రంగవల్లుల్లో ప్రావీణ్యాన్ని చూపించాలని ప్రతీ ఒక్కరు ఆరాటపడుతుంటారు. అలా మీరు వేసిన ముగ్గును ముద్రణలో చూడాలని అనుకుంటున్నారా..! ఆ అవకాశం మీకు 'ఈనాడు' కల్పిస్తోంది. చేయాల్సిందల్లా.. ఇంటి ఆవరణలో మీరు వేసిన ముగ్గుతోపాటు ఫొటో దిగి.. మీ పేరు, ఊరు, మండలం జతపరిచి వాట్సాప్‌లో కింది ఇచ్చిన నంబరుకు పంపించడమే. ఫొటో ప్రచురణ తుది నిర్ణయం నిర్వాహకులదే.

వాట్సాప్ నంబరు

96186 78906





ఎన్.స్వాతి, పాలకొల్లు



పి. మౌనిక



ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

తిల్లపూడి (పాలకొల్లుగ్రామీణ), న్యూస్‌టుడే : ప్రభుత్వం పేదల కోసం అందిస్తున్న సంక్షేమపథకాలను అందరు సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆఫ్ కో ఆపరేటివ్ (అమరావతి) నియోజకవర్గ ప్రత్యేక అధికారి వై.అబ్దుల్‌ఆలీ అన్నారు. మండలంలోని తిల్లపూడి గ్రామంలో బుధవారం జన్మభూమి-మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. బీసీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకురాలు, నోడల్ అధికారి ఎన్.పుష్పలత మాట్లాడుతూ కార్పొరేషన్ అందిస్తున్న రుణాల ద్వారా ప్రతి ఒక్క లబ్దిదారు యూనిట్‌ను స్థాపించి పురోభివృద్ధి సాధించాలని ఆమె అన్నారు. ఈ సందర్భంగా 55మంది లబ్దిదారులకు కార్పొరేషన్ రుణాలు, అర్హులకు రేషన్‌కార్డులు, పింఛన్లు పంపిణీచేశారు.

పోలవరం

నలుగురు వ్యక్తుల బైండోవర్

మధ్యాహ్నపువారిగూడెం (టి.నరసాపురం), న్యూస్‌టుడే: సంక్రాంతిని పురస్కరించుకుని కోడి పందేలు నిర్వహించేందుకు సిద్ధం అయిన మధ్యాహ్నపువారిగూడేనికి చెందిన ఇద్దరిని, టి.నరసాపురానికి చెందిన ఇద్దరిని బుధవారం బైండోవర్ చేసినట్లు ఎస్సై వి.రాంబాబు తెలిపారు.

కేసుల నమోదు

వెలగపాడు (టి.నరసాపురం), న్యూస్‌టుడే: వెలగపాడుకు చెందిన మల్లపు మేరి గత నెల 31న రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా శీలం సాయివినయ్, మరికొందరు కలిసి ఇంటి తలుపులు పగులకొట్టారు. మేరీని, ఆమె మేనల్లుడు అభిరాంను, కరిపోతు రాజును కులం పేరుతో దూషించి కొట్టారు. అలాగే బొడ్డు విజయకుమారిని బొడ్డు భాస్కరరావు మరికొందరు కలసి ఆమె దుస్తులు చించివేసి కొట్టారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరో కేసులో వెలగపాడుకు చెందిన లింగాల నాగమణి గత నెల 31 రాత్రి చర్చికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా ఉమ్మడి గంగరాజు మరో ఇద్దరు కలసి ఆమె దుస్తులు చించివేసి అసభ్యకరంగా ప్రవర్తించి కులం పేరుతో దూషించారు. అలాగే గెడ్డం బాలరాజును బొడ్డు శ్రీను మరో ముగ్గురు కలసి కర్రలతో తలపై బలంగా కొట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు బుధవారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి. రాంబాబు తెలిపారు.

సీపీఎస్‌కు వ్యతిరేకంగా 9న ధర్నా

టి.నరసాపురం, న్యూస్‌టుడే: సీపీఎస్‌కు వ్యతిరేకంగా టి. నరసాపురంలో ఈ నెల 9న ధర్నా నిర్వహించనున్నట్లు ఏపీటీఎఫ్ 1938 సంఘం మండల శాఖ అధ్యక్షుడు జి.నెహ్రూ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎం.రమేష్‌బాబు, పి.రామదాసుతో పాటు ఏడుగురు ఉపాధ్యాయులు తమ శాఖ సభ్యత్వాన్ని తీసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు ఎం.కృష్ణ, రాంబాబు పాల్గొన్నారు.

సినిమాలు

పోలవరం	
గంగాభవాని	ఎంసీఏ
కొయ్యలగూడెం	
మహాలక్ష్మి	ఎంసీఏ
శ్రీ రామదుర్గ	ఒక్కక్షణం
దుర్గామహాల్	ఒక్కక్షణం
చింతలపూడి	
శ్రీరత్న	ఎంసీఏ
శ్రీరత్నమినీ	హలో
శ్రీ శారద	ఒక్కక్షణం
శ్రీ గౌరీ	2 కంట్రీస్
జంగారెడ్డిగూడెం	
లక్ష్మీ	హలో
సౌభాగ్య	జ్యూ మంజి 3డి
సౌభాగ్య మినీ	2 కంట్రీస్
శ్రీరాజరాజేశ్వరి	ఎంసీఏ
శ్రీపద్మ	ఒక్కక్షణం

వీఆర్ఏ మృతికి సంతాపం

ములగలంపల్లి (జీలుగుమిల్లి), న్యూస్‌టుడే: మండలంలోని ములగలంపల్లి వీఆర్ఏ ఇమామ్‌ఖాన్ (బారిమా) (59) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. జీలుగుమిల్లి ఏఎస్‌వో వీరేంద్రనాథ్, వీఆర్వోలు తిరుపతమ్మ, దివ్యమాధురి, విజయకృష్ణ, నాయకులు తదితరులు ఇమామ్‌ఖాన్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

మండల పాస్టర్ల సంఘం నూతన కమిటీ ఎన్నిక

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: క్రిస్టియన్ పాస్టర్ల సంఘం మండల నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నట్లు ఆ సంఘం సలహాదారు కనిపే జార్జిముల్లర్ తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా చిన్నం అలెగ్జాండర్, సలహాదారుగా ఎం.జోసఫ్, అధ్యక్షుడిగా పి.పాల్, ఉపాధ్యక్షుడిగా పి.దావీద్, కార్యదర్శిగా కె.డానియేల్, సహాయ కార్యదర్శిగా ఎస్.ఇస్సాక్, కోశాధికారిగా కె.పీటర్, కన్వీనర్‌గా ఎస్‌కే పాల్, కార్యవర్గ సభ్యులుగా ఇస్రాయేల్, గాబ్రియల్, ఏసుపాదం, యేసేబు ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

కట్కూరు.. కటకట

చెంతనే జీవనది గోదావరి ఉన్నా గిరిజనులకు తాగునీటి తిప్పలు తప్పడం లేదు. తాగునీటి పథకం కూడా ఉంది. అయినా ఏడాది కాలంగా పనిచేయడం లేదు. చేసేది లేక సమీపంలోని గోదావరిలోని నీటిని తెచ్చుకుని గొంతులు తడుపుకొంటున్నారు. అవి రక్షిత జలాలు కాకపోవడంతో అనేక మంది ఆదివాసీ కొండరెడ్డి గిరిజనులు జ్వరం, కామెర్లు వంటి వ్యాధులతో బాధపడాల్సిన దుస్థితి నెలకొంది. వేలేరుపాడు మండలం కట్కూరు గ్రామంలో నెలకొన్న తాగునీటి అవస్థలపై కథనం.

- రక్షిత పథకాలు నిరుపయోగం
- తడారుతున్న గిరిజనుల గొంతు
- గోదావరికి వెళ్తేనే తాగునీరు



గోదావరి నుంచి కావిళ్లతో నీటిని తెచ్చుకుంటున్న గిరిజనులు

వేలేరుపాడు, న్యూస్‌టుడే

విలీన మండలం వేలేరుపాడులో వేసవి రాకముందే తాగునీటి కోసం గిరిజనులు పడరాని పాట్లు పడుతున్నారు. సుమారు 400 కుటుంబాలకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు గ్రామ సమీపంలో గోదావరిలో విద్యుత్తు మోటార్ ఏర్పాటు చేశారు. అక్కడ్నుంచి పైపుల ద్వారా గ్రామానికి తాగునీరు సరఫరా చేస్తున్నారు. గతేడాది సంభవించిన గోదావరి వరదల కారణంగా మోటారు కొట్టుకుపోయింది. అప్పటి నుంచి నూతనంగా మరో మోటారు ఏర్పాటు చేయలేదు. దీంతో గ్రామంలోని వారంతా రెండు చేతిపంపులపై ఆధారపడి తాగునీటి అవసరాలు తీర్చుకుంటున్నారు. ఇటీవల ఒక చేతిపంపు మరమ్మతులకు గురై సరిగా నీరు రాకపోవడంతో సమీపంలోని గోదావరికి చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా బిందెలు, కావిళ్లతో వెళ్లి తెచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో ఆ నీటిని తాగిన అనేక మంది వివిధ రకాల వ్యాధుల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. కాగా కొందరు సొంత ఖర్చులతో గ్రామ సమీపంలోని గుట్టల నుంచి వచ్చే నీటిని పైపులు ద్వారా గ్రామానికి మళ్లించి తాగుతున్నారు. ప్రస్తుతం ఆ నీరు సైతం పెద్దగా రావడం లేదు. దీంతో గిరిజనుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి.



ఎప్పుడు పనిచేస్తుందో తెలియని చేతిపంపు

అలంకారప్రాయంగా పథకం



గోదావరిలో బోరు ఏర్పాటు చేసి అక్కడ్నుంచి పైపుల ద్వారా తాగునీటి పథకంలోకి నీటిని మళ్లించి అక్కడి నుంచి ప్రజలకు సరఫరా చేస్తున్నారు. గత రెండేళ్ల క్రితం రూ.2 లక్షల వ్యయంతో చేపట్టిన కొత్త తాగునీటి పథకాన్ని అసంపూర్తిగా వదిలేశారు. ఇదిలా ఉండగా ఈ పథకానికి నీరు సరఫరా చేసేందుకు గోదావరిలో బోరు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. దాంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా, లక్షలాది రూపాయల ప్రజాధనం గోదావరిలో పోసినట్లు అయింది.

ఎవరికి చెప్పినా ఫలితం లేదు



గ్రామంలో ఏడాది కాలంగా తాగునీటి సమస్య ఉన్నప్పటికీ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. చేసేదేమి లేక ఉదయాన్నే నిద్ర లేచి చిన్నా, పెద్ద అందరం కలిసి గోదావరికి వెళ్లి బిందెలు, కావిళ్లతో నీటిని తెచ్చుకుంటున్నాం. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే రానున్న వేసవిలో తమ పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో తలచుకుంటేనే భయమేస్తుంది.

- వాళ్ల లక్ష్మీదేవి, కట్కూరు

కూలి పనులు మానుకుంటున్నాం



రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కొండరెడ్డి గిరిజనులమైన మేము నీటి ఇబ్బందుల కారణంగా కూలి పనులకు సైతం వెళ్లలేకపోతున్నాం. ఉదయం, మధ్యాహ్నం అనే తేడా లేకుండా గోదావరికి నీటి కోసం వెళ్లాల్సి వస్తోంది. వెంటనే విద్యుత్తు మోటారును ఏర్పాటు చేయాలి. లేనిచో గ్రామంలోని రెండు చేతిపంపుల నుంచి నిరంతరాయంగా నీరు వచ్చేలా చూడాలి. **- అరగంట్ల దుర్గ, కట్కూరు**

నూతన మోటారు ఏర్పాటు చేస్తాం

ఇటీవలే బదిలీపై వచ్చినందున నాకు కట్కూరులో తాగునీటి ఎద్దడి సమస్య ఆలస్యంగా తెలిసింది. అయినప్పటికీ శాసనసభ్యునితో పాటు జిల్లా ఉన్నతాధికారులకు సమస్యను విన్నవించా. మరో వారం, పది రోజుల్లో నూతన విద్యుత్తు మోటారు ఏర్పాటు చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తాం.

- వినయ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, వేలేరుపాడు

సావిత్రిబాయి పూలే అందరికీ ఆదర్శం



ములగలంపల్లి: ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న విద్యార్థులు

ములగలంపల్లి (జీలుగుమిల్లి), న్యూస్‌టుడే: భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అందరికీ ఆదర్శనీయమని ప్రధానోపాధ్యాయుడు కె.నాగేశ్వరరావు అన్నారు. ములగలంపల్లి ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయురాళ్లు చెంచులక్ష్మి, రాజ్యలక్ష్మి, రామలక్ష్మిలను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బిరుదుగడ్డ నాగేశ్వరరావు, కె.ప్రతాప్, వెంకటేశ్వరరావు, రాజేంద్ర, లక్ష్మణరావు, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కుక్కునూరు, న్యూస్‌టుడే: సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరపాలని సీపీఎం మండల కార్యదర్శి నాగేంద్రరావు కోరారు. కుక్కునూరులోని సీపీఎం కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు జరిగాయి. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా స్త్రీ విద్య కోసం ఆమె రాజీలేని పోరాటాన్ని కొనసాగించారని తెలిపారు. నాయకులు వలీపాషా, రమేష్ పాల్గొన్నారు.

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: బాలికల విద్య కోసం పాటుపడిన ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిని స్ఫూర్తిగా తీసుకుని పనిచేయాలని ఏపీ మహిళా ఆర్థిక సహకార సంస్థ డైరెక్టరు గంగిరెడ్ల మేఘలాదేవి పేర్కొన్నారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ఉపాధ్యాయ, ఉద్యోగుల సహకార భవనం వద్ద సావిత్రిబాయి పూలే జయంతిని బుధవారం నిర్వహించారు. మేఘలాదేవి మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ప్రధాన భూమిక పోషించాలని పేర్కొన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన ఏవీ నళిని, యూటీఎఫ్ తరపున ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పి.శ్రీదేవి, ఐ.కమలరత్నం, సాయిసుధలను సత్కరించారు. ఎంపీపీ అయినపర్తి చందన, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఆకుమర్తి విక్టర్, మండల అధ్యక్షులు ఎంఏ నబీ, జి.ఆనందకుమార్, జి.రవీంద్ర, ఎస్.రమేష్, విజయలక్ష్మి, తులసి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ మహిళా ఆర్థిక సహకార సంస్థ డైరెక్టరు మేఘలాదేవి

ఉత్తమ ఉపాధ్యాయినిగా కృపామణి



మంత్రి గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న కృపామణి

కుక్కునూరు, న్యూస్‌టుడే: సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని పాఠశాల విద్యా శాఖ ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి, పురస్కారాలను అందజేసింది. కుక్కునూరు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ప్రత్యేకాధికారిణి కృపామణికి ఈ పురస్కారం లభించింది. బుధవారం విశాఖలోని ఆంధ్రా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు ఈ పురస్కారాన్ని అందజేశారు. పురస్కారం కింద రూ.10,000 నగదు, ట్యాబ్, బంగారు పతకం, ప్రశంసపత్రం అందించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పురస్కారానికి 50 మంది ఉపాధ్యాయులు ఎంపిక కాగా, అందులో జిల్లా నుంచి ఎంపికైన ఇద్దరు ఉపాధ్యాయులు విలీన మండలాలకు చెందిన వారు కావటం గమనార్హం. కుక్కునూరు ప్రత్యేకాధికారిణి కృపామణితో పాటు వేలేరుపాడు కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల ప్రత్యేకాధికారిణి పోశమ్మ పురస్కారాన్ని అందుకున్న వారిలో ఉన్నారు.

పోలవరం

చంద్రన్న బీమా పరిహారం అందజేత

వెలగపాడు (టి.నరసాపురం), న్యూస్‌టుడే: వెలగపాడులో అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన నరదల వీర్రాజు కుటుంబానికి చంద్రన్న బీమా పరిహారం నగదు రూ.5 వేలు ఎంపీపీ శీలం వెంకటేశ్వరరావు బుధవారం అందజేశారు. మిగిలిన రూ.1.95 లక్షలను బాధిత కుటుంబ బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం నెల రోజుల్లో జమ చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

ప్రతి గిరిజన కుటుంబానికి ఇల్లు మంజూరు



ప్రగడపల్లిలో బాలుడిని దత్తత తీసుకున్న మోపిదేవి భాస్కరరావు

రెడ్డిగణపవరం, జైనవారిగూడెం, (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: మన్యంలో అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి ఇల్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని శాసనసభ్యుడు మొడియం శ్రీనివాసరావు తెలిపారు. రెడ్డిగణపవరంలో బుధవారం నిర్వహించిన జన్మభూమి- మా ఊరు గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. పంచాయతీలో రూ.50 లక్షల అంచనా విలువతో అభివృద్ధి పనులు మంజూరు చేశామన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏడుగురు గర్భిణులకు సామూహిక సీమంతాలు, ఇద్దరు చిన్నారులకు అన్నప్రాసన చేశారు. 22 మందికి రేషన్‌కార్డులు, 20 మందికి పింఛన్లు అందజేశారు. రెడ్డిగణపవరం, జైనవారిగూడెం, అచ్చియ్యపాలెం గ్రామాల్లో రూ.13 లక్షల చొప్పున అంచనా విలువతో మంజూరైన మహిళా గ్రామ సంఘం భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కరెడ్లగూడెంలో అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. తెదేపా మండల అధ్యక్షుడు మొగపర్తి సోంబాబు, మండల ప్రత్యేకాధికారి మోహనరావు, ఎంపీడీవో ప్రసాద్, మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు ఎస్.నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు అందుగుల ఫ్రాన్సిస్, సర్పంచి కొర్సా బాలకృష్ణ, తెదేపా ఎస్సీ విభాగం మండల అధ్యక్షుడు బొబ్బర ఎలీషా తదితరులు పాల్గొన్నారు.

✳ బోయలు, వాల్మీకి కులాలను ఎస్టీ జాబితాలో కలపవద్దని కోరుతూ ఆదివాసీ ఐకాస ఆధ్వర్యంలో అంతర్వేదిగూడెం, రెడ్డిగణపవరం గ్రామాల్లో జన్మభూమి- మా ఊరు గ్రామసభలను అడ్డుకున్నారు. ఆదివాసీ ఐకాస ఛైర్మన్ మొడియం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శాసనసభ్యుడు మొడియం శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు.

కట్కూరు (వేలేరుపాడు), న్యూస్‌టుడే: జన్మభూమి- మాఊరు ద్వారా సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయని తహశీల్దారు పి.రవికుమార్ అన్నారు. కట్కూరులో జన్మభూమి- మాఊరు గ్రామసభ బుధవారం జరిగింది. చంద్రన్న సంక్రాంతి కానుకలు, డ్వాక్రా మహిళలకు రాయితీ సొమ్ము, పింఛన్లు, రేషను కార్డులు అందజేశారు. వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో కలపడం వల్ల తమకు తీరని అన్యాయం జరిగే ప్రమాదం ఉందని ఆదివాసీ సంఘాల నాయకులు గ్రామసభను అడ్డుకున్నారు. సర్పంచి కొవ్వాసి ధనలక్ష్మి సంఘీభావం తెలిపి సభలో నుంచి బయటకు వెళ్లిపోయారు. ఎంపీడీవో వై.అపర్ణ, ఎస్సై బీఎం.వెంకటరాజా, వెలుగు ఏపీఎం నాగసుబ్రమణ్యం, విద్యుత్తు, గృహ నిర్మాణ శాఖల ఏఈలు మధులయ్య, ఆలీ, ఈవోపీఆర్డీ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని నియమించండి సారూ

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: తమ పాఠశాలలో జీవశాస్త్రం బోధనకు ఉపాధ్యాయులను నియమించాలని వేదాంతపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు 'జన్మభూమి మా ఊరు' కార్యక్రమంలో వేడుకున్నారు. ఇప్పటి వరకు సిలబస్ పూర్తి కాలేదని, పదో తరగతి పరీక్షలు ఎలా రాయాలో భయంగా ఉందని వాపోయారు. ఆర్డీవో మోహనరావుకు వినతిపత్రం ఇచ్చారు.

కుక్కునూరు, న్యూస్‌టుడే: రాజీవ్‌నగర్, తొండిపాకల్లో గ్రామసభలు బుధవారం జరిగాయి. కోడిపందేలు నియంత్రించాలని రాజీవ్‌నగర్‌లో జరిగిన గ్రామసభలో మహిళలు, స్థానికులు కోరారు. స్పందించిన మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు కట్టడి చేయాలని పోలీసులకు సూచనలు చేస్తామని అన్నారు. రాజీవ్‌నగర్ పునరావాస జాబితాలో గ్రామాన్ని తొలగించారని, ఈ గ్రామాన్ని ముంపు జాబితాలోకి తీసుకురావాలని స్థానికులు కోరారు. మరుగుదొడ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిపివేశారనీ, తమకు ఒక్క పైసా ఇవ్వకుండా బిల్లులు చెల్లించినట్లు ఆన్‌లైన్‌లో చూపుతున్నారనీ, దీనిపై విచారణ జరపాలన్నారు. తహశీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీవో దుర్గాప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

✳ పోలవరం పునరావాస జాబితాను వెంటనే విడుదల చేయాలనీ, తొలగించిన అర్హులను జాబితాలోకి చేర్చాలనీ, మరుగుదొడ్ల అవినీతిపై విచారణ జరపాలని సీపీఐ మండల కార్యదర్శి వెంకటాచారి, లక్ష్మయ్య, బాబూరావు తదితరులు నిరసన వ్యక్తం చేశారు.

పథకాలపై అవగాహనతోనే లబ్ధి

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలపై అవగాహనతోనే లబ్ధి చేకూరుతుందని జన్మభూమి మా ఊరు కార్యక్రమం పరిశీలకులు, కాడ్ ప్రత్యేక కమిషనరు పీఎస్ రాఘవయ్య పేర్కొన్నారు. సరిపల్లి, వేదాంతపురం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన జన్మభూమి మా ఊరు సభలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏఎంసీ అధ్యక్షులు పారేపల్లి రామారావు, జంగారెడ్డిగూడెం ఆర్డీవో మోహనరావు మాట్లాడుతూ కొత్తగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. జడ్పీ ఉపాధ్యక్షురాలు చింతల వెంకటరమణ, ఎంపీపీ అయినపర్తి చందన, సర్పంచి మద్దాల నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మక్కినవారిగూడెం, మర్రిగూడెం (టి.నరసాపురం), న్యూస్‌టుడే: మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ శీలం వెంకటేశ్వరరావు అన్నారు. మక్కినవారిగూడెం, మర్రిగూడెంలో జన్మభూమి మా ఊరు కార్యక్రమం బుధవారం జరిగింది. మర్రిగూడెంలో సాంకేతిక కారణాల వల్ల చంద్రన్న బీమాకు అర్హత కోల్పోయిన 310 మందికి మక్కినవారిగూడెం సహకార సంఘం వద్ద అంతర్జాలంలో నమోదు చేసేందుకు ఏర్పాట్లు చేస్తామని సంఘ అధ్యక్షుడు ఆచంట సూర్యనారాయణ తెలిపారు. మక్కినవారిగూడెంలో సంక్రాంతి అనంతరం ఇళ్లు, ఇళ్ల స్థలాలు లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు కృషి చేస్తామని తెదేపా మండల అధ్యక్షుడు పన్నమనేని మధు తెలిపారు. గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ శ్రీరామమూర్తి, జడ్పీటీసీ చలపతిరావు, తహశీల్దార్ నాగరాజు, ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి పాల్గొన్నారు.

రాచన్నగూడెం, పి.రాజవరం (జీలుగుమిల్లి), న్యూస్‌టుడే: మండలంలోని రాచన్నగూడెంలో తహశీల్దార్ ఎం.రాజశేఖరరావు, పి.రాజవరంలో ఎంపీడీవో వి.అన్నపాలీన అధ్యక్షతన బుధవారం జన్మభూమి గ్రామసభలు జరిగాయి. పి.రాజవరంలో ప్రత్యేక అధికారి షాజానాయక్ మాట్లాడుతూ ప్రజల వద్దకే అధికారులను తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జన్మభూమి కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. కాగా గ్రామాల్లో నూతనంగా 18 పింఛన్లు, 30 రేషన్‌కార్డులు, 38 ఉపకార వేతనాలు, వ్యవసాయ పరికరాలు అందజేశారు. పి.రాజవరంలో ప్రజలు తమకు ఇళ్లు నిర్మించుకునేందుకు గాను ఎంజాయ్‌మెంట్ పత్రాలు ఇవ్వాలని గంటసేపు ఆందోళన చేశారు. సర్పంచి తాటి శ్రీరామమూర్తి, ఎంఈవో కె.శ్రీనివాసరావు, ఉపాధి ఏపీవో ఎ.శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎం నరసింహారావు, విద్యుత్తు ఏఈ ఎం.సత్యనారాయణ, ఏవో కె.పార్వతి, ఈవోపీఆర్డీ కొండలరావు, వైద్యాధికారులు అజయ్‌కుమార్, ప్రియదర్శిని పాల్గొన్నారు.



రెడ్డిగణపవరంలో చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న శాసనసభ్యుడు మొడియం శ్రీనివాసరావు



ఆర్డీవో మోహనరావుతో మాట్లాడుతున్న విద్యార్థులు



వేలేరుపాడులో రాయితీ సొమ్ము అందజేస్తున్న అధికారులు

మద్యం గొలుసు దుకాణాలను తక్షణమే తొలగించాలి

అంతర్వేదిగూడెం (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: అంతర్వేదిగూడెంలో మద్యం గొలుసు దుకాణాలను తక్షణమే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని శాసనసభ్యుడు మొడియం శ్రీనివాసరావు ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. గ్రామంలో నిర్వహించిన జన్మభూమి- మా ఊరు గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో నాలుగు మద్యం గొలుసు దుకాణాలను నిర్వహిస్తున్నారని పలువురు మహిళలు ఆయనకు ఫిర్యాదు చేశారు. మహిళా భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

విద్యార్థిని దత్తత తీసుకున్న ప్రధానోపాధ్యాయుడు

ప్రగడపల్లి (పోలవరం), న్యూస్‌టుడే: ప్రగడపల్లిలో జన్మభూమి-మాఊరు గ్రామసభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా పిల్లలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అధికారులను అలరించాయి. మండల పరిషత్ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న మరపట్ల లక్ష్మీకార్తీక్ రాజధానుల గురించి తడబడకుండా చెప్పడంతో అధికారులు విస్మయం చెందారు. అక్కడే ఉన్న పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోపిదేవి భాస్కరరావు పదో తరగతి వరకు చదివించేందుకు లక్ష్మీ కార్తీక్‌ను దత్తత తీసుకున్నారు.

మెరుగైన వైద్యానికి ఏర్పాట్లు



క్షతగాత్రురాలిని పరామర్శిస్తున్న తహశీల్దారు రవికుమార్

పోలవరం, న్యూస్‌టుడే: ట్రాక్టరు ప్రమాదంలో గాయపడి పోలవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో కోలుకుంటున్న మెత్తప్పకోట గ్రామస్థులను బుధవారం ఉదయం తహశీల్దారు సీహెచ్ రవికుమార్ పరామర్శించారు. వారికి ఐటీడీఏ నుంచి మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తామన్నారు. రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించిన మడకం లక్ష్మి వైద్యం విషయంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారితో మాట్లాడతామని చెప్పారు. క్షతగాత్రులకు పండ్లు అందజేశారు. పోలవరం జడ్పీటీసీ సభ్యురాలు కుంజం సుభాషిణి, తెదేపా నాయకులు బొరగం శ్రీనివాసరావు, వైకాపా ఎస్టీ సెల్ అధ్యక్షుడు తెల్లం బాలరాజు, బి.మురళీకృష్ణ తదితరులు గాయపడిన వారిని పరామర్శించారు.

నేడు ఎమ్మెల్యే మండల పర్యటన

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: పోలవరం శాసనసభ్యుడు మొడియం శ్రీనివాసరావు గురువారం జీలుగుమిల్లి మండలంలో పర్యటించనున్నారని మండల తెదేపా అధ్యక్షుడు ఉండవల్లి సోమసుందరం తెలిపారు. ములగలంపల్లి గ్రామంలో స్త్రీశక్తి భవనం, రజకులకు దోబీఘాటు నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. అనంతరం స్వర్ణవారిగూడెం, దర్భగూడెం గ్రామాల్లో జరిగే జన్మభూమి గ్రామసభల్లో పాల్గొంటారని వివరించారు.

నేటి నుంచి ఎన్ఎస్ఎస్ శిబిరం

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: జీలుగుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో గురువారం నుంచి తాటియాకులగూడెంలో ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమ అధికారి డీఈ ప్రసన్నకుమార్ తెలిపారు. గ్రామంలో వారం రోజుల పాటు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛ భారత్‌పై అవగాహన ప్రదర్శనలు, వైద్య శిబిరాలు నిర్వహిస్తామని వివరించారు.

తాడేపల్లిగూడెం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

వీర వనిత సావిత్రిబాయి

సుబ్బారావుపేట (తాడేపల్లిగూడెం అర్బన్), న్యూస్‌టుడే: మహిళా హక్కుల సాధనకు విశేష పోరాటం చేసిన వీర వనిత సావిత్రిబాయి పూలే అని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు అన్నారు. బుధవారం పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పూలే జయంతి వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. మున్సిపల్ ఛైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారంటే కారణం పూలే అని అన్నారు. అనంతరం తొమ్మిది మంది ఉత్తమ ఉపాధ్యాయినులను మంత్రి, ఛైర్మన్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ అధ్యక్షత వహించారు. డీవైఈవో కే నాగేశ్వరరావు, ఎంఈవో హనుమా, పట్టణ సీఐ మూర్తి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ కిలాడి ప్రసాద్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఈతకోట తాతాజీ, ఫ్లోర్ లీడర్ యెగ్గిన నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారావుపేట (తాడేపల్లిగూడెం గ్రామీణ), న్యూస్‌టుడే: మహిళల హక్కులు, వితంతువుల పునర్వివాహం కోసం పోరాడిన సావిత్రి బాయి పూలే నేటి మహిళలకు ఆదర్శప్రాయురాలని ఎంపీపీ గన్నమని దొరబాబు పేర్కొన్నారు. సావిత్రి బాయి పూలే జయంతి కార్యక్రమాన్ని బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంఈవో వి.హనుమ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి దొరబాబు మాట్లాడుతూ మహిళల కోసం పాఠశాలలను స్థాపించి వారికి విద్యాబ్యాసం అందించిన ఘనత సావిత్రిబాయి పూలేదని వివరించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయినులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెంటపాడు, న్యూస్‌టుడే: సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడిన సావిత్రి బాయి పూలే పోరాట పటిమను విద్యార్థులందరూ ఆదర్శంగా తీసుకోవాలని స్థానిక డీఆర్ గోయంకా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం.శ్యాంబాబు సూచించారు. డిగ్రీ కళాశాల స్త్రీ సాధికారత విభాగం ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే 187వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే మొదటి మహిళా ఉపాధ్యాయిని, సంఘ సంస్కర్త అని, ఆమె జయంతిని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. స్త్రీ సాధికారత విభాగం సమన్వయకర్త ఎం.వసంతలక్ష్మి మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే జీవిత చరిత్రను వివరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి జె.విశ్వనాథ్‌కుమార్, అధ్యాపకులు చిట్టిబాబు, బ్రహ్మచారి, రత్నకుమారి, స్వప్న, దీప్తి, పద్మావతి పాల్గొన్నారు.

ఘనంగా పూలే జయంతి వేడుకలు

సుబ్బారావుపేట (తాడేపల్లిగూడెం అర్బన్), న్యూస్‌టుడే: పట్టణంలోని సుబ్బారావుపేటలో ఉన్న దివ్యాంగుల పాఠశాలలో బుధవారం సావిత్రి బాయ్ పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పాఠశాల విద్యార్థులు స్వీట్లు పంచారు. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయిని జ్యోతి అధ్యక్షత వహించారు. ఉపాధ్యాయులు, ఎస్కే బాల ఈశ్వరయ్య, మస్తాన్‌బి, ఆదిలక్ష్మి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నేత్ర వైద్యశిబిరం

తాడేపల్లిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో మండలంలోని చినతాడేపల్లి పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నిడదవోలు పట్టణానికి చెందిన రాజేశ్వరి లయన్ నేత్ర వైద్యశాల వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచి చిటికెన శ్రీనివాసరావు ప్రారంభించారు ఆయన మాట్లాడుతూ ప్రజాహితం కోసం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో 100 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. 15 మందికి ఉచితంగా కళ్ళజోళ్ళను పంపిణీ చేశారు. మరో 10 మందికి శస్త్ర చికిత్స అవసరం ఉండటంతో ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు, జోన్ ఛైర్మన్ లయన్ డివిపి విశ్వేశ్వరావు, లయన్ ఎల్ఎస్‌వి నాగేశ్వరరావు, ఏపి వెంకటేశ్వరావు,కె.హరనాథ్, సిహెచ్ఎస్ఎన్ మూర్తి, జివి నరసింహారావు, సూర్యనారాయణమూర్తి, కార్యదర్శి సుంకర శ్రీనివాస్ తదితరుల పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

పడాల (తాడేపల్లిగూడెం గ్రామీణ), న్యూస్‌టుడే: గ్రామాల్లో ఎవరైనా కోడి పందేలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గ్రామీణ ఎస్సై బాదం శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని పడాలలో బుధవారం ఆయన అధ్యక్షతన స్థానికులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత కోడిపందేలు, పేకాట, గుండాట వంటి జూదాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సంకల్ప సిద్ధి.. పరిసరాలు శుద్ధి

- ☛ బహిరంగ మలవిసర్జనకు పాల్పడేవారికి జరిమానాలు
- ☛ రేషన్, విద్యుత్తు, పింఛన్ నిలుపుదల చేస్తామంటూ హెచ్చరిక బోర్డులు

కుంచనపల్లి, కడియద్ద (తాడేపల్లిగూడెం గ్రామీణ), న్యూస్‌టుడే: దేశానికి పల్లెలే పట్టుగొమ్మలు. వాటిని ప్రజానీకం పరిశుభ్రంగా ఉంచుకుంటే సంపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందించుకున్నట్టే. లేకపోతే వ్యాధులు ముసిరే అవకాశాలున్నాయి. అంతలా ఆరోగ్యంతో ముడిపడిపోయింది పారిశుద్ధ్యం. దీనిలోభాగంగానే పాలకులు, అధికారులు ప్రతీ కుటుంబానికి వ్యక్తిగత మరుగుదొడ్లను మంజూరు చేసి, నూరుశాతం నిర్మాణాలను పూర్తి చేయించారు. స్వచ్ఛత దిశగా అడుగులు వేయించారు. కానీ మండలంలోని పలు గ్రామాల్లో కొంతమంది ఇంటి దగ్గర నిర్మించుకున్న వ్యక్తిగత మరుగుదొడ్డిని వినియోగించుకోకుండా బహిరంగ మల విసర్జనకు పాల్పడుతున్నారు. పరిసరాలను కాలుష్యం చేస్తున్నవారిపై కొరడా ఝులిపిస్తున్నారు. గ్రామాల్లో ఎవరు బహిరంగ మల విసర్జనకు పాల్పడినా వారికి జరిమానాలు విధిస్తున్నారు. అంతటితో ఆగకుండా వారి ఫొటోలను ఫ్లెక్సీలపై ముద్రించి గ్రామ ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేస్తున్నారు. దీంతోపాటు రేషన్, విద్యుత్తు, పింఛన్ నిలుపుదల చేస్తామంటూ హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటుచేస్తుండటం గమనార్హం. .

నిఘా కమిటీలు: మండలంలోని 31 గ్రామాలకు గతంలో 5,960 వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరయ్యాయి. వాటిని యుద్ధప్రాతిపదికన పూర్తిచేసేలా పాలకులు, అధికారులు చిత్తశుద్ధితో పనిచేశారు. కానీ కొంతమంది నేటికి ఆ అవసరం నిమిత్తం ఆరుబయటికొస్తూ పరిసరాలను కలుషితం చేస్తున్నారు. అపరిశుభ్రత వల్ల 80 శాతం ప్రజానీకం రోగాలబారినపడే అవకాశాలున్నాయి. గ్రామాల్లో పూర్తిస్థాయిలో సంపూర్ణ పారిశుద్ధ్యాన్ని తీసుకురావాలనే ఉద్దేశంతో అధికారులు గ్రామాల్లో ఐదుగురు నుంచి పది మందితో కూడిన నిఘా కమిటీలను ఏర్పాటు చేశారు. వారు ఉదయం, సాయంత్రం ఆయా గ్రామాల్లో ఎవరు బహిరంగ మల విసర్జనకు పాల్పడుతున్నారో వారిపై నిఘా పెడుతున్నారు. ఇంటి దగ్గర నిర్మించుకున్న వ్యక్తిగత మరుగుదొడ్డిని వినియోగించుకునేలా వారికి కౌన్సెలింగ్ నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు. అప్పటికి వినకపోతే కార్యదర్శులు, మండల పారిశుద్ధ్య పర్యవేక్షకుడు జరిమానాలు విధిస్తున్నారు. అంతటితో ఆగకుండా మళ్లీ బహిరంగ మల విసర్జనకు పాల్పడితే వారికి రేషన్, విద్యుత్తు, పింఛన్లు వంటి ప్రభుత్వ పథకాలను నిలుపుదల చేయనున్నారు. ఇందుకు సంబంధించిన హెచ్చరిక బోర్డులను సైతం గ్రామ శివార్లలో ఏర్పాటు చేయటం విశేషం.



కడియద్దలో రేషన్, పింఛన్, విద్యుత్తు నిలుపుదల చేస్తామంటూ ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డు

జరిమానాలు: గ్రామాల్లో బహిరంగ మలవిసర్జనకు పాల్పడేవారికి రూ. 100 నుంచి రూ. 200 వరకూ జరిమానాలు విధిస్తున్నారు. వారి ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటుచేసి ఆయా గ్రామ ప్రధాన కూడళ్లలో ఆవిష్కరిస్తున్నారు. నవాబ్‌పాలెంలో 25 మందికి, కుంచనపల్లిలో నలుగురుకు, మోదుగగుంటలో ఐదుగురుకు, మెట్టఉప్పరగూడెంలో ఇద్దరికి, ఎల్.అగ్రహారంలో ఇద్దరికి, కొత్తూరులో ఐదుగురుకు, ఆరుగొలనులో నలుగురుకు, కృష్ణాయపాలెంలో ముగ్గురుకు జరిమానాలు విధించారు. వీరిలో ఎవరైనా మళ్లీ బహిరంగ మల విసర్జనకు పాల్పడితే రేషన్, విద్యుత్తు, పింఛన్ వంటి ప్రభుత్వ పథకాలను వారికి నిలుపుదల చేస్తారు. ఈ కార్యక్రమాన్ని నిరంతర ప్రక్రియగా చేపడితే పారిశుద్ధ్యంపై ప్రజల్లో పూర్తి అవగాహన ఏర్పడుతోంది. దీంతోపాటు కొన్ని గ్రామాల్లో సేకరించిన చెత్తను రహదారి పక్కనే వేస్తున్నారు. అన్ని గ్రామాల్లోను చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల షెడ్డులను త్వరితగతిన పూర్తిచేసి వినియోగంలోకి తీసుకొస్తే చెత్త సమస్య కూడా పూర్తిగా పరిష్కారమవుతోంది. ఆ దిశగా కూడా పాలకులు, అధికారులు చర్యలు తీసుకుంటే గ్రామాలు పరిశుభ్రమవుతాయి. ఫలితంగా గ్రామ ప్రజానీకం ఆరోగ్య కరమైన జీవనాన్ని గడుపుతారు. సంపూర్ణ పారిశుద్ధ్యం విషయంలో నూరు శాతం పురోగతి సాధించినవారవుతారు.

నిరంతర ప్రక్రియగా చేపడతాం

గ్రామాల్లో నూరుశాతం వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించినా కొంతమంది బహిరంగ మలవిసర్జనకు పాల్పడుతున్నారు. అటువంటి వారికి జరిమానాలు విధిస్తున్నాం. మళ్లీ ఎవరైనా బహిరంగ మలవిసర్జనకు పాల్పడితే రేషన్, పింఛన్, విద్యుత్తు వంటి ప్రభుత్వ పథకాలను నిలుపుదల చేస్తాం. ఈ కార్యక్రమాన్ని నిరంతర ప్రక్రియగా చేడతాం. అన్ని గ్రామాల్లోను చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల షెడ్డులను త్వరితగతిన పూర్తిచేసి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం.

- వివి.రామాంజనేయ శర్మ, ఎంపీడీవో

రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు

రావిపాడు, చింతపల్లి, కోరుమిల్లి (పెంటపాడు), న్యూస్‌టుడే: రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇతర పథకాలను అమలు చేస్తోందని జడ్పీ అధ్యక్షుడు ముళ్లపూడి బాపిరాజు పేర్కొన్నారు. రావిపాడు, చింతపల్లి, కోరుమిల్లి గ్రామాల్లో బుధవారం జన్మభూమి-మా ఊరు సభలను నిర్వహించారు. సర్పంచులు నల్లగంటి శివకృష్ణ, కూసంపూడి సీతమ్మ, వల్లూరి సత్యవతి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బాపిరాజు మాట్లాడుతూ 2019 ఆఖరికి మండలంలో నూరుశాతం సీసీ రహదారులు నిర్మిస్తామన్నారు. డీసీసీబీ అధ్యక్షుడు ముత్యాల వెంకటేశ్వరరావు (రత్నం) మాట్లాడుతూ డీసీసీబీ ద్వారా జిల్లాలోనే అధికంగా పెంటపాడు మండలంలో లబ్ధిదారులకు కాపు కార్పొరేషన్, ఇతర స్వయంఉపాధి సోపానం రుణాలను అందజేశామన్నారు. ఈ సందర్భంగా రావిపాడు జడ్పీ ఉన్నతపాఠశాలకు రూ.10.70 లక్షలతో నిర్మించిన ప్రహరీని బాపిరాజు ప్రారంభించారు. రూ. 13 లక్షలతో నిర్మించనున్న అదనపు తరగతి గదులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గూడెం పురపాలక అధ్యక్షుడు బొలిశెట్టి శ్రీనివాస్, ఎంపీపీ పెదపోలు వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ సభ్యుడు కిలపర్తి వెంకట్రావు, డీసీసీబీ డైరెక్టరు దాసరి అప్పన్న, సొసైటీ అధ్యక్షుడు ములగాల బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల ప్రహరీ నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ అధ్యక్షుడు బాపిరాజు

డీఎంహెచ్‌వో సందర్శన : జన్మభూమి సభల సందర్భంగా రావిపాడు గ్రామాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి సుబ్రహ్మణ్యేశ్వరి సందర్శించారు. గ్రామ ఆరోగ్య ప్రొఫైల్‌ను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలందరూ ఆనందంగా ఉంటారని పేర్కొన్నారు. వైద్య, ఆరోగ్యశాఖ అమలు చేస్తున్న పలు పథకాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో మల్లికార్జునరావు, వైద్యాధికారి ఎస్.వెంకటరమణ, ఆరోగ్య విస్తరణాధికారులు సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, ప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని చాటుకోవాలి

గణేష్‌నగర్ (తాడేపల్లిగూడెం అర్బన్), న్యూస్‌టుడే: యువత క్రీడా స్ఫూర్తిని చాటుకోవాలని జిల్లా పరిషత్ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు అన్నారు. పట్టణంలోని నన్నయ విశ్వవిద్యాలయం సమీపంలో గొర్రెల లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలను జడ్పీ ఛైర్మన్, మున్సిపల్ ఛైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్‌లు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాపిరాజు మాట్లాడుతూ పండుగ సమయాల్లో యువత, విద్యార్థులు చెడు అలవాట్లు జోలికి పోకుండా ఇలాంటి క్రీడా పోటీల్లో పాల్గొనాలని సూచించారు. తండ్రి పేరుతో క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్న మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ గొర్రెల శ్రీధర్‌ను అభినందించారు. పురపాలక ఛైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణంలో ఉన్న విమానాశ్రయ భూములను విద్యా రంగానికి కేటాయించారు. ఈ ప్రాంతంలో ఉన్న 8 ఎకరాల భూమిని క్రీడా ప్రాంగణంగా తీర్చిదిద్దాలని కోరారు. పెద్ద టోర్నమెంట్‌లు ఆడేందుకు ఈ ప్రదేశం అనువుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ కిలాడి ప్రసాద్, మదాసు ఇందు, కౌన్సిలర్లు, తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

తాడేపల్లిగూడెం

వెంకట్రామ	ఎంసీఏ
శేషమహల్	ఒక్క క్షణం
రంగమహల్	2 కంట్రీస్
చలపతి	మోసంగి
శ్రీపద్మజ	హలో
లక్ష్మీనారాయణ సినీమేక్స్	హలో
లక్ష్మీనారాయణ స్క్రీన్స్2	జుమాంజీ

గణపవరం

మహాలక్ష్మి	ఎంసీఏ
కుమారి	హలో

తాడేపల్లిగూడెం

నేడు ఉచిత దంతవైద్య శిబిరం

డీఎస్ చెరువు (తాడేపల్లిగూడెం అర్బన్), న్యూస్‌టుడే: పట్టణంలోని డీఎస్ చెరువు వద్ద ఉన్న సత్యసాయి సేవా మందిరంలో ఈనెల 4వ తేదీన విష్ణు దంత వైద్యశాల వారిచే ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సేవా సంస్థ కన్వీనర్ ఆకుల నవీన్‌బాబా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రంగవల్లులకు.. ఆహ్వానము

ముగ్గులు... మహిళల సృజనకు వేదికలు. ధనుర్మాసం వచ్చిందంటే చాలు ఇంటి ముంగిట వేసే రంగవల్లుల్లో ప్రావీణ్యాన్ని చూపించాలని ప్రతీ ఒక్కరు ఆరాటపడు తుంటారు. అలా మీరు వేసిన ముగ్గును ముద్రణలో చూడాలని అనుకుంటున్నారా..! ఆ అవకాశం మీకు 'ఈనాడు' కల్పిస్తోంది. చేయాల్సిందల్లా.. ఇంటి ఆవరణలో మీరు వేసిన ముగ్గుతోపాటు ఫొటో దిగి.. మీ పేరు, ఊరు, మండలం జతపరిచి వాట్సాప్‌లో కింది ఇచ్చిన నంబరుకు పంపించడమే. ఫొటో ప్రచురణ తుది నిర్ణయం నిర్వాహకులదే.

వాట్సాప్ నంబరు
96186 78906



టి.భవ్య లక్ష్మి, తాడేపల్లిగూడెం

అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి

మాధవరం (తాడేపల్లిగూడెం గ్రామీణ), న్యూస్‌టుడే: దేశ భద్రత, సంరక్షణ నిమిత్తం ఎక్కువ మంది సైనికులను అందిస్తున్న మిలట్రీ మాధవరం రుణం తీర్చుకోలేనిదని, ఈ గ్రామాభివృద్ధికి శక్తివంచనలేకుండా కృషి చేస్తున్నానని దేవాదాయ శాఖా మంత్రి పైడికొండల మాణిక్యాలరావు తెలిపారు. మండలంలోని మాధవరం, కుంచనపల్లి, అప్పారావుపేట, ఎల్.అగ్రహారం గ్రామాల్లో బుధవారం జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. మాధవరం సభలో మంత్రి మాణిక్యాలరావు మాట్లాడుతూ రక్షణ శాఖలో ఉద్యోగాలు పొందే యువత శిక్షణ పొందేందుకు వీలుగా గ్రామంలో ఆర్మీ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తున్నానని తెలిపారు. ఇప్పటికే ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లగా సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిందని పేర్కొన్నారు. రక్షణ శాఖ ఆధ్వర్యంలోని బీడీఎల్ కంపెనీ గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు ఈ నెల 14న రక్షణ శాఖామంత్రి నిర్మలా సీతారామన్ శంకుస్థాపనలు చేసేందుకు రానున్నారని తెలిపారు. గ్రామంలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్మలా సీతారామన్‌ను కోరతానని తెలిపారు. జడ్పీ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు మాట్లాడుతూ దేశ రక్షణలో పునీతులవుతున్న సైనికుల గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఎంపీపీ గన్నమని దొరబాబు, మండల ప్రత్యేక అధికారి ఎంవి.రమణ మాట్లాడారు. సభలకు సర్పంచులు కవులూరి పరిమళ, రాపాక కృష్ణ, జువ్వల మణికుమారి, పి.లక్ష్మి అధ్యక్షత వహించారు. ముందుగా బాపిరాజు కార్యక్రమాన్ని 12 గంటలకు ముగించుకుని వెళ్లిపోగా, తరువాత మంత్రి మాణిక్యాలరావు మధ్యాహ్నం 2 గంటలకొచ్చి అరగంటపాటు ఉన్నారు.



పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేస్తున్న మంత్రి మాణిక్యాలరావు

సంతృప్తి చెందేలా ప్రభుత్వ పథకాలు

సుబ్బారావుపేట (తాడేపల్లిగూడెం అర్బన్), న్యూస్‌టుడే: ప్రజలు సంతృప్తి చెందేలా ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు అన్నారు. బుధవారం పట్టణంలోని పలు వార్డులో నిర్వహించిన జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో మంత్రి, మున్సిపల్ ఛైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చంద్రన్న బీమా పేద కార్మికులకు వరంలాంటిదని రూ. 15 చెల్లించి బీమాను పొందాలని విజ్ఞప్తి చేశారు. వాటర్ గ్రిడ్ పథకం ద్వారా జిల్లాలోని అన్ని గ్రామాలకు, పట్టణాలకు గోదావరి జలాలను నేరుగా అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. మున్సిపల్ ఛైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణ జనాభా గతంలో కంటే 10 రెట్లు పెరిగిందన్నారు. సుమారు రెండు లక్షల జనాభాకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మంచి నీరు అందిస్తున్నట్లు ఛైర్మన్ వెల్లడించారు.

బాలికా వికాస శిక్షణ

తాడేపల్లిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: గోయంక మహిళా కళాశాలలో బుధవారం భారతీయ విద్యాకేంద్రం విశాఖపట్టణం ఆధ్వర్యంలో బాలికా వికాస శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ సుంకవల్లి రామకృష్ణ జ్యోతి వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సాహితీకృష్ణ మాట్లాడుతూ బాలికా వికాసం కోసం కావాల్సిన అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యాభారతి కార్యదర్శి కావూరి ఓంకార నరసింహారావు, గోయంక డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జయంతి కుమారి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సివిఎన్ శివప్రసాద్, సదాశివం, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.



బాలిక వికాస శిక్షణ నిర్వహిస్తున్న దృశ్యం

గ్రామ దర్శిని

తాడేపల్లిగూడెం రూరల్, న్యూస్‌టుడే

జగన్నాథపురం, దండగర్ర, ఆరుళ్ల, ఉప్పరగూడెం: ఆయా గ్రామాల్లో గురువారం జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. **కడియద్ద:** గ్రామంలో నూతనంగా మోటారును నిర్మిస్తున్నారు. **నీలాద్రిపురం:** గ్రామంలో కొత్తగా విద్యుత్తు లైన్‌ను వేస్తున్నారు. **కొండ్రుప్రోలు:** గ్రామ శివారు ప్రాంతం కెవిఎస్ఎన్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

మాధవరం: గ్రామంలోని ఉన్నత పాఠశాల వద్ద అదనపు తరగతి గదుల భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

రహదారి ప్రమాదంలో వ్యక్తి మృతి

రాచర్ల (పెంటపాడు), న్యూస్‌టుడే: రాచర్ల వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో తాడేపల్లిగూడేనికి చెందిన గంగుల సాయి (27) అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు సాయి ఉదయం తన స్నేహితులను కలవడం కోసం రాచర్ల వచ్చాడు. మధ్యాహ్నం తిరిగి గూడెం వెళ్తుండగా వాహనం అదుపు తప్పి కింద పడిపోయాడు. ఈ ఘటనలో సాయి తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని పెంటపాడు 108 సిబ్బంది నిర్ధరించారు. ఏఎస్సై కె.సత్యనారాయణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సాయి తాపీ పని చేస్తుంటాడు. అతని అన్న రాజావెంకట రత్నంనాయుడు ఫిర్యాదు మేరకు ఏఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటన స్థలంలో గంగుల సాయి మృతదేహం

అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

పెదతాడేపల్లి (తాడేపల్లిగూడెం గ్రామీణ), న్యూస్‌టుడే: అనుమానాస్పద మృతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని గ్రామీణ పోలీసులు బుధవారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు గూడెం మండలం పెదతాడేపల్లికి చెందిన చుక్కా సుబ్రహ్మణ్యం (35) వికలాంగుడు. దీంతో మూడు చక్రాల బండిని చేతితో తోసుకుంటూ నడుపుతుంటాడు. గ్రామంలోనే కిళ్లీకొట్టు నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 2న మూడు చక్రాల బండిపై తాడేపల్లిగూడెం పట్టణం పనిమీద వెళ్లాడు. తిరిగి అర్ధరాత్రి మూడు చక్రాల బండిపై ఇంటికెళ్తుండగా బెస్ట్ కళాశాల సమీపంలో అదుపుతప్పి పక్కనే ఉన్న పంట బోదెలోకి పడిపోయి మృతి చెందాడు. దీనిపై చుక్కా శ్రీను ఇచ్చిన పిర్యాదుపై గ్రామీణ ఎస్సై బాదం శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని పోలీసులు వివరించారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

అలంపురం (పెంటపాడు), న్యూస్‌టుడే: అలంపురంలో అసంపూర్తిగా మరుగుదొడ్లు నిర్మించిన గుత్తేదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు డిమాండు చేశారు. గ్రామంలోని ఒకటోవార్డు రజకుల కాలనీలో సీపీఐ బృందం బుధవారం పర్యటించింది. ఈ సందర్భంగా అసంపూర్తిగా నిర్మించిన మరుగుదొడ్ల వద్ద లబ్ధిదారులతో కలిసి కొంతసేపు నిరసన తెలిపారు. లక్ష్మణరావు మాట్లాడుతూ 120 మరుగుదొడ్లను, భూగర్భ డ్రెయినేజీని అసంపూర్తిగా నిర్మించడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇంటిపన్ను సామాన్యులకు అందుబాటులో లేదన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు కోటిచుక్కల శ్రీను, రామిశెట్టి శ్రీనివాస్, ఆర్‌వీఎస్ గోపాలకృష్ణ, కోటిచుక్కల అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.



నిర్మించిన నిరసన తెలియజేస్తున్న లబ్ధిదారులు

తణుకు

✸ ఒక వ్యక్తి పవిత్రమైన ఆలోచనతో మాట్లాడినా, పనిచేసినా ఎప్పటికీవిడువని నీడలా ఆనందంగా వెన్నంటే ఉంటుంది:- గౌతమ బుద్ధుడు

విద్యార్థుల ప్రతిభ

తణుకు పాతూరు, న్యూస్‌టుడే: ఇటీవల నెల్లూరులో నిర్వహించిన అంతర జిల్లాల టెన్నిస్, క్రికెట్ పోటీలలో వీరభద్రపురం చైతన్య పాఠశాల క్రీడాకారులు సీహెచ్ లోకేష్, కె.గిరీష్, పి.రాజ్యవర్ధన్‌కి షోర్ పాల్గొని ప్రతిభ చూపారని ప్రిన్సిపల్ పుష్పలత తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను, విజయానికి కారణమైన వ్యాయామ అధ్యాపకుడు కె.వెంకన్నబాబును ఉపాధ్యాయులు అభినందించారు.

రంగవల్లులకు.. ఆహ్వానము

ముగ్గులు... మహిళల సృజనకు వేదికలు. ధనుర్మాసం వచ్చిందంటే చాలు ఇంటి ముంగిట వేసే రంగవల్లుల్లో ప్రావీణ్యాన్ని చూపించాలని ప్రతీ ఒక్కరు ఆరాటపడుతుంటారు. అలా మీరు వేసిన ముగ్గును ముద్రణలో చూడాలని అనుకుంటున్నారా..! ఆ అవకాశం మీకు 'ఈనాడు' కల్పిస్తోంది. చేయాల్సిందల్లా.. ఇంటి ఆవరణలో మీరు వేసిన ముగ్గుతోపాటు ఫొటో దిగి.. మీ పేరు, ఊరు, మండలం జతపరిచి వాట్సాప్‌లో కింది ఇచ్చిన నంబరుకు పంపించడమే. ఫొటో ప్రచురణ తుది నిర్ణయం నిర్వాహకులదే.

వాట్సాప్ నంబరు

96186 78906



జ్యోతి గాయత్రి, తణుకు




దేవినాగశ్రీ, పాతూరు, తణుకు




సంధ్య, మండపాక, తణుకుమండలం

నీరందక.. దమ్ము సాగక!

ఆలస్యమవుతున్న రబీనాట్లు



పొదలాడలో నీరందక వరినాట్లు పడనిచేలు

ఇరగవరం, న్యూస్‌టుడే: శివారు ప్రాంతాల్లో రబీ సాగు ఆలస్యమవుతోంది. బోర్ల సాయంతో నారు పెంచినా, దమ్ము చేసేందుకు నీరు లేకుండా పోయింది. నాట్లు పూర్తి చేసుకునేందుకు అధికారులు సూచించిన గడువు (డిసెంబరు 31) ఇప్పటికే ముగిసింది. ఈ నేపథ్యంలో ఊడ్పులు మరింత ఆలస్యమైతే పంట కీలక దశలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 14,200 ఎకరాల కు గాను ఇప్పటి వరకు ఎనిమిది వేల ఎకరాల్లో మాత్రమే నాట్లు పడ్డాయి.

ఇక్కడే నీటి ఎద్దడి

కంతేరు ఛానల్ పరిధిలో కంతేరు, పొదలాడ. రేలంగి శివారు బొజ్జరాజపాలెం ఛానల్ పరిధిలో గవర్లపాలెం చుక్కావానితోట, బొజ్జరాజపాలెం ప్రాంతాల్లో సుమారు 2వేల ఎకరాల ఆయకట్టులో నాట్లు ఆలస్యమవుతున్నాయి. బోదెల్లోకి నీరు పూర్తిగా రాక రైతులు అవస్థలు పడుతున్నారు. ఏటా ఈ సమస్యలు తలెత్తుతూనే ఉన్నాయని రైతులు వాపోతున్నారు. పొదలాడ ప్రాంతంలో మురుగు కాలువలోని నీరు చేలకు తోడుకునేలా ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఇంజిన్లు ఏర్పాటు చేయించారు. అయితే ఆ ప్రాంతంలో త్రీఫేజ్ విద్యుత్తు సరఫరాకు వీలుగా పరివర్తకం లేకపోవడతో అవి పూర్తిస్థాయిలో ఉపయోగపడటం లేదని రైతులు వాపోతున్నారు.

నీరు పారడం లేదు



పంట బోదెల్లోకి నీరు పారడం లేదు. నారుమడి పెరిగిపోతోంది. నీరు లేక దమ్ములు చేయలేక పోతున్నాం. రెండు ఎకరాలు ఊడ్చాలి. ఏంచేయాలో అర్థం కావటం లేదు.

-గెడ్డం సత్యనారాయణ, రైతు, పొదలాడ

ఏటా అవస్థలే



కంతేరు కాలువ శివారులో ఏటా ఇబ్బంది వస్తుంది. దీంతో సకాలంలో నాట్లు వేయలేక దిగుబడి తగ్గుతోంది. చేలు బీటలు తీస్తున్నాయి. మురుగు కాలువలు, బోదెల్లోకి రొయ్యల చెరువుల నీరు వదిలేస్తున్నారు. ఆ నీరు పెడితే పంట దెబ్బతినేలా ఉంది.

- పెచ్చెట్టి ఆదినారాయణ, రైతు,పొదలాడ

లాకు ఏర్పాటు చేయాలి



బొజ్జరాజసాలెం కాలువ శివారున చిన్న లాకు నిర్మిస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. కాలువ శివారున నీటి నిల్వ పెరిగితే నాట్లు వేసుకునే వీలుంటుంది. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే వేస్తున్నారు. ఇక్కడ నారుమడికి సైతం నీరందక ఇంజిన్లతో తోడాల్సి వస్తుంది.

-బొక్కా భాస్కరరావు, కౌలురైతు, చుక్కావానితోట, రేలంగి.

త్యాగానికి, ధైర్యానికి ప్రతీక సావిత్రిబాయి పూలే

తణుకు, న్యూస్‌టుడే: సావిత్రిబాయిపూలే త్యాగానికి, ధైర్యానికి ప్రతీకని మున్సిపల్ ఛైర్మన్ పరిమి వెంకన్నబాబు బుధవారం అన్నారు. ఆమె జయంతి సందర్భంగా స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ప్రతీ మహిళా చదువుకోవాలని సావిత్రిబాయి పూలే ఆకాంక్షించారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ మంత్రిరావు వెంకటరత్నం, జడ్పీటీసీ సభ్యుడు ఆత్మకూరి బులిదొరరాజు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

✸ జ్యోతిరావుపూలే సంఘం ఆధ్వర్యంలో వీరభద్రపురం బీసీ కార్యాలయంలో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పుల్లేకుర్తి బ్రహ్మజీ, గుత్తుల రంగారావు, తామరాపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

✸తణుకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ సభ్యులు జంగా వెంకటేశ్వర్లు, ఏలూరి చిట్టి మోషే, పొట్ల సురేష్, కౌరు వెంకటేశ్వర్లు, గెడ్డం భాగ్యానందం పాల్గొన్నారు.

✸ బీసీ చైతన్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక రాష్ట్రపతి రోడ్డులో ఉన్న సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ✸ బీఎస్పీ ఆధ్వర్యంలో స్థానిక పెద్ద వంతెన సమీపంలో ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ✸ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక పెద్ద వంతెన సమీపంలో ఉన్న సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పూలే చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు



పూలే దంపతుల విగ్రహాల వద్ద నివాళులు అర్పిస్తున్న బీసీ చైతన్య వేదిక నాయకులు

ఘనంగా సొసైటీ వార్షికోత్సవం

బల్లిపాడు(అత్తిలి), న్యూస్‌టుడే: రైతులకు విశేష సేవలందించడంలో బల్లిపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) మిగతా సొసైటీలకు ఆదర్శంగా నిలుస్తోందని డీసీసీబీ ఛైర్మన్ ముత్యాల వెంకట రత్నం అన్నారు. సొసైటీ 75వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు ప్రగడ కోట సత్యం అధ్యక్షత వహించారు. పోటీతత్వం నేపథ్యంలోనే బల్లిపాడు సొసైటీ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. సంఘ మాజీ అధ్యక్షులు కశిరెడ్డి సూర్యారావు, తలారి ధర్మారావు సంఘ బలోపేతానికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. అదే విధంగా మిగతా అధ్యక్షులు కూడా రైతులకు రుణాలు, ప్రభుత్వ పథకాలు అందించడంలో కృషి చేశారని తెలిపారు. అనంతరం సంఘ అధ్యక్షుడు ప్రగడ కోట సత్యంను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గారపాటి ధనరాజు, సర్పంచి ఆకుల వెంకట రమణ, వీవీఎన్ ఫణికుమార్, వైవీ రాఘవేంద్రావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



సొసైటీ అధ్యక్షుడు సత్యంను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, డీసీసీబీ ఛైర్మన్ రత్నం

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

తణుకు పాతూరు, న్యూస్‌టుడే: పురపాలక కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక పురపాలక కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ జి.సాంబశివరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు గారరంగారావు మాట్లాడుతూ గత నెల 18 నుంచి 22 వరకు కార్మికులు చేసిన సమ్మె ఫలితంగా పలు హక్కులకు సంబంధించి ప్రభుత్వం నుంచి హామీ పొందినట్లు చెప్పారు.

సినిమాలు

తణుకు	
వెంకటేశ్వర	హలో
శ్రీచిత్ర	ఇఈ
నరేంద్ర	గరుడవేగ
మినీ నరేంద్ర	మాతంగి
ప్రత్యూష	ఎంసీఏ
ప్రత్యూష మినీ	ఎంసీఏ
ప్రత్యూష డిజిటల్	జవాన్
లక్ష్మి	ఒక్క క్షణం
లక్ష్మి మినీ	టూ కంట్రీ
అత్తిలి	
వెంకట్రామ	ఎంసీఏ
కనకదుర్గ	హలో

సత్యసాయి మందిరంలో గోపూజ

రేలంగి(ఇరగవరం), న్యూస్‌టుడే: సత్యసాయిబాబా జయంతి సందర్భంగా రేలంగి సత్యసాయి మందిరంలో బుధవారం గోపూజ, లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు యర్రంశెట్టి చిట్టిభద్రయ్య, పసుపులేటి నాగేశ్వరరావు, రామారావు, మోపిదేవి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

తణుకు, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవని గ్రామీణ ఎస్సై చిలకమర్తి వెంకట రమేష్ హెచ్చరించారు. ముందస్తు చర్యగా తణుకు మండలంలో 20 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. అలాగే పందేలు నిర్వహిస్తున్న ఎనిమిది మందిపై కేసులు నమోదు చేశామని తెలిపారు.

అయితంపూడి (ఇరగవరం), న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, ఇతర జూదాలు నిర్వహించే వారిపై చర్యలు తప్పవని తహశీల్దార్ జి.మమ్మీ హెచ్చరించారు. అయితంపూడి ప్రాంతంలో కోడిపందేలు ఏర్పాటు చేసే బరులను బుధవారం ఆమె పరిశీలించారు. స్థల యజమానులను పిలిచి మాట్లాడారు. పందేలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించే వారిపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. ఈమేరకు మండల స్థాయిలో కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేశామని ఎస్సై గుబ్బల శ్రీనివాసరావు చెప్పారు. గ్రామ సర్పంచి జితేంద్ర పాల్గొన్నారు.

త్వరలోనే గోదావరి జలాల సరఫరా

తణుకు, న్యూస్‌టుడే: తణుకు పట్టణ ప్రజలకు త్వరలో గోదావరి జలాలను అందిస్తామని ప్రజారోగ్య శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ సుధాకర్ చెప్పారు. ఇందుకు సంబంధించి వేసవి నీటి నిల్వ ట్యాంకునకు సేకరించిన స్థలాన్ని ఆయన బుధవారం పరిశీలించి మాట్లాడారు. మొత్తం 60.06 ఎకరాల భూమిని పెరవలి మండలం అజ్జరం గ్రామంలో సేకరించినట్లు వెల్లడించారు. మున్సిపల్ ఛైర్మన్ పరిమి వెంకన్నబాబు, కమిషనర్ సాంబశివరావు, ఏఈ ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

తణుకు

ప్రజాస్వామిక సంస్కారం బయట నుంచి వచ్చేది కాదు. మనిషి లోపలి నుంచి ప్రభవించాలి.
- గాంధీజీ

చూడాలి.. వెతలు తీరాలి

ఇరగవరం, న్యూస్‌టుడే:



సమస్య: కత్తవపాడు-పొదలాడ మార్గంలో విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా ఉంది. ఇటుగా వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి.
-డి.సత్యనారాయణ, పొదలాడ

అధికారి: విద్యుత్తు స్తంభాన్ని సరిచేసి, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం
-నరసయ్య, విద్యుత్తు ఏఈ ఇరగవరం

సమస్య: గోటేరు శివారు అంతెనగుంట నుంచి ఇరగవరం చేరే రహదారి గోతులమయంగా మారింది. రాళ్లు లేచి వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరగుతున్నాయి.
-ఆదిత్య, గోటేరు



అధికారి: రహదారికి మరమ్మతులు చేపట్టి, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం. **-విశ్వనాథ్, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి, ఇరగవరం**

ఆలయ రహదారి అభివృద్ధి

స్పందనకు స్పందనం

ఇరగవరం, న్యూస్‌టుడే: రేలంగి మంటలాంబ అమ్మ వారి ఆలయానికి చేరే మార్గం గోతులుపడి, రాళ్లులేచి అధ్వానంగా ఉన్న వైనంపై గత సెప్టెంబరు 11న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రూ. 65లక్షల వ్యయంతో సీసీ రహదారిగా అభివృద్ధి చేశారు. ఈ మార్గం గుండా ఆలయానికి చేరే భక్తులతో పాటు, రైతులు, అత్తిలి నుంచి తణుకు చేరే వాహనచోదకులు ప్రధాన రహదారికి ప్రత్యామ్నాయంగా ఉపయోగిస్తుంటారు. మార్గం అభివృద్ధి పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గోతులమయంగా రహదారి



నూతనంగా నిర్మించాక..



సమస్య: రేలంగి- పాలి రహదారిలో ఉన్న మలుపు వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలి
-కె.వెంకటేష్, పాలి

అధికారి: పరిశీలించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం**-టి.ప్రసాదు, ర.భ. ఏఈ**



సమస్య: రేలంగి సంతమార్కెట్ సమీపంలో కుళాయికి ఫ్లాట్ ఫాం లేక నీరు పట్టుకోవడానికి ఇబ్బందిగా ఉంది. **-వి.రామలక్ష్మి, రేలంగి**

అధికారి: నీరు పట్టుకునేందుకు ఇబ్బంది లేకుండా చేస్తాం**-శ్రీరామమూర్తి, కార్యదర్శి, రేలంగి**

మీకు వాట్సాప్ ఉందా.. స్పందించండి

మీరు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలపై స్పందించండి. యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈనాడు వేదికగా నిలుస్తు ంది. మీరు చేయాల్సిందల్లా సమస్యను ఫొటో తీసి, పరిస్థితిని క్లుప్తంగా వివరించి.. వాట్సాప్ ద్వారా మీ పేరుతో సహా పంపడమే.

దిగువ నంబర్లకు పంపొచ్చు..

తణుకు: 96667 2400, 9948012094

అత్తిలి: 99592 60206

ఇరగవరం: 94937 09678



దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

కనుల పండువగా దీపోత్సవం

తణుకు సాంస్కృతికం, న్యూస్‌టుడే: వాసవీ కన్యకాపరమేశ్వరి ప్రార్థనా మందిరంలో ధనుర్మాసం సందర్భంగా లక్ష్మీనారాయణులకు అభిషేకం, ప్రత్యేక పూజలు, తిరుప్పావై, దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు 27 ద్రవ్యాలతో హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు గమిని రాజా, సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు దీపోత్సవంలో పాల్గొన్నారు.



లక్ష్మీనారాయణులకు దీపోత్సవం

మంత్రి వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

తణుకు పాతూరు, న్యూస్‌టుడే: తణుకులో నిర్వహించిన జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్రమంత్రి పితాని సత్యనారాయణ భాజపాపై చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని తణుకు అసెంబ్లీ నియోజకవర్గ భాజపా కన్వీనర్ మల్లిన రాధాకృష్ణ విమర్శించారు. రాష్ట్రంలో భాజపాను దోషిగా నిలబెట్టేందుకు అధికార తెదేపా ప్రయత్నిస్తుందనడానికి మంత్రి చేసిన వ్యాఖ్యలే నిదర్శనమని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తణుకు నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో చేసిందని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చుండూరి శేషాద్రిశాస్త్రి, పెన్మత్స సోమసుందరరాజు, మల్లుల రమాసత్యనారాయణ, సింహాద్రి లక్ష్మణకుమార్‌గుప్త పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

తణుకు, న్యూస్‌టుడే: తణుకు మండలం కోనాలలో పేకాట స్థావరంపై దాడిచేసి, ముగ్గురిని అరెస్టు చేసినట్లు గ్రామీణ ఎస్సై సీహెచ్‌కే రమేష్ తెలిపారు. ఈసందర్భంగా నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

పేదలకు బహుళ అంతస్తుల తరహాలో గృహాలు

ఇరగవరం, న్యూస్‌టుడే: అర్హులైన పేదలందరికీ గృహయోగం కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జన్మభూమి నోడల్ అధికారి కల్లోల్ బిస్వాస్‌అన్నారు. మండలంలోని ఏలేటిపాడులో బుధవారం నిర్వహించిన జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో సేకరించిన స్థలంలో బహుళ అంతస్తుల విధానంలో ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పారు. భూములు విలువ భారీగా ఉన్నందున కొత్తగా స్థలసేకరణ చేసే అవకాశం లేదన్నారు. ప్రభుత్వాసుపత్రిలో సేవల తీరును ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలను తిలకించారు. ఎంపీపీ గొర్తి లక్ష్మి, గ్రామ సర్పంచి యుద్ధం శ్యామల, నాయకులు సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ✹ అర్జునుడుపాలెంలో జరిగిన కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ధనుంజయరావు, జడ్పీటీసీ సభ్యుడు చుక్కా సాయిబాబు, ఎంపీడీవో వానపల్లి విజయలక్ష్మి నాయకులు పోతుల గంగాధరరావు పాల్గొన్నారు. ✹ కొత్తపాడులో సర్పంచి బి.లక్ష్మి, నాయకులు బొంతు శ్రీనివాసు పాల్గొన్నారు. ✹ పేకేరులో గ్రామ సర్పంచి కునుకు నాగకృష్ణ, మండల ఉపాధ్యక్షుడు సత్తి సూర్యప్రకాష్‌రెడ్డి, నాయకులు కునుకు సత్తిబాబు పాల్గొన్నారు.

తణుకు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే జన్మభూమి- మాఊరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ పరిమి వెంకన్నబాబు అన్నారు. పట్టణంలోని ఒకటి నుంచి నాలుగు వార్డుల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం చంద్రన్న బీమా బాండ్లు, విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. వార్డుల కౌన్సిలర్లు చిట్యాల అనంతలక్ష్మి, బొద్దాని నాగరాజు, గుబ్బల నాగలక్ష్మి, ఎలుబూడి ఈశ్వరరావు పాల్గొన్నారు.

తణుకు పాతూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జన్మభూమి నోడల్ అధికారి బిస్వాస్ పేర్కొన్నారు. తణుకు మండలం ముద్దాపురం, కోనాల గ్రామాలలో బుధవారం నిర్వహించిన జన్మభూమి-మాఊరు కార్యక్రమాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం అర్హులకు రేషన్ కార్డులు అందజేశారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కట్టా అనంతలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు బులిదొరరాజు, సర్పంచులు ముళ్లపూడి శ్రీనివాసరావు, బూరుగుపల్లి ఆనందరమేష్, అధికారులు పాల్గొన్నారు.



బల్లిపాడులో ప్రభుత్వ పథకం మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి, జేసీ కోటేశ్వరరావు

ప్రతి కుటుంబానికి లబ్ధి

అత్తిలి, న్యూస్‌టుడే: తెదేపా ప్రభుత్వం హయాంలో ప్రతీ కుటుంబానికి లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. జన్మభూమి-మాఊరు కార్యక్రమాలు అత్తిలిలో బుధవారం నిర్వహించారు. అత్తిలి పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గడచిన నాలుగేళ్లలో అత్తిలిలో సుమారు రూ.4కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. వైకాపా అధికారంలోకి వస్తే అందేవి నవ రత్నాలు కావని, నకిలీరత్నాలని ఎద్దేవా చేశారు. తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. అనంతరం లబ్ధిదారులకు రేషన్ కార్డులు, చంద్రన్న బీమా బాండ్లు, కానుకలు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచి కందుల కల్పన, ఎంపీపీ కేతా సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యురాలు మేడపాటి కృష్ణకుమారి, జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు దిరిశాల భీమరాజు, పోలిశెట్టి చంటి, తెదేపా మండల, పట్టణ అధ్యక్షులు ఆనాల ఆదినారాయణరావు, పూతినీడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

✹ ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకున్నప్పుడే వాటి ఉపయోగాలు తెలుస్తాయని, తద్వారా అర్హులైన వారు లబ్ధి పొందవచ్చని జిల్లా సంయుక్త కలెక్టరు కోటేశ్వరరావు అన్నారు. బల్లిపాడులో బుధవారం నిర్వహించిన జన్మభూమి-మా ఊరు సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడారు. లబ్ధిదారులకు చంద్రన్న కానుకలు, రేషన్ కార్డులు, చంద్రన్న బీమా, ఉపకార వేతనాలు అందజేశారు. డీసీసీబీ ఛైర్మన్ ముత్యాల వెంకటరత్నం, గ్రామ సర్పంచి ఆకుల వెంకటరమణ, గారపాటి ధర్మయ్య, బుద్దాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

తణుకు పాతూరు, న్యూస్‌టుడే: స్థానిక ఎస్కేఎస్డీ మహిళా జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో ఆరోగ్య, సాధారణ విద్యపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

ఉండి

చీరల వేలం ఆదాయం రూ.43,060

మావుళ్లమ్మగుడి వీధి (భీమవరం ఆధ్యాత్మికం), న్యూస్‌టుడే: భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మ ఆలయంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలకు బహిరంగ వేలం పాట బుధవారం నిర్వహించారు. ఈ పాటలో రూ.43,060 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇన్‌ఛార్జి ఈవో ఎన్ఎస్. చక్రధరరావు తెలిపారు. ధర్మకర్తల మండలి సభ్యులు అడ్డగర్ల ప్రభాకరగాంధీ, అడ్డాల సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్యాస్ సమాచారం

గొల్లలకోడేరు, గరగపర్రు, (పాలకోడేరు), న్యూస్‌టుడే: గొల్లలకోడేరు, గరగపర్రు గ్రామాల్లోని ఇండేన్ గ్యాస్ వినియోగదారులకు గురువారం గ్యాస్ ఇవ్వనున్నారు. ముందస్తుగా నమోదు చేసుకున్నవారికి సిలిండర్లు అందిస్తారు.

రంగవల్లులకు.. ఆహ్వానము

ముగ్గులు... మహిళల సృజనకు వేదికలు. ధనుర్మాసం వచ్చిందంటే చాలు ఇంటి ముంగిట వేసే రంగవల్లుల్లో ప్రావీణ్యాన్ని చూపించాలని ప్రతీ ఒక్కరు ఆరాటపడుతుంటారు. అలా మీరు వేసిన ముగ్గును ముద్రణలో చూడాలని అనుకుంటున్నారా..! ఆ అవకాశం మీకు 'ఈనాడు' కల్పిస్తోంది. చేయాల్సిందల్లా.. ఇంటి ఆవరణలో మీరు వేసిన ముగ్గుతోపాటు ఫొటో దిగి.. మీ పేరు, ఊరు, మండలం జతపరిచి వాట్సాప్‌లో కింది ఇచ్చిన నంబరుకు పంపించడమే. ఫొటో ప్రచురణ తుది నిర్ణయం నిర్వాహకులదే.

వాట్సాప్ నంబరు

96186 78906

సాగునీరు.. రైతుల మధ్య పోరు..!

ఉండి, న్యూస్‌టుడే

☛ అనధికార వంతులతో అందని వైనం ☛ దమ్ములు సాగటం లేదని సాగుదారుల ఆవేదన



ఈ చిత్రం వెలివర్రులోనిది. సాగునీరు అందకపోవడంతో దమ్ములు పూర్తి కాలేదు. మెరక, కాలువ శివారు భూములు కావడంతో ఆలస్యంగా నారుమడులు పోశారు. వరినాట్లు వేయాలంటే ప్రత్యేకించి నీరివ్వాలని రైతులు కోరుతున్నారు.

ఇది ఉండిలో మొలక దశలో ఉన్న నారుమడి. మరో 20 రోజులు ఆగితే తప్ప నాట్లు వేయలేని పరిస్థితి ఇక్కడ ఉంది. శివారు ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న దయనీయస్థితికి ఈచిత్రమే నిదర్శనంగా చెప్పొచ్చు.



జలవనరుల శాఖ ఉండి సబ్‌డివిజన్ పరిధిలో 1,49,320 ఎకరాల విస్తీర్ణం ఉండగా.. వరి సాగవుతున్నది 1,19,775 ఎకరాలని ఆశాఖ అంచనా వేస్తోంది. ఉండి ప్రధాన పంట కాలువపై 66,388 ఎకరాలు, వెంకయ్య వయ్యేరుపై 47,305, పాత వయ్యేరుపై 6,083 ఎకరాలు సాగవుతున్నట్లు దస్త్రాలు వెల్లడిస్తున్నాయి. దాదాపు నెల రోజుల నుంచి ఈసబ్ డివిజన్ పరిధిలోని రెండు ప్రధాన పంటకాలువలకు అనధికార వంతుల విధానం అమలుచేస్తున్నారు. ఈ రకంగా చేస్తే సాగు ముందుకెళుతుందనేది అధికారులు చెప్పే వాదన. కాగా క్షేత్ర స్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. శివారు, మెరకభూముల్లో కనీసం దమ్ములు కూడా పూర్తి చేసుకోలేని దుస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారు. ఈనేపథ్యంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి.

లోపించిన పర్యవేక్షణ

సాధారణంగా సాగునీటి సమస్య తలెత్తిన సమయంలో మండల స్థాయి కమిటీ, అధికారులు ఐక్య నిర్ణయాలతో ముందుకెళుతుంటారు. రెండు నెలల నుంచి ముందస్తు రబీకి రైతులు సన్నద్ధం కావాలంటూ ప్రచారం చేయడం మినహా ఏ కాలువ గట్టుపై ఎంత వరి విస్తీర్ణం ఉంది.. అందులో ఎంత సాగైందనే కచ్చితమైన లెక్కలు ఎవరి వద్దాలేవు. వ్యవసాయ, దాని అనుబంధ శాఖల మధ్య పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఉండి సబ్‌డివిజన్ పరిధిలో సుమారు 25శాతం విస్తీర్ణంలో దమ్ములు చేయాల్సి ఉందనేది అనధికార లెక్కలు. జలవనరుల శాఖ అధికారులైతే సాగుకు అవసరమైన నీరందిస్తున్నట్లు చెబుతున్నారు. కాగా నాలుగు మండలాల్లో సుమారు 15 గ్రామాల్లో సమస్యలు ఉన్నట్లు రైతులు వాపోతున్నారు. దమ్ము నిమిత్తం పలువురు కారాలు, ఇంజిన్లు వినియోగిస్తున్నారు. సందట్లో సడేమియాలా కనీసం వరినాట్లు పూర్తయ్యేంతవరకూ ఆగకుండా ఎగువ ప్రాంతాల్లో కాలువలలోని నీటిని ఎక్కడకక్కడే ఇంజిన్లు వేసి ఆక్వా చెరువులకు తోడేస్తుండటంతో శివారు భూములకు నీరందటం లేదు. దీంతో రబీ వరినాట్లు బాగా ఆలస్యమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కాగా ఖరీఫ్ పంట చేతికొచ్చిన తర్వాత ఉండి, ఆకివీడు, కాళ్ల మండలాల్లో చేపల చెరువుల తవ్వకాలు మరోసారి ప్రారంభమయ్యాయి. ఒక్క ఉండి మండలంలోనే సుమారు 400 ఎకరాల్లో తవ్వుతున్నట్లు చెబుతున్నారు. దీంతో ఏమండలంలో ఎంత వరి విస్తీర్ణం ఉంటుందనే కచ్చితమైన లెక్కలు అందించలేని పరిస్థితి అధికారుల పరంగా ఉంది.

నాట్లు పూర్తి చేయిస్తాం

పంట కాలువలకు అనధికార వంతుల్లో నీరిస్తున్నాం. అన్ని ప్రాంతాల్లో వరినాట్లు పూర్తయ్యేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. నీరందని ప్రాంతాల వివరాలు తమకు అందించాలని రైతులను కోరుతున్నాం.

-వెంకటేశ్వరరావు, ఇన్‌ఛార్జి డీఈఈ, జలవనరుల శాఖ, ఉండి



పెదపుల్లేరు: సీతారామచంద్ర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా లక్షతులసీదళ పూజ

పెదపుల్లేరు (ఉండి), న్యూస్‌టుడే: పెదపుల్లేరులోని సీతారామచంద్రస్వామి ఆలయంలో లక్ష తులసీదళ పూజ బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పెన్మత్స నాగరాజు దంపతులు పీటలపై కూర్చొన్నారు. పూజలో పెదపుల్లేరు సత్తెమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ కలిదిండి కృష్ణంరాజు, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు సీతారామరాజు, సహకార సంఘ మాజీ కార్యదర్శి కలిదిండి భాస్కరరాజు, ఏపీఎస్ఎస్ఐ డీసీ మాజీ ఛైర్మన్ రామకృష్ణంరాజుతో పాటు ఇతర గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అనంతరం మహా ప్రసాద వితరణ జరిగింది.

నేడు జన్మభూమి-మాఊరు సభలు

ఉప్పులూరు, పాందువ్వ (ఉండి), న్యూస్‌టుడే: మండలంలోని ఉప్పులూరులో గురువారం ఉదయం, యండగండిలో మధ్యాహ్నం జన్మభూమి-మాఊరు సభలు నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో వీరమల్లు రెడ్డియ్య తెలిపారు.

మైప, కోరుకొల్లు (పాలకోడేరు), న్యూస్‌టుడే: జన్మభూమి- మాఊరు సభలు మైప, కోరుకొల్లు గ్రామాల్లో గురువారం నిర్వహించనున్నామని ఎంపీడీవో పి.వెంకటరత్నం తెలిపారు.

బొండాడ, బొండాడపేట (కాళ్ల), న్యూస్‌టుడే: మండలంలో గురువారం ఉదయం 9 గంటలకు బొండాడలో, మధ్యాహ్నం 2 గంటలకు బొండాడపేట గ్రామాల్లో 'జన్మభూమి-మా ఊరు' సదస్సులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎన్వీ శివప్రసాద్‌యాదవ్ తెలిపారు.

డంపింగ్ యార్డు నిర్మాణ పనుల పరిశీలన

పాలకోడేరు, న్యూస్‌టుడే: పాలకోడేరులో నిర్మిస్తున్న డంపింగ్‌యార్డు పనులను మండల పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి సంతోష్ బుధవారం పరిశీలించారు. నెలరోజులలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ప్రస్తుతం తడి, పొడి చెత్తను వేరు చేసేందుకు అవసరమైన పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచి గాదిరాజు చంద్రావతి, పంచాయతీ కార్యదర్శి సీహెచ్‌వీ రమాలీలా, గాదిరాజు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభతోనే గుర్తింపు

గుమ్ములూరు (ఆకివీడు (గ్రామీణ), న్యూస్‌టుడే: ఏ రంగంలోనైనా ఉత్తమ ప్రతిభతోనే గుర్తింపు వస్తుందని ఎమ్మెల్యే శివరామరాజు అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయినులు ఎస్ఎన్ సుభాషిణి, ఎం.శ్రీదేవి, టి.విజయలక్ష్మి, కె.సంధ్యారాణిని గుమ్ములూరులో జరిగిన 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమంలో ఎమ్మెల్యే బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచి కోపల్లి రత్నమాణిక్యం, జడ్పీటీసీ సభ్యురాలు మన్నె లలితాదేవి, ఎంపీపీ నౌకట్ల రామారావు, ఎంఈవో ఎ.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శివరామరాజు

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ఆకివీడు, న్యూస్‌టుడే: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం పొందవచ్చని ఆకివీడు నోడల్ అధికారి ఎన్.ఠాగూర్ అన్నారు. 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రచారంలో భాగంగా ఆరోగ్యంపై ప్రజలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పౌష్టికాహారాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో తెదేపా పట్టణ అధ్యక్షుడు బొల్లా వెంకట్రావు, గ్రామ రెవెన్యూ అధికారి సత్యనారాయణ, ప్రజా ప్రతినిధులు అడపా అబ్బులు, బొండాడ సాయమ్మ, పాంద్రంగి లక్ష్మీ పాల్గొన్నారు.



పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న నోడల్ అధికారి ఠాగూర్ తదితరులు

అమలు కాని హామీలతో మోసం

కుప్పనపూడి (ఆకివీడు), న్యూస్‌టుడే: వైకాపా అధికారంలోకి వస్తే ఓటరే ప్రజాప్రతినిధిగా వ్యవహరించవచ్చని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు. గడపగడపకూ వైకాపా కార్యక్రమం కుప్పనపూడిలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమలు కాని హామీలతో తెదేపా ప్రజల్ని మోసం చేసిందని ఆరోపించారు. కుప్పనపూడిలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఉందన్నారు. కార్యక్రమంలో వైకాపా మండల అధ్యక్షుడు గుండా సుందరరామినాయుడు, నంద్యాల సీతారామయ్య, కేసిరెడ్డి మురళీ, హుస్సేన్, పుప్పాల సత్యనారాయణ, నంద్యాల శ్యామల, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం శ్రమించే వారికి తగిన గుర్తింపు

పాములపర్రు (ఉండి), న్యూస్‌టుడే: భావితరాన్ని తీర్చిదిద్దే క్రమంలో నిరంతరం శ్రమించే ఉపాధ్యాయులకు ఎప్పటికైనా తగిన గుర్తింపు లభిస్తుందని పాములపర్రు గ్రామ ఇన్‌ఛార్జి సర్పంచి నక్కా చెన్నకేశవరావు అన్నారు. పాములపర్రులో బైబిల్ అహరోను సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో తల్లమ్మచెరువు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.డేనియల్ దంపతులను ఘనంగా సత్కరించారు. పాములపర్రు ప్రాథమిక పాఠశాలలో 12 సంవత్సరాలు పనిచేసిన డేనియల్ విద్యా ప్రగతికి మంచి పునాది వేశారని పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యుడు వర్రే పైడియ్య, మాజీ సర్పంచి తాటిపట్టి పెదవీరప్ప, సంఘ ప్రతినిధులు నక్కా విజ్ఞానరాజు, నక్కా ఏసురత్నం, మతబోధకులు తాటిపట్టి మరియమ్మ, దానం సువర్ణరాజు పాల్గొన్నారు.

సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

అయిభీమవరం (ఆకివీడు (గ్రామీణ), న్యూస్‌టుడే: దాళ్వాసాగులో నీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని డీసీ ఛైర్మన్ తోట ఏడుకొండలు తెలిపారు. అయిభీమవరంలో వెంకయ్యవయ్యేరు అనుబంధ కాలువ ద్వారా సాగునీరు అందక రైతులు అవస్థలు పడుతున్నారు. దీనిపై ఎమ్మెల్యే శివరామరాజు సూచనల మేరకు సుమారు కిలోమీటరు పొడవునా ఉన్న కాలువలో యంత్రం సాయంతో మట్టి పూడికతీత పనులను ప్రారంభించారు. వీటిని బుధవారం ఏడుకొండలు, నీటి పారుదల శాఖ ఏఈ అవధానులు పరిశీలించారు.

సినిమాలు

ఆకివీడు

విజయ	ఎంసీఏ (మిడిల్‌క్లాస్ అబ్బాయి)
విజయమినీ	హలో!
వెంకటలక్ష్మి	ఒక్క క్షణం
సంగీత	మిస్టర్ కార్తీక్

భీమవరం

విజయలక్ష్మి	ఆక్సిజన్
మహాలక్ష్మి	మళ్లీ రావా
పద్మాలయఎ/సి	ఎంసీఏ (మిడిల్ క్లాస్ అబ్బాయ్)
శ్రీపద్మాలయమినీ	హలో
కిషోర్	ఒక్క క్షణం
కిషోర్‌మినీ	ప్రాజెక్ట్
అన్నపూర్ణ	2 కంట్రీస్

ప్రజాస్వామిక సంస్కారం బయట నుంచి వచ్చేది కాదు. మనిషి లోపలి నుంచి ప్రభవించాలి.
- గాంధీజీ

ఉండి

ద్విచక్రవాహనంపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

విస్సాకోడేరు (పాలకోడేరు), న్యూస్‌టుడే: విస్సాకోడేరులో ద్విచక్రవాహనంపై నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన బుధవారం జరిగింది. పాలకోడేరు ఎస్సై వి. వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు .. తూర్పుగోదావరి జిల్లా మలికిపురానికి చెందిన పి. రాము(40) భీమవరంలోని ఓ ఆసుపత్రికి వచ్చి తిరిగి ద్విచక్రవాహనంపై వెళుతుండగా.. విస్సాకోడేరు సమీపంలో ఉన్నట్టుండి వాహనంపై నుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు.

స్పందించారు.. సమస్య తీర్చారు!

నాడు


పాలకోడేరు, న్యూస్‌టుడే: కొండేపూడి పంచాయతీ కార్యాలయానికి వెళ్లే ప్రధాన మార్గాన్ని సీసీగా మార్చేందుకు రాళ్లు, ఇసుక గుట్టలు వేసి, నెలరోజులైనా పనులు ప్రారంభించకపోవటంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులపై గతనెల 9న 'ఈనాడు'లో ప్రచురితమైన వాట్సాప్ చిత్రానికి సర్పంచి బి. రాంబాబు స్పందించారు. గుత్తేదారుడితో మాట్లాడి రహదారి నిర్మాణాన్ని పూర్తి చేశారు. సుమారు రూ.5లక్షలతో ఈ ప్రాంతంలో సిమెంట్ రహదారి నిర్మాణం చేపట్టారు.

నేడు


నాడు


నేడు


కొండేపూడి పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురంలో సామూహిక మరుగుదొడ్ల అపరిశుభ్రంగా ఉన్నాయి. కనీస మౌలిక సదుపాయాలు లేక స్థానికులు పడుతున్న ఇబ్బందులపై గతనెల 9న 'ఈనాడు'లో ప్రచురితమైన వాట్సాప్ చిత్రానికి స్థానిక పంచాయతీ కార్యదర్శి కనకారావు స్పందించారు. సామూహిక మరుగుదొడ్ల ప్రాంతంలో పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రతా చర్యలు చేపట్టారు.

వీటిని చూడాలి



సమస్య: వేండ్ర, వేండ్రఅగ్రహారం ప్రాంతంలోని గోస్తనీనదిలో ఎక్కడికక్కడ మట్టి మేటలు వేయడంతో మురుగునీటి పారుదలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గోస్తనీనది పూడికకారణంగా వర్షాకాలంలో వరిచేలు ముంపుబారిన పడుతున్నాయి. మట్టిమేటలను తొలగించాలని స్థానికుడు ముత్యాలరావు కోరారు.

అధికారి: గోస్తనీ నదిలో వేసిన మట్టిమేటలను తొలగించేందుకు ప్రతిపాదనలు పంపిస్తాం. ఈ వేసవిలో పూడిక తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- కె.లీలాశివప్రసన్న, డ్రెయినేజీశాఖ ఏఈ**



సమస్య: పాలకోడేరు అడ్డగట్టు ప్రాంతంలో సాగునీరు అందక వరిచేలు ఎండుతున్నాయి. దాళ్వా నారుమడి వేసి నెలరోజులైనా నాట్లు పూర్తికాలేదు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సాగునీటిని పూర్తిస్థాయిలో విడుదల చేయాలని స్థానికుడు కె. అరవింద్ కోరారు.

అధికారి: పూర్తిస్థాయిలో సాగునీటిని అందించేందుకు చర్యలు చేపట్టాం. రెండ్రోజులలో ప్రధాన సాగునీటి కాలువలకు, పంటబోదెలకు నీరు చేరుతుంది.

- శివన్నారాయణ, జలవనరుల విభాగం ఇన్‌చార్జి డీఈ

మీకు వాట్సాప్ ఉందా.. స్పందించండి

మీరు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలపై స్పందించండి. యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈనాడు వేదికగా నిలుస్తుంది. మీరు చేయాల్సిందల్లా సమస్యను ఫొటో తీసి, పరిస్థితిని క్లుప్తంగా వివరించి.. వాట్సాప్ ద్వారా మీ పేరుతో సహా పంపడమే.

దిగువ నంబర్లకు పంపొచ్చు..

ఆకివీడు: 94401 04042
ఆకివీడు గ్రామీణ: 94412 15569
పాలకోడేరు: 98499 59923
కాళ్ల: 80085 74524

జిల్లా కార్యవర్గం ఏర్పాటు


భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: ఆక్వా ట్రేడర్స్ అండ్ రొయ్యల కమిషన్ ఏజెంట్‌ల జిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. భీమవరం పట్టణంలో జరిగిన సమావేశంలో రెండేళ్ల పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు భీమాల శ్రీరామ్మూర్తి తెలిపారు. ట్రేడర్స్ సమస్యలపై రొయ్యల ఎగుమతిదారులతో మాట్లాడి వాటిని పరిష్కరించడంపై దృష్టి సారిస్తామని తెలిపారు. సంఘ గౌరవాధ్యక్షులుగా కటికల పల్లారావు, నడపన చంటి, మల్కిపురం సుబ్బరాజు, కార్యదర్శిగా పెన్నాడ శ్రీను, కోశాధికారులుగా ఎం. పిచ్చయ్య, కె. లక్ష్మణస్వామి, సంయుక్త కార్యదర్శిగా గుంటూరి పెద్దిరాజు మరో 10 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు వివరించారు.

మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షునిగా షేక్‌ఖాసిం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భారతీయ జనతా పార్టీ మైనార్టీ మోర్చా జిలా అధ్యక్షునిగా భీమవరం పట్టణానికి చెందిన షేక్ ఖాసిం నియమితులయ్యారు. భీమవరంలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు భూపతిరాజు శ్రీనివాసవర్మ ఆయనకు నియామక ఉత్తర్వులు అందజేశారు.

పల్లెల్లో ఎల్‌ఈడీ కాంతులు

కోపల్లె, వేంపాడు (కాళ్ల), న్యూస్‌టుడే: విద్యుత్తు బిల్లుల తగ్గింపే లక్ష్యంగా నియోజకవర్గంలోని అన్నీ పల్లెల్లో ఎల్‌ఈడీ దీపాలు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు శాసనసభ్యుడు శివరామరాజు చెప్పారు. మండలంలోని వేంపాడు, కోపల్లె గ్రామాల్లో బుధవారం నిర్వహించిన 'జన్మభూమి-మా ఊరు' సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయా గ్రామాల సర్పంచులు దాసరి ప్రభావతి, నాజాన ధనాజీరావు అధ్యక్షత వహించారు. తెదేపా పాలనలో పల్లెల్లో 70 శాతం రహదారులను సీసీలుగా మార్చామన్నారు. ఈ ఏడాది చివరికల్లా 100శాతం నిర్మించడంతో పాటు భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఎంపీపీ ఆరేటి వెంకటరత్నప్రసాద్, జడ్పీటీసీ సభ్యులు శ్రీవెంకటరమణ, జాన్, తెదేపా మండల అధ్యక్షుడు జీవీ నాగేశ్వరరావు, ఉండి డీసీ ఛైర్మన్ ఫణిబాబు, అభిరుచి కాశీ, వేగేశ్న కృష్ణంరాజు, పెన్మెత్స విశ్వనాథరాజు, కోటిరాజు అధికారులు పాల్గొన్నారు.



ఉపకారవేతనాల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శివరామరాజు

పాలకోడేరు మండలంలో..

పాలకోడేరు, న్యూస్‌టుడే: జన్మభూమి- మా ఊరు కార్యక్రమాన్ని వేండ్ర, కుముదవల్లి గ్రామాల్లో బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే శివరామరాజు పాల్గొని కొత్తగా మంజూరైన పింఛన్లు, రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. కుముదవల్లిలో ఉన్నత పాఠశాల విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ప్రసాద్, పాలకోడేరు సహకార సంఘం అధ్యక్షుడు భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటి రాజు), మాజీ ఎంపీపీ పాలా వెంకటచలపతి, సర్పంచులు విపర్తి స్వర్ణ, తోట చిట్టిమరియ, ఉపసర్పంచి వంశీకృష్ణంరాజు, తెదేపా మండల అధ్యక్షుడు గోపాలకృష్ణంరాజు, అధికారులు పాల్గొన్నారు.

రక్షిత నీటి సరఫరాకు ప్రతిపాదనలు

యండగండి, ఉణుదుర్రు (ఉండి), న్యూస్‌టుడే: ప్రతీ కుటుంబానికి స్వచ్ఛమైన నీరందించేందుకు రూ. 72 కోట్లతో చేసిన ప్రతిపాదనలకు ఫిబ్రవరిలో అనుమతి రానుందని, ఆ వెంటనే పనులు చేపట్టి పూర్తిస్థాయిలో నీరిస్తామని ఎమ్మెల్యే శివరామరాజు తెలిపారు. యండగండి, ఉణుదుర్రు గ్రామాల్లో సర్పంచులు చికిలే విజయకుమారి, దాట్ల పర్వతవర్ధనల అధ్యక్షతన జన్మభూమి-మాఊరు సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి అజీజ్, ఎంపీపీ లక్ష్మి, జడ్పీటీసీ సత్యతులసీ, ఏఎంసీ వైస్‌ఛైర్మన్ జుత్తిగ నాగరాజు, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షుడు జుత్తిగ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

ఆకివీడు మండలంలో..

గుమ్ములూరు, అప్పారావుపేట (ఆకివీడు గ్రామీణ), న్యూస్‌టుడే: గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే శివరామరాజు అన్నారు. గుమ్ములూరు, అప్పారావుపేట పంచాయతీ కార్యాలయాల వద్ద బుధవారం నిర్వహించిన 'జన్మభూమి- మా ఊరు' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం నూతనంగా మంజూరైన పింఛన్లు, రేషన్‌కార్డులు, విద్యార్థులకు ఉపకారవేతనాలను పంపిణీ చేశారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. పలు క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జన్మభూమి ప్రత్యేక అధికారి వి. ఆదిశేషు, ఏఎంసీ ఛైర్మన్ మోటుపల్లి రామవరప్రసాద్, డీసీ ఛైర్మన్ ఏడుకొండలు, సర్పంచులు కోపల్లి రత్నమాణిక్యం, బొమ్మిడి వెంకటలక్ష్మి, ఉప సర్పంచి కోపల్లి సాయిబాబా, సుంకర సుబ్రహ్మణ్యం, ఎం. వీరభద్రరావు పాల్గొన్నారు.